# శ్రీసాయిభక్త విజయం


పూజ్యశ్రీ సాయినాథుని శరత్‌బాబూజీ

శ్రీసాయిచరిత్రాధార సాహిత్య గ్రంథమాల

తృతీయ కుసుమం

సాయిపథం పబ్లికేషన్స్

శిరిడీ | చెన్నై | హైదరాబాద్



శ్రీసాయిబాబా చరణారవిందములకు
భక్తిపూర్వక సమర్పణ

**Sri Saibhaktha Vijayam (Telugu)**

**శ్రీసాయిభక్త విజయం**

ప్రచురణ: సాయిపథం పబ్లికేషన్స్
సాయిపథం, శిరిడీ – 423109
*Saipatham Publications*
*Saipatham, Shirdi - 423109*
*publications@saimail.com*

*Copyright © 2012 Saibaba Foundation*

*ISBN: 978-81-88560-10-3*

ప్రథమ ముద్రణ: శ్రీబాబూజీ ఆరాధన, నవంబర్ 2012
*Sri Babuji Aradhana, November 2012*

ద్వితీయ ముద్రణ: గురుపూర్ణిమ, 2015
*Guru Purnima, 2015*

ప్రోసెసింగ్: సాయిముద్ర, శిరిడీ
*Sai Mudra, Shirdi*


ముద్రణ: సాయిబాండ్స్ ప్రింట్ సిస్టమ్స్
చెన్నై – 106
*Saibonds Print Systems*
*Chennai - 106*

*For Copies: saipa@saimail.com*
*Ph no: +919385593866*

*Website: www.saibaba.com*
*www.srisainathunisarathbabuji.com*

# విషయసూచిక


| | | |
|---|---|---|
| ప్రకాశకుల ముందుమాట | ... | 7 |
| మహల్సాపతి | ... | 13 |
| తాత్యాకోతే పాటిల్ | ... | 37 |
| శ్రీమతి బయజాబాయి | ... | 63 |
| నానావలీ | ... | 73 |
| ఉపాసనీ మహరాజ్ | ... | 85 |
| భావూ మహరాజ్ కుంభార్ | ... | 209 |



*శ్రీబాబూజీ, వారణాశి, 1995*

## ప్రకాశకుల ముందుమాట

పరిపూర్ణమైన దివ్యత్వం భక్తజనావళి కోసం పాంచ భౌతికదేహంతో శ్రీసాయి రూపంతో శిరిడీ క్షేత్రం నేపథ్యంగా సాగించిన సాయిలీలావిలాసంలో ప్రతి క్షణమూ సాయినాథుని అనుగ్రహ తేజోవిరాజితమే, సత్యప్రబోధ శోభితమే! శ్రీసాయి ప్రత్యక్ష సాన్నిధ్యంలో ఆ దివ్యమంగళరూపాన్ని కనులారా దర్శించుకుని, మనసారా పూజించుకుని, జీవితాలను సాఫల్యం చేసుకున్న ధన్యజీవులెందరో శ్రీసాయి చరిత్రలో దర్శనమిస్తారు. ఆ చిరునవ్వు చూసి పరవశించిన హృదయాలు... ఆ అవ్యాజ ప్రేమకు ముగ్ధమైన మనస్సులు... ఆ దివ్యలీలలను వర్ణించలేక అలసిన జిహ్వలు... ఆ మమతల జల్లులలో తడిసి ముద్దైన జీవితాలు... ఆ అనంతతత్వాన్ని దర్శించి స్తుతించిన మహాత్ములు... ఆ సన్నిధి చేరి ఆధ్యాత్మిక శిఖరాలను అధిరోహించిన సాధకులు... ఆ చరణాలను ఆశ్రయించి జీవితగమ్యాన్ని చేరుకున్న సద్భక్తులు... ఇలా సాయినాథుని చరిత్ర సమస్తం సాయిభక్త విజయమే.

శ్రీసాయి సశరీరులుగా ఉండగా వారి కృపామృతాన్ని, లీలాప్రబోధాన్ని తనివితీరా రుచి చూసిన సాయిభక్తుల వివరాలు, అనుభవాలు సమగ్రంగా సాయిభక్తలోకానికి అందించాలనే ప్రయత్నంతో ఎంతో పరిశోధన చేసి, పరిశ్రమించి సుమారు రెండు దశాబ్దాల క్రితం "శ్రీసాయిభక్తవిజయం"ను రచించారు పూజ్యశ్రీ సాయినాథుని శరత్‌బాబూజీ. "సాయిపథం" పత్రికలో విభిన్న శీర్షికలతో ధారావాహికంగా ప్రచురితమైన ఈ అముద్రిత గ్రంథం ఇప్పుడు ఈ పుస్తకరూపం ధరించడం శ్రీసాయి అనుగ్రహవిశేషం.

శ్రీసాయికి నామకరణం చేసిన శ్రీమహల్సాపతి, బాబా అనురాగవల్లరులలో తడుస్తూ ఆనందంగా నర్తించిన శ్రీతాత్యాకోతేపాటిల్, మమతానుబంధంతో సాయికి ఆత్మబంధువైన శ్రీమతి బయజాబాయి, శ్రీసాయిభక్తిసామ్రాజ్యంలో శిరిడీ దుర్గానికి

రక్షణాధికారిగా కనిపించిన నానావలీ, "ఇతను నా వాడు, అతని పూర్తి బాధ్యత నాది" అని బాబాతో అనిపించుకున్న శ్రీఉపాసనీ మహరాజ్, శ్రీసాయి మహావృక్షం నీడన వినమ్రంగా తలవంచుకుని అజ్ఞాతంగా ఆధ్యాత్మిక శిఖరాలను అధిరోహించిన శ్రీభావూ మహరాజ్ కుంభార్ మొదలైన సాయిభక్తుల జీవిత విశేషాలు ఈ గ్రంథంలో విపులంగా ఉన్నాయి. ఇందులో ప్రతి అక్షరం ఉద్దేశ్యం ఆయా భక్తుల జీవిత చిత్రణే అయినా ఆ అక్షరాల ఉనికికి ఆధారమైన పుటల తైలవర్ణ ఛాయలో శ్రీసాయి ప్రేమ స్వరూపం పాఠకులకు సాక్షాత్కరిస్తుంది, వారికి శ్రీసాయి సన్నిధి సంప్రాప్తమవుతుంది. అంతేకాదు, అంతటా అన్నింటా తామే ఉన్నామని అనుభవపూర్వకంగా నిదర్శనాలు ఇచ్చిన శ్రీసాయిలో ప్రకటమైన విశ్వాత్మతత్వాన్నే కాక భక్తులకు మమతను పంచిన ఆత్మీయకోణాన్ని అపురూపంగా ఆవిష్కరించి పాఠకులకు శ్రీసాయితో గల అనుబంధాన్ని సుదృఢం చేస్తుంది.

శ్రీసాయినాథుని విశిష్టత గురించి శ్రీబాబూజీ ప్రస్తావిస్తూ, "సాయితత్వంలో ప్రధానంగా సాయి యొక్క లీల, సాయి యొక్క బోధ అంటూ రెండుగా లేవు. ప్రపంచ ఆధ్యాత్మిక చరిత్రలో ఎందరో మహనీయులు ఉద్భవించారు. వారు ఆదర్శప్రాయమైన జీవితాన్ని గడిపారు, ఎట్లా గడపాలి అనే దానిని మనకు తెలియజేశారు. వారి బోధ, వారి జీవితం, ఆచరణ.... ఇన్ని ఉన్నాయి. కానీ బాబా విషయంలో... ఆయనెక్కడా ఉపన్యాసాలు ఇవ్వలేదు, పుస్తకాలు వ్రాయలేదు, సత్సంగాలు చేయలేదు, గోష్ఠులు నిర్వహించలేదు, వేదాంతం గురించి అసలే మాట్లాడలేదు. అయినప్పటికి కూడా ఆయన శిరిడీలో 16 ఏళ్ళ బాలునిగా కనిపించి 1918లో మహాసమాధి చెందేవరకు ఆయన చేసినటువంటి ప్రతి చర్య కూడా ఆయన బోధే. కాబట్టి సాయి యొక్క లీలను, సాయి యొక్క తత్వాన్ని వేరుపరచి ఇది సాయి యొక్క జీవితచరిత్ర, ఇది సాయి యొక్క బోధ అని చెప్పడం చాలా కష్టమైన విషయం. పువ్వుకు పరిమళం ఎలా ఉంటుందో, చక్కెరకు తీపి ఎలా ఉంటుందో అట్లాగే బాబా జీవితంలో అణువణువులోనూ – ఆయన ఎవరు, ఆయన రూపం, ఆయనెట్లా ప్రకటమయ్యారు, ఆయన ప్రతి కదలికా ఒక సత్యాన్ని మనకు తెలియజేస్తుంది" అంటారు. ఈ నేపథ్యంలో చూస్తే సాయి ప్రత్యక్ష సాన్నిధ్యభాగ్యాన్ని పొందిన సాయిభక్తుల జీవిత ప్రస్థానాలు... సాయి తత్వాన్ని దర్శింపజేసే దర్శనాలు, అసమానమైన సాయి మహిమకు నిదర్శనాలు. అంతేకాదు,

సాయిభక్తులు ఆచరింపదగిన ఆదర్శాలను, వర్జించవలసిన అంశాలను తెలియజేసి సాయిపథాన ముందుకు నడిపే వెలుగు దివ్వెలు కూడా.


"శ్రీసాయి జీవితం సమాధానపడిన ఒక ప్రశ్న, ప్రశ్నగా మిగిలిపోయిన సమాధానం" అంటారు శ్రీబాబూజీ. శ్రీబాబూజీకే సాధ్యమైన అసమాన తార్కిక దృక్పథం – శ్రీసాయి పట్ల వారికి గల అనన్య ప్రేమ; హేతుబద్ధత – సంపూర్ణ శరణాగతి; నిష్కర్ష విమర్శ – నిష్కల్మషమైన ప్రశంస; ఇలా పరస్పర విరుద్ధమనిపించే భావాలతో ఎంతో ఒద్దికగా, పొందికగా, నిర్దిష్టంగా సాగే పూజ్యశ్రీ బాబూజీ పరిశీలన, సాయి భక్తుల జీవితాలలోని వివిధ సంఘటనల విశ్లేషణ... అద్భుతం, అద్వితీయం! నా చర్యలు అనూహ్యాలు, అగమ్యాలు అన్న శ్రీసాయి చర్యలను ఏ వెలుగులో చూడాలి? ఎంతమేరకు, ఏ దృష్టితో అర్థం చేసుకోవడానికి ప్రయత్నించాలి అన్న సాయిభక్తుల సంశయాలకు సమాధానాలు ఈ "శ్రీసాయిభక్త విజయం"లో లభిస్తాయి.

"మన సద్గురువుకు సంబంధించిన ప్రతి విషయాన్ని తెలుసుకోవడమనేది మన ప్రేమకు వ్యక్తీకరణ" అంటారు శ్రీబాబూజీ. ఈ క్రమంలోనే సాయిచరిత్రకు సంబంధించిన ఎన్నో ప్రశ్నలకు, అసంగతమైన విషయాలకు ఈ గ్రంథంలో హేతు బద్ధమైన సమాధానాలు, వివరణలు లభిస్తాయి. సాయిచరిత్ర మరింత సమగ్రతను సంతరించుకుంటుంది. పరిపూర్ణమైన సాయి సంప్రదాయంలోకి కాలగతిలో వచ్చి చేరిన ఛాందస భావజాలాన్ని, అపోహలను తొలగించుకునేందుకు కావలసిన వివేకాన్ని, విచక్షణను సాయిభక్తులకు అందించే ఎన్నో ప్రామాణికమైన వివరణలు కూడా ఇందులో ఉన్నాయి.

సాయి సంప్రదాయంలో, సాయితత్వ సాహిత్యంలో కలికితురాయి వంటి ఈ గ్రంథం ఆర్తులు, అర్థార్తులు, జిజ్ఞాసువులు, ముముక్షువులు ఇలా ప్రతి సాయిభక్తుడూ అసలైన సాయిపథంలో పయనించడానికి కరదీపికగా మారి దారి చూపుతుందని ఆశిస్తూ...

SAI SEEKERS

# శ్రీసాయిభక్త విజయం



మహల్సాపతి

# మహల్సాపతి

శ్రీసాయిబాబా సశరీరులైయున్నప్పుడు వారిని ప్రత్యక్షంగా, అత్యంత సన్నిహితంగా సేవించుకున్న భక్తులలో మొట్టమొదట పేర్కొనవలసిన భాగ్యశాలి 'భగత్' మహల్సాపతి. శ్రీసాయిని సేవించుకున్న భక్తులలోనూ, శ్రీసాయి చరిత్రలోనూ ఈయనకున్న ప్రాముఖ్యత మరెవ్వరికీ లేదనే చెప్పాలి.

బాబా 1854లో శిరిడీలో కొంతకాలం వేపచెట్టు క్రింద నివసించి హఠాత్తుగా అదృశ్యులయ్యారు. మళ్ళీ రెండేళ్ళ తరువాత చాంద్‌భాయ్ పాటిల్‌కు చెందిన పెళ్ళి బృందంతో శిరిడీ చేరారు బాబా. ఊరి బయట ఉన్న ఖండోబా ఆలయ సమీపంలో బాబాను చూచి, అంతకు రెండేళ్ళ క్రితం అదృశ్యుడైన బాలఫకీరుగా గుర్తించి "ఆయియే! సాయి" ('రండి! సాయి') అని సాదరంగా శిరిడీకి ఆహ్వానించింది మహల్సాపతే. అంతకుముందు, ఆ తరువాత కూడా బాబా పేరు, ఇతర వివరాలేవీ ఎవ్వరికీ తెలియవు. మహల్సాపతి "సాయి" అని పిలిచినప్పటి నుండీ అదే ఆయన పేరుగా స్థిరపడింది. అంటే ఒక విధంగా బాబాకు నామకరణం చేసింది మహల్సాపతే! ఈనాడు ఎందరో భక్తులకు తారకమంత్రమైన శ్రీసాయి నామాన్ని మనకందించింది మహల్సాపతే!

లక్షలాది భక్తులు ఈనాడు సాయి పూజ చేస్తున్నారు. కాని సాయిని ప్రథమంగా పూజించిన భాగ్యం మహల్సాపతిదే! బాబా రాత్రిళ్ళు తనతో నిద్రించేందుకు (?)– ఈ ప్రశ్నార్థకమెందుకో తరువాత వివరిస్తాను – మహల్సాపతిని, తాత్యాకోతేపాటిల్‌ని తప్ప మరెవ్వరినీ అనుమతించేవారు కారు. అలా సుమారు 40, 50 సంవత్సరాలు బాబాతో మసీదులోనూ, చావడిలోనూ నిద్రించే అవకాశం, ఆ అవకాశాన్ని సద్వినియోగం

చేసుకోగల అదృష్టం, మహల్సాపతికే దక్కాయి. ఆ రోజుల్లో మహల్సాపతి చేత బాబా ఎటువంటి కఠిన ఆధ్యాత్మిక సాధనలు చేయించారో! (ఆ వివరాలు కొన్ని తరువాత తెలుసుకుంటాము.) 1886లో బాబా తాత్కాలికంగా మూడు రోజులపాటు భౌతిక శరీరాన్ని త్యజించినప్పుడు బాబా తనకప్పజెప్పిన ఆయన భౌతికశరీర రక్షణ బాధ్యతను ఎంతో శ్రద్ధాభక్తులతో మోసి, బాబా ఆ తరువాత సుమారు 32 సంవత్సరాల పాటు సశరీరులుగా మన మధ్య సంచరించడానికి నిమిత్తమాత్రుడయ్యాడు మహల్సాపతి.

మహల్సాపతి హృదయంలోని నిర్మల భక్తివైరాగ్యాలను బాబా గుర్తించారా అన్నట్లు మహల్సాపతిని బాబా ఎప్పుడూ *'భగత్'* (భగవంతుని భక్తుడు, భాగవతుడు) అని పిలిచేవారు. బాబా మరే భక్తుణ్ణీ అలా సంబోధించినట్లు వారి చరిత్రలో దాఖలాలు లేవు. తన సద్గురువు, దైవమూ అయిన బాబా అలా తన భక్తిని గుర్తించి మన్నించడంకన్నా ఆ భాగవతోత్తమునికి కావలసింది మరేముంది!

శిరిడీ గ్రామానికి చెందిన పేద విశ్వబ్రాహ్మణ (కంసాలి) కుటుంబంలో జన్మించారు శ్రీమహల్సాపతి. వంశపారంపర్యంగా విశ్వబ్రాహ్మణ కులదైవమైన ఖండోబా ఆలయంలో ఆయన పూజారి. ఏదో వీధి బడి చదువు తప్ప పెద్ద చదువులేదు. వారి కులానికి పవిత్ర గ్రంథమైన 'మహల్సాపురాణం' చదవడం, ఆ గ్రామంలోనూ, ప్రక్క గ్రామాలలోనూ వారి కులంవారి ఇండ్లలో సాంఘిక మతపరమైన కార్యాలలో వారి కులాచారానుసారం పౌరోహిత్యం చేయడం మహల్సాపతికి అనూచారంగా లభించిన విద్య. శిరిడీలో మట్టితో కట్టిన ఒక చిన్న ఇల్లు, 7½ ఎకరాల మెట్టభూమి తప్ప ఆయనకేమి ఆస్తిపాస్తులు లేవు. భార్య, నలుగురు కుమార్తెలు, ఇద్దరు కుమారులు (వారిలో పెద్దకొడుకు 1896కు ముందే మరణించాడు). మెట్టభూమి మీద వచ్చే ఫలసాయం ఏమీ ఉండేది కాదు. కులవృత్తియైన కంసాలిపని చేస్తూ ఉండినా, ఆ చిన్న గ్రామంలో రాబడి అంతంతమాత్రం. దాంతో, జరుగుబాటు కష్టంగానే ఉండేది.

## పూనకంలో బాబా గురించి చెప్పిందెవరు?

కుటుంబసమస్యలు ఎన్ని ఉన్నప్పటికీ మహల్సాపతికి ఆయన కులదైవమైన ఖండోబా అంటే అమితభక్తి. ఆయన ఖండోబా ఆలయ పూజారి కూడాను. ఖండోబాకే 'మహల్సాపతి' అని మరో పేరు. మహల్సాదేవి యొక్క పతి – మహల్సాపతి. (పార్వతీపతి,

సీతాపతి, లక్ష్మీపతిలాంటి పేరన్నమాట) మహల్సాపురాణ పఠనం, పారాయణ దీక్షగా చేసేవాడు. తన తీరిక సమయంలో ఎక్కువ భాగం ఖండోబా ఆరాధనలోనూ, తన మిత్రులైన కాశీరాం షింపే, అప్పాభిల్‌లతో వేదాంతప్రసంగాలలోనూ, ఆ ఊర్లోనే కొంతకాలమున్న జానకీదాసు, దేవీదాసు అనే సాధువుల సేవ, సత్సంగాలలోనూ గడిపేవాడు. ఖండోబా పట్ల తన భక్తి క్రమేణా వృద్ధిచెంది, ఒక్కో సమయంలో ఖండోబాతో 'మానసికంగా' తాదాత్మ్యభావన చెంది, ఆ భక్త్యావేశంలో ఖండోబా తనను ఆవేశించినట్లు మాట్లాడేవాడు. దేవుళ్ళూ, దెయ్యాలు పూనటం మీద గ్రామీణ ప్రజల్లో బలమైన నమ్మకం ఉండడం సహజమే! ఈనాడు విద్యాధికులమనుకునే వారిలోనే ఎంతోమందికి పూనకాల మీద నమ్మకం పోనపుడు, సుమారు 150 ఏళ్ళ క్రితం పల్లెవాసుల నమ్మకాల గురించి చెప్పాలా! మహల్సాపతికి తన కులదైవం ఖండోబా ప్రత్యక్షమనీ, ఆయనను ఆవేశించి ప్రజల భవిష్యత్తు గురించిన ప్రశ్నలకు జవాబులు ఇస్తాడని ప్రచారం అయింది. ఖండోబా 'గణం'గా ఆయనకు పేరొచ్చింది.

ఆ రోజుల్లోనే మొదటిసారి బాబా శిరిడీలో బాలఫకీరుగా కనిపించారు. సాధు దర్శనం అలవాటుగా ఉన్న మహల్సాపతి తన సత్సంగ మిత్రులతో కలిసి అప్పుడప్పుడూ వేపచెట్టు క్రింద బాబాతో సమావేశమవుతుండేవారు. ఆ రోజులలో ఎప్పుడో బాబా ఆ వేపచెట్టు క్రింద గుహలో తన గురువు సమాధి ఉండడం గురించి, తానక్కడ పూర్వం తపస్సు చేసిన విషయం గురించీ బహుశా ప్రస్తావించి ఉండవచ్చు. ఆ తరువాత శిరిడీలో పెద్ద గాలివాన రావడం, బాబాను ఎవ్వరూ పట్టించుకోకపోవడం గూర్చి మహల్సాపతీ, ఆయన మిత్రగణం, మరికొందరు గ్రామస్థులు ఆవేదన చెందడం జరిగింది. ఆ ఆవేదన, భక్త్యావేశాలలో బాబా తనతో ప్రస్తావించిన వివరాల గురించి మహల్సాపతి గ్రామస్థులకు చెప్పి ఉండవచ్చు. అప్పటికే మహల్సాపతిని ఖండోబా 'గణం'గా ప్రజలు భావిస్తూండడంతో ఆ వివరాలు ఖండోబానే 'పూని' వెల్లడించాడని వారు తలచడం అసంభవంకాదు. (ఈ విషయాన్ని గూర్చిన పూర్వాపరాలు వేరే సందర్భంలో వివరంగా చర్చించుకుందాం.)

కానీ, తరువాత శ్రీసాయి సాన్నిహిత్య ప్రభావం వల్ల శ్రీమహల్సాపతిలో ఈ "ఉద్రేకాలు" తగ్గాయి. తనకు ***'ఖండోబా ఆలయంలో ఎంతో ప్రశాంతంగా ఉందనీ, అక్కడే ఉంటాననీ'*** బాబా శిరిడీ వచ్చిన క్రొత్తలో అన్నప్పుడు, బాబా ముస్లిం

కనుక ఆలయప్రవేశాన్ని నిరాకరించిన మహల్సాపతే తరువాత బాబాను మసీదులో చందనపుష్పాదులతో పాదపూజ చేసి అర్చించాడు. సంకుచిత మతాచారాలను, ఛాందసభావాలను మనస్సుల నుండి తొలగించుకొని, వివేకం, విశాల దృక్పథంతో, సద్గురుశరణాగతి అలవర్చుకోవడం సాధకుల పరిణతికెంత అవసరమో మహల్సాపతి చరిత్ర చాటిచెబుతుంది. ఛాందసభావాలనే ఇనుముగా ఉన్న స్వర్ణకారుని మనస్సును గురుభక్తీవైరాగ్యాలనే మేలిమి బంగారంగా మార్చిన ఆధ్యాత్మిక 'రససిద్ధుడు' శ్రీసాయిబాబా.

**పిలిచిన 'పిలుపే' ఆయన పేరు!**

**పేరేదైనా 'ఓం' యని పలుకు!!**

నాగరే వంశీయులకు శిరిడీలోనూ, ఆ చుట్టుప్రక్కల గల ఖండోబా మందిరాల అర్చకత్వం, పౌరోహిత్యం అనువంశికంగా వస్తున్న హక్కు. మహల్సాపతి తండ్రి చిమ్నాజీపంత్ తరువాత ఆ అర్చకత్వము ఆయన తమ్ముడు (– అంటే, మహల్సాపతి పినతండ్రి)కి దక్కింది. ఒకసారి మహల్సాపతికి ఖండోబా 'పూని' (– దీన్నే మహరాష్ట్ర దేశంలో 'సంచారం' అంటారు) "నాకు నీ ఇంటికి రావాలని ఉంది. నన్ను నీ ఇంటికి తీసికొనిపో!" అని అన్నాడట (– మహల్సాపతితోనే!). ఆ ఖండోబా 'ఆజ్ఞ', మహల్సాపతికి ఖండోబాపై గల భక్తిప్రపత్తులు, ఆయన సాధుప్రవృత్తి చూచిన కులపెద్దలు ఖండోబా అర్చకత్వాన్ని మహల్సాపతికి అప్పగించారు.

మహల్సాపతికి అప్పటికే నలుగురు ఆడపిల్లలు – జానకీబాయి, సీతాబాయి, విఠాబాయి, లఖుమాబాయి. ఒక్క కొడుకు పుట్టి ఒక సంవత్సరం వయస్సు లోపలే మరణించాడు. ఆ పిల్లవాడు మరణించే రోజున ఒక సంఘటన జరిగింది. ఒకసారి మహల్సాపతి శిరిడీకి దగ్గరలోనే ఉన్న రణ్‌కూరి అనే గ్రామానికి వెళ్ళాడు. అక్కడ కొందరు గ్రామస్థులతో కలిసి రాత్రంతా నెగడు వేసుకొని దాని చుట్టూ కూర్చొని భగవత్సంబంధమైన ప్రసంగాలతో గడిపాడు. రాత్రంతా మేల్కొనటంవల్ల వేకువఝూమున కొంచెంసేపు నిద్రపోయాడు మహల్సాపతి. ఆ నిద్రలో ఒక స్వప్నం. ఆ స్వప్నంలో తాను ఖండోబా మందిరం దగ్గర ఉన్నాడు. అప్పుడు ఒక నల్లని వ్యక్తి ఒక పెద్ద బండ తీసుకొని మహల్సాపతికి గురిపెట్టి, "నా కూర నాకివ్వు! లేకపోతే

ఈ బండ నీ మీద పడేస్తాను" అన్నాడు. మహల్సాపతికి స్వప్నంలోనే అతడు కాలపురుషుడుగా తోస్తున్నాడు. అయినా ఏమీ భయపడకుండా, ఖండోబాను స్మరిస్తూ, ఆ కాలపురుషుడికి కూర పెట్టాడు. ఆ కూర తీసికొని, చేతిలోని బండను ప్రక్కన పారవేసి, ఆ కాలపురుషుడు వెళ్ళిపోయాడు. స్వప్నం అంతరించింది. మెలకువ వచ్చింది. అప్పుడే శిరిడీ నుంచి ఒక వ్యక్తి మహల్సాపతి కోసం వచ్చి, "నీ కొడుక్కి ప్రమాదంగా జబ్బు చేసింది. వెంటనే శిరిడీ వెళ్ళు!" అన్నాడు. ఆ వార్త వినడంతోనే, అంతకు మునుపు తనకొచ్చిన విచిత్ర స్వప్నం యొక్క అర్థం ఎందుకో మహల్సాపతి మనస్సుకు సమన్వయపడి, "నా దగ్గర దాయటం ఎందుకు? నా కుమారుడు రాత్రి చనిపోయాడు! అవునా?" అని నిబ్బరంగా అడిగి, తన స్వప్నం విషయం వారికి వివరించి చెప్పాడు. నిజానికి మహల్సాపతి కుమారుడు ఆ ముందు రాత్రే హఠాత్తుగా సుస్తీ చేసి చనిపోయాడు. ఆ వార్త మహల్సాపతికి చెబుదామని వచ్చిన వ్యక్తి ఆ విషాదవార్తను ఒక్కసారిగా చెప్పకూడదనే భావంతో జబ్బు చేసిందని చెప్పాడు. మహల్సాపతి మాటలకు, అతని గుండెనిబ్బరానికి అక్కడి గ్రామస్థులు ఆశ్చర్యపోయారు. ఆ తర్వాత మహల్సాపతి తన కుమారుడి మృతదేహాన్ని స్వప్నంలో కాలపురుషుడు తన చేతిలోని బండను ఎక్కడ వేసాడో ఆ చోటనే (ఖండోబా ఆలయం ప్రక్కనున్న మర్రిచెట్టు దగ్గర) సమాధి చేశాడు.

ఒకసారి మహల్సాపతికి మరో దివ్యస్వప్నం వచ్చింది. ఆ స్వప్నంలో ఒక బ్రాహ్మణుడు కనుపించి, "ఏం బాబూ! ఈ కంసాలి పని లేకపోతే నీకు కడుపు నిండదా ఏమిటి?" అని అడిగాడు. దానికి మహల్సాపతి, "మరి ఈ రోజు నుండి నన్నేం పని చేయమంటారు?" అని అడిగాడు. "ఏమీ అవసరంలేదు! నా పాదాలు పట్టుకో!" అంటూ అదృశ్యుడయ్యాడు ఆ బ్రాహ్మణుడు. అది ఖండోబా ఆదేశంగా తీసుకొని ఆ మరుసటి రోజు నుండి కంసాలివృత్తిని పూర్తిగా మానివేసి, భిక్షావృత్తి స్వీకరించాడు మహల్సాపతి. తన సత్సంగమిత్రులైన కాశీరాం షింపే, అప్పాజీ జోగ్లే మహల్సాపతి కుటుంబానికి అవసరమైన సరకులను మోయనగా పంపేవారు. ఆ మోయనలు, ఊర్లో చేసే భిక్ష ద్వారా వచ్చేదానితో మహల్సాపతి కుటుంబం గడిచేది. మహల్సాపతి తన సమయంలో ఎక్కువ భాగం ఖండోబా ధ్యానంలోనూ, సాధు సత్పురుషుల సేవలోనూ గడిపేవాడు. ఇంటికి ఎప్పుడో కానీ వెళ్ళేవాడుకాదు. నివేదన సమయానికి

మహల్సాపతి భార్య – శివూబాయి – నైవేద్యం తీసుకొచ్చి ఖండోబా ఆలయంలో ఇచ్చేది. చాలావరకు కేవలం ఖండోబా ప్రసాదంతోనే మహల్సాపతి శరీర పోషణ గడిచిపోతుండేది.

సాధు సత్పురుషులంటే మహల్సాపతికి ఎంతో గౌరవం, ఆదరం. ఎవరైనా సన్యాసి కనిపిస్తే, "నమోనారాయణ" అనీ, బైరాగి తటస్థపడితే "జైరాం" అనీ, ముస్లిం ఫకీరు ఎదురైతే "జై సాయ్" అనీ అభివాదం చేసి పలుకరించడం మహల్సాపతికి అలవాటు. అందుకనే, బాబా చాంద్‌భాయి పాటిల్ పెళ్ళిబృందంతో (రెండవసారి) శిరిడీ చేరినపుడు "యా, సాయ్" అని ఆదరంగా పలుకరించాడు. భగవత్సంకల్పానుసారం ఆ పిలుపే బాబా పేరుగా స్థిరపడ్డది.

## ఖండోబా పూజారి చెవిలో ఖురాన్ పఠనం!

బాబా శిరిడీ వచ్చిన క్రొత్తల్లో వారి ప్రవర్తన ఆ ఊరివారికి చిత్రంగా ఉండేది. ఎక్కువమంది ఆయనను ఒక పిచ్చిఫకీరుగానే జమకట్టారు. మహల్సాపతి, అతని సత్సంగమిత్రులకు కూడా మొదట మొదట బాబా పిచ్చివాడేమోననే సందేహం ఉండేది. కానీ బాబా విచిత్రప్రవర్తన వెనుక స్పష్టంగా తొంగిచూస్తున్న ఆయన అనన్య వైరాగ్యప్రవృత్తి, నిరాడంబరమైన సాత్విక జీవనం, అలౌకికమైన తేజస్సు– మహల్సాపతి నిష్కల్మష హృదయాన్ని సూదంటురాయివలె ఆకర్షించాయి. ఒక ముస్లిం ఫకీరుకు సన్నిహితం కావడానికి మహల్సాపతికి తన ఆచార పరాయణత్వం కూడా అడ్డురాలేదు. బాబా శిరిడీ రాక మునుపే శిరిడీలో ఉంటున్న జానకీదాసు, దేవీదాసు అనే సాధువులతో మహల్సాపతి తరచు సత్సంగాలు చేస్తూండేవాడు. బాబా కూడా అప్పుడప్పుడూ ఆ సాధువులతో సంభాషిస్తూండేవారు. ఆ ఇరువురు సాధువులు బాబాను ఎంతో గౌరవంగా చూచేవారు. అప్పుడప్పుడూ ఆ ముగ్గురి సంభాషణలలో వ్యక్తమయ్యే బాబా జ్ఞానపరిణతికి ముగ్ధుడయ్యేవాడు మహల్సాపతి. బాబాతో సాన్నిహిత్యం, శ్రీఆనందనాథస్వామి, శ్రీగంగగిర్ మహరాజ్ వంటి ప్రఖ్యాత సత్పురుషులు బాబా పట్ల వ్యక్తపరచిన పూజ్యభావం, మహల్సాపతికి బాబాపట్ల ఉన్న గౌరవభావం స్థానే ఆరాధ్యభావాన్ని కలిగించాయి. అది – అందరూ సామాన్యమైన పిచ్చిఫకీరుగా బాబాను చూస్తున్న రోజుల్లోనే – మసీదులో బాబాను దైవంగా

పూజించే స్థాయికి ఎదిగింది. మహల్సాపతి తర్వాత బాబాను ఎందరో పూజించారు. కానీ వారందరూ బాబా మహిమ, అలౌకిక లీలలవల్ల ఆకర్షింపబడేవారు. కానీ, మహల్సాపతి ఆరాధించినది బాబాలోని తీవ్ర జ్ఞానవైరాగ్యాలను చూచి ముగ్ధుడయ్యే.

మహల్సాపతి బాబాకు దగ్గరైన కొద్దీ, రోజులో ఎక్కువ భాగం బాబాతోనే గడపసాగాడు. మసీదు(ద్వారకామాయి) నుండి తన ఇల్లు అరఫర్లాంగు దూరం కూడా లేకపోయినప్పటికీ రాత్రిళ్ళు కూడా నియమంగా మసీదులోనే నిద్రించేవాడు. మహల్సాపతి మొదట మొదట తన పైపంచె తీసి నేలపై పరిచేవాడు. దానిమీదే అతను, బాబా చెరొక ప్రక్క మేనువాల్చేవారు. తరువాత మహల్సాపతికి తాత్యాకోతే పాటిల్ కూడా తోడయ్యాడు.

ఇలా కొన్ని ఏళ్ళు గడిచాయి. 1889వ సంవత్సరంలో బాబా ఒకసారి మహల్సాపతితో, *"అరే భగత్! నీవు నీ భార్యని వదలిపెట్టి ఇక్కడే గడుపుతున్నావు. సంసారం కూడా చూచుకోవాలి! నీకిప్పుడు కూతుళ్ళే మిగిలారు. కూతుళ్ళు చింతపండులాంటి వారు; కొడుకులు మామిడిపండులాంటి వారు. ఈ రోజు నుంచి పోయి ఇంట్లో పడుకో! నీకు కొడుకు పుడ్తాడు. ఈ ఫకీరు మాటలు విను. మసీదులో కూర్చొని నేనెప్పుడూ అబద్ధం చెప్పను!"* అన్నారు. కానీ, తనకు సంసార బంధాలు వద్దనీ, ఇంటికి ససేమిరా వెళ్ళననీ, మొరాయించాడు మహల్సాపతి. అప్పుడు బాబా అక్కడే ఉన్న కాశీరాంషింపే, తాత్యాకోతే, లక్ష్మీబాయి షిండే తదితరులతో, *"మహల్సా మరీ పిచ్చివాడైపోతున్నాడు. అతణ్ణి సంసారం చెయ్యమనాలె!"* అన్నారు. బాబా మాటపై కాశీరాం తదితరులు మహల్సాపతిని బలవంతంగా ఒప్పించి ఇంటికి పంపారు. మరుసటి సంవత్సరానికల్లా మహల్సాపతికి గోకులాష్టమి రోజున కొడుకు పుట్టాడు. ఆదివారంనాడు పుట్టాడు గనుక ఆ బిడ్డకు 'మార్తాండ్' అని పేరు పెట్టాడు. కుమారుడు పుట్టిన వెంటనే మహల్సాపతి మునుపటి లాగే నియమంగా రాత్రిళ్ళు మసీదులో గడపడం ప్రారంభించాడు. తాత్యాపాటిల్ కూడా బాబాతో మసీదులో నిద్రించినా, బాబా మహల్సాపతి చేతనే ఎన్నో కఠినమైన ఆధ్యాత్మిక సాధనలు చేయించారు. ఆ యోగసాధనల వివరాలు పూర్తిగా వెల్లడికానప్పటికీ, ఆ సాధనలలో భాగంగా బాబా విధించిన కఠిన నియమాలను చూస్తే – అది సామాన్యులకు అసాధ్యమని తెలుస్తుంది.

## 'నిద్ర మరచినప్పుడె నిష్ఠుండుతానాయె!'

ఒకసారి బాబా ఎందుకో మహల్సాపతికి ఒక నియమం విధించారు. కొంతకాలం మహల్సాపతిని వెన్నుపూస నేలకు తగిలేటట్లు పడుకోవద్దనీ, అలా వెల్లకిలా పడుకుంటే ప్రమాదమనీ హెచ్చరించారు. మహల్సాపతి ఆ నియమాన్ని జాగ్రత్తగానే పాటిస్తున్నాడు. కానీ, ఒకరోజు తన కుమారుడు మార్తాండ్, తన మేనకోడలు కాళ్ళు పడుతుంటే నిద్ర ముంచుకొచ్చి, వీపు నేలపై ఆనించి నిద్రలోకి జారిపోయాడు. అంతే! వెంటనే మహల్సాపతి శరీరం చల్లబడ్డది. ఎగశ్వాస ప్రారంభమైంది. అది చూచి మార్తాండ్ తదితరులు విపరీతంగా ఆందోళన చెందారు.

మహల్సాపతికి కూడా విపరీతమైన భయంవేసింది. ప్రాణం పోతుందేమో ననిపించింది. ఇంతలో ఇద్దరు ముస్లిం ఫకీర్లు తన ఇరువైపులా కూర్చుని ఏదో ఇస్లాం ప్రార్థన చేస్తున్నట్లు స్పష్టంగా గోచరించింది. ఆ ప్రార్థన వింటూ ఉండగా క్రమంగా శరీరం మామూలు స్థితికి వచ్చింది. చివుక్కున లేచి కూర్చున్నాడు. ప్రక్కన తన కుటుంబసభ్యులు తప్ప ఫకీర్లెవ్వరూ లేరు! వెంటనే కాళ్ళు స్వాధీనంలోకి రాలేదు. కొంతసేపు కాళ్ళు మర్దన చేయించుకొంటేగానీ లేవలేకపోయాడు. జరిగిన విషయాన్ని బాబాతో చెబుదామని మసీదుకు వెళ్ళాడు. అల్లంత దూరంలో మహల్సాపతిని చూస్తూనే, బాబా కోపంతో తిట్టసాగారు. *"ఏమిరా భగత్! నేను చెప్పిందేమిటి? నీవు చేసిందేమిటి? ఒళ్ళు దగ్గరపెట్టుకొని ఉండు!"* అంటూ కేకలేశారు.

బాబా వద్ద ఎప్పుడూ ఒక ఇటుకరాయి, ఒక పాతగుడ్డ ఉండేవి. అవి బాబాకు వారి గురుప్రసాదమని భక్తులు తలచేవారు. మసీదులో ఓ గోనెపట్టానుగానీ, పై పంచెను గానీ పరచి బాబా ఇటుకను ఆ పాతగుడ్డలో చుట్టి పెట్టేవాడు మహల్సాపతి. దాన్ని బాబా తమ తలగడలాగా ఉపయోగించేవారు. మసీదులో నేలపైన బాబాకు ఉత్తర, దక్షిణ దిశలలో తాత్యాపాటిల్, మహల్సాపతి తమ తలలు పెట్టి, ముగ్గురి కాళ్ళూ ఒక దగ్గరకు వచ్చేటట్లు పెట్టుకొని రాత్రిళ్ళు చాలా ప్రొద్దుపోయేవరకూ మాట్లాడుకుంటూ పడుకొనేవారు. *[1] (పూర్తి విశ్లేషణకు పేజీ నెం. 60 చూడగలరు)

కొంతకాలం మాత్రం బాబా మసీదు కప్పుకు ఒక చెక్కపలకను వ్రేలాడగట్టి అద్భుతరీతిన దానిపై నిద్రించేవారు. దాన్నో ప్రదర్శనలాగా చూడాలని జనం వస్తూ ఉండటంతో బాబా ఆ చెక్క పలకను ధునిలో వేసేశారు.

{ ఆ వివరం : బాబాపై అవ్యాజమైన ప్రేమ కలిగిన భక్తులలో ఎందరో గొప్ప ధనవంతులూ ఉన్నారు. బాబా మాత్రం తమ నిరాడంబర జీవితాన్ని వీడలేదు. ధరించే కఫ్నీలోగానీ, నివసిస్తున్న పాడుబడ్డ మసీదులోగానీ, పడకలోగానీ మార్పు లేదు! ఫకీరు వేషమే, భూ శయనమే! అయిదు ఇళ్ళ వద్ద భిక్షాటనమే!

భక్తులకు ఆ జీవనవిధానం ఎంతో బాధాకరంగా ఉండేది. పలుమార్లు ప్రాధేయపడి మార్పుకోరినా బాబా నవ్వి ఊరుకొనేవారు.

బాబా కటిక నేలపై పరుండటం సహించలేని నానాసాహెబ్ డేంగ్లే బాబాకు 18 అంగుళాల వెడల్పు, 5 మూరల పొడవు ఉన్న ఒక చెక్కపలకను పడకగా ఉపయోగించుకునేందుకు, బాబాను ప్రార్థించి, ఒప్పించి అర్పించాడు.

బాబా ఆ చెక్కకు నాల్గుమూలలందు చివికిన గుడ్డపేలికల్ని తాళ్ళుగా కట్టారు. మసీదు పైకప్పుకు మూరెడు క్రిందుగా పలకను ఉంచి కప్పుదూలాలకు ఆ చివికిన గుడ్డపేలికల తాళ్ళ చివర్లతో ముడివేశారు. దుర్బలంగా వ్రేలాడుతున్న ఆ చెక్క, నిచ్చెన సాయంలేకుండా పైకి చేరలేనంత ఎత్తులో ఉండిపోయింది. ఆ బల్ల నాలుగు మూలలందు నాలుగు వెలుగుతున్న ప్రమిదల్ని ఉంచారు. 18 అంగుళాల వెడల్పు, 5 మూరల పొడవుతో నామావశిష్టమైన ఆ ఊయల మీదకు ఏ సహాయం లేకుండా కనురెప్పపాటులో దాని పైకి చేరి ప్రమిదల మధ్య పరుండేవారు. ఆ చర్య ఒక అద్భుతం. చివికిన ఆ గుడ్డపేలికల తాళ్ళు స్థూలకాయుడైన బాబా భారాన్ని మోస్తూ తెగిపోయేవికావు. ఊయల మీదికి గమనించలేని విధంగా జేరినట్లే క్రిందికి దిగడం కూడా గమనించలేనంతటి విధంగా ఉండేది.

ఈ ఉయ్యాల వార్త నలుమూలలా ప్రాకిపోయింది. ఈ అద్భుతాన్ని చూడాలని ఒకసారి దాసగణు తదితరులు ఒక రాత్రి మసీదు వద్ద పొంచివున్నారు. బాబా ఆ రాత్రి కోపంతో కేకలేస్తూ, ఆ కొయ్యబల్లను పీకి మండుతున్న ధునిలో వేసేశారు.

– **సాయిపథం**, మార్చి 1988, 'నిద్రలేనివాడు నెరయోగిఎందైన' అనే వ్యాసం నుండి.}

ఆ తరువాత, బాబా నిద్రించేందుకు మరో చెక్కబల్లను సమర్పిస్తానన్నాడు కాకాసాహెబ్ దీక్షిత్. దానికి బాబా ***"వద్దు! మహల్సాపతిని నేలపై విడిచి నేనెలా చెక్కబల్లపై పడుకోను? ఇంకా నేనే నేలపైన పడుకొని, మహల్సాపతి ఎత్తులో పడుకొంటే బాగుంటుంది"*** అన్నారు. "అయితే మీకొకటి, మహల్సాపతికొకటి

రెండు చెక్కబల్లలు తీసికొస్తాను" అన్నాడు దీక్షిత్. *"అతడు చెక్కబల్లపై పడుకోలేడు. నేలపైనే పడుకొంటాడు. చెక్కబల్లపై పడుకోవడమంటే తమాషాకాదు. ఎవరైతే నాలాగా కళ్ళు తెరుచుకొని మెలకువతో నిద్రిస్తారో వాళ్ళే చెక్కబల్లపై పడుకోగలరు. నేను మహల్సాపతితో, "నేను పడుకొన్నప్పుడు నా ప్రక్కనే కూర్చొని, నీ చేతిని నా హృదయంపై వేయి. నిద్రపోవద్దు! నేను అల్లాను స్మరిస్తుంటాను. స్మరణ జరిగినంత సేపూ నా హృదయస్పందన ఒక విధంగా ఉంటుంది. స్మరణ ఆగగానే స్పందన మారుతుంది. అప్పుడు వెంటనే నన్ను తట్టిలేపు!" అని పురమాయిస్తుంటాను. కానీ, కనీసం ఆ పనిగూడా అతడు చేయలేడు. కూర్చుని కునికిపాట్లు పడుతుంటాడు. అతనికి నిద్ర తూగినపుడు అతని చేయి నా గుండెపై ఒక బండరాయిలా బరువుగా అనిపిస్తుంది. అపుడు నేనతణ్ణి గట్టిగా పిలిచి లేపితే కంగారుగా కళ్ళు తెరుస్తాడు. నేలపైనే సరిగ్గా కూర్చోలేనివాడు, నిద్రకు బానిసైనవాడు, వ్రేలాడగట్టిన బల్లపై ఎట్లా పడుకోగలడు?"* అన్నారు బాబా. అంతేకాదు, రాత్రి మసీదులోకి ఒకసారి అడుగు పెట్టాక, మళ్ళీ మహల్సాపతిని మసీదు మెట్లుకూడా దిగనిచ్చేవారుకారు – లఘుశంక తీర్చుకోవడానికైనా సరే! ఎప్పుడైనా మహల్సాపతి లేచి మసీదు బయటకు పోబోతే, *"మసీదు మెట్లు దిగకు! దిగితే చస్తావ్!"* అని కేకలేసేవారు. అలా తనతో గడిపిన అన్ని రాత్రిళ్ళు మహల్సాపతిని నిద్రపోనీయక, జాగరూకతతో తాను విధించిన సాధనలు చేయించారు బాబా.

## సాయి సేవలో మహల్సాపతి

బాబా విధించిన నియమాలపట్ల అజాగ్రత్తగా ఉండి ఎంత ప్రమాదాన్ని మహల్సాపతి కొని తెచ్చుకొన్నాడో, బాబా అనుగ్రహం వల్ల ఎలా రక్షింపబడ్డాడో చూచాం. బాబా ఆదేశాలను వెంట్రుకవాసి తప్పి చరించినా – తనకేగాక, ఒక్కోసారి ఇతరులకూ – ఎంత ప్రమాదమో మహల్సాపతి విషయంలోనే జరిగిన ఒక బాబా లీల చూస్తే తెలుస్తుంది. అంతేకాదు, సర్వశక్తి సంపన్నుడైన శ్రీసాయి వంటి సద్గురువులను సేవించడం కత్తి మీద సాము వంటిదని కూడా తెలుస్తుంది.

బాబా ఒక రాత్రి మహల్సాపతితో, *"ఈ రాత్రి నీవు నిద్రపోవద్దు. బయట నిలబడి కాపలా కాస్తుండు. నేను అల్లా ధ్యానంలో ఉంటాను. ఆ తల్లిని ఆ రోహిల్లా*

*జబర్దస్తీగా చంపాలని చూస్తున్నాడు. నేను ఆమె కోసం అల్లాను ప్రార్థించాలి"* అన్నారు. అలాగే, మహల్సాపతి మేలుకొని బాబా ధ్యానానికి ఎవ్వరూ భంగం కలిగించకుండా చూస్తున్నాడు. ఇంతలో నెవాసానుండి ఒక మమల్తదారు (తాసిల్దారు) తన జవాన్లతో అట్టహాసంగా బాబా దర్శనానికొచ్చాడు. అంత రాత్రయినా, బాబా దర్శనం చేయాల్సిందేనని పట్టుబట్టాడు. బాబా ధ్యానంలో ఉన్నారనీ, ఎవ్వరినీ రానివ్వకూడదని ఆదేశించారనీ మహల్సాపతి ఎంత నచ్చచెప్ప యత్నించినా వాళ్ళు – ముఖ్యంగా మమల్తదారు జవానులు – వినలేదు. ఒకవైపు ఉన్నత ప్రభుత్వాధికారి, మరోవైపు బాబా ఆదేశం – మహల్సాపతికేం చేయాలో పాలుపోలేదు. తెల్లవారిన తరువాతనే బాబా దర్శనం అవుతుందనీ, కావాలంటే బాబా ఊదీ తీసికెళ్ళమనీ, వారినెలాగో ఒప్పించి ఊదీ కోసం లోపలికెళ్ళాడు. పెద్దగా వాళ్ళు మాట్లాడుకొంటున్న మాటలు, మహల్సాపతి ఊదీ తీసుకొనేటప్పుడు చేసిన అలికిడికీ బాబా ధ్యానం భగ్నమైంది. బాబా మహాకోపంతో *"ఓరే కంసాలీ, ఒక్క వెంట్రుకతో నా గొంతు కోస్తావా? నీకూ పిల్ల పాప ఉన్నారు. ఎంతపని చేశావ్? ఇప్పుడు ఆ నీగోజీ పాటిల్ భార్య చచ్చిపోయింది. నీ బట్టలు తీసికొని వెళ్లిపో! ఇక ఇక్కడ పడుకోనక్కరలేదు!"* అంటూ చాలాసేపు కేకలేస్తూ, మహల్సాపతి పడుకొనేందుకు పరచుకొనే పైపంచె తీసి బయటపడేశారు. తరువాత కొంతసేపటికి శాంతంగా *"సరే పోనీ, జరిగిందేదో మంచికే జరిగింది!"* అంటూ మహల్సాపతిని చిలుం సిద్ధంచేయమన్నారు. తెల్లవారగానే మహల్సాపతికి ఊదీ ఇచ్చి ఇంటికెళ్ళమన్నారు. ఇంటికెళ్ళేదారిలో అంత్యక్రియలకు అవసరమైన సామాన్ల కోసం శిరిడీ వచ్చి ఉన్న (నీంగావ్) నీగోజీపాటిల్ బంధువులను చూచి ఖిన్నుడయ్యాడు మహల్సాపతి. నీగోజీ పాటిల్ భార్యకు అంతకు ముందు ప్లేగు (దాన్నే బాబా 'రోహిల్లా' అన్నది) సోకి, ఆ ముందు రాత్రి – సరిగ్గా బాబా మహల్సాపతిని కేక లేస్తున్న సమయంలోనే మరణించింది!

## దక్షిణల మాయలో పడని భగత్!

తాను చేస్తున్న వృత్తిని త్యజించి పూర్తిగా బాబా సేవలో, భగవధ్యానంలో గడుపుతున్నప్పటికీ మహల్సాపతి కేవలం భిక్షపైనే ఆధారపడి జీవించాడు తప్ప– తాను సంసారి కనుక, జీవనాధారమైన వృత్తిని వదలి బాబా సేవలో ఉన్నాడు గనుక

దక్షిణలు, కానుకలు స్వీకరించడం తన హక్కు అని, అవి సమర్పించడం సాయి భక్తుల బాధ్యత అని భావించలేదు, అలా అని సాటి సాయిభక్తులను భ్రమింపజేయ యత్నించనూలేదు.

తన యొక్క, తన కుటుంబం యొక్క భుక్తి కోసం మధుకర వృత్తి (భిక్ష)నే ఆశ్రయించి ఆ భిక్ష కూడా లభించకపోతే తానూ, తన కుటుంబసభ్యులు రోజుల తరబడి ఉపవాసం ఉండేవారే తప్ప భక్తుల నుండి దక్షిణలు, కానుకలు స్వీకరించేవాడు కాదు. అపరిగ్రహాన్ని (ఎవ్వరి దగ్గర దానంగాగానీ, దక్షిణగాగానీ ఏమీ తీసుకోక పోవడం) మించిన ఉత్తమ నియమం ఆధ్యాత్మికసాధనలో లేదనీ "ప్రతిగ్రహం మాన్యః తపస్తేజోయశక్షీణదం" (కానుకలు దక్షిణ గ్రహించడం వల్ల తపశ్శక్తి, తేజోశక్తి, కీర్తి నాశనమవుతాయి) – అని శాస్త్రాలు ఘోషిస్తున్నాయి. దక్షిణ, కానుకలతో కూడిన పూజాదుల వల్ల ముక్తుడైన యతి కూడా బంధంలో చిక్కుకుంటాడని *"అభిపూజిత లాభాంశ్చ। జుగుప్సేతైవ సర్వశః। అభిపూజిత లాభైస్తు। యతిర్ముక్తో పి బధ్యతే।।"* మనుస్మృతి.

ఎందరో సాయిభక్తులు మహల్సాపతికి కానుకలు, ధనము ఇవ్వాలని ప్రయత్నించారు. నిత్యమూ బాబా ప్రక్కనే ఉంటూ సాయి ప్రధాన సేవకుడుగా ఉన్న మహల్సాపతి పేదరికంలో మ్రగ్గుతూ ఉంటే, ఎందరో ధనిక సాయిభక్తులు ఆయనకు కానుకలు, ధనసహాయం చేయడానికి ముందుకు రావడం సహజమే. ఉదాహరణకు చింతామణ్‌రావు అనే భక్తుడు రూ. 1000/–, యం.ఎ. సేఠ్ అనే భక్తుడు రూ. 100/– (ఆ రోజుల్లో) – ఇలా ఇంకా ఎందరో సాయిభక్తులు ఎంతో డబ్బు మహల్సాపతికి సమర్పించి, స్వీకరించమని ఒత్తిడి చేశారు. కానీ మహల్సాపతి నిష్కర్షగా ఆ కానుకలను స్వీకరించడానికి సుతరామూ ఒప్పుకోలేదు. ఒకసారి ఒక భక్తుడు ఓ పది రూపాయలు మహల్సాపతికి ఇవ్వబోయాడు. మహల్సాపతి ఆ పైకం తీసుకోలేదు. ఇంతలో బాబా ఆ భక్తుని దగ్గరకి పిలిచి, ఆ పదిరూపాయలు తామే స్వీకరించి వెంటనే మరో భక్తునికి ఇచ్చారు.

బాబా కూడా మహల్సాపతి ఇతర సాయిభక్తుల నుండి కానుకలు స్వీకరించడానికి ఎంతమాత్రమూ అంగీకరించేవారు కాదు. అంతేకాదు, బాబా తామే స్వయంగా ఎందరో భక్తులకు నిత్యం వందలాది రూపాయలు ప్రసాదంగా దానం

చేసేవారు. కానీ, మహల్సాపతికి మాత్రం ఏమీ ఇచ్చేవారు కాదు. అయితే చాలాసార్లు బాబా మహల్సాపతితో, *"భగత్, ఇదిగో ఈ మూడు రూపాయలు తీసుకో! రోజూ ఇలా మూడు రూపాయలు తీసుకుంటూ ఉండు! అలా బాగా ధనవంతుడివికా! ఇతరులు నీ సహాయం కోసం నిన్ను ఆశ్రయిస్తారు. సుఖంగా జీవించు!"* అనేవారు. మహల్సాపతి మాత్రం బాబా అలా అన్న ప్రతిసారీ, ధన ప్రలోభానికి లోనుకాకుండా "బాబా, నాకివేమీ అక్కరలేదు. ఎప్పుడూ నీ పాదాలు పూజించుకుంటూ ఉంటే నాకదే పదివేలు!" అంటూండేవాడు.

## వట్టిపోయిన మనసు - గట్టిపడిన వైరాగ్యం!

శిరిడీకి సుమారు ఆరు ఏడు మైళ్ళ దూరంలో ఉండే అస్తీగావ్ అనే గ్రామానికి చెందిన రాంభావ్ హర్డే అనే భక్తుడు ప్రతి గురువారం నియమంగా శిరిడీ వచ్చి బాబా దర్శనం చేసుకునేవాడు. బాబాకు నమస్కరించిన తరువాత మహల్సాపతికి కూడా నమస్కరించేవాడు.

ఒకసారి రాంభావ్ తన చూడి ఆవుకు గర్భం సరిగా పెరగడం లేదని, ఎన్ని మందులు వాడినా ఫలితం కనిపించడం లేదని, ఏదైనా పరిష్కారం సూచించమని మహల్సాపతిని సలహా అడిగాడు. మహల్సాపతి ఆ ఆవు కోసం ఖండోబాకు పూజ చేసి, ఊదీని ఆ ఆవు కొమ్ములకు కట్టమని చెప్పాడు. తరువాత కొంతకాలానికి ఆ ఆవు ఈనింది. రాంభావ్ ఆ ఆవుదూడను మహల్సాపతికి ఇచ్చేసి, తాను తన గ్రామంలో పురాణ కాలక్షేపం ఒకటి ఏర్పాటు చేసాననీ, దానికి మహల్సాపతి వచ్చి పురాణపఠనం చేయాలని అర్థించాడు. మహల్సాపతి ఆ కార్యక్రమానికి వెళ్ళడానికి బాబా అనుమతి కోరాడు. బాబా అనుమతి నిరాకరిస్తూ, *"భగత్, అక్కడ కొట్లాటలు జరుగుతాయి. నీవు పోవద్దు!"* అని అన్నారు. కానీ, రాంభావ్ వత్తిడి తట్టుకోలేక మహల్సాపతి అస్తీగావ్ వెళ్ళాడు. అక్కడ పురాణపఠనానికి 'మల్-అ-రీ మహాత్మ్యం' అనే గ్రంథం కూడా తీసుకెళ్ళాడు. మహల్సాపతి గ్రంథపఠనం మొదలెట్టబోతుండగా, ఒక ప్రక్క అప్పుడే భోజనానికి కూర్చున్న రాంభావ్ కుమారులకు, ఇంకొంతమంది యువకులకు వాళ్ళలో వాళ్ళకు ఏదో విషయంగా మాటామాటా పెరిగి కర్రలతో కొట్టుకొనేదాకా వచ్చింది. ఆ కొట్లాట వల్ల పురాణకాలక్షేపం ఆగిపోయి, మహల్సాపతి

వెంటనే శిరిడీ తిరుగుముఖం పట్టవలసి వచ్చింది. మహల్సాపతి బాబా దగ్గరకెళ్ళగానే, బాబా అతడితో, *"నేను పోవద్దంటే విన్నావా? ఇప్పటికైనా తెలిసిందా?"* అన్నారు.

అలా తన అహంకారాన్ని పెంచే బంధాలే కాకుండా, పూర్తి వైరాగ్యవృత్తి నవలంబించిన మహల్సాపతిని లాంఛనప్రాయమైన (కుటుంబ సంబంధమైన) సంసారబంధాలలో కూడా తగులుకోకుండా కాపాడేవారు బాబా. మహల్సాపతి నలుగురు కుమార్తెలలో ఇద్దరిని డోర్హాళ్ అనే ఊర్లో ఇచ్చి వివాహం చేశాడు. ఒకసారి ఏదో కుటుంబ సంబంధమైన కార్యంలో భోజనానికి తన వియ్యంకులవద్ద నుండి మహల్సాపతికి ఆహ్వానం వచ్చింది. డోర్హాళ్ వెళ్ళేముందు బాబా అనుమతి కోసం మసీదుకు వెళ్ళాడు. మహల్సాపతిని చూడగానే బాబా, ***"నీవు అక్కడికి భోజనానికి పోవద్దు. పోతే అవమానం జరుగుతుంది!"*** అన్నారు. దానికి మహల్సాపతి, "పోకపోతే ఎలా బాబా? పిలిచిన వాళ్ళు దగ్గర బంధువులు. పోకపోతే ఏమయినా అనుకొంటారు. అక్కడ అందరూ భోజనానికి నా కోసం ఎదురు చూస్తుంటారు. పోక తప్పదు!" అన్నాడు. బాబా మౌనం వహించారు. మహల్సాపతి డోర్హాళ్ వెళ్ళేసరికి, అక్కడ కార్యానికి వచ్చినవారు – తనను పిలిచినవారితో సహా – అందరి భోజనం పూర్తయింది. మహల్సాపతిని భోజనం చేయమని ఎవ్వరూ అడగలేదు, సరికదా, అతణ్ణి ఎవ్వరూ పట్టించుకోలేదు కూడా! వియ్యంకుల ఇంట్లో జరిగిన అవమానానికి కృంగిపోతూ మహల్సాపతి శిరిడీ మరలి వచ్చాడు. మహల్సాపతిని చూడగానే బాబా, ***"డోర్హాళ్‌లో మర్యాదలు బాగా జరిగాయా?"*** అన్నారు నవ్వుతూ.

అహంకార మమకారాలను జయించడంలో సాధకులు పెద్ద విషయాలలో జాగ్రత్త వహిస్తూ, చిన్న చిన్న విషయాలలో తప్పటడుగు వేయటం సామాన్యంగా జరుగుతుంటుంది. కానీ ఘటనాఘటన సమర్థుడైన సద్గురువు తనదైన అద్భుత రీతిలో తన భక్తుని మనస్సు అడుగుపొరల్లో దాగిన ఆశామమకారాలను వెలికితీసి, గుర్తింపజేస్తాడు.

ఒకసారి ఖండోబా ఆలయంలో దొంగతనం జరిగింది. మహల్సాపతి వాడుకొనే ఉన్ని జంఖానా, కొన్ని పాత్రలు దొంగిలించబడ్డాయి. ఆ కంబళి అంటే మహల్సాపతికి చాలా ప్రీతి. ఆ వస్తువుల కోసం వెతికి, ఇక వాటి మీద ఆశ వదులుకున్నారు. కొన్ని రోజుల తర్వాత డోర్హాళ్‌లో మహల్సాపతి కూతురు (గ్రామస్థులు బట్టలు ఉతుక్కునే

బండ దగ్గరకు) బట్టలు ఉతుక్కునేందుకు వెళ్ళినప్పుడు, ఒక మహిళ ఉతికేందుకు తెచ్చిన కంబళిని చూచి, అది తన తండ్రిదని గుర్తించి, గ్రామపటేల్‌కు ఫిర్యాదు చేసింది. ఆ మహిళను ప్రశ్నిస్తే, ఆమెకు ఆ కంబళి ఇచ్చిన దొంగ కూడా దొరికాడు. పటేలు ఆ కంబళి గుర్తించి తీసుకొని పొమ్మని మహల్సాపతికి కబురుపెట్టాడు. మహల్సాపతి ఆ కంబళి తెచ్చుకోవడానికి బాబా అనుమతి కోరితే *"ఏం లాభం? నీవు వెళ్ళినా ఒక్కటే! వెళ్ళకున్నా ఒక్కటే!"* అన్నారు బాబా. అయినా బాబా మాటలు లెక్కచేయక డోర్హాళ్ వెళ్ళాడు మహల్సాపతి. కంబళి దొరికింది. కానీ తన వియ్యపురాలు ఆ కంబళి తనకివ్వమని కోరడంతో, దాన్ని ఆమెకు ఇవ్వక తప్పిందికాదు. బాబా మాటల్లోని అంతరార్థం, జరిగిన దాన్లోని పరమార్థం అప్పుడు అతనికి స్ఫురించింది. ఆ దొంగ తనకు పరోక్షంగా మేలే చేశాడని గుర్తించి, ఆ దొంగపై ఫిర్యాదు ఉపసంహరించుకొని, ఆ దొంగను క్షమించి వదలివెయ్యమని పటేలును అభ్యర్థించి, వట్టి చేతులతో, వట్టిపోయిన మనస్సుతో, నిర్వికారంగా శిరిడీ చేరాడు మహల్సాపతి.

## అంతటా నిండి ఉన్న అభయప్రదాత

మహల్సాపతికి భక్తివైరాగ్యాలు దృఢపడడానికి బాబా అతనికన్నీ చేదు అనుభవాలే ఇవ్వలేదు. తననొక్కసారి మనసారా స్మరిస్తేనే తన భక్తుని రక్షణకు పరుగున వచ్చే బాబా అహర్నిశలు తననే నమ్ముకొని, శరణు పొంది సేవిస్తున్న భక్తుణ్ణి కష్టాలలో కాపాడకుంటారా?

ప్రతిరోజు మసీదు నుండి సాయంత్రం మహల్సాపతి తన ఇంటికెళ్ళడానికి బాబా దగ్గర సెలవు తీసుకుంటున్నప్పుడల్లా, బాబా అతనితో *"వెళ్ళిరా! నేను నీతోనే ఉంటాను"* అనేవారు. శిరిడీ గ్రామంలో పాముల బెడదెక్కువ. బాబా పాములనెప్పుడూ, *"దొంగల"*నీ, *"పెద్దమనుష్యుల"*నీ తన నిగూఢ పరిభాషలో ప్రస్తావించేవారు. ఒక రాత్రి మహల్సాపతి ఇంటికెళ్ళేటప్పుడు బాబా అతనితో అన్నారు: *"నీకీరోజు ఇద్దరు దొంగలు ఎదురవుతారు. కానీ భయం లేదు. నీతో నేను తోడు వస్తాను. వెళ్ళిరా!"* అని. ఆ రాత్రి మహల్సాపతికి తన ఇంటి గుమ్మం వద్ద ఒక పాము, ప్రక్క ఇంటి గడప దగ్గర ఒక పాము కనిపించాయి. ఇంకోసారి, ఇంటికెళ్తున్న మహల్సాపతితో *"నీవు తిరిగి వచ్చేటప్పుడు, కూడా లాంతరు తెచ్చుకో. గుమ్మం దగ్గర నీకొక 'దొంగ'*

*ఎదురవుతాడు"* అన్నారు. అలాగే మహల్సాపతి లాంతరుతో తిరిగి వస్తుండగా, గుమ్మం ముందు ఒక పాము పడుకొని కనిపించింది. "పాము! పాము!" అని అతడు కేకలేసేసరికి చుట్టుప్రక్కలవాళ్ళు వచ్చి దాన్ని చంపేశారు. మహల్సాపతి దగ్గర ఆ రోజు లాంతరే లేకుంటే, చూడకుండా ఆ పామును త్రొక్కి ఉండేవాడే!

మరోసారి మహల్సాపతితో బాబా *"ఖండోబా గుళ్ళో వాళ్ళకి త్వరలో కష్టాలు ఉన్నాయి. అయినా భయపడనక్కరలేదు. నేనున్నాను"* అన్నారు. తర్వాత కొద్దిరోజులకి మహల్సాపతి భార్యకు, కుమార్తెకు తీవ్రంగా జబ్బు చేసింది. విచిత్రంగా మిగిలిన కుటుంబసభ్యులు కూడా అనారోగ్యానికి గురయ్యారు. మహల్సాపతికేం చెయ్యాలో పాలుపోలేదు. ఆ తర్వాత బాబా దర్శనానికొచ్చిన వారిలో ఉన్న కొందరు డాక్టర్లు, మహల్సాపతి ఇంట్లోని వారి అనారోగ్యం గురించి తెలుసుకొని, మహల్సాపతికి కొన్ని మందులు యిచ్చారు. డాక్టర్ల మందుల విషయం మహల్సా బాబాకు చెబితే, బాబా ఏ మందులూ వాడొద్దన్నారు. అలానే మహల్సాపతి ఏ మందులూ వాడలేదు. బాబా అతణ్ణి పిలచి *"మంచానపడ్డ వారిని మంచంలోనే ఉండనీ!"* అంటూ తమ సటకా (చేతికర్ర) ఊపుతూ, మసీదు చుట్టూ తిరుగుతూ, *"రా! నీ శక్తి ఏమిటో కూడా చూస్తాను. నా ముందుకొచ్చావంటే నా చిన్న చేతికర్ర తడాఖా ఏమిటో కూడా నీకు తెలుస్తుంది!"* అంటూ కొంతసేపు ఏదో అదృశ్యశక్తిని తిడుతూ, బెదిరిస్తూ ఉన్నారు. విచిత్రంగా, బాబా అలా అన్న తరువాత నుండి మహల్సా కుటుంబసభ్యుల ఆరోగ్యం మెరుగుపడనారంభించి, త్వరలోనే పూర్తిగా కోలుకున్నారు.

ఒకసారి మహల్సాపతి భార్య తన పుట్టింటికెళ్ళింది. అక్కడ ఆమెకు మెడ దగ్గర ఒక కణితి (tumour) లేచి, విపరీతంగా బాధపెట్టసాగింది. కానీ ఆమె ఆ విషయం తన భర్తకు వ్రాయలేదు. అయితే శిరిడీలో బాబా మహల్సాపతితో *"నీ భార్యకు గొంతు దగ్గర ఒక కణితి లేచింది. దాన్ని నేను నయం చేస్తాను. ఇంకెవ్వరూ నయం చెయ్యలేరు!"* అన్నారు. మహల్సాపతికి బాబా అలా ఎందుకన్నారో అప్పుడు అర్థం కాలేదు. తరువాత కొన్ని రోజులకు తన భార్య దగ్గర నుంచి ఉత్తరం వస్తే, అప్పుడు తెలిసింది– ఆమెకు కణితి వచ్చిందనీ, కానీ అదే విచిత్రంగా నయమైందనే విషయం.

అలా బాబా మహల్సాపతిని, అతని కుటుంబసభ్యులను కంటికి రెప్పలా కాపాడిన సంఘటనలు మహల్సాపతి జీవితంలో ఎన్నో! *"పద! నేనెప్పుడూ నీకు*

***తోడుంటాను"*** అన్న బాబా హామీ మహల్సాపతికి శిరిడీ గ్రామంలో ఉన్నప్పుడు మాత్రమే కాదు, అతను ఎన్ని వందల మైళ్ళ దూరాన ఉన్నా అనుభవమయ్యేది.

ఖండోబా ఉపాసకుడు, ఖండోబా ఆలయంలో పూజారి అయిన మహల్సాపతి సాంప్రదాయానుసారం ప్రతి యేడూ మాఘశుద్ధపౌర్ణమికి ఖండోబా పుణ్యక్షేత్రమైన జజూరీకి వెళ్ళి అక్కడ జరిగే ఉత్సవాలలో పాల్గొనేవాడు. జజూరీ శిరిడీకి సుమారు 150 మైళ్ళు ఉంటుంది. మహల్సా వారి కులాచారం ప్రకారం అంత దూరమూ, ('మాలం భగత్ పాల్కి' అని పిలవబడే) పల్లకీ తీసుకొని, మరికొందరు ఖండోబా భక్తుల బృందంతో డప్పు మొ॥న వాయిద్యాలు వాయించుకుంటూ ఊరేగింపుగా కాలినడకనే వెళ్ళేవాడు. శిరిడీ నుండి బయలుదేరినప్పటి నుండి ఉపవాస దీక్షలో ఉండి, కాళ్ళకు చెప్పులు కూడా వేసుకోకుండా యాత్ర చేసేవాడు. తిరుగు ప్రయాణంలో 'కరా' అనే నదిలో స్నానం చేసి, ఉపవాసదీక్ష విరమించి, పారణ చేసేవాడు. ఇలా ప్రతి యేడూ నియమంగా చేసేవాడు మహల్సాపతి.

ఒకసారి మహల్సాపతి జజూరీ యాత్రకు సిద్ధమయ్యాడు. ఆ యేడు రాష్ట్రంలోని వివిధ ప్రాంతాలలో ప్లేగు వ్యాధి భయంకరంగా విజృంభించి ఉంది. ఆ దృష్ట్యా యాత్రికుల రాకపోకలపై ప్రభుత్వంవారు ఆంక్షలు విధించారు. నియమం తప్పకూడదని మహల్సాపతి ధైర్యం చేసి బయలుదేరాడు. బాబా అనుమతి తీసుకొని బయలుదేరగానే బాబా, అతణ్ణి పిలచి, రూ. 1-25పైలు. ఇచ్చి, ***"యాత్రకు వెళ్ళిరా! ఈ పైకం ఖర్చు పెట్టుకుంటే పెట్టుకో, లేకపోతే నీ ఇష్టం"*** అని అన్నారు. మహల్సాపతి బృందం అక్కడక్కడా విడిదిచేస్తూ జజూరీ సమీపించేసరికి అక్కడ ప్లేగు చాలా తీవ్రంగా ఉందని తెలిసింది. మహల్సాపతి బృందంలోని వారు ముందుకు పోవడానికి భయపడసాగారు. ఊరి బయట ఆగి, ధైర్యం చేసి ముందుకు పోవాలా? లేక వెనక్కి తిరిగి పోదామా? అంతదూరం, అంత కష్టపడి వచ్చి, వెనక్కి పోవడమెలా? - అని మధనపడుతూ మహల్సాపతి పల్లకీనానుకుని నిలుచుని ఆలోచిస్తున్నాడు. ఇంతలో అతనికి పల్లకీ ప్రక్కన బాబా నిల్చొని స్పష్టంగా కనిపించారు. బాబా అక్కడికెలా వచ్చారా అని ఆశ్చర్యపోతూ, పలుకరిద్దామనుకొనేసరికి, చూస్తుండగానే బాబా అదృశ్యమయ్యారు. బాబా దర్శనంతో మహల్సాపతికి ఎక్కడలేని ధైర్యం వచ్చింది. తన దివ్యానుభవాన్ని తన తోటి యాత్రికులకు చెప్పి, ***"బాబా మనతోనే ఉన్నారు. మనం***

*ఏమీ భయపడవలసిన పనిలేదు. పోదాం పదండి!"* అని ముందుకు సాగాడు. ఆ యాత్ర క్షేమంగా, సంతృప్తికరంగా పూర్తయ్యింది.

మహల్సాపతి శిరిడీ తిరిగి వచ్చి బాబాను దర్శించగానే, బాబా అతనితో, *"అరే భగత్, యాత్ర బాగా జరిగిందా? నేను కూడా యాత్రకొచ్చాను. నీవు జజూరీలో పల్లకీకానుకొని నిలుచుని కన్పించావు!"* అన్నారు. ఆ మాటలతో తాను జజూరీలో బాబాను దర్శించడం తన మనోభ్రాంతి కాదనీ, సర్వాంతర్యామియైన బాబా తాను సంకటస్థితిలో ఉన్నపుడు ప్రేమతో దర్శనమిచ్చి, తానున్నానని అభయమిచ్చారనీ – స్పష్టమైంది మహల్సాపతికి.

మరోసారి మామూలుగానే జజూరీ యాత్రకు బయలుదేరాడు మహల్సాపతి. అప్పట్లో కొన్ని భద్రతాకారణాల దృష్ట్యా అనుమతి పత్రాలు (pass) లేకుండా ఊరేగింపుగా స్వస్థలం వదలి వెళ్ళకూడదనే ప్రభుత్వ నిషేధం ఉంది. మహల్సాపతి బృందం పారనేరు అనే గ్రామం చేరేసరికి రాత్రయింది. బాజా భజంత్రీలతో సాగుతున్న ఆ బృందాన్ని పోలీసులు ఆపి, వారి పాసులు తనిఖీ చేశారు. ఆ బృందంలో ఒకరికి పాసు లేకపోవడంతో అతణ్ణి అరెస్టు చేసి పోలీసు స్టేషన్‌కు తీసుకెళ్ళారు. మహల్సాపతి బృందం అక్కడే ఆగిపోయింది. మరుసటి రోజు ఉదయాన్నే మహల్సాపతి పోలీసు అధికారిని కలిసి, విషయం వివరించాడు. ఆ గ్రామాధికారి (కులకర్ణి) నుండి రిమాండులో ఉన్న వ్యక్తి పేర పాసు తీసుకొస్తే, అతణ్ణి వదిలేస్తామన్నాడా పోలీసు అధికారి. మహల్సాపతి ఆ గ్రామ కులకర్ణిని కలిసి పాసు వ్రాసి ఇప్పించవలసిందని ప్రార్థించాడు. ఆ కులకర్ణికి తనతో పనిబడిన వారితో ఏదో పని చేయించుకొనిగానీ సహాయం చేసే అలవాటు లేదు. "అలానే పాసు వ్రాయించి ఇస్తాను, ఈ లోపల ఆ కట్టెలు కొంచెం కొట్టిపెట్టు" అని పురమాయించాడు. మహల్సాపతికి తప్పింది కాదు. గొడ్డలి తీసుకొని రెండు దెబ్బలు వేసేసరికి గొడ్డలికున్న పిడికట్టె విరిగిపోయింది. కులకర్ణి మరో గొడ్డలి ఇచ్చాడు. అదీ విరిగింది. అలాగే మూడో పిడికట్టె కూడా విరగడంతో కులకర్ణి ఆశ్చర్యపోయాడు.

మహల్సాపతి పూర్వాపరాలు క్షుణ్ణంగా విచారించి, "మీ చేత కట్టెలు కొట్టించడం ఆ భగవంతుడికి ఇష్టంలేదు" అంటూ, పాసు వ్రాసి ఇచ్చి కొన్ని బొప్పాయి పండ్లు కూడా దేవునికి నైవేద్యం పెట్టమని ఇచ్చి పంపాడు.

## అందుకో భగత్! సాయిభక్తుల కృతజ్ఞతాంజలి

ఈ అపూర్వ సంఘటన 1886లో జరిగింది. బాబా అప్పుడప్పుడు ఉబ్బసంతో బాధపడేవారు. 1886 డిసెంబరులో కూడా ఒకసారి బాబాకు తీవ్రంగా ఉబ్బసం పట్టుకొంది. బాబా చెంతనే ఉంటూ మహల్సాపతి అహర్నిశలు బాబాను సేవించు కొంటున్నాడు. ఒక రాత్రి సుమారు 10 గంటలప్పుడు బాబా మహల్సాపతితో, ***"అరే భగత్, నేను అల్లా దగ్గరకెళ్తున్నాను. మూడు రోజుల్లో తిరిగి వస్తాను. అంతదాకా ఈ దేహాన్ని జాగ్రత్తగా చూసుకో. ఒకవేళ నేను రాకపోతే, ఈ దేహాన్ని అక్కడ*** ('గురుస్థాన్' వేపచెట్టు సమీపంలోని ఆరుబయలు ప్రదేశాన్ని చూపుతూ) ***పాతిపెట్టి, గుర్తుగా రెండు జెండాలు నాటు"*** అని అన్నారు. మహల్సాపతికి బాబా మాటల్లోని సారాంశము అర్థమయ్యేలోగా, మరుక్షణంలోనే బాబా దేహం అచేతనంగా మారిపోయింది. గుండె, శ్వాస ఆగిపోయాయి. ఈ హఠాత్పరిణామానికి ఏం చెయ్యాలో మహల్సాపతికి తోచలేదు. కానీ బాబా ఆదేశాన్ని స్మరించి, అలాగే బాబా దేహం ప్రక్కన కూర్చున్నాడు. మరుసటిరోజుకల్లా బాబా మరణించారన్న 'వార్త' ఊర్లో ప్రాకింది! అప్పటికింకా బాబా మహిమ అంత ప్రఖ్యాతం కాలేదు. బాబా మహాత్మ్యాన్ని గుర్తించిన కొందరు భక్తులు కూడా, బాబా మరణించిన తరువాత తిరిగి మేల్కొనగలంతటి మహిమాన్వితుడనే పూర్తి విశ్వాసం లేదు. అప్పాకులకర్ణి, కాశీనాథ్, మౌలీసాహెబ్ మొ॥న వారందరూ, రెండవ రోజుకల్లా, బాబాను ఎలా సమాధి చెయ్యాలా అనే చర్చలో పడ్డారు. బాబాను హిందూ సాంప్రదాయం ప్రకారం సమాధి చెయ్యాలని కొందరంటే, కాదు – (బాబా కోరిక ప్రకారం) ముస్లిం సాంప్రదాయాన్ననుసరించి సమాధి చేయాలని కొందరు పట్టుబట్టారు. బాబా చెప్పిన ప్రకారం మూడురోజులు చూచి, ఆ తరువాత నిర్ణయించవచ్చునని కొందరంటే, అంత్యక్రియలు చెయ్యకుండా 'శవాన్ని' అన్ని రోజులు అట్టేపెట్టడం ఊరికి క్షేమం కాదని కొందరు ఆక్షేపించారు. ఎవరేమంటున్నా, మూడు రోజుల వరకు బాబా చెప్పిన ప్రకారం వేచిచూడవలసిందేననీ, ఆ లోపల తన ప్రాణం పోయినా బాబా దేహాన్ని అప్పగించననీ మహల్సాపతి మొండిగా కూర్చున్నాడు. బాబా తలను తన ఒడిలో పెట్టుకొని, నిద్రాహారాలు కూడా లేకుండా, మూడు రోజులు బాబా దేహాన్ని కంటికి రెప్పలా కాపాడాడు. మూడవరోజు తెల్లవారుఝామున సుమారు 3 గంటల

ప్రాంతంలో బాబా దేహంలో కదలిక కన్పించింది! అప్పుడే నిద్రలేచినట్లు కళ్ళు తెరచి, ఏమీ జరగనట్లు, మామూలుగా ఉన్నారు. బాబా మాటలపై మహల్సాపతికున్న అచంచల విశ్వాసం, అలా బాబా దేహాన్ని కాపాడింది. ఆ రోజున మహల్సాపతి అక్కడి గ్రామస్థుల ఒత్తిడికి లొంగిపోయి ఉంటే ఏమై ఉండేదో మనం ఊహించలేం! ఆ తరువాత సుమారు 32 సంవత్సరాలపాటు బాబా తమ భౌతికదేహంతో అవతార కార్యాన్ని కొనసాగించేందుకు మహల్సాపతి అలా నిమిత్తమాత్రుడయ్యాడు. దానికి సాయిభక్తులందరూ మహల్సాపతికి ఎల్లప్పుడూ కృతజ్ఞులై ఉంటారు.

అంతేకాదు, బాబా అప్పుడప్పుడు తీవ్ర కోపావేశంతో *"నూనె వ్యాపారస్థులు నన్ను వేధిస్తున్నారు. నేనీ ఊర్లో ఉండను!"* అంటూ ఊరు వదలి వెళ్ళేందుకు బయల్దేరేవారు. అప్పుడు మహల్సాపతి, తాత్యా తదితర సన్నిహిత భక్తులు బాబాను చిన్నపిల్లాణ్ణి బుజ్జగించినట్లు బుజ్జగించి, బ్రతిమిలాడి మసీదుకు తిరిగి తీసుకొచ్చేవారు. అలాగే, ఒకసారి, బాబా తీవ్ర కోపావేశంలో 'నూనె వ్యాపారస్థుల'ను, శిరిడీ గ్రామస్థులను తిడుతూ, తాను శిరిడీ వదలి వెళ్తున్నానని అంటూ వెళ్ళిపోయారు. అప్పుడు బాబా దగ్గర మహల్సాపతి కూడా లేడు. అతడు భిక్షకెళ్ళి ఉన్నాడు. భిక్ష చేసుకొని ఇంటికి తిరిగి రాగానే, అతని భార్య బాబా చాలాసేపటి క్రితమే ఊరు విడిచి వెళ్ళిన సంగతి చెప్పింది. మహల్సాపతి హతాశుడయ్యాడు. విచారించగా బాబా మామూలుగా వెళ్ళే రహతా వైపుగానీ, నీంగాం వైపుగానీ వెళ్ళలేదని తెలిసింది. ఇంకా విచారించగా, బాబా కోపంతో ఎవర్నో తిడుతూ, రూయీ గ్రామం వైపు వెళ్ళడం తాము చూచామని కొందరు చెప్పారు. "బాబా ఎక్కడున్నా వెంటబెట్టుకొనే నేను తిరిగి శిరిడీ వస్తాను. లేకపోతే ఇక కనిపించను" అని ఇంట్లో చెప్పి, రూయీ వైపు వెర్రిగా పరుగుతీశాడు మహల్సాపతి. అతను రూయీ సమీపించేసరికి ఆ ఊరి బయట ఉన్న మారుతీ ఆలయం దగ్గర కూర్చుని, కాలికి గుచ్చుకున్న ముల్లు తీసుకుంటూ కనిపించారు బాబా. మహల్సాపతిని అల్లంత దూరాన చూడగానే బాబా ఉగ్రులై, అతణ్ణి, శిరిడీ గ్రామస్థులను తిడుతూ, తన వెంట రావద్దని కేకలేస్తూ, అతనిపై రాళ్ళు రువ్వసాగారు. బాబా ఎంత తిట్టినా మహల్సాపతి చలించలేదు. బాబా శిరిడీ తిరిగి వస్తేనేగానీ తాను కదలనని భీష్మించుకు కూర్చున్నాడు. *"నేను ఫకీర్ని. నా ఇష్టమొచ్చిన చోటుకు నేను వెళ్తాను. నీకు కొంపాగోడూ ఉంది. నాతో నీకేం పని?"* అంటూ బాబా ఇంకా

తీవ్రంగా తిట్టసాగారు. బాబా తిరిగి శిరిడీ వస్తేగానీ తాను పచ్చి మంచినీళ్ళయినా ముట్టననీ, తన ప్రాణం పోయినా బాబాను వదలననీ హఠం వేసుకు కూర్చున్నాడు మహల్సాపతి. బాబాకిక తప్పలేదు. నెమ్మదిగ శాంతించి, మహల్సాపతితో శిరిడీ చేరారు. అలానే అంతకు చాలాకాలం ముందు జవహర్ అలీ అనే ముస్లిం ఫకీరు బాబాను రహతాకు తీసికెళ్ళినప్పుడు, శిరిడీ గ్రామస్థులను కూడగట్టి, రహతా వెళ్ళి, బాబాను తిరిగి శిరిడీ తీసుకురావడంలో ప్రముఖపాత్ర వహించినదీ – మహల్సాపతే!

## సాయి 'భక్తమాణిక్యం' సమాధియైన రోజు

బాబాను అనన్యంగా సుమారు 50 సంవత్సరాలపాటు నీడలా ఉండి సేవించుకొన్న మహల్సాపతికి బాబా నిర్యాణం ఎంతటి విఘాతమో ఎవ్వరైనా తేలికగా ఊహించుకోగలరు. కానీ, 1918లో బాబా మహాసమాధి చెందినపుడు – బాబా అనుగ్రహించిన శిక్షణ, వైరాగ్య బోధోపరతుల ఫలితమా అన్నట్లు – మహల్సాపతి ఎంతో ఆత్మస్థైర్యంతో, దృఢచిత్తంతో తట్టుకోగలిగాడు. అంత వృద్ధాప్యంలో కూడా, అంతకు ముందు నియమంగా మసీదులో రాత్రిళ్ళు నిద్రిస్తున్న ప్రకారమే బాబా మహాసమాధి చెందిన తరువాత కూడా కొనసాగించాడు.

ఎవరి పాదసన్నిధిలో తన జీవితం ఎక్కువ భాగం గడిచిందో, ఎవరి లీలా దర్శనము తన నిత్యకృత్యాలలో భాగమో, ఎవరికోసం తన భార్యాబిడ్డలను కూడా పట్టించుకోకుండా అహోరాత్రాలు సేవించుకొన్నాడో, అట్టి తన గురువు, దైవం, ఆత్మబంధువు అయిన బాబా భౌతికరూపంతో వియోగం దుర్భరంగా తోచడం సహజమే. అందుకే మసీదులో రాత్రిళ్ళు ఒంటరిగా గడిపేటపుడు మహల్సాపతి రాత్రిలో ఎక్కువ భాగం కూర్చొని ధ్యానం చేసుకుంటుండేవాడట. ఒక్కోసారి మసీదులో కూర్చుని, కన్నీరు కారుస్తూ బాబా భౌతికంగా ఉన్నప్పుడు ఎలా బాబా కాళ్ళు పట్టేవాడో, అలాగే బాబా అక్కడ ఉన్నట్లు 'కాళ్ళొత్తుతూ' రాత్రిళ్ళంతా గడిపేవాడట. అలాంటి స్థితిలో మహల్సాపతిని చూచిన భక్తులకు ఆ దృశ్యం ఎంతో హృదయవిదారకంగా తోచేదట. అలా బాబా భౌతిక సాన్నిధ్యం లేకుండా ఆ తరువాత నాలుగు సంవత్సరాలు గడిపాడు మహల్సాపతి. ఆ రోజులలో ఎక్కువ భాగం తన కాలాన్ని మౌనంలోను, భగవధ్యానంలోనూ గడిపేవాడు.

1922 సెప్టెంబరు 11వ తేది సోమవారం (భాద్రపద శుద్ధ ఏకాదశి) మహల్సాపతి తండ్రిగారి ఆబ్దికం. అంతేకాదు, ఆ రోజు ఖండోబా భక్తులకు పవిత్రమైంది కూడా. మామూలుగానే, ఆ రోజు కూడా ఖండోబాకు, బాబాకు నిత్యపూజానుష్ఠానాలు పూర్తిచేసి, తన కుటుంబసభ్యులతో "ఆబ్దికానికి ఏర్పాట్లు, వంటలు త్వరగా కానివ్వండి! ఈ రోజు నేను వెళ్ళిపోవలసి ఉంది" అని అన్నాడు. పురోహితుడు లక్ష్మణ్ వచ్చి యథావిధి శ్రాద్ధప్రక్రియ పూర్తి చేశాడు. భోక్తల భోజనం తరువాత ఇంట్లో అందరూ భోజనం చేశారు. అందరితోపాటు పంక్తిలో కూర్చున్నా మహల్సాపతి భోజనం చేయలేదు. వడ్డించిన పళ్ళాన్ని పైకెత్తి, ముక్కుకు తాకించి వాసన చూసి, పళ్ళెం క్రింద పెట్టేసాడు. ఒక కోరా (కొరికము) బట్ట చింపి నడుముకు చుట్టుకొని, మిగిలినది కౌపీనంగా ధరించి, "నేను దీక్ష తీసుకున్నాను" అన్నాడు. అక్కడే ఉన్న బాలాగురవే, రామచంద్రకోతే మొ॥న వారితో భగవన్నామ సంకీర్తన చేయమని కోరాడు.


ఈలోగా, తాను ఆ రోజు నిర్యాణం చెందుతానని మహల్సాపతి చెప్పిన విషయాన్ని కాకాసాహెబ్ దీక్షిత్, హేమాడ్పంతు, బాబాసాహెబ్ పురందరే మొ॥న సన్నిహిత సాయిభక్తులందరికీ తెలుపుతూ అక్కడున్నవారు కబురు పంపారు. 'ఇంతలో ఏం జరుగుతుంది లెమ్మ'ని కాకాసాహెబ్ దీక్షిత్ ఏదో అవసరమైన పని ఉండి ఖాండ్వా వెళ్ళాడు. నామసంకీర్తన జరుగుతుండగా మహల్సాపతి తీవ్ర ధ్యానంలో నిశ్చలంగా ఉండిపోయాడు. అక్కడున్న వారందరూ మహల్సాపతి నిర్యాణం చెందాడనుకొన్నారు. కానీ, కొంతసేపటికి మహల్సాపతి కళ్ళు తెరచి, "నేను పోవడానికి ఇంకా ఆలస్యం ఉంది. నేను రేపు పోతాను" అన్నారు.

రాత్రి అందరూ మామూలుగా నిద్రపోతూ ఉన్నారు. తెల్లవారుఝామున మహల్సాపతి, తన కుమారుడు మార్తాండ్‌ను నిద్రలేపి, "ఇప్పుడు సమయం ఎంతై ఉంటుంది?" అని అడిగాడు. సుమారు 4గం॥లని మార్తాండ్ చెప్పాడు. తనకు బాగా ఆకలి వేస్తున్నదనీ, ఏమయినా తింటే బాగుంటుందనీ అంటూ తన చిన్న కుమార్తె వితాబాయిని నిద్రలేపి ఏమైనా వండి పెట్టమన్నాడు. కానీ ఆమె తాను బహిష్ఠు అయినాననీ, ఏమీ చేయలేననీ చెప్పింది. మార్తాండ్ తన తల్లిని నిద్రలేపుతానన్నాడు. మహల్సాపతి అందుకు వద్దని, మౌనంగా ఉండిపోయాడు. కాసేపు ఆగి, బాలాగురవేను పిలిపించుకొని, 'మల్–అ–రీ మహాత్మ్యము' పారాయణ చేయించుకొని విన్నాడు.

21వ అధ్యాయము పూర్తికాగానే 22 వ అధ్యాయాన్ని "రేపు చదువుదువు గానిలే!" అని అన్నాడు. అది విన్న ఆయన కుమారుడు మార్తాండ్, "నాన్నా, నీవు ఈ రోజు సమాధి అవుతానంటివే? మరి రేపెలా చదువుతావు?" అని అడిగాడు తమాషాకి. "అది నీకు అర్థం కాదులే!" అన్నాడు మహల్సాపతి నవ్వుతూ. ఆ తరువాత కొందరు భక్తులు వచ్చి నామసంకీర్తన జరుపుతూ ఉండగానే, మహల్సాపతి భగవన్నామం ఉచ్చరిస్తూ తుది శ్వాస విడిచాడు.

అలా తన మరణానికి తానే ముహూర్తం నిర్ణయించుకొని, భగవన్నామస్మరణ చేస్తూ, ప్రశాంతంగా దేహత్యాగం చేయగలగడం మహాయోగులకుగానీ సాధ్యంకాదు. యోగనాథుడైన బాబా శిక్షణలో మహల్సాపతి అత్యున్నత ఆధ్యాత్మిక శిఖరాలు అధిరోహించాడనే విషయం ఆయన నిర్యాణం చెందిన విధానమే చెబుతున్నది. అయితే (కొందరు సాయిభక్తులవలె) సాయినాథుడనే మహా వటవృక్షం యొక్క ఛాయలో కొంత తడవు సేదతీర్చుకొని, స్వల్పశక్తి పుంజుకొని, ఆ మూల వృక్షం నుంచి విడివడి, సద్గురువుగా, అవతారపురుషునిగా పూజలందుకోవాలనే ప్రలోభానికి భగత్ లోనుకాలేదు. తన ఆఖరి శ్వాస వరకూ లోకం దృష్టిలో – ఉత్తమ సాధకునిగా, సద్భక్తునిగా, సచ్ఛిష్యునిగానే మిగిలిపోయాడు. ప్రముఖ సాయిభక్తుడు శ్రీబి.వి.దేవ్ అన్నట్లు 'భగత్' మహల్సాపతి నిశ్చయంగా 'భక్త మాణిక్యమే'.

ద్వారకామాయి (మసీదు) సమీపానే ఉన్న మహల్సాపతి ఇంటిలో, ఆయన సమాధిని, బాబా ధరించిన కఫ్నీ, చెప్పులు, చేతికర్ర (సటకా) మొ॥న వస్తువులను ఈనాటికీ భక్తులు సందర్శించుకుంటున్నారు.



తాత్యాకోతే పాటిల్

# తాత్యాకోతే పాటిల్

శ్రీసాయిబాబాను ప్రత్యక్షంగా సేవించిన భక్తులలో ఎక్కువమంది ఆయనలోని దివ్యత్వాన్ని, మహిమను దర్శించి ఆశ్రయించారు. 'జయామనీ జైసాభావ!' అని శ్రీమాధవ్ అడ్కర్ తన ఆరతి గీతంలో ఆలపించినట్లు వారివారి భావానికనుగుణంగా బాబా వారికి ప్రకటమయ్యారు. అలాగాక, బాబా మహిమతో సంబంధం లేకుండా – బాబాను బాబా కోసమే ప్రేమించి – మమతానుబంధంతో తమను తాము ఆయనతో ముడివేసుకొన్న భక్తులను వ్రేళ్ళ మీద లెక్కించవచ్చు. శ్రీసాయికూడా వారిపై అలాంటి అనురాగధారలనే వర్షించారు. ఆ అనురాగధారల తుషారాల నుండి చూస్తే, శ్రీసాయి యొక్క దివ్యరూపం ఒక మమతల హరివిల్లులా మనకు గోచరిస్తుంది. అలా బాబా అనురాగవల్లరులలో తడుస్తూ ఆనందంగా నర్తించిన భక్తులలో శ్రీతాత్యాకోతే పాటిల్ తరువాతనే మిగిలినవారిని పేర్కొనాలి.

శ్రీగణపతిరావుకోతే పాటిల్ – శ్రీమతి బయజాబాయిల కుమారుడు శ్రీతాత్యాకోతే పాటిల్. తల్లిదండ్రులకు తాత్యా ఒక్కడే కొడుకు. వీరిది మొదటి నుండి మధ్యతరగతి రైతు కుటుంబం. తన స్వయంకృషివల్ల, తరువాతి కాలంలో బాబా ప్రతి నిత్యం ఇచ్చిన పైకం వల్ల తాత్యా ఊరిలో పెద్ద మోతుబరి రైతయ్యాడు. ఆ రోజుల్లో తాత్యాది పన్నెండెద్దుల వ్యవసాయం. అప్పటి ప్రమాణాల ప్రకారం పన్నెండెద్దుల సేద్యమంటే పెద్ద భూస్వామి క్రింద లెక్క. తాత్యా ఒడ్డు, పొడుగు, బలిష్ఠమైన దేహసౌష్టవం కలిగి ఉండేవాడు. మంచి పరోపకార నైజంతో ఊరిలో అందరి తలలో నాలుకలా మెలుగుతూ గ్రామ వ్యవహారాలలో కీలక పాత్ర వహించేవాడు. తగాదాల పరిష్కారానికి ఎందరో ఈయన వద్దకు 'మధ్యస్తం' చెయ్యమని వచ్చేవారు. కొన్ని సాయి చరిత్రలలో

తాత్యాను శిరిడీ గ్రామాధికారి (పాటిల్)గా పేర్కొన్నారు. అయితే తాత్యాగానీ, అతని పూర్వీకులు కానీ ఎవ్వరూ గ్రామాధికారులు కారు. పాటిల్ అనేది కేవలం గౌరవ వాచకమే తప్ప పదవిని సూచించే పదం కాదు. ఆ రోజుల్లో శిరిడీ గ్రామ పోలీస్ పటేల్ (మునసబు) శ్రీసంతాజీ పాటిల్ షెల్కె.

**బాబాతో బాల్యం:**

శ్రీసాయిబాబా శిరిడీ వచ్చినప్పటికి తాత్యా వయస్సు సుమారు ఆరేడు సంవత్సరాలుంటాయి. బాబాతో తన తొలినాటి పరిచయం, ఆనాటి తన అనుభవాలను గూర్చిన తన స్మృతులను నెమరువేసుకుంటూ శ్రీతాత్యా పాటిల్ ఇలా అన్నారు:

"శ్రీసాయి మొదట శిరిడీ గడ్డ మీద అడుగుబెట్టే నాటికి నాకు 6 లేక 7 సంవత్సరాలుంటాయి. మొదట మారుతి మందిరంలోను, ఆ తరువాత మా గుర్రాల శాలలోను చదువుతుండేవాడిని. అప్పుడు శ్రీమాధవరావు దేశ్‌పాండే (షామా) మాకు ఉపాధ్యాయుడిగా ఉండేవారు.

నేను మారుతి ఆలయంలోని స్కూలులో చదువుతుండగా బాబా నిత్యము మా ఇంటికి భిక్షకు వచ్చేవారు. నేను, నా మిత్రుడు రఘుపాటిల్, మరి నలుగురైదురు పిల్లలము కలిసి స్కూలు విడవగానే మసీదు ముంగిట నిలిచి బాబాను వెక్కిరించి కవ్వించేవారము. అప్పుడు ఆయన వయస్సు సుమారు 18 లేక 19 సంవత్సరాలుండేవి. సన్నని మీసముండేది. ఆయనెప్పుడూ మసీదులో ఒక స్తంభం ప్రక్కన మౌనంగా కూర్చుని ఉండేవారు. రఘుపాటిల్ రోజూ మసీదు గేటు దగ్గర నిలబడి బాబాపై రాళ్ళు రువ్వేవాడు. ఒక్కొక్కసారి ఆయన మమ్మల్ని తిట్టేవారు. దానికి మేము పెద్దగా నవ్వుతూ, ఆయన్ను వెక్కిరించి ఇంకా కవ్వించేవారము. బాబా మమ్మల్ని కొట్టడానికి సట్కా (చేతికర్ర) తీసుకోగానే మేము అక్కణ్ణుంచి పరిగెత్తి పారిపొయ్యేవారం. అది దాదాపు మా నిత్యకృత్యంగా ఉండేది. ఆ తరువాత నేను మధ్యాహ్న భోజనానికి ఇల్లు చేరేవాడిని.

ఎక్కువసార్లు నా భోజనం సగం అయ్యేసరికి బాబా భిక్షకు మా ఇంటికొచ్చేవారు. ***"ఆబాదే ఆబాద్, బయజామామీ రోటీలావ్!"*** అని కంచువలె ఖంగుమనే కంఠంతో కేకవేసేవారు. అప్పుడు మా అమ్మ ఆయనను ఆదరంగా ఇంటిలోకి ఆహ్వానించేది.

బాబా మాత్రం ఎప్పుడూ ఇంటిలోకి వచ్చేవారు కాదు. ఎప్పుడైనా గుమ్మం బయట ఉన్న పంచలో కూర్చునేవారు. మా అమ్మ ఇంటి పనంతా వదలి ఆయన చెంతనే కూర్చునేది. నేను బాల్యం చేత ఆయన భుజాలపైకెక్కడమో, ఆయన ఒడిలో దొర్లడమో, కూర్చోవడమో చేసేవాడిని. నా కోతిచేష్ఠలను బాబా చిరునవ్వుతో గమనిస్తూ కూర్చునేవారు. మా అమ్మ మాత్రం నా అనుచిత ప్రవర్తనకు సంకటపడేది. ఆమె ముఖంలో ఏ మాత్రం కోపం కనిపించినా ***"ఎందుకమ్మా కోప్పడతావు? వాడిష్టమొచ్చినట్లు వాడిని చెయ్యనీ!"*** అని ఆమెను వారించేవారు బాబా.

బాబా శిరిడీ వచ్చాక రెండు మూడు సంవత్సరాలు మసీదులో నివసించి, ఆ తరువాత తమ మకామును లెండి, శిర అనే వాగుల మధ్యనున్న చెట్ల తోపులలోకి మార్చారు. అక్కడ ఆయన సుమారు రెండు సంవత్సరాల ఆరు మాసాలున్నారు. ఆ కాలంలో ఆయన భక్తులలో ఎవరో ఒకరు అక్కడే ఆయనకు నిత్యం భిక్షను ఏర్పాటు చేసేవారు. బాబా ఆ చెట్లతోపులో ఉన్నపుడు నేను, రఘుపాటిల్, మరి ముగ్గురు నలుగురు కలిసి ఆయన వద్దకు వెళ్ళేవాళ్ళము. అప్పటికి మేము మా కోతి బుద్ధులు, పిల్లచేష్టలు మానుకొన్నాము. నానాసాహెబ్ డేంగలే వంటి భక్తులు కూడా చాలా తరచుగా ఆయన దర్శనానికి అక్కడికొస్తుండేవారు".

## బువాగారి శిక్షణ నుండి బాబా రక్షణలోకి

"మొదట 1896లో గంగగిర్‌బువా అనే సత్పురుషుడు శిరిడీలో నామసప్తాహం చేసినప్పుడు, ఎవరో కొద్దిమంది తప్ప శిరిడీ గ్రామస్థులెవ్వరూ ఆ నామసప్తాహంలో పాల్గొనలేదు. గ్రామస్థుల ప్రవర్తనపట్ల గంగగిర్ మహరాజ్ తీవ్ర అసంతృప్తిని వ్యక్తం చేస్తూ మసీదుకు వెళ్ళి, అక్కడున్న వారికి బాబాను చూపుతూ "ఆయన రత్నం. అది ఇప్పుడీ పెంటకుప్ప మీదున్నది. నేను చెప్పేమాటలు గుర్తుంచుకోండి! ఈయన శిరిడీ రూపురేఖలనే మార్చేస్తాడు!" అని చెప్పి, వెంటనే శిరిడీ వదలి కోపంగా వెళ్ళిపోయారు. నేను, గంగగిర్ మహరాజ్ వెనుకనే వెళ్ళి ఆయనను రూయీ గ్రామంలో దర్శించి, మా గ్రామస్థులను క్షమించి, మళ్ళీ శిరిడీలో నామసప్తాహం చెయ్యవలసిందని ఎంతగానో ప్రాధేయపడ్డాను. మొదట ఒక పట్టాన వారు అంగీకరించలేదు. ఆ తరువాత నేను ఆయనతో కలిసి ఎన్నో ప్రదేశాలకు వెళ్ళి నామసప్తాహాలలో పాల్గొన్నాను. ఒకసారి

అలాగే గంగగిర్ మహరాజ్‌గారి నామసప్తాహాలలో పాల్గొని దసరా పండుగకు శిరిడీ తిరిగివచ్చాను. రాగానే బాబా దర్శనానికి మసీదుకు వెళ్ళాను. నాకప్పటికి 17, 18 సంవత్సరాలు ఉంటాయి. నామ సప్తాహాల గూర్చి నేను చెప్పినది విని బాబా ఎంతో సంతోషించారు. అప్పటినుండి నేను తరచుగా మసీదుకు వెళ్ళడం ఆరంభించాను. బాబాకూడా నన్నెంతో ప్రేమగా తన బిడ్డవలె చూచుకొనేవారు. తమ అనుమతి తీసుకోకుండా నన్ను ఎక్కడికీ వెళ్ళనిచ్చేవారు కాదు!"

## మసీదులో పడక

మొదట మహల్సాపతి ఒక్కడే బాబాతో ప్రతి నిత్యం రాత్రిళ్ళు నిద్రించేవాడు. తాత్యాకు బాబాతో సాన్నిహిత్యం పెరిగాక, అతను కూడా రోజూ (ఆ తరువాత బాబా ఒకరోజు మసీదులో ఒకరోజు చావడిలో నిద్రించడం మొదలుపెట్టాక రోజు మార్చి రోజు) బాబాతో మసీదులో నిద్రించడం ఆరంభించాడు. మహల్సాపతి, తాత్యాలను తప్ప మరెవ్వరినీ రాత్రిళ్ళు మసీదులో నిద్రించడానికి బాబా అనుమతించేవారు కాదు. అలా మసీదులో బాబా, మహల్సాపతి, తాత్యా నిద్రించే వైనాన్ని గూర్చి శ్రీహేమాద్పంతు తన "శ్రీసాయిసచ్చరిత్ర"లో ఇలా వర్ణించాడు:

"మహాత్ముల హృదయాలలో వాసుదేవుడు సదా నివసిస్తుంటాడు. అటువంటి మహాత్ముల సహవాస భాగ్యం పొందిన భక్తులు ధన్యులు. తాత్యా, మహల్సాపతి అటువంటి మహాభాగ్యశాలురు. మసీదులో బాబాతోబాటు ప్రతి నిత్యం నిద్రించే అవకాశం పొందిన వారిద్దరి పుణ్యఫలం ఎంత గొప్పది? బాబాకు వీరంటే అత్యంత ప్రీతి. బాబా వారిద్దరినీ సమానంగా ప్రేమించేవారు. ఈ ముగ్గురు రాత్రులందు మసీదులో తమ తలలను తూర్పు, పడమర, ఉత్తరంవైపు పెట్టుకొని, ముగ్గురి కాళ్ళు మధ్యలో ఒకచోట చేర్చి, ఒకరి కాళ్ళు ఒకరికి తగిలేలా పండుకునేవారు. పక్కలు పరచుకొని అలా పడుకొని రాత్రి చాలా ప్రొద్దుపొయ్యేవరకు ఏవేవో కబుర్లు చెప్పుకొనేవారు. వీరిలో ఎవరైనా నిద్రలోకి తూలితే మిగిలిన ఇద్దరూ వారిని మేల్కొల్పేవారు. తాత్యాకు నిద్రతూగి గుఱ్ఱుపెడితే బాబా, మహల్సాపతి కలసి అతన్ని అటు, ఇటు కుదిపి, పొర్లించి తాత్యా తల, కాళ్ళు, వీపు గట్టిగా నొక్కేవారు. అలా 14 సంవత్సరాలు ఇంటిలో తన తల్లిదండ్రులను వదలి తాత్యా బాబాతో కలసి నిద్రించాడు.

తాత్యాకి బాబాపైగల ప్రేమను ఎంతని కొలవగలము? అలాగే బాబాకు తాత్యాపైగల కృపకు ఎవరు విలువ కట్టగలరు? అవి మరపురాని మధురమైన దినాలు. ఆ రోజులు గడిచిపోయినాయి. వాటి మధుర స్మృతులు మాత్రం శాశ్వతంగా నిలచిపోయాయి. తండ్రి మరణానంతరం ఇంటి బాధ్యతలన్నీ తాత్యాపైబడ్డాయి. ఆ కారణంగా అతడు ఇంటివద్దనే నిద్రించేవాడు. తాత్యా, మహల్సాపతి వంటి శ్రద్ధానురాగాలు గల సభ్యులపై శ్రీసాయి కరుణాకటాక్షాలు అయాచితంగా వర్షిస్తాయి. వారి స్మృతులు భక్తులకు ఒక వింత అనుభూతిని కలిగిస్తాయి." ('శ్రీసాయి సచ్చరిత్ర' 8వ అధ్యాయం మూలానువాదం)

ప్రతిరోజూ రాత్రి 8–9 గంటలమధ్య తాత్యాపాటిల్ ఇంటి నుండి రొట్టెలు, పాలు, బెల్లం తీసుకొని మసీదుకు వచ్చి వాటిని బాబాకు సమర్పించేవాడు. బాబా వాటిలో స్వల్పంగా భుజించి తాత్యాకు రూ॥ 35/– ఇచ్చేవారు. అలా బాబా తమ మహాసమాధి పర్యంతం రోజూ తాత్యాకు (ఆ రోజుల్లో) రూ. 35/– ఇచ్చేవారు. ఒక్కొక్క భక్తుడికి ఒక్కొక నిర్ణీత మొత్తం చొప్పున అలా రోజూ బాబా కొందరు భక్తులకు పైకం ఇచ్చేవారు. భక్తులు దీన్ని 'బత్యం' అని అనేవారు. మాలేగాం ఫకీరుకు బాబా రోజూ రూ. 55/– ఇచ్చేవారు. అతని తరువాత అతి పెద్ద మొత్తంలో బాబా వద్ద నుండి 'జీతం' పుచ్చుకొన్నది తాత్యాకోతేపాటిలే!

## మరపురాని మధురస్మృతులు

శ్రీహేమాద్పంతు వర్ణించిన ఆ "మరపురాని మధురస్మృతుల"ను గురించి ప్రస్తావిస్తూ శ్రీతాత్యా తమ స్మృతులు నెమరువేసుకొంటూ ఇలా అన్నారు:

"ప్రతి రోజూ బాబా రూ. 15/– లేక రూ. 20/–లు పెట్టి మిఠాయి, పండ్లు కొని తమ దర్శనార్థం మసీదుకొచ్చే భక్తులందరికి ప్రసాదంగా పంచేవారు. ప్రతిరోజూ రాత్రి నేను మసీదుకు కొన్ని రొట్టెలుగానీ, సంగటి ముద్దలుగానీ తీసుకొని వెళ్ళి బాబా ముందుంచేవాడిని. ఆ రొట్టెలు మూడువంతుల భాగాన్ని ముక్కలు చేసి వాటిలో ఆ పాలు, బెల్లం కలిపేవాడిని. బాబా కొంచెం తిని, ఆ పాత్రను దూరంగా నెట్టేసేవారు. దానిని, ఒక సంగటి ముద్దను కొండ్యా ప్రసాదంగా తీసికొనేవాడు. తర్వాత నేను తెచ్చిన ఇతర తినుబండారాలను బాబా ముందుంచేవాడిని. ఆయన కొంచెం తిని, కొంచెం

నా నోట్లో పెట్టేవారు. తర్వాత కొండ్యా కొన్ని కిళ్ళీలు కట్టి బాబాకు సమర్పించేవాడు. బాబా వాటిలో కొన్ని కిళ్ళీలు వేసుకొని మిగిలినవి అక్కడున్న భక్తులపై విసిరేవారు. వారెంతో శ్రద్ధాభక్తులతో వాటిని ప్రసాదంగా గ్రహించేవారు. కిళ్ళీలు నమిలాక బాబా ఎక్కువగా మంచినీరు త్రాగేవారు. ఆయనకు తాంబూలమంటే ఎంతో ఇష్టం. రాత్రి పగలు చాలా కిళ్ళీలు వేసుకొనేవారు. మొదట కొండ్యా, ఆ తరువాత రాధాకృష్ణఆయి కిళ్ళీలు సిద్ధంచేసి ఉంచేవారు.

బాబాకు ఎవరో భక్తులు సమర్పించిన రెండు ఆవులు, రెండు మేకలు ఉండేవి. వాటిని మా ఇంటివద్దనే మేపేవారు. వాటి పాలు, పెరుగు కూడా బాబా చాలా స్వల్పంగా స్వీకరించేవారు. ఆ తరువాత (నేను, మహల్సాపతి తప్ప) భక్తులందరూ బాబా వద్ద సెలవు తీసుకొని ఇండ్లకెళ్ళేవారు".

"మసీదులో (ఇప్పుడు పెద్ద సాయిబాబా పటమున్న ప్రదేశంలో) పడమర వైపుకు తలపెట్టుకొని బాబా నిద్రించేవారు. నేను ఉత్తరంగా తలపెట్టుకొని దక్షిణంగా కాళ్ళుపెట్టుకొని పడుకొనేవాడిని. బాబాకు దక్షిణంగా, తలను పడమరవైపుకు పెట్టుకొని పాదాలు తూర్పువైపుకు వచ్చేలా మహల్సాపతి పడుకొనేవాడు. గాఢనిద్రలో మాలో ఒకరి కాళ్ళమీద మరొకరి కాళ్ళుపడి పెనవేసుకొనేవి. *[1] (పూర్తి విశ్లేషణకు పేజీ నెం. 60 చూడగలరు) తెల్లవారి మేము నిద్రలేచేసరికి ఆ పరిస్థితి మాకే తమాషాగా అనిపించి నవ్వు వచ్చేది. మా కాళ్ళు నిద్రలో తెలియకుండానే అలా పెనవేసుకున్నాయో, లేక బాబా కావాలని అలా చేసేవారో మాకు అర్థమయ్యేది కాదు. ఒక్కోసారి బాబా పాదాలు మా కాళ్ళపై ఉండేవి. కానీ, ఒక్కోసారి మరోవిధంగా జరిగినప్పుడు మేమెంతో అపరాధం చేసినట్లు బాధకలిగేది. ఈ విధంగా ముగ్గురం మసీదులో నిద్రించేవాళ్ళం. సామాన్యంగా మేము రాత్రి 9, 9-30 గంటలకంతా పడుకొనేవారం. కొద్దిసేపు నిద్రించాక మహల్సాపతి లేచి మసీదులోని ప్రమిదలలో నూనె నింపి వత్తులు సరిచేసి బాబా రొట్టెలు పెట్టే కుండ (కొలంబా)పై మూతవేసి, ధునిలో కట్టెలు వేసేవాడు. మూడు నాలుగు సంవత్సరాలపాటు మహల్సాపతికి తరచుగా సుస్తీ చేస్తుండేది. కనుక అప్పుడు అతడు చూచుకొనే మసీదు పనులన్నీ - దీపాలలో నూనె వత్తులు వేస్తుండటం, వత్తులు సిద్ధంగా చేసి పెట్టుకోవడం, బాబాకు చిలుం తయారుచేసివ్వడం వంటివి నేనే చూచుకొనేవాడిని".

## గుడాకేశుడి సన్నిధిలో గుఱ్ఱుపెడితే!

బాబా నాతో పరిహాసాలాడేవారు. నేను మసీదులో గాఢంగా నిద్రపోతుంటే నన్ను మసీదులోంచి బయటకుతోసి తాను దాక్కునేవారు. నాకు మెలకువ వచ్చి నన్నెవరు బయటకు నెట్టారని పెద్దగా కేకలు వేస్తుంటే, బాబా నా ఎదుటకొచ్చి చిలిపిగా నవ్వేవారు. వేసవికాలంలో మసీదులో ధుని దగ్గర పడుకున్నప్పుడు ఎంతో వేడిగా ఉండేది. నాతో చెలగాటమాడనిష్టపడే బాబా రాత్రి దొంగచాటుగ నిద్రలేచి, నాకు తెలియకుండా నాపైన దుప్పటి కప్పేవారు. నాకు అధికంగా చెమటపట్టి, ఆ దుర్భరమైన ఆవిరికి మెలకువ వచ్చి లేచి మసీదు క్రింది మెట్లపైన కూర్చునేవాడిని. బాబా ఆందోళన నటిస్తూ నాకోసం కేకలు వేసి, బయటకు వచ్చి నేను అక్కడ కనిపించగానే ***"అమ్మయ్యా! బ్రతికాను! నీవిక్కడ ఉన్నావా?"*** అనేవారు. ఎన్నోసార్లు నేను నిద్రపోతుంటే నా తలను గట్టిగా పిసికి నా కాళ్ళను మరో దిక్కుకు లాగి పడుకోబెట్టేవారు.

## ఉపచారమా! అపచారమా!!

తాత్యా గుఱ్ఱుపెట్టి నిద్రపోతుంటే బాబా, మహల్సాపతి కలిసి అతని తల, వీపు, కాళ్ళు పిసికేవారని శ్రీసాయి సచ్చరిత్రకారుడు వ్రాశారు. బాబా అలా ఎందుకు చేసేవారో వివరిస్తూ శ్రీతాత్యా ఇలా చెప్పారు:

"నేను పగలంతా పొలంలో కష్టించి వస్తాననీ, అందువల్ల నాకు ఒళ్ళునొప్పులుగా ఉంటాయనీ బాబాకు తెలుసు. అందుకని నేను నిద్రలో ఉన్నప్పుడు బాబా, మహల్సాపతి కలిసి నా ఒళ్ళు, కాళ్ళు, చేతులు పిసికేవారు. అది నాకెంతో బాధనిపించేది. ఒకరోజు అలా చెయ్యడం ఎంతమాత్రం సమంజసం కాదని బాబాతోనూ, మహల్సాపతితోనూ నిక్కచ్చిగా చెప్పాను. నేను వారికి సేవలు చెయ్యవలసిందిపోయి, వారి చేతనే సేవలు చేయించుకోవడమేమిటి?

బాబా నా మాటలేం పట్టించుకోలేదు. పైగా, ***"ఏం ఫర్వాలేదులే! మనిద్దరం ఒక్కటే! అందరూ నన్ను గొప్ప అనుకుంటారు కానీ, అది నిజం కాదు. నేనూ నీలాంటి వాడినే!"*** అన్నారు. నేను మాత్రం, "బాబా! మళ్ళీ అలా చేస్తే పగలుగాని, రాత్రిగానీ అసలు మసీదుకే రాన"ని బెదిరించాను. ఊరికే బెదిరించడం కాదు, అలా చేశాను

కూడా! ఒకసారి పట్టుబట్టి 10, 12 రోజులు మసీదు ఛాయలకు కూడా వెళ్ళలేదు. దానికి బాబా చాలా బాధపడ్డారు. ఏదైనా పనిబడి మసీదుకు దూరాన్నుండి నేను వెళుతూంటే బాబా చూచి కేకవేసి పిలిచేవారు. నేను దూరాన్నుండే సైగలతో నాకు, ఆయనకు ఏమీ సంబంధం లేదని తెలుపుతూ వెళ్ళిపోయేవాడిని. అప్పుడు కాకాసాహెబ్ దీక్షిత్ శిరిడీవచ్చి నేను మసీదుకు వెళ్ళడం లేదని తెలిసి, నన్ను పిలిచి నేను బయజామామి కుమారుణ్ణయినందున నేనంటే బాబాకు ఎంతో ప్రేమ అని, అందువల్ల నా పట్టుదల వదలి తిరిగి మామూలుగానే మసీదుకెళ్ళవలసిందని నచ్చజెప్పారు.

మూడు నాలుగేళ్ళు తరచూ మహల్సాపతికి సుస్తీ చేస్తుండేది. ఆ కాలంలో బాబా మహల్సాపతిని ఇంటికెళ్ళమని చెప్పి, మసీదులో పడుకోనిచ్చేవారు కాదు. నేను మాత్రం 14, 15 ఏళ్ళవరకూ మసీదులో బాబాకు తోడుగా నిద్రించేవాడిని. బాబా మహాసమాధికి 5, 6 ఏళ్ళ ముందు నుంచి నేను మసీదులో నిద్రించడం మానుకున్నాను".

## చావడి ఉత్సవం - తాత్యా ఉత్సాహం

బాబా ఏ సంవత్సరం నుండి ఒకరోజు మసీదులో, ఒకరోజు చావడిలో నిద్రించడం ప్రారంభించారో ఇదమిత్థంగా తెలియరావడంలేదు. తరువాత కాలంలో భక్తులు శ్రీసాయి మసీదు నుండి చావడికి బయలుదేరడాన్ని ఒక ఉత్సవంగా నిర్వహించేవారు. అదే సాయి భక్తులకు అత్యంత ప్రియమైన చావడి ఉత్సవం. బాబా సశరీరులుగ ఉండగా రోజు మార్చి రోజు జరుగుతుండిన చావడి ఉత్సవం ఈనాడు శిరిడీలో ప్రతి గురువారం రాత్రి నిర్వహింపబడుతూ ఉంది. బాబా చావడిలో నిద్రించిన రోజు రాత్రి, ఆ మరుసటి ఉదయం మాత్రమే బాబాకు శేజ్ (రాత్రి) ఆరతి, కాకడ (ఉదయ) ఆరతి చేసేవారు. మధ్యాహ్న ఆరతి మాత్రమే ప్రతి నిత్యం మసీదులో జరిగేది.

ఒకరోజు ఎలా చేస్తే బాబా మరుసటి రోజు కూడా అలానే చేసేవారు. బాబా చావడికి బయలుదేరవలసిన ప్రతిసారీ కొంచెం ముందుగా తాత్యాపాటిల్ వచ్చి బాబాను బయలుదేరడానికి సిద్ధంగా ఉండమని చెప్పేవారు. కానీ, బాబా కదిలేవారు కాదు. తాత్యా అప్పుడు బాబా చంకలో చేయివేసి లేవదీసేవాడు. బాబా బయలుదేరగానే

తాత్యా ఒక జలతారు శాలువాను ఆయన భుజాలపై వేసేవాడు. జలతారు వంటి విలువైన వస్త్రాలు కప్పుకోవడానికి బాబా ఎంతమాత్రం ఒప్పుకొనేవారుకారు. ఇంకెవరైనా భక్తులు ఆ పనిచేస్తే బాబా సహించేవారు కాదు. తాత్యా తప్ప ఆ పని చెయ్యడానికి ఎవరూ సాహసించేవారు కాదు. కానీ తాత్యా ఏం చేసినా సామాన్యంగా అడ్డు చెప్పేవారుకాదు. అందుకని ఆ బాధ్యత తాత్యాకు అప్పజెప్పి తద్వారా భక్తులు తమ ముచ్చట తీర్చుకొనేవారు. ఆ తరువాత బాబా ఎడమచేతిని తాత్యా, కుడిచేతిని మహల్సాపతి పట్టుకొని బాబాను మసీదునుండి చావడికి నడిపించి తీసుకెళ్ళేవారు. శ్రీసాయిని మసీదులో కనిపెట్టుకొని సేవించిన భక్తులు వీరిద్దరే కదా! తాత్యా ఒక చేతితో బాబా ఎడమచేతిని, మరో చేతితో లాంతరు పట్టుకొని నడిచేవాడు. బాబా చావడి చేరగానే తాత్యా ముందు లోపలికి వెళ్ళి బాబాకు ఆసనము, ఆనుకోవడానికి చెక్క అమర్చి, బాబాను దానిపై కూర్చోబెట్టి ఆయనకు ఒక అందమైన కోటు తొడిగేవారు. తరువాత షామా చిలుం సిద్ధంచేసి తాత్యా చేతికిచ్చేవాడు. తాత్యా మొదట ఆ చిలుం పీల్చి అది బాగా రాజుకున్నాక బాబా కందించేవాడు. బాబా పీల్చిన తరువాత మహల్సాపతి, ఆ తరువాత ఇతరులు ఒకరి తర్వాత ఒకరు ఆ చిలుం పీల్చేవారు.

శేజారతి అయ్యాక ఒక్కొక్కరే బాబా వద్ద ఊదీ, సెలవు తీసుకొని బయల్దేరేవారు. తాత్యా కూడా బాబాకు చిలుం తదితరాలు సిద్ధంచేసి, లేచి ఇంటికి బయల్దేరుతుంటే, బాబా అతడితో, ***"నన్ను కనిపెట్టుకొని ఉండు! నీ ఇష్టమొచ్చిన చోటుకు వెళ్ళు కానీ, రాత్రి ఏదో వేళలో ఒకసారి వచ్చి నా గురించి విచారించుకుంటూ ఉండు!"*** అనేవారు. తాత్యా అలాగేనని బాబాకు హామీ ఇచ్చి ఇంటికెళ్ళేవాడు.

## దీని భావమేమి శిరిడీవాసా?!

రోజూ మసీదులో రాత్రి బాబావద్ద సెలవు తీసుకొని తమ ఇళ్ళకు వెళుతూ బాబాకు మంచు, చలిగాలి తగలకుండా భక్తులు తెరలు దించేవారు. వారలా చేస్తుంటే ఒక్కోసారి బాబా వారితో వ్యంగ్యంగా, ***"అవునులే! మీరంతా నన్నిలా కాపాడకపోతే, మరి నేనేమైపోతాను?"*** అంటూ మరుక్షణంలో గంభీరంగా ***"మీరు నన్నేమి కాపాడగలరు? నేనే మిమ్మల్నందరినీ కాపాడుతాను"*** అనేవారు. అటువంటిది,

తాత్యాతో మాత్రం రాత్రి ఏదోవేళలో ఒకసారి వచ్చి తనను గమనించుకొంటూ ఉండమని – ఒక పసిబాలుడు బేలగా తన పెద్దలనడిగినట్లు – బాబా ఎందుకు అడిగేవారు? ఇదేకాదు, ఒక్కోసారి తాత్యా మసీదుకు రాగానే బాబా ***"జైదేవా! జైదేవా!"*** అంటూ నమస్కరించేవారు! తాత్యాకు లోపల బాబా చర్యకు బాధగా ఉన్నా, ఆయన సరదాకంటున్నారనుకొని, దానికి ప్రతిగా "సలామాలేకుం!" అంటూ వంగి బాబాకు సలాం చేసేవాడు. ఒకసారైతే అంతకంటే విడ్డూరంగా ప్రవర్తించారు బాబా. ఆ సంఘటనను తాత్యా మాటల్లోనే చూద్దాం.

"ఒకనాడు అకస్మాత్తుగా లేచి, బాబా నా పాదాలు తాకారు. నాకు ఎంతో బాధనిపించింది. వెంటనే ఆయన చేతులు పట్టుకొని, గద్గదకంఠంతో "బాబా, మీరలా చెయ్యడం తగునా?" అని అడిగాను. ఆయన నా మాటలేమీ పట్టించుకోకుండా, తమ చేతులు విడిపించుకొని మరలా నా పాదాలు తాకి నమస్కరించారు. నాకది మరింత ఘోరంగా అనిపించి, "బాబా, ఏమిటి మీరు చేస్తున్నది?" అని బాధతో అరిచాను. దానికి బాబా, ***"నోర్ముయ్! ఏం తెలుసు నీకు?"*** అని గద్దించారు. నాకు వారి చర్యలకు దిగ్భ్రమ కలిగేది".

తాత్యాకే కాదు అలాంటి అనూహ్యమైన బాబా చర్యలు అందరికీ 'దిగ్భ్రమ'ను కలిగించేవి. బాబా ఒక్కోసారి అలా ఎందుకు ప్రవర్తించేవారో ఎవ్వరికీ అంతుబట్టేది కాదు. బాబా ఈ చర్య ఏసుప్రభువు తమ శిష్యుల పాదాలు తాకి నమస్కరించిన సంఘటనను గుర్తుకు తెస్తుంది.

## మామా - మేనల్లుళ్ళ సరసం

బయజాబాయిని బాబా తమ స్వంత సోదరికంటె మిన్నగా భావించి అభిమానించేవారు. బయజాబాయి కుమారుడైన తాత్యా అందుకే బాబాను చిన్ననాటి నుండి "మామా" అని సంబోధించేవాడు. నిజానికి వారి సంబంధం మామా–మేనల్లుళ్ళ మమతానుబంధంగానే ఉండేది. సామాన్యంగా ఎంతో గంభీరంగా, ఏదో అలౌకికమైన తాదాత్మ్యస్థితిలో ఉండే శ్రీసాయిబాబా, తాత్యాతో మాత్రం ఎంతో చనువుగా, సరదాగా, ఆత్మీయతతో వ్యవహరించేవారు. వారి అనుబంధం ఎలాంటిదో తాత్యా మాటల్లోనే చూద్దాం.

## బాబాతో కుస్తీ

"బాబా ఒక్కోసారి నాతో చేతులు కలిపి "ఉప్పులగుప్ప" ఆడుతూ గిరగిర తిరిగేవారు. ఒక్కోసారి నాతో కుస్తీ పట్టేవారు. ఒక్కోసారి ఆ పెనుగులాటలో నేను వారిని అమాంతం పైకెత్తేసి భుజాలపైనో, వీపుమీదనో మోసుకొని పరుగెత్తేవాడిని. అలా ఆయన బరువు మోస్తూ పరుగెడుతుంటే నాకెక్కడ నరం పడుతుందోనని ఆదుర్దాగా హెచ్చరిస్తూ పకపక నవ్వేసేవారు. వారు నన్ను ***'తాత్యా'*** అనో, ***'కోత్యా'*** అనో, లేక ***'గుఱ్ఱం మొఖంవాడా'*** అనో పిలిచేవారు. ఒకసారి నేను, బాబా నందూమార్వాడీ అంగడి దగ్గర నిలబడి ఉన్నాము. ఆ రోజు హెూళీ. బాబా పండుగ సరదాలో మహా ఉత్సాహంగా ఉన్నారు. ఆ సరదాలోనే నేను వారిని అమాంతం పైకెత్తుకొని భుజాలపై కూర్చోబెట్టుకొని మసీదు వైపుకు నడిచాను. దారి పొడుగునా బాబా ***"ఒరే కోత్యా! ఆగు! నన్ను క్రిందకు దించు! లేకపోతే నీ పేగు నరాలు పట్టి తరువాత బాధపడతావ్!"*** అంటూ అరుస్తున్నారు. నేను ఆయన కేకలనేమాత్రం లెక్కపెట్టకుండా అలానే వారిని నా భుజాలపై మోస్తూ భద్రంగా మసీదు చేర్చాను. అలా తర్వాత కూడా ఒకటి రెండుసార్లు చేశాను. ఆ తరువాత అలాంటి మొరటు పనులవల్ల ఆయన దేహానికి బాధ కలుగుతుందేమోననే భయంతో అలా చెయ్యడం మానుకొన్నాను".

## బాబా దాగుడుమూతల సరదా

"బాబా అప్పుడప్పుడు సరదాకు నాకు తెలియకుండా నా పైపంచె తీసి మసీదులోని గోధుమల బస్తా చాటునో మరోచోటునో దాచి ఏమీ ఎరగనట్లు కూర్చునేవారు. నా పంచె ఏదని నేను అడిగితే ఆయన ఎప్పుడూ చెప్పే జవాబు ఒక్కటే: ***"ఏమిట్రా? నీ పంచె సంగతి నాకేం తెలుసు? నేనేమైనా ఇతరుల పంచెలు దొంగిలించేవాడనా ఏమిటి?"*** అనేవారు. 'నా పంచె ఎక్కడ దాచిపెట్టి ఉంటారు?' అనేవాణ్ణి నేను. ఆయన కూడా నా పంచె కోసం ఎంతో ఆతురతగా వెతికినట్లు నటించి, తరువాత అది అప్పుడే దొరికినట్లు తీసేవారు. ఒక్కొక్కసారి ఆయన నా వెనుకనుండి వచ్చి నా కన్నులు మూసేవారు. "ఎవరు?" అని నేనరిస్తే, చటుక్కున స్తంభం చాటుకి నక్కి దాగుడుమూతలాడేవారు. ఒక్కొక్కసారి నా చేతివ్రేళ్ళ మధ్యకు వారి చేతివ్రేళ్ళను

చొప్పించి నొక్కేవారు. నేను తిరిగి వారి వ్రేళ్ళను నొక్కితే బాధ నటిస్తూ, నేను ఆయన వ్రేళ్ళు విరిచేసానంటూ పెద్దగా కేకలు వేసేవారు. ఒక్కోసారి నా చేతిని తన చేతితో పట్టుకొని నా బలం చూపమని సవాల్ చేస్తూ నా చేతిని గట్టిగా నొక్కేవారు. నేను తిరిగి నొక్కగానే నేను తమ చేతి ఎముకలను విరిచేసినట్లు విలవిలలాడుతూ బాధ నటించేవారు. అప్పుడప్పుడు నేను బాబా తలపై చుట్టుకొనే తెల్లగుడ్డను తీసేసి, నా గ్వాలియర్ తలపాగాను షిందీషాహి (ఒక రకమైన మరాఠీ తలపాగా) విధంలో ఆయన తలకు చుట్టి, తరువాత నా ఉత్తరీయాన్ని ఆయన మెడలో వేసి ఒక అద్దం తెచ్చిఇచ్చేవాడిని. బాబా కూడా ఆ సరదాలో పాలు పంచుకొంటూ నా నడక, మాటతీరు, భంగిమలు, గొంతు అనుకరించి చూపి అద్దంలో చూచుకుంటూ భుజాలెగరేసి, వెక్కిరించినట్లు కనుగ్రుడ్లు త్రిప్పుతూ ***"ఏం అద్దమా! ఈ కోత్యా నేనున్నట్లే ఉంటాడా? నేను చేసినట్లే చేస్తాడా? కొంచెం చెప్పమ్మా!"*** అనేవారు. తరువాత తలపాగాను, ఉత్తరీయాన్ని, అద్దాన్ని నాకు తిరిగి ఇచ్చేసేవారు. ఇదంతా ఆయన కూర్చునే చేసేవారు".

### బాబాతో పంతాలు - పట్టింపులు

"బాబాకు కావలసిన సరకులు ఎప్పుడూ నేనే సంత నుండి తెచ్చేవాడిని. ఒకరోజు బాబా నాచేతికి నాలుగు రూపాయలిచ్చి తమకు తమలపాకులు, మరికొన్ని చిల్లర వస్తువులు, రేగుపళ్ళు కొనుక్కొని రమ్మన్నారు. నేను వెంటనే రహాతాలోని సంతకు వెళ్ళి బాబా చెప్పిన వస్తువులన్నీ కొని తెచ్చి బాబా ముందుంచి, "బాబా రేగుపళ్ళు తెమ్మన్నారు కదా? మీకోసం ఎంత మంచి రేగుపళ్ళు తెచ్చానో చూడండి!" అన్నాను. బాబా నేనంత అభిమానంతో ఏరుకొని తెచ్చిన రేగుపళ్ళను ఒక్కటి కూడా ముట్టుకోకుండా అన్నింటినీ నాకు, మహల్సాపతికి ఇచ్చేసారు. నేను ఆ పళ్ళు తీసుకోకుండా బాబా కూడా కొన్నింటిని తింటేనే తప్ప నేను కూడా తిననని పట్టుబట్టాను. తమకప్పుడు ఆ పండ్లు తినాలని లేదని మొత్తం నన్నే తీసుకోమని చెప్పారు. నేను ఒప్పుకోలేదు. చాలాసేపు రాద్ధాంతం జరిగింది. ఆయనగాని, నేనుగాని మా పట్టుదల సడలించుకోలేదు. నాకు ఓర్పు నశించింది. కోపంతో పండ్లన్నింటినీ ఒక రుమాలులో మూటగట్టి తీసుకెళ్ళిపోయాను. రాత్రి నేను రోజూ తెచ్చే రొట్టెతో

పాటు ఆ పండ్లుకూడా తీసుకొచ్చి బాబా ముందుంచి అప్పుడైనా వాటిలో కొన్నింటిని తినమని బ్రతిమిలాడాను. బాబా పట్టుదలగా ముందు నేనే తినాలన్నారు. మళ్ళీ కొంతసేపు పేచీలు, పంతాలు సాగాయి. నాకు కోపమొచ్చి ఆ పండ్లను మసీదు ముంగిట విసిరి పారేసి, అప్పుడు చావడి దగ్గర ప్రదర్శింపబడుతున్న 'తమాషా' (వీధినాటకం) చూడడానికి విసవిసా వెళ్ళిపోయాను.

నేను వెళ్ళాక బాబా, మహల్సాపతి కలిసి మసీదు ముంగిట చెల్లాచెదురుగా పడిపోయిన ఆ రేగుపండ్ల నన్నింటినీ ఏరారు. ఆ తరువాత నన్ను పిలుచుకురమ్మని మహల్సాపతిని పంపారు బాబా. బాబా తమ పట్టు సడలించుకొని ఉంటారన్న ఆశతో మసీదుకు తిరిగి వచ్చి, బాబా తమ పాత పట్టింపే కొనసాగించడంతో నిరుత్సాహపడ్డాను. కోపంతో మళ్ళీ తమాషా చూడటానికి వెళ్ళిపోయాను. నన్ను ఎలాగైనా చెప్పి ఒప్పించి తీసుకురమ్మని దగ్గు, కొండ్యా అనే ఇద్దరు భక్తుల్ని నా కోసం పంపారు బాబా. నేను ససేమిరా రానని మొండిపట్టు పట్టాను. కాసేపటి తరువాత మహల్సాపతి వచ్చి బాబా నాకోసం ఎంతో ఆతురతతో ఎదురుచూస్తున్నారని చెప్పాడు. నేను మొదట మూర్ఖించినా, చివరకు వెళ్ళక తప్పిందిగాదు. కానీ, నేనెంతో కోపం మీదున్నాను. బాబా కొన్ని రేగుపండ్లను తమ పెదవులతో మాత్రం తాకి, తక్కినవి మహల్సాపతికిచ్చి ***"భగత్, నీవు కొన్ని తిని, మిగిలినవి ఇతడికిచ్చి తినమని చెప్పు"*** అన్నారు. నా అహము, పట్టుదల చల్లబడ్డాయి. ఆ రాత్రంతా బాబా నాతో మాట్లాడలేదు".

బాబా తామే బజారుకు పంపి తెప్పించిన రేగుపండ్లను ఎందుకంత పట్టుదలగా తినలేదో ఆయనకే ఎఱుక! బాబా చర్యలు అత్యంత నిగూఢాలు. అవి ఊహకందనివి! అదే పరిస్థితిలో తాత్యా స్థానంలో మరొక భక్తుడుంటే "బాబా ఎందుకు ఆ రేగు పండ్లు స్వీకరించ నిరాకరించారో? అది ఆయనకే ఎఱుక!" అని వినమ్రభావంతో మిన్నకుండేవాడేమో. తాత్యాకు బాబాతో ఉన్న చనువు, సాన్నిహిత్యం తాత్యా అలకకు, పట్టింపుకు కారణాలయ్యాయి. తాను ఆ పండ్లు తినకపోవడానికి కారణం బాబా చెప్పలేదు; చెప్పినా తాత్యా అర్థం చేసుకోలేడు. కనుకనే "అహంభావహీనం – ప్రసన్నాత్మభావం"తో శోభించిన శ్రీసాయి తామే రాజీపడి మధ్యేమార్గంగా ఆ పండ్లను తమ పెదవులకు మాత్రమే తాకించుకొని తాత్యాను బుజ్జగించారు.

## శ్రీసాయితో సహపంక్తి భోజనాలు:

అప్పుడప్పుడు బాబా బజారు నుండి సరకులు తెప్పించి స్వయంగా వంట చేసేవారు. సామాన్యంగా మాంసంపలావుగానీ, పులగంగానీ, పాయసంగానీ వండేవారు. ఆ వంటకాలు వండేటప్పుడు పొయ్యిమీద కుతకుత ఉడుకుతున్న వంటకాలను తమ చెయ్యిపెట్టి త్రిప్పేవారు. గరిట ఉపయోగించేవారు కాదు. ఆయన చెయ్యి కొంచెం కూడా కాలేది కాదు. వంట పూర్తికాగానే, ఆ పదార్థాలను మౌల్వీ చేత నివేదన చేయించి మొదట కొంచెం మహల్సాపతి ఇంటికి, తాత్యాపాటిల్ ఇంటికి పంపి, మిగిలినది అక్కడి భక్తులందరికీ ప్రసాదంగా వడ్డించేవారు. ఒకసారి ఎవరో భక్తులు బాబాకు రెండు ఆవులు సమర్పించారు. బాబా వాటిని తాత్యాకు, సగుణమేరు నాయక్‌కు చెరొకటి ఇచ్చేశారు.

1900 నుండి శిరిడీకి బాబా దర్శనార్థం వచ్చే భక్తుల సంఖ్య క్రమంగా పెరగసాగింది. భక్తులు బాబాకు సమర్పించే నైవేద్యాలతో ప్రతిరోజూ సుమారు 150–200 మంది భోజనం చేసేవారు. బాబా మాత్రం నిత్యం భిక్ష చేసి ఆ భిక్షాన్నాన్ని, కొంత నైవేద్యాలను కలిపి మధ్యాహ్నం 10, 12 మంది భక్తులతో కలిసి కూర్చుని భోజనం చేసేవారు. తాత్యా మొదలైన కొందరు భక్తులు కూడా మసీదులోనే భోజనం చేసేవారు. బాబా కుడివైపు తాత్యాపాటిల్, ఎడమవైపు మాలేగాం ఫకీరు (బడేబాబా) కూర్చొనేవారు. తాత్యా, రామచంద్రపాటిల్, బయ్యాజీ పాటిల్ ఒక కంచంలోను, బాబా, మాలేగాం ఫకీర్ (బడేబాబా) కలిసి ఒక కంచంలోను భోజనం చేసేవారట.

## భక్తితో యుక్తి:

తాత్యాకు బాబాతో గల ఈ చనువు సాన్నిహిత్యం దృష్ట్యాను, తాత్యా ఏం చేసినా సామాన్యంగా బాబా అడ్డు చెప్పరనే నమ్మకం వల్ల బాబా మామూలుగా ఇష్టపడరని భావింపబడే పనులు సాధించుకోవడానికి భక్తులు తాత్యాను ప్రయోగించేవారు. చావడి ఉత్సవం వంటి సందర్భాలలో బాబాపై జరీ సెల్వార్ కప్పడం, కోటు తొడగడం, కిరీటం పెట్టడం వంటి ముచ్చటలు భక్తులు తాత్యా ద్వారా సాధించుకొనేవారు. మామూలుగా అయితే అటువంటి ఖరీదైన దుస్తుల మాట అటుంచి, తాము రోజూ ధరించే కఫ్నీ కూడా ఒక పట్టాన మార్చేవారు కాదు. కఫ్నీ చినిగిపోతే ఒక ముల్లుకు

రంధ్రం వేసి దానినే సూదిగా ఉపయోగించి మధ్యాహ్న సమయంలో తామే ఓపిగ్గా కుట్టుకునేవారు. భక్తులెవరైనా కొత్త కఫ్నీ కుట్టించి సమర్పిస్తే, ***"ఈ పేద ఫకీరుకు ఈ పాత కఫ్నీ చాలులే!"*** అంటూ, కొత్త కఫ్నీ ధరించడానికి నిరాకరించేవారు. బాబా కఫ్నీ మరీ అతుకుల బొంతగా తయారైతే, తాత్యా వచ్చి బాబాతో ఆ మాట ఈ మాట మాట్లాడుతూ, "బాబా ఏమిటి మీ కఫ్నీ ఇక్కడ ఇలా చినిగింది?" అంటూ ఆ చిరుగుల్లో తన వేలు దూర్చి ఆ చినుగులను మరీ పెద్దవి చేసి ఇక కుట్టుకోవడానికి కూడ వీల్లేని స్థితికి తెచ్చేవాడు. అప్పుడిక కొత్త కఫ్నీ వేసుకోక తప్పేది కాదు. తాత్యాను చీవాట్లు పెడుతూ పాత కఫ్నీ తీసి ధునిలో వేసి కొత్త కఫ్నీ ధరించేవారు. ఒక్కోసారి తాత్యా అలా చింపిన కఫ్నీకి మాసికలు వేసి తిరిగి కుట్టుకునేవారు.

బాబా ఒక్కోసారి ఎందుకోగానీ హఠాత్తుగా తీవ్ర ఆగ్రహావేశాలను ప్రదర్శించే వారు. ఆ సమయంలో ఆయన మహోగ్రంగా కనిపించేవారు. కళ్ళు చింతనిప్పులుగా మారిపొయ్యేవి. ఆ సమయంలో చెంతనున్న భక్తులను విపరీతంగా తిట్టి అందరినీ మసీదు నుండి తరిమివేసేవారు. ఒక్కోసారి కొట్టేవారు కూడా! బాబా అలా కోపావేశంలో ఉన్నప్పుడు తాత్యా ఒక్కడే ఆయన్ని సముదాయించగలిగేవాడు. ఒక్కోసారి అతనికి కూడా అది సాధ్యమయ్యేదికాదు. అయితే ఆ సమయాలలో అసలు ఆయన్ను సమీపించే సాహసం తాత్యా వంటి ఒకరిద్దరు భక్తులకే ఉండేది.

ఒక్కోసారి బాబా ఎవరికీ ఏమీ చెప్పకుండా నీంగాం వైపో, రహతా వైపో బయల్దేరేవారు. బాబా శిరిడీ వదిలి ఎక్కడికైనా వెళ్ళిపోతారేమోననో లేదా నీంగాంలో గానీ, రహతాలోగానీ ఒక రాత్రి ఉంటే ఇంకా అలాగే అక్కడే ఉండిపోతారేమోనని భక్తులకు, గ్రామస్థులకు ఒక భయముండేది. అందువల్ల అటువంటి సందర్భాలలో బాబా బయలుదేరగానే భక్తులు పరుగునపోయి తాత్యా ఎక్కడున్నా వెదకి ఆ సంగతి తాత్యాకు చెప్పేవారు. తాత్యా హుటాహుటిన వెళ్ళి బాబాను దారిలోనే కలుసుకొని "బాబా మీరలా వెళితే తిరిగిరారు! మిమ్మల్ని మేము విడిచిపెట్టము. నీంగాం (లేదా రహతా) రేపు పోవచ్చులే! ఇప్పుడు వెనక్కి రండి!" అని పట్టుబట్టేవాడు. అప్పుడు బాబా తాము సాయంత్రానికి తప్పక శిరిడీ తిరిగి వస్తామని తాత్యాకు వాగ్దానం చేసి అతన్ని వెనక్కి పంపేవారు. ఒక్కోసారి బాబా హఠాత్తుగా లేచి ***"నన్ను వణీ తేలీలు (నూనె వ్యాపారస్థులు) చాలా బాధపెడుతున్నారు. నేనిక ఈ మసీదులో ఉండను"*** అంటూ

తమ జోలె, రేకుడబ్బా, సట్కా తీసుకొని అక్కణ్ణుండి వెళ్ళిపోవడానికి సిద్ధమయ్యేవారు. అప్పుడు కూడా భక్తులు హుటాహుటిన తాత్యాకు కబురుపెట్టేవారు. తాత్యా వచ్చి "ఆ తేలీ వణీలను నేను దండిస్తాను కదా? మీరు శాంతించండి! అంతగా అయితే రేపు వెళ్దాం!" అని చిన్నపిల్లలను మాయచేసి బుజ్జగించినట్లు బుజ్జగించేవాడు. అప్పుడు బాబా శాంతించి ఏమీ జరగనట్లు మసీదులో ఆసీనులయ్యేవారు!

**నాటకాలు :**

శిరిడీలో ఏటేటా చావడిముందు నాటకాలు వేసేవారు. ఆ నాటకాల్లో తాత్యా కూడా చురుగ్గా పాల్గొనేవాడు. మామూలుగా తాత్యా నాటకాలలో రాజు పాత్రలు వేసేవాడు. ఆ నాటకాల ఖర్చు నిమిత్తము ప్రతి ఏటా బూటీ రూ.500/- విరాళం కూడా ఇచ్చేవాడు. ఆ నాటకాలు చూడటానికి చుట్టుప్రక్కల ఊర్లనుండి కూడా జనం వచ్చేవారు. తాత్యా వేషం చూడడానికి ఒక్కోసారి బాబా కూడా చావడిలో కూర్చొని అక్కడి నుండి ఆ వినోదం చూచేవారు.

**మమతానుబంధమా? మహితానుబంధమా?**

ఇప్పటివరకు చెప్పుకొన్న శ్రీతాత్యా అనుభవాలు అవలోకిస్తే బాబాకు తాత్యాకు ఉన్న బంధం కేవలం మానవ సహజమైన మామ – మేనల్లుళ్ళ మమతానుబంధమే తప్ప ఆధ్యాత్మికవాసన గోరంతైనా గోచరించకపోవడంలో ఆశ్చర్యం లేదు. అయితే తమ అణువణువునా ఆధ్యాత్మికశక్తిని వెదజల్లిన శ్రీసాయివంటి మహితమూర్తితో తమను తాము ఏవిధంగా ముడివేసుకొన్నా, అది కడకు వారి ఆత్మోద్ధరణకు ఊతమయ్యే ఆధ్యాత్మిక బంధం కాక తప్పదు. అసలు శ్రీసాయివంటి సద్గురు సామ్రాట్ సాన్నిధ్యంలో అంతకాలం సాన్నిహిత్యం కలిగి ఉండటంకన్నా గొప్ప ఆధ్యాత్మికసాధన ఏముంది? నిజానికి సూక్ష్మంగా పరిశీలించి చూస్తే ఎంతో లౌకికంగా కనిపించే తాత్యా అనుభవాల వెనుక ఒక అలౌకిక నేపథ్యం గోచరిస్తుంది.

సృష్టిలోని ప్రతి కదలిక శ్రీసాయి సంకల్పంలో భాగమనే ఎఱుకతో బాబా చేతికి తమ "జీవితపు పగ్గాలను అప్పగించి నిశ్చింతగా ఉండటమే" శ్రీసాయియోగంలోని ప్రధాన అంశం. ఈ శరణాగతిపథాన్నే శ్రీసాయి తమ వివిధ లీలల ద్వారా బోధించినది.

మనం ముందు ముందు "ఇలా చెయ్యాలి, ఇలా జరగాలి" అనే సంకల్పం ఆధారంగా ఏవేవో ప్రణాళికలను (plans) తయారుచేసుకొని, వాటికి మనలను మనం బద్ధులం చేసుకొంటాం. ఆ బంధమనే కోటలో మన అహాన్ని భద్రంగా పెంచి పోషిస్తాం. మన దైనందిన జీవితంలో గడ్డిపోచలవలే ఎంతో స్వల్పమైనవిగా, అప్రధానంగా తోచే ఈ సంకల్పబంధాలే తరువాత బలమైన మోకుల్లా మనలను బంధించి, ఆనందస్వరూపుడైన శ్రీసాయిని శరణు పొందనీయకుండా చేస్తాయి. అందుకే మనం అతిస్వల్ప విషయాలుగా భావించే విషయాలను కూడా బాబా ఎంతో గమనికతో పట్టించుకొని, అదనుచూసి తగు అనుభవాలను ఇస్తూ ఈ సంకల్పబంధాల నుండి విడుదల చేసి, మనలను శరణాగతిపథంలో నడిపిస్తారు. ఒకటి రెండు రోజులు శిరిడీలో ఉండిపోవాలని వచ్చినవారిని నెలల తరబడి ఉంచెయ్యడం, దీర్ఘకాలం అక్కడ ఉండడానికి సిద్ధమై వచ్చిన వారిని వెంటనే వెళ్ళిపొమ్మనడం, ముందు బయలుదేరడానికి అనుమతించి వెంటనే మళ్ళీ సెలవు నిరాకరించడం వంటి శ్రీసాయి చర్యలు ఈ తత్త్వం యొక్క నేపథ్యంలో దర్శిస్తేనే కొంచెమైనా అవగాహన అవుతాయి. బాబా మాట పెడచెవిన బెట్టి, ఆయన అనుమతి లేకుండా శిరిడీ వదలి వెళ్ళడం వంటివి చేస్తే తప్పకుండా ఎన్నో ఆపదలకు కష్టాలకు గురి అవ్వడం ఎందరో భక్తుల అనుభవం. బాబా అలా అనుమతి నిరాకరించడానికి కారణం భవిష్యత్తులో జరుగబోయే అనర్థాన్ని ముందుగా తెలుసుకొని బాబా ఆయా భక్తులను అలా హెచ్చరించేవారని అనుకోవడానికి కూడా పూర్తిగా వీలులేదు. సర్వశక్తిమంతుడైన శ్రీసాయికి ఆ ఆపదలను తొలగించడం ఒక లెక్కలోని పనా? ఎన్నో సందర్భాలలో ముందుగా జరిగే ఆపదలను సూచించి, అయినా ఫర్వాలేదులెమ్మని పంపి, ఆయా భక్తులను ఆ ఆపదల నుండి కాపాడిన సంఘటనలు ఎన్నో ఉన్నాయి. కొంచెం సూక్ష్మంగా పరిశీలిస్తే, శ్రీసాయి ప్రతి చర్య శరణాగతిపథమనే 'శుభ్రమార్గం'లో మనకు నడకలు నేర్పే పాఠాలేనని అర్థమౌతాయి.

## అనుమతి లేకపోతే అనర్థం

తమ అనుమతి తీసుకోకుండా శిరిడీ వదలి ఎక్కడికీ వెళ్ళవద్దని తాత్యాను ఆదేశించారు బాబా. తాత్యా కూడా బాబాకు చెప్పకుండా, ఆయన అనుజ్ఞ తీసుకోకుండా

ఎక్కడికీ వెళ్ళేవాడు కాదు. ఒకవేళ, బాబాతో తనకున్న చనువు వల్ల బాబా ఆజ్ఞ జవదాటి వెళితే వెంటనే దాని 'ఫలితాన్ని' చవిచూసేవాడు.

ఒకసారి మహాశివరాత్రికి జజూరీ వెళ్ళాలనుకొన్నాడు తాత్యా. టాంగా సిద్ధం చేసికొని బాబా అనుమతి కోసం మసీదుకు వెళ్ళాడు. అతని యాత్ర గురించి విని బాబా అయిష్టంగా *"ఎందుకంత బాధ? వెళ్ళకపోతే ఏం?"* అన్నారు. దానికి తాత్యా "పో బాబా! మీరెప్పుడూ ఇంతే. నేనెప్పుడు యాత్రకు వెళ్ళాలనుకున్నా ఏదో అడ్డుపుల్ల వేస్తారు!" అన్నాడు మారాముగా. బాబా విసుగ్గా *"సరే పో! నీ ఇష్టం"* అన్నారు కసిరినట్లు. తాత్యా హుషారుగా టాంగా ఎక్కి బయలుదేరాడు. శిరిడీ వదలి కొద్దిదూరం వెళ్ళేసరికి హఠాత్తుగా అతని టాంగా బోల్తా కొట్టింది. ఒంటికయిన గాయాలు తుడుచుకొంటూ మొహం వ్రేలాడేసుకొని ఉసూరుమంటూ మళ్ళీ మసీదు చేరాడు. తాత్యాను చూస్తూనే "బాగా తిక్క కుదిరిందా?" అన్నట్లు చప్పట్లు చరుస్తూ గంతులేస్తూ *"బుద్ధుండక్కరలే, అడగడమెందుకు? వద్దంటే వినకుండా వెళ్ళడమెందుకు?"* అన్నారు బాబా.

మరోసారి, కోపర్‌గాంలో వారానికొకరోజు జరిగే సంతకు ఏదో అవసరమైన పని ఉండి టాంగాలో బయల్దేరాడు తాత్యా. వెళ్తూ హడావుడిగా మసీదుకొచ్చి "బాబా కోపర్‌గాం దాకా వెళ్ళొస్తా" అన్నాడు. దానికి బాబా *"ఎందుకంత తొందరపడతావ్? కొంచెం నిదానించు! సంత ఉంటే ఉండిందిలే! నీవు మాత్రం ఈరోజు శిరిడీ వదలి వెళ్ళొద్దు!"* అన్నారు. తనకు సంతలో చాలా అవసరమైన పని ఉందనీ, తప్పక వెళ్ళాల్సిందేననీ పట్టుబట్టాడు తాత్యా. అతడలా మూర్ఖించడం చూచి బాబా, *"సరే అయితే! కానీ, వెళ్ళేటప్పుడు షామాను తోడుగా తీసుకుపో"* అన్నారు. కోపర్‌గాం దాకా వెళ్ళేందుకు తనకు షామా తోడేమిటని, బాబా మాటలు పట్టించుకోకుండా టాంగాను దౌడు తీయించాడు. శిరిడీ గ్రామం దాటి సావుల్‌విహిర్ గ్రామం దరిదాపుల్లో, టాంగాకు కట్టిన రెండు గుఱ్ఱాలలో ఒక క్రొత్త గుఱ్ఱం రెండోదాని కంటే వేగంగా దౌడుతీసి కాలు మడతబడి కూలబడ్డది. టాంగాలో ఉన్న తాత్యా క్రింద పడ్డాడు. బాబా దయవల్ల పెద్ద దెబ్బలేమీ తగల్లేదు. అలాగే మరోసారి బాబా మాట పెడచెవిన పెట్టి కోల్హారుకు బయలుదేరి టాంగా ప్రమాదానికి గురయ్యాడు తాత్యా. అలా పరోక్షంగానే కాదు, ప్రత్యక్షంగా కూడా తాత్యా ఐహిక ఆధ్యాత్మిక పురోభివృద్ధి పట్ల శ్రద్ధ వహించారు బాబా. ఈ అంశాన్ని గూర్చి వివరిస్తూ శ్రీతాత్యా ఇలా అన్నారు:

"నేను ఏకాదశి, శ్రావణ సోమవారాలు, మహాశివరాత్రి సమయంలో తప్పక ఉపవసించేవాడిని. కానీ, ఉపవాసం వల్ల ఐహికంగాగానీ, ఆధ్యాత్మికంగాగానీ ఏమీ ప్రయోజనం లేదని బాబా అభిప్రాయం. ఆ పర్వదినాల్లో నేనెంతగా ఉపవసించాలని యత్నించినా బాబా నాచేత ఏదో ఒకటి తినిపించి ఉపవాసాన్ని భంగం చేసేవారు. ఒక శివరాత్రినాడు నేను బాబాతో, "బాబా, దయచేసి శివరాత్రి నాడైనా, నాచేత ఏమీ తినిపించకండి! నన్నీరోజైనా ఉపవసించనీయండి!" అని అన్నాను. ***"తినరా! తిను! ఏం శివరాత్రి?"*** అన్నారు బాబా. ప్రక్కనే ఉన్న దాదాకేల్కర్ కూడా బాబా చెప్పినట్లే చెయ్యమనీ, ఆయన ఆజ్ఞను ఉల్లంఘించవద్దనీ నన్ను హెచ్చరించాడు. నేనిక బాబా మాటకు అడ్డు చెప్పలేదు. ఆనాటి నుండి నేనేరోజునా ఉపవాసం చెయ్యలేదు".

అలాగే ఒక మహాశివరాత్రికి జజూరీ యాత్ర చెయ్యాలనుకొన్న తాత్యాను బాబా నిరుత్సాహపరచిన వైనం ముందు చూచాం. అంతేకాదు! బాబాతో అత్యంత సన్నిహిత సాహచర్యంతో మెలిగిన తాత్యాకు బాబాను ఎంతో అరుదైన ఆధ్యాత్మిక స్థితులలో చూచే అవకాశం లభించింది. అలాంటి ఒక సందర్భాన్ని గూర్చి ప్రస్తావిస్తూ శ్రీతాత్యా ఇలా అన్నారు: "ఒక్కొక్కప్పుడు బాబా ఒకానొక పారవశ్యంలో ఉండేవారు. అటువంటి అరుదైన సమయాలలో ఆయన తమ చేత తంబూరా ధరించి పారవశ్యంతో ఒడలు తెలియని రీతిన నృత్యం చేసేవారు. అత్యంత లయబద్ధమైన వారి పాద, కర, నేత్ర కదలికలు భంగిమలు చూచేవారినందరినీ మంత్రముగ్ధులను చేసేవి. ఎంతో మధురమైన కంఠస్వరంతో బాబా ఎంతో గొప్పగా పాడేవారు కూడా. అలా నృత్యం చేస్తూ పిల్లనగ్రోవి వాయిస్తున్నట్లు భంగిమచేస్తూ, ఒక కాలును మరో కాలు ఎదుట అడ్డంగా మడిచి నిలుచునేవారు. ఆయనను ఆ భంగిమలో చూచిన వారందరికీ వారు బాబాను కాక, ఆ బృందావన కృష్ణుడినే చూస్తున్నామా అనిపించేది. అటువంటి భావపారవశ్యంలో ఆయన్ను దర్శించిన వారందరికీ కూడా ఏదో తెలియని పారవశ్యం కలిగి, ఏదో పారలౌకిక దృశ్యాన్ని చూస్తున్నట్లనిపించేది".

1910 దీపావళినాడు ధునిలో కట్టెలు సవరిస్తూ బాబా హఠాత్తుగా తమ చేతినే మంటలో పెట్టారు. బాబా చెయ్యి బాగా కాలింది. అలా ఎందుకు చేసారని అడిగిన భక్తులకు ఎక్కడో కొలిమిలో పడబోయిన ఒక బిడ్డను రక్షించడానికి తాము అలా చేశామన్నారు బాబా. కాలిన బాబా చెయ్యి చూసి బాధతో కన్నీళ్లు కారుస్తున్న తాత్యాతో

*"అరే! ఎందుకురా ఏడుస్తావ్? మండుతున్న రెండువేల పిడకలబట్టీ పైన ఈ శరీరాన్ని కాలుస్తున్నా చలించకూడదు. నిజమైన జ్ఞానానికి అదే గీటురాయి!"* అన్నారు శ్రీసాయి.

అయితే, తాత్యా ఎప్పుడూ బాబా అనురాగామృతాన్నే కాకుండా, అప్పుడప్పుడు ఆయన ఆగ్రహాన్ని కూడా చవిచూడవలసి వచ్చేది. 1914లో మసీదు ముంగిలి భక్తులు కూర్చొనేందుకు చాలా ఇరుకుగా ఉందని భావించి, దాన్ని విశాలం చేసే పని ప్రారంభించాడు శ్రీకాకాసాహెబ్ దీక్షిత్. బాబా చావడిలో నిద్రించిన ఒక రాత్రి భక్తులంతా మసీదు ముంగిట గోతులు తీసి, దూలాలు పాతారు. మరుసటి ఉదయం బాబా చావడి నుండి మసీదుకు రాగానే, జరిగిన పని చూచి ఉగ్రులయ్యారు. ఆ కోపావేశంలో తమ చెంతనే ఉన్న తాత్యా గొంతును ఒక చేత్తో పట్టుకొని, ఇద్దరు ముగ్గురు కలిసిగానీ మొయ్యలేని ఆ దూలాలను మరోచేత్తో అవలీలగా పీకిపారేశారు. తరువాత, తాత్యా తలపాగా పీకి దానికి నిప్పంటించి ఆ దూలాలు పాతిన గుంటల్లో ఒక దానిలో వేశారు. తరువాత తమ జేబులోనుండి ఒక రూపాయి నాణెం తీసి, దాన్ని కూడా ఆ గుంటలో వేశారు. ఆ సమయంలో బాబా కళ్ళు అగ్నికణాల్లాగా ఉన్నాయి. ఆ మహోగ్రమూర్తిని సమీపించడానికి కూడా భయపడి భక్తులంతా నివ్వెరపోయి భయంతో దూరంగా నిలబడి చూస్తున్నారు. బాబా అంతసేపు తాత్యా గొంతు విడవలేదు. మామూలుగా అయితే బాబాను తన భుజాలపైన అవలీలగా కూర్చొనబెట్టుకొని పరుగుతీసే బలంగల తాత్యా, ఆ సమయంలో ఎంత గింజుకొన్నా బాబా పట్టునుండి తన మెడను విడిపించుకోలేకపోయాడు. తాత్యా పరిస్థితి ఏమవుతుందోనని అందరూ భయపడ్డారు. అప్పుడు భాగోజీషిండే కొంచెం ధైర్యం తెచ్చుకొని బాబా పట్టునుండి తాత్యాను విడిపించబోయాడు. కానీ బాబా అతన్ని దూరంగా తోసి, అతడిపై రాళ్ళు రువ్వారు. అలా కొద్దిసేపు గడిచాక బాబా తమంతట తాము శాంతించారు. ఒక భక్తుని బజారుకు పంపి మంచి జరీ తలపాగా తెప్పించి, దాన్ని సగౌరవంగా తామే తాత్యా తలపై చుట్టారు!

1916లో ఒకసారి శ్రీరామచంద్రకోతేపాటిల్‌కి తీవ్రంగా జబ్బు చేసింది. అన్నిరకాల వైద్యాలు నిష్ఫలమయ్యాయి. ఇక రామచంద్రపాటిల్ మరణించడం తథ్యమని అందరూ అనుకొన్నారు. అతడూ నిరాశతో చావుకు సిద్ధపడి 'ఎప్పుడెప్పుడా' అని చూస్తున్నాడు. ఇంతలో ఒకరాత్రి అతనికి బాబా దివ్యదర్శనమిచ్చి, *"నీవేం భయపడవద్దు. నీ చావు చీటీ చింపేశాను. త్వరలోనే నీ ఆరోగ్యం బాగవుతుంది.*

*కానీ, తాత్యా గురించే నా ఆలోచన. అతడు 1918 విజయదశమినాడు మరణిస్తాడు. అయితే ఈ విషయం ఎవ్వరికీ చెప్పకు! ముఖ్యంగా తాత్యాకు చెప్పవద్దు. చెప్తే అతడు అనవసరంగా ముందే భయపడిపోతాడు!"* అన్నారు. ఆ మరుసటిరోజు నుండి ఆశ్చర్యకరంగా రామచంద్రపాటిల్ కోలుకోనారంభించి కొద్దిరోజులలో పూర్తిగా స్వస్థుడైనాడు. అతను తాత్యాకు ఆప్తమిత్రుడు. బాబా మాటకు తిరుగులేదని, ఇక రెండు సంవత్సరాలే తాత్యాకు ఆయుష్షు అనీ మనసులో కుమిలిపోయాడు శ్రీరామచంద్ర పాటిల్. ఈ రహస్యాన్ని, ఆవేదనను తన హృదయంలోనే ఇముడ్చుకోలేక తన మిత్రుడైన బాలాషింపీకి మాత్రం చెప్పాడు.

రామచంద్రపాటిల్, బాలాషింపీలు భయపడుతున్నట్లే 1918 దసరా ప్రారంభం కాగానే తాత్యా తీవ్రంగా జబ్బునపడ్డాడు. దాదాపు అదే సమయంలో బాబా కూడా అస్వస్థులయ్యారు. రోజురోజుకు తాత్యా ఆరోగ్యం క్షీణించి ఇక విజయదశమి ఒకటి రెండురోజులుందనగా అతని ఆరోగ్యపరిస్థితి మరీ ప్రమాదకరంగా మారింది. బాబా దర్శనార్థం మసీదుకు కూడా రాలేకపోయాడు. ఒకరోజు బాబా మసీదుకు వచ్చి భోజనం చేయమని తాత్యాకు కబురుపెట్టారు. లేవలేక మంచాన ఉన్న తాత్యాను కొందరు భక్తులు సాయంపట్టి ఎలాగో మసీదుకు తెచ్చారు. అంత జబ్బులో ఉన్న తాత్యాకు బాబా స్వయంగా పాయసం తినిపించారు. చాలా కష్టంమీద ఎలాగో రెండు గుటకలు వేయగలిగాడు తాత్యా. బాబా అతనితో *"తాత్యా! మొదట మనిద్దరికోసమని రెండు ఊయలలు తెప్పించాను. కానీ, తరువాత మనసు మార్చుకొన్నాను. ప్రస్తుతానికి నేనొక్కడినే వెళ్తున్నాను. ఇక నీవింటికి వెళ్ళు!"* అన్నారు. బాబా మాటలలోని భావాన్ని గ్రహించిన తాత్యా వెక్కి వెక్కి ఏడుస్తూ, "బాబా, నన్నే ముందుగా పంపకూడదా?" అన్నాడు. దానికి బాబా, *"నేను ఫకీరును. నేను పోతే శోకించేవారెవ్వరూ లేరు. కానీ, నీవు పోతే నీవాళ్లందరూ దుఃఖిస్తారు"* అన్నారు. ఆ మాటలకు తాత్యా దుఃఖం ఇంకా కట్టలు త్రెంచుకొంది. అతను దుఃఖంతో వెక్కిళ్ళు పెడుతూ, "నేను పోతే నా బంధువులే దుఃఖిస్తారు, మీరు లేకపోతే ఎంతోమంది అనాథలౌతారు. మీరుంటే మీ దర్శనం చేతనే ఎందరో తరిస్తారు. ఇక నేనంటారా? నా జీవితం నాకు, నా సాటివాళ్ళకూ ఒక భారం" అన్నాడు. అతని ధోరణిని అడ్డుకొంటూ బాబా, *"సరేలే! ఇక నోరుమూసుకొని ఇంటికి పో!"* అని ప్రేమతో కసిరారు.

బాబాకు నమస్కరించి సెలవు తీసుకుంటున్న తాత్యా నొసట ఊదీపెట్టి, బరువైన గుండెతో ఇంటికి పోతున్న తాత్యాను అతను కనుమరుగయ్యేదాకా అలాగే చూస్తూ ఉండిపొయ్యారు బాబా.

విజయదశమి రానే వచ్చింది. బాబా దేహత్యాగం చేశారు. బాబా మహాసమాధి చెందిన కొన్ని గంటలకు అప్పటికి ఎంతో విషమించిన తాత్యా ఆరోగ్యస్థితి విచిత్రంగా మెరుగుపడటం మొదలై తరువాత ఒకటి రెండురోజులలో పూర్తిగా కోలుకున్నాడు.

తాత్యా ప్రాణాలు కాపాడటంకోసం అతని ప్రాణాలకు బదులు బాబా తమ ప్రాణాలే అర్పించారని ప్రజలు భావించారు. ఈ విషయాన్ని ప్రస్తావిస్తూ శ్రీహేమాడ్పంత్ తమ "శ్రీసాయిసచ్చరిత్ర" (42వ అధ్యాయం) లో ఇలా అంటారు: "వారిలో వారు (బాబా–తాత్యాలు) తమ మరణము మార్చుకొన్నట్లనిపించెను. బాబా తమ ప్రాణమును తాత్యా కొరకర్పించిరని జనులనుకొనిరి. సత్యము బాబాకే తెలియును. ఈ విధముగ బాబా తాత్యా పేరు చెప్పి తమ సమాధిని సూచించిరి". బాబాకు తాత్యాకు ఉన్న ప్రాణాధికమైన ప్రేమానురాగాల దృష్ట్యా ప్రజలు అలా భావించడంలో ఆశ్చర్యంలేదు. అయితే అది కేవలం వారి 'భావనే' తప్ప, ఆ 'భావన'కు బలమైన కారణం ఏదీ కనిపించదు. ఎందుకంటే, మొదట తమ కోసం, తాత్యా కోసం రెండు ఊయలలు తెప్పించాననీ, కానీ తరువాత మనసు మార్చుకొని ఒక ఊయలను ఖాళీగా త్రిప్పి పంపేశాననీ, తాను మాత్రమే వెళుతున్నాననీ బాబా స్పష్టంగా చెప్పారు. అంతేగానీ, తాత్యా కోసం ఒక్క ఊయలనే సిద్ధంచేసి దానిలో తాత్యా బదులు తాము వెళ్తామని బాబా చెప్పలేదు. తాత్యా కూడా "తనను ముందుగా పంపరాదా?" అని బాబాను అర్థించాడే తప్ప, "మీ బదులు నన్ను పంపరాదా?" అని అడగలేదు. బాబా వంటి దివ్య అవతారమూర్తుల దేహం యొక్క ఆవిర్భావం, పరిణామం, అదృశ్యం ఎందరో భక్తుల ప్రారబ్ధంతో, తరింపుతో ముడిపడి ఉంటుంది. అంతేగాక, ఎందరో భక్తులను మరణం నుండి కాపాడటమేగాక, మరణించిన వారిని కూడా పునర్జీవితులను చేసిన సర్వశక్తి సంపన్నుడైన శ్రీసాయికి తాత్యా ప్రాణాలు కాపాడటం ఒక లెక్కలోని పనికాదు. అతని ప్రాణాలు కాపాడాలంటే దానికి బదులు తమ ప్రాణాలు అర్పించాల్సినంత పని అసలే లేదు. శ్రీహేమాడ్పంతు సూచించినట్లు తమ సహజ నిగూఢరీతిలో తమ పేరుకు బదులు తాత్యా పేరు చెప్పియుండవచ్చు. అయితే, తాత్యా కోసం బాబా

తమ ప్రాణాలనే అర్పించారనే ప్రజల 'భావన' బాబాకు, తాత్యాకు మధ్యనున్న ప్రాణాధికమైన మమతానురాగాలకు అద్దం పడుతున్నది.

## సంతానం


వివాహమైన చాలాకాలంవరకు తాత్యాకు సంతానం కలుగలేదు. మరో వివాహం చేసుకొంటేనయినా సంతానం కలుగుతుందేమోనని రెండవ వివాహం కూడా చేసుకొన్నాడు. రెండవ భార్య ద్వారా కూడా ఎంతకాలానికీ సంతతి కలుగక పోవడంతో మూడవ వివాహం కూడా చేసుకొన్నాడు. మూడవ భార్యవల్ల కూడా సంతతి కలుగలేదు. ఇక తనకు సంతానయోగం లేదనుకొని, తన మిత్రుడైన రామచంద్రపాటిల్ కుమారుని దత్తత చేసుకోవడానికి తాత్యా నిర్ణయించుకొన్నాడు. దత్తత స్వీకారోత్సవం ఏర్పాటుచేసి, దత్తత స్వీకారానికి సంబంధించిన పత్రాలు తీసుకొని, బాబా ఆశీస్సుల కోసం వెళ్ళాడు. బాబాకు విషయం చెప్పగానే ఆయన ***"దత్తత తీసుకోవలసిన అవసరం ఏమొచ్చింది? నీకే సంతానం కలుగుతారు!"*** అన్నారు. బాబా మాటమీద అచంచల విశ్వాసంగల తాత్యా వెంటనే దత్తత స్వీకార ప్రయత్నాలు విరమించుకొన్నాడు. కానీ, ఆ తరువాత కూడా ఎంతకాలానికీ తాత్యాకు బిడ్డలు కలుగలేదు. వేచి, చూచిచూచి ఒకసారి బాబా వద్దకు వెళ్ళి, "దేవా, నాకు సంతానం కలుగుతుందని మీరు చెప్పడం వల్ల నేను దత్తత తీసుకోవడం మానుకొన్నాను. మీరు మాట చెప్పి ఇంతకాలమైనా సంతానం కలిగే సూచనలేమీ కనిపించడంలేదు. నన్నేం చెయ్యమంటారు?" అని అడిగారు. దానికి బాబా, ***"నీకు సంతానం కలిగితే సంపద నిలవదు. సంతానం కావాలో సంపద కావాలో తేల్చుకో!"*** అన్నారు. సంతతి కోసం తపించిపోతున్న తాత్యా "సంపద లేకపోతే పోయింది. నాకు సంతానమే కావాలి" అని అన్నాడు. అప్పుడు బాబా చిరునవ్వుతో ***"సరే అయితే! నీకు పిల్లలే కదా కావాలి? పందికి పుట్టినట్లు గంపెడు పిల్లలు పుడతారులే పో!"*** అన్నారు. ఆ తరువాత తాత్యాకు తన 55వ ఏట సంతానప్రాప్తి మొదలై ముగ్గురు భార్యలూ గర్భం ధరించారు. కాలాంతరంలో చాలామంది సంతానం కలిగారు. ఈనాడు తాత్యా సంతతి (మనుమలు, మునిమనుమలతో పాటు) సుమారు వందమంది పైన ఉంటారు! కానీ బాబా చెప్పినట్లు తాత్యాకు సంపద మాత్రం నిలువలేదు. చివరిరోజులలో తాత్యా ఆర్థికంగా ఎన్నో

ఇబ్బందులను ఎదుర్కొనవలసి వచ్చింది. అయితే, బాబా అనుగ్రహం వల్ల తన చివరి రోజుల్లో ఎవ్వరికీ పైసా అప్పు లేకుండా 1945లో నిశ్చింతగా కన్నుమూసాడు. (ఈ వివరాలు శ్రీతాత్యా రెండవ భార్య కుమారుడు, శ్రీఉత్తమరావు తాత్యాకోతే పాటిల్ 'సాయిపథం'కు స్వయంగా చెప్పారు)


శ్రీతాత్యాకోతే పాటిల్ సమాధి లెండీబాగ్ ప్రధానద్వారం ప్రక్కన ప్రహరీ గోడకు, సాయిబాబా సంస్థానంవారి ఎలెక్ట్రిసిటీ పవర్ హౌస్‌కు మధ్య మనకీనాడు దర్శనమిస్తుంది*2. బాబాకు కంటివెలుగుగా భావింపబడే తాత్యాయొక్క సమాధిని ఆనుకొని మొత్తం సంస్థానానికి వెలుగునిచ్చే (విద్యుచ్ఛక్తి కేంద్రం) పవర్ హౌస్ చోటు చేసుకోవడం కేవలం యాదృచ్ఛికంకాక శ్రీసాయి సంకల్పమేనని అనిపించకమానదు!

---

*1 'శ్రీసాయిలీలామాసిక్' (మరాఠీ) పత్రికలో ప్రచురింపబడిన తాత్యా అనుభవాలు (ఈ గ్రంథంలో ప్రచురింపబడిన) శ్రీతాత్యాస్మృతులకు ఆధారం. బాబా-మహల్సా-తాత్యాలు మసీదులో ఏవిధంగా నిద్రించేవారనే విషయంలో 'శ్రీసాయి సచ్చరిత్ర'లో చెప్పబడిన వివరానికి, శ్రీతాత్యాపాటిల్ తమ స్మృతులలో చెప్పిన వివరాలకు కొంచెం తేడా ఉంది. అయితే ఈ విషయంలో, మసీదులో బాబాతో పాటు నిద్రించిన ఇద్దరిలో ఒకరైన శ్రీతాత్యా చెప్పిన వివరమే ఆధికారికం కదా? *"మశీదులో తమ తలలను తూర్పు, పడమర, ఉత్తరంల వైపు చేసి, మధ్యలో ఒకరికాళ్ళు ఒకరికి తగులునట్లు పడుకునేవారు"* అని శ్రీహేమాద్పంతు వ్రాశారు. కానీ, మసీదులో తలను తూర్పు వైపు (అంటే మసీదు మెట్లవైపునకు) పెట్టి, కాళ్ళను పడమర వైపు (అంటే, పవిత్ర నింబారు వైపుకు) పెట్టుకుని పడుకొనడం సంప్రదాయ విరుద్ధం. ప్రపంచంలోని మహమ్మదీయులందరూ పవిత్ర మక్కా వైపుకు తిరిగి ప్రార్థనలు చేస్తారు. నింబారు ఆ పవిత్ర మక్కాదిశను సూచించే (కిటికీని పోలిన) గూడు. అది మసీదులో ప్రధాన పవిత్ర స్థానం. ముస్లిం ఫకీరుగా ప్రపంచానికి ప్రకటమైన శ్రీసాయి నింబారును ఎంతో గౌరవించేవారు. అందుచేత, నింబారు వైపు కాళ్ళు పెట్టి మసీదులో పడుకునేవారనడం సమన్వయపడదు. ఎంతో భావస్ఫూర్తితో, కవితావేశంతో శ్రీహేమాద్పంతు చేసిన వర్ణనను బాబా-మహల్సా-తాత్యాల శయనశైలికి చక్కటి ఉపోద్ఘాతంగా గ్రహించి, శ్రీతాత్యా చెప్పిన వివరాన్ని చూస్తే అస్పష్టతకు తావుండదు. శ్రీతాత్యా చెప్పిన దిక్కుల వివరాన్ని కూడా ఖచ్చితమైన క్షేత్రగణితవిలువలు (geometrical values)గా గ్రహించక, రమారమిగా దిశలను సూచించే వర్ణనగా గ్రహిస్తే, *"ఒక్కొక్కప్పుడు నిద్రలో మా కాళ్ళు పెనవేసుకునేవి"* అని శ్రీతాత్యా చెప్పినది కూడా సమన్వయపడుతుంది. ఈ నేపథ్యంలో, బాబా-మహల్సా-తాత్యాలు మసీదులో నిద్రించిన విధం దాదాపు ప్రక్క చిత్రంలో చూపిన విధంగా ఉండడానికి అవకాశం ఉంది.




*2 తరువాత రోజుల్లో 'శ్రీసాయిబాబా సంస్థాన్' చేపట్టిన ఆధునీకరణ కార్యక్రమంలో భాగంగా, కట్టడాల పునర్నిర్మాణ సందర్భంలో, ఆ పవర్‌హౌస్ – శ్రీతాత్యా సమాధి ప్రక్క నుండి, ఆ దగ్గరలోనే (మ్యూజియం ప్రక్కన) నూతనంగా నిర్మించిన భవనంలోనికి మార్చబడినది.





శ్రీమతి బయజాబాయి

# శ్రీమతి బయజాబాయి

పరిపూర్ణ దివ్యత్వం ధరించిన మానుషరూపమే – శ్రీసాయిబాబా! అవధులు లేని దైవశక్తి పాంచభౌతికదేహం యొక్క పరిధులలో ఎంతవరకు ప్రకటం కాగలదోనన్న దానికి అవధియే శ్రీసాయిమహిమ. శ్రీసాయిని ప్రత్యక్షంగా సేవించిన భక్తులలో తొంభై అయిదుశాతం ఆయనలోని మహిమను దర్శించి ఆశ్రయించారు. “జయామని జైసాభావ, తయా తైసానుభవ! దావిసి దయాఘన ఐసి తుఝీ హీ మావ!!” అని శ్రీమాధవ అడ్కర్ తన ఆరతి గీతంలో ఆలపించినట్లు, ఆయా భక్తుల భావానికి అనుగుణంగా శ్రీసాయి వారికి ప్రకటమయ్యారు. మిగిలిన అయిదు శాతం భక్తులు మాత్రం కేవలం సాయిమహిమ పట్ల ఆకర్షణతోనే గాక, మమతానుబంధంతో బాబాతో తమను తాము ముడివేసుకున్నారు. వారిపై శ్రీసాయి వర్షించిన అనురాగ వర్షధారలలో నుండి చూస్తే శ్రీసాయి దివ్యరూపం ఒక మమతల హరివిల్లుగా మనకు గోచరిస్తుంది. అలా బాబా అనురాగధారలలో ఆమూలాగ్రం తడిచి, ఆనందంగా నర్తించిన భక్తులలో శ్రీతాత్యాకోతేపాటిల్ తరువాతనే మిగిలినవారిని పేర్కొనాలి. అంతటి భాగ్యానికి శ్రీతాత్యా నోచుకోవడానికి శ్రీతాత్యా తల్లిదండ్రులు శ్రీగణపతికోతే, శ్రీమతి బయజాబాయిలు బాబాకు అందించిన సేవలు, బాబాతో వారికి గల సాన్నిహిత్యం నిమిత్తాలయినాయి.

లోకకళ్యాణార్థం శ్రీసాయిబాబా శిరిడీలో ప్రకటమయ్యారు. చాంద్‌భాయ్ పాటిల్ బంధువు కళ్యాణం కోసం వారి పెళ్ళిబృందంతో శ్రీసాయి శిరిడీలో అడుగిడడం ఆ వాస్తవానికి స్థూలమైన సూచ్యరూపమే! బాబా శిరిడీ వచ్చిన మొదట్లో ఆ గ్రామ ప్రజలకు శ్రీసాయి ఒక పిచ్చి ఫకీరు, ఒక సామాన్య భిక్షకుడు మాత్రమే! శ్రీసాయిమహిమ

ఏ మాత్రం ప్రకటం కాని ఆ రోజులలోనే ఆయనపట్ల ఏదో తమకే తెలియని కారణాల వల్ల ఆకర్షితులైనవారు ఆ గ్రామంలో ముగ్గురు నలుగురుకన్నా లేరు. మహల్సాపతి, కాశీరాం షింపే, అప్పాజోగ్లే, గణపతికోతే పాటిల్ – ఆ రోజులలోనే శ్రీసాయిని అత్యంత గౌరవాదరాలతో సేవించేవారు. వారిలో శ్రీగణపతికోతే(అప్పాకోతే)తో శ్రీసాయి ఎంతో ఆత్మీయతతో ఉండేవారు. గణపతికోతే భార్య శ్రీమతి బయజాబాయిని స్వంత అక్కలా సంభావించేవారు. శ్రీఅప్పాకోతే దంపతులకు బాబాతో మొదట పరిచయమైన వైనం గూర్చి శ్రీసాయి శరణానంద తమ గ్రంథంలో ఇలా వ్రాశారు:

"బహుశా శ్రీసాయిబాబాతో తనను తాను పరిచయం చేసుకొన్న మొదటి వ్యక్తి మహల్సాపతి. బాబాతో సంభాషించాక మహల్సాపతికి ఆయనపై ఎంతో గురి కుదిరింది. ఆపై రోజూ బాబాను కలుసుకునేవాడు. తరువాత తన మిత్రులయిన కాశీరాం షింపేకు, అప్పాజోగ్లేకు బాబాను పరిచయం చేశాడు. వీరు ముగ్గురూ బాబాను నిత్యం దర్శించి బాబాకు చిన్న చిన్న నిత్యావసర వస్తువులు సమకూరుస్తుండేవారు. బాబా గురించి విని అప్పాకోతే పాటిల్ సతీసమేతంగా ఒకసారి బాబా దర్శనానికి వచ్చాడు. వారిని చూడగానే బాబా తమ ఆసనం నుండి లేచి, అప్పాకోతేను సాదరంగా ఆహ్వానించి, ఆయన భార్యతో, ***"అమ్మా! నీవు నిజంగా నా సోదరివి"*** అన్నారట. అప్పాకోతే భార్య బయజాబాయికి కూడా ఆ ప్రథమ దర్శనంతోనే బాబాపై ఎంతో భక్తివిశ్వాసాలు ఏర్పడి, రోజూ బాబాకు భిక్ష సమర్పించకుండా భోజనం చేయకూడదనే నియమం పెట్టుకుంది".

## బాబాకు ఆత్మబంధువు – సాయిభక్తికి సింధువు!

బాబా శిరిడీ వచ్చిన మొదటి రోజులలో ఆయనకు నిర్ణీత నివాసస్థలం ఉండేది కాదు. ఒక్కోసారి గ్రామంలో భిక్ష చేసేవారు. ఒక్కోరోజు ఊరి బయట పొలాల్లోకో, తోపులలోకో వెళ్ళి అక్కడే కూర్చుండిపొయ్యేవారు. బాబా భుజిస్తేగానీ తాను భోజనం చేయకూడదనే కఠిన నియమం తనకు తానే విధించుకొన్న బయజాబాయి, బాబా తమ ఇంటికి భిక్షకు రాని రోజులలో ఆయనను వెదకి పట్టుకొని భిక్ష పెట్టడానికి ఎన్నో అవస్థలు పడవలసివచ్చేది. మధ్యాహ్నం 12గం.ల వరకు చూచి, బాబా ఇంటికి రాకపోతే, తానే ఒక గంపలో రొట్టె, కూర పెట్టుకొని పొలాల వెంట తిరిగి ఆయనను

వెదకి పట్టుకొని భక్తి శ్రద్ధలతో భోజనం పెట్టేది. కొంతకాలం తరువాత బయజాబాయికి శ్రమ తప్పించడానికా అన్నట్లు బాబా మసీదులోనే భోజనం చేసేవారు.

శిరిడీ వచ్చిన మొదటి రోజులలో అనికేతుడయిన శ్రీసాయి నివాసాన్ని గూర్చి ప్రస్తావిస్తూ, శ్రీతాత్యాకోతే పాటిల్ తమ స్మృతులలో ఇలా అంటారు: "మొదట శిరిడీ వచ్చినపుడు బాబా ఒక ఆకుపచ్చటి కఫ్నీ, ఆకుపచ్చ తలకట్టు ధరించేవారు. అలా నాలుగు మాసాలున్నాక ఆయన తెల్లటి తలకట్టు ధరించనారంభించారు. బాబా శిరిడీ వచ్చిన క్రొత్తలలో ఆయనకొక నిర్ణీతమయిన నివాసమే ఉండేది కాదు. కొద్దినెలల తరువాత ఆయన మసీదులో సుమారు పదిమాసాలున్నారు. తరువాత ఆయన వేపచెట్టు క్రింద నివసించనారంభించారు. తర్వాత మళ్ళీ తమ మకాము మసీదుకు మార్చారు. అలా రెండు మూడు సంవత్సరాలు మసీదులోనే ఉండి తమ నివాసాన్ని లెండీ-శీర అనే వాగుల మధ్యనున్న చెట్లతోపులలోకి మార్చారు. అక్కడ నిత్యము ఎవరో భక్తులు ఆయనకు భిక్ష ఏర్పాటు చేసేవారు. ఆ తోపులలో సుమారు రెండున్నరఏళ్ళపాటు ఉండి, మరల తమ మకాము మసీదుకు మార్చి, మహాసమాధి పర్యంతం అక్కడే ఉండిపోయారు".

బాబా శిరిడీ గ్రామంలో అందరి ఇళ్ళకు భిక్షకు వెళ్ళేవారు కాదు. పాటిల్‌బువా వామన్ గోండ్కర్, నందరామ్ మార్వాడీ, గణపతి కోతే, సఖారాం షెల్కే ఇళ్ళ వద్దనే భిక్ష చేసేవారు. ఎడమ భుజానికి జోలె, కుడిచేతిలో ఒక రేకు డబ్బా తీసుకొని మొదట పాటిల్‌బువా గోండ్కర్ ఇంటికి వెళ్ళి, గుమ్మం ముందు నిలుచుని, ***"ఆంగో రాధా భాకర్!"*** అని ఖంగుమనే కంఠంతో కేకవేసేవారు. ఆ తరువాత నందరామ్ మార్వాడీ ఇంటి గుమ్మం ముందు నిలుచుని ***"నందే దేఖోరే, భాకర్ లావ్!"*** అని కేకేసేవారు. అక్కడ నుండి గణపతిరావ్ కోతే (బయజాబాయి) ఇంటికి వెళ్ళి, ***"ఆబాదే ఆబాద్, బయజామాయి రోటీ లావ్!"*** అనేవారు. అలాగే సఖారామ్ ఇంటివద్ద, ***"ఇత్లాయీబాయీ, రోటీ లావ్!'*** అని కేకవేసి భిక్ష అడిగేవారు. ఈ ఇండ్లకు బాబా ఒక్కోసారి రోజుకు రెండుమూడుసార్లు కూడా భిక్షకు వెళ్ళేవారు. బాబా శిరిడీ చేరిన సుమారు రెండు సంవత్సరాలకు ఆ ప్రాంతంలో పెద్ద కరువు వచ్చింది. ఆ కరువు కాలంలో మాత్రం ధనికుడయిన నందూరామ్ మార్వాడీ ఇంటికి, తాత్యాపాటిల్ ఇంటికి మాత్రమే బాబా భిక్షకు వెళ్ళేవారు. బాబా ఎవరింటికి వెళ్ళినా వీధిగుమ్మం

ముందు నిలుచుని భిక్ష స్వీకరించేవారే కానీ, ఎప్పుడూ ఏ గృహస్థుల ఇంటిలో అడుగుపెట్టలేదు. బయజాబాయి బాబా భిక్షకు వచ్చినప్పుడల్లా, ఇంటిలోకి రమ్మని సాదరంగా ఆహ్వానించేది. బాబా ఎప్పుడయినా వారి ఇంటి గుమ్మం ముందున్న పంచలో మాత్రం కూర్చునేవారు. బయజాబాయి బాబాను వారింట్లోనే కూర్చుని తన కళ్ళ ఎదుట రెండు ముద్దలయినా తినివెళ్ళమని బ్రతిమిలాడుకొనేది. బాబా మాత్రం ఆయనకు తోచినట్లు చేసేవారు. ఎప్పుడయినా అరుదుగా బుద్ధిపుడితే వారి ఇంటి పంచలోనే భోజనం చేసి వెళ్ళేవారు. అటువంటి సందర్భాలలో బయజాబాయి ఆనందానికి మేర ఉండేదికాదు. "ఇంకొంచెం తిను! ఇంకొంచెం....." అంటూ బ్రతిమిలాడి తినిపించి, "ఏమైనా త్రాగడానికి తీసుకో!" అనేది ప్రీతిగా. సామాన్యంగా ఆయన భాకరి (సజ్జరొట్టె), కూర మాత్రం భుజించేవారు. ఎప్పుడయినా పాలు, పెరుగు, మజ్జిగ, ఊరగాయ, ఉల్లిపాయ, అప్పడం అడిగి ప్రీతిగా తినేవారు. అందుకని, బయజాబాయి వాటిని తాజాగా తయారుచేసి సిద్ధంగా ఉంచుకొనేది.

### బయజాబాయి పండరి యాత్ర!

అలా బాబాను ఎంతో ఆత్మీయతతో, అచంచల భక్తిశ్రద్ధలతో సేవించిన బయజాబాయికి బాబా వివిధ సందర్భాలలో ఏమి బోధించారో, ఆమెకు కలిగిన దివ్యానుభూతులేమిటో వివరంగా గ్రంథస్థం కాకపోవడం సాయిభక్తుల దురదృష్టమే. శ్రీతాత్యా తమ స్మృతులలో తన తల్లి బయజాబాయికి సంబంధించిన ఒక సంఘటనను ఇలా ప్రస్తావించాడు: "రాధాకృష్ణ ఆయి మొదట పండరిపూరులో ఉండి, ఆ తర్వాత శిరిడీ వచ్చింది. ఒకసారి ఆమె శిరిడీ నుండి పండరిపూరుకు పాదయాత్ర చేయాలనుకుంది. ఆమెతోపాటు బాలాషింపీ, మాధవ్‌ఫస్లే కూడా బయలుదేరారు. ఆషాఢ ఏకాదశికి పండరిలో జరిగే పూజలలో పాల్గొనాలని వారి ఉద్దేశ్యం. ఈ విషయం తెలిసి మా అమ్మ (బయజాబాయి), నేను, మరికొందరు గ్రామస్థులు కూడా పండరి వెళ్ళాలనుకొన్నాం. ముందే బయలుదేరి వెళ్ళిన రాధాకృష్ణఆయి బృందాన్ని బండ్లలో అహ్మద్‌నగర్ వెళ్ళి కలుసుకొని, అక్కడ నుండి అందరం కాలినడకన పండరి చేరాలని అనుకొన్నాము. మా అమ్మ, బావ, లక్ష్మీబాయి షిండే, మరి నలుగురైదుగురు స్త్రీలు ప్రయాణానికి సిద్ధమైనారు.

బయలుదేరడానికి ముందు మేమంతా బాబా దర్శనం చేసుకొని, ఆయన ఆశీస్సులు తీసుకోవడానికి మసీదుకు వెళ్ళాము. బాబా ఆశీర్వదించి ఊదీ ఇచ్చారు. మా సామానులతో మూడు బండ్లు గ్రామబావి వద్ద చెట్టు క్రింద బయలుదేరడానికి సిద్ధంగా ఉన్నాయి. నేను మా యాత్ర నిర్విఘ్నంగా జరగడానికి మారుతి ఆలయంలో టెంకాయ కొట్టి, అటునుండి శని ఆలయానికి వెళ్ళాను. మాకు వీడ్కోలు చెప్పడానికి సుమారు 50మంది గ్రామస్థులు చెట్టుక్రింద నిలబడి ఉన్నారు. నేను శని ఆలయానికి పోతూ దారిలో ఈనాడు బాబా సమాధి మందిరమున్న జాగాలో బాబా నిలుచుని ఉండడం చూచి ఆశ్చర్యపోయాను. నేను శని మందిరంలో టెంకాయ కొట్టి బయటకు వచ్చేసరికి కొండ్యాజీ అనే ముస్లిం సోదరుడు వచ్చి నన్ను బాబా పిలుస్తున్నారని చెప్పాడు. నేను బాబా నిలబడివున్న చోటుకి వెళ్ళాను. బాబా నన్ను మసీదుకు తీసుకెళ్ళారు. అక్కడున్న వారిలో కొందరు నాతో మసీదుకొస్తే, మరికొందరు చెట్టు క్రింద వేచివున్నారు. బాబా తన యథాస్థానంలో కూర్చుని ఉన్నారు. నేను బాబా ప్రక్కన ఉన్న కటకటాల దగ్గర, నా ఎదుట మాధవరావు దేశ్‌పాండే (షామా) కూర్చున్నాము. మాధవరావు చిలుం వెలిగించి బాబాకందించాడు. బాబా చిలుం పీలుస్తూ కూర్చున్నారు. అంతా మౌనంగా కూర్చున్నాము. చివరికి కొంతసేపైనాక మాధవరావు బాబాతో "దేవా! మీ బయజాబాయి వాళ్ళంతా ఇతడి కోసం అక్కడ వేచియున్నారు. పండరి యాత్రకి బయలుదేరడానికి అంతా సిద్ధంగా ఉన్నారు" అన్నాడు. అప్పుడు బాబా ***"బయజాబాయిని ఇటు పిలవండి!"*** అన్నారు. మా అమ్మ హడావుడిగా వచ్చి, ఆతురతగా, "బాబా, ఏమిటి పిలిచారట? ప్రొద్దుగ్రుంకుతోంది. అందరూ బయల్దేరడానికి సిద్ధంగా ఉన్నారు" అన్నది. బాబా ప్రశాంతంగా, ***"మాయీ, నీవు ఇంటికెళ్ళు! ఇవాళ బయలుదేరవద్దు. రేపు కూడా వద్దు! ఎల్లుండి ప్రయాణంకా! ఎందుకు, ఏమిటని అడగకు! ఈ విషయంలో ఎవ్వరినీ సంప్రదించనక్కరలేదు. ఇదిగో, ఊదీ తీసుకో!"*** అన్నారు. మా అమ్మ మరో ఆలోచన లేకుండా, "సరే బాబా! మీరు చెప్పినట్లు ఎల్లుండే వెళ్తాము" అన్నది. సర్దిన సామానంతా దింపి, బండ్లను వెనక్కు పంపేశాము. ప్రయాణం రద్దవడంతో మమ్మల్ని సాగనంపడానికొచ్చిన బంధుమిత్రులంతా వెనక్కి వెళ్ళిపోయారు. ఆ తర్వాత మాధవరావు పంచాంగం చూచి, ఆ రోజు ప్రయాణానికి మంచిరోజు కాదని చెప్పాడు.

మూడవరోజు ఉదయమే మేము మళ్ళీ ప్రయాణానికి సిద్ధమైనాము. బాబా ఉత్సాహంగా ప్రతి ఒక్కరికీ ఊదీ ఇచ్చి, రోడ్డు వరకు వచ్చి మమ్మి సాగనంపారు. మేము అనుకొన్న ప్రకారం పుంతంబా చేరి స్నానాలు, అల్పాహారం పూర్తి చేసుకొని, రైలెక్కి ఉదయం 8 గం.లకు బేలాపూరు చేరాము. 9 గం.లకు రాధాకృష్ణఆయి బృందాన్ని కలుసుకొన్నాము. భోజన సమయానికి నరసింగ్‌పూర్ చేరి, శ్రీనరసింగ మహరాజ్ దర్శనం చేసుకొన్నాము. అక్కడనుండి బయలుదేరి మరుసటిరోజు సాయంత్రానికి పండరిపురం చేరాము. పండరిపురంలో ఏకాదశినాడే కలరా చెలరేగింది. ద్వాదశి నాటికి బాగా విజృంభించింది. మా బృందంలోని వారంతా భయపడిపోయి శిరిడీ తిరిగి వెళ్ళిపోతామని తొందరపడసాగారు. నేను మాత్రం ఏదేమయినా పూర్ణిమ వరకు అక్కడే ఉందామని పట్టుబట్టాను. మా అమ్మ కూడా భయపడిపోయి అక్కడే మమల్తదారుగా చేస్తున్న నానాసాహెబ్ చందోర్కర్‌ను కలిసి, వెంటనే శిరిడీ తిరిగి వెళ్ళడానికి నన్ను ఒప్పించమని కోరింది. నానాసాహెబ్ నాకు, బాలాషింపీకు కబురుపెట్టి పిలిపించి, వెంటనే శిరిడీ వెళ్ళమని సలహా ఇచ్చాడు. సర్వజ్ఞుడయిన బాబాకు పండరిపురంలో కలరా చెలరేగుతుందని ముందే తెలుసు. కానీ, మా ఉత్సాహం చూచి యాత్ర మాన్పించలేకపోయారు!"

## సాయిభక్తులపై పంచాంగాల పట్టు . . .
## శరణాగతి పథం నుండి బయటకు నెట్టు


స్థూలంగా చూస్తే ఎంతో చిన్నదిగా కనిపించినా, శ్రీసాయితత్త్వవిచారం దృష్ట్యా ముఖ్యమైన అంశం ఒకటి ఈ సంఘటనలో ఇమిడి ఉంది! ***"నా చర్యలు అత్యంత అగాధాలు!"*** అని బాబానే ఒకసారి సెలవిచ్చారు. అటువంటి అగాధమయిన శ్రీసాయి చర్యలను ఆయన బోధించిన తత్త్వానికి సమన్వయించుకొని అవగాహన చేసుకోవడానికి "ప్రయత్నించడం" సాధనలో అవసరం. కానీ, శ్రీసాయి చర్యలకు జ్యోతిషం, వాస్తు మొ॥న శాస్త్రాల వెలుగులో కారణాలు వెతకబూనడం కేవలం అజ్ఞానమవుతుంది. అంతా సిద్ధమై ప్రయాణం కాబోయే ముందు బయజాబాయి పండరియాత్రను బాబా వాయిదా వెయ్యమన్నారు. మారు పలకకుండా మరో ఆలోచన లేకుండా బయజాబాయి ప్రయాణం మానుకొన్నది. బాబా మాటపై ఆమెకు గల

అచంచల భక్తివిశ్వాసాలకు అది తార్కాణం. ఆ శరణాగతి తత్త్వమే తమ మాటల ద్వారా, చేతలద్వారా బాబా మనకు ప్రబోధించినదీ, నేర్పదలచినదీ! అదీ సాయి భక్తులు సాధించవలసినది. బయజాబాయి ప్రయాణం హఠాత్తుగా మాన్పించడానికి కారణాలు వెతకబూని పంచాంగం చూచి, ఆ రోజు మంచి రోజు కాదనీ, అందుకనే బాబా ప్రయాణం ఆపుచేశారని తేల్చి చెప్పాడు షామా! షామా మాటలను ఆధారం చేసుకొని ప్రయాణాది కార్యాలకు పంచాంగం ప్రకారం మంచిరోజు అదీ చూచుకొని ప్రారంభించడాన్ని బాబా పరోక్షంగా ప్రోత్సహించారని (లేదా అంగీకరించారనీ) కొందరు అనాలోచితంగా అనుకొనే అవకాశముంది. కొంచెం ఆలోచిస్తే ఈ అభిప్రాయం ఎంత అసంబద్ధమో ఇట్టే బోధపడుతుంది. బయజాబాయి ప్రయాణం బాబా వాయిదా వెయ్యడానికి ఆ రోజు మంచిరోజు కాదనేదే కారణమైతే, ఆ మాట చెప్పడానికి అరగంట ముందు ఆ యాత్రాబృందానికి ఊదీ ఇచ్చి వెళ్ళి రమ్మని ఎందుకు ఆశీర్వదించారు? అది మంచిరోజు కాదనే విషయం ఒక అరగంట ముందు బాబాకు తెలియదా? తరువాత తన నిర్ణయాన్ని పంచాంగంతో ముడిబెడతారని తెలిసే కాబోలు సర్వజ్ఞుడయిన సాయి *"ఈ విషయంలో ఎవ్వరినీ సంప్రదించకు!"* అని ఖచ్చితంగా నిషేధించారు. అంటే పరోక్షంగా బాబా – తమ సహజరీతిలో – పంచాంగాన్ని సంప్రదించడాన్ని నిషేధించినట్లే! అయితే, తాత్యా భావించినట్లు పండరిలో కలరా ప్రబలుతుంది గనుక బాబా అలా ప్రయాణం వాయిదా వెయ్యమన్నారనడం కూడా 'పూర్తిగా' సరిపోదు! అదే కారణమైతే, ఎన్నో సందర్భాలలో ఇతర భక్తులకు చెప్పినట్లు స్పష్టంగా ప్రయాణమే వద్దని చెప్పి ఉండేవారు. అంతేగాక, అదే కారణమైతే, బయజాబాయికి పెట్టిన ఆటంకాలేవీ, అంతకుముందే పండరి ప్రయాణమైన రాధాకృష్ణఆయి బృందానికి బాబా పెట్టలేదు కదా? మరి, బాబా అలా ఎందుకు చేసినట్లు? ఆయన చర్యల వెనుకనున్న ఆంతర్యం ఆయనకే ఎఱుక! "అగాధ తవ కరణీ" అని సాయిని ఆరతికారుడు కీర్తించినట్లు, బాబా చర్యలు అగాధాలు, అనూహ్యాలు!

సాయి చరిత్రలో, సాయిభక్తుల శ్రేణిలో సమున్నత స్థానాన్ని అలంకరిస్తున్న శ్రీమతి బయజాబాయి సుమారు 1910లో పరమపదించింది. ఆమె భర్త శ్రీగణపతికోతే పాటిల్ అంతకు కొన్నేళ్ళ ముందే దివంగతుడయ్యాడు. సుమారు 60 సంవత్సరాల

పాటు నిత్యం బాబా భిక్ష చేసిన బయజాబాయి గృహాన్ని శిరిడీ సందర్శించే సాయి భక్తులు దర్శించాలని ఉబలాటపడటం సహజం. బయజాబాయి కుటుంబం మొదట చావడికి తూర్పుకు వెళ్ళే వీధిలో ప్రస్తుతం ఇచ్ఛ్‌రాజ్ హోటల్ సమీపంలో కాపురముండేవారు. తర్వాత ఆ ఇంటిని అమ్మివేసి, మహాలక్ష్మి మందిరం సమీపంలో ప్రస్తుతమున్న పిల్‌గ్రిమ్స్ ఇన్ హోటల్ వెనుక క్రొత్త ఇల్లు నిర్మించుకొని నివసించారు. ఇప్పుడు ఆ ఇంటి జాగాలోనే బయజాబాయి గెస్ట్ హౌస్ అనే హోటల్ ఉంది. బాబా ఆ రెండు ఇళ్ళ వద్దకు భిక్షకు వెళ్ళేవారు.





* నానావలీ ఒరిజినల్ ఫోటో అలభ్యంగా ఉన్నందువలన, నానావలీ ఫోటో స్థానంలో శ్రీసాయిబాబా ఫోటో ప్రచురించబడినది.

# నానావలీ

శిరిడీకి బాబాను దర్శించడానికి వచ్చే సన్నిహిత భక్తుల మనస్సులలో శ్రీసాయిఫకీర్ పట్ల భక్తి ప్రపత్తులతోబాటు, నానావలీఫకీర్ అనే మరో భక్తునిపట్ల 'ఫికర్' కూడా ఉండేది. ఈ నానావలీ ఫకీర్ ఎప్పుడు ఏమిచేస్తాడో, ఎవరి మీద దాడి చేస్తాడో తెలిసేది కాదు. అతడు చేసే విచిత్రచర్యలకు అంతుండేది కాదు. పిచ్చిపనుల్లో పారంగతుడుగా కనిపించేవాడు. అతడు చేసేవి పిచ్చిపనులైనా అతడు మాత్రం 'పిచ్చివాడు' కాదనీ, బాబా అతనితో వ్యవహరించే తీరే దానికి నిదర్శనమనీ, అతడు గొప్ప ఔలియా (అవధూత) అనీ– కొందరు భక్తుల ప్రగాఢ విశ్వాసం. కొందరు ప్రముఖ సాయిభక్తులు ఈ నానావలీకి భయపడి – నానావలీ జీవించినంతకాలం అసలు శిరిడీకే రాకుండా పోయిన సందర్భాలు కూడా ఉన్నాయి. శ్రీసాయిచరిత్ర పరిశీలిస్తే, నానావలీ శ్రీసాయిభక్తి సామ్రాజ్యంలో శిరిడీ దుర్గానికి రక్షణాధికారిగా కనిపిస్తాడు.

నానావలీ మహా మొరటు మనిషి. ఈ ప్రపంచంలో – ఒక్క బాబాను తప్ప – మరెవ్వరినీ లెక్కచేసేవాడు కాదు. భయమనేమాట మచ్చుకు కూడా అతనిలో కనిపించేది కాదు.

నిఖార్సయిన ఫకీరు జీవితం – అవినీతిపై దౌర్జన్యం చెయ్యడమనే ఒక్క విషయం తప్ప – గడిపిన నానావలీ, బాబా దర్శనానికొచ్చే భక్తులలో దంభం అవినీతి మొ॥ దుర్గుణాలు కనిపిస్తే ఏమాత్రం సహించేవాడు కాదు. వారి మనసుల మడతల మాటున దాగివున్న వాంఛలు, వాసనలు ఎలా పసిగట్టేవాడో కానీ, స్వచ్ఛమైన భక్తిభావం తప్ప మరే ఇతర దుర్భావనలు మనసులో ఉంచుకొని బాబాను దర్శించే వారి మీద

విరుచుకుపడేవాడు. వారి దుర్గుణాలకు, చెడ్డకర్మలకు ఫలితం ఎప్పుడో భవిష్యత్తులో వస్తుందనే భయంకన్నా, కొందరు భక్తులకు ప్రస్తుతంలో నానావలీ చేసే రౌడీయిజమే రౌరవాది నరకాల్లా తోచేవి.

అంతేకాదు తరచూ, "నా మామను (బాబాను) కాపాడుకోవడమే నా పని!" అంటూ తనను తాను బాబాకు అంగరక్షకుడిగా ప్రకటించుకొనేవాడు. సాయిభక్తులలో ఎవరైనా తమ నైతిక ప్రవర్తనలో – ముఖ్యంగా స్త్రీ సంబంధమైన విషయాల్లో తప్పు చేస్తే వారివల్ల బాబాకు చెడ్డపేరు వస్తుందని భావించి అటువంటి వారిపై కత్తిగట్టి వేధించి, బాధించేవాడు.

## బాబా అతని ప్రాణానికి ప్రాణం! దానికి అతడే ప్రమాణం!

బాబాను దర్శించడానికొచ్చే భక్తులలో దంభం, దర్పం, అట్టహాసం, కపటం వంటి గుణాలు ఉంటే సహించలేకపోయేవాడు. అందుకేనేమో, ఏ కల్లాకపటం తెలియని పిల్లలను పోగేసుకొని వారితో కలిసిపోయి చిన్నపిల్లాడిలా ఆడుకొనేవాడు. ఎవరైనా ధనికభక్తులు ఆడంబరమైన వేషంలో అట్టహాసంగా బాబాను దర్శించడానికి వచ్చారని తెలియగానే ఒక గాడిదను పట్టుకొని, దాని వీపున ఒక శాలువా కప్పి, నెత్తిన టోపీపెట్టి, పిల్లాజెల్లాతో కలిసి మసీదు చేరేవాడు. బాబా అతణ్ణి చూసి ***"ఏమిరా! ఏమిటిలా వచ్చావ్!"*** అని అడిగితే, అతడు తాను తోలుకొచ్చిన గాడిదను చూపుతూ, "ఈ శ్రీమంతుడు ఒక పిచ్చి ఫకీరును చూడడానికి మన ఊరొచ్చాడు!" అనేవాడు నవ్వుతూ. అతని మాటకు పిల్లాజెల్లా, అక్కడున్న భక్తులు అందరూ గొల్లున నవ్వేవారు. ఆ వచ్చిన ధనికుని ముఖం అవమానంతో మాడిపోయేది. "ఏమిటిది నానావలీ? ఏమిటీ ఆగడం?" అని ఎవరైనా భక్తులు ధైర్యం చేసి మందలించబోతే, "నిజమే! నేను చేసేది ఆగడమే! కానీ, చూడండి! ఎంత ముస్తాబు చేసినా, ఈ అలంకారాలేవీ తనవికావని ఈ జీవికి(గాడిదకు) తెలుసు. మళ్ళీ మసీదులోని మా సాయిఫకీరుకే తెలుసు. వీరిని చూచైనా మనకు బుద్ధిరాదు!" అనేవాడు. పిల్లలు ఆకతాయి పనులు చేస్తుంటే, పెద్దలు కళ్ళతోనే మందలించినట్లు, బాబా అతనివైపు మందలింపుగా చూచేవారు. అంతటితో బుద్ధిమంతుడైన పిల్లాడిలా నానావలీ కిక్కురుమనకుండా అక్కణ్ణుండి జారుకొనేవాడు.

## సర్వజీవరక్షకుడైన సాయికే మరో రక్షకుడా?!

ఒకసారి ఒక సన్యాసి ఒక స్త్రీని వెంటబెట్టుకొని శిరిడీ వచ్చాడు. ఆ స్త్రీ అతనికేం కావాలో ఎవ్వరికీ తెలియదు. అతని శిష్యురాలని అందరూ అనుకొన్నారు. కానీ, సన్యాసాశ్రమ ధర్మం ప్రకారం సన్యాసి తన తల్లితో తప్ప మరే ఇతర స్త్రీతోనూ నివసించకూడదు, ప్రయాణించకూడదు, ఒంటరిగా సంభాషించకూడదు. కానీ ఆ నియమాన్ని పాటించే సాధువులుగాని, ఆ నియమోల్లంఘనను పట్టించుకొనే భక్తులుగానీ సామాన్యంగా కనిపించరు. ఎవరు పట్టించుకొన్నా పట్టించుకోకపోయినా నానావలీ పట్టించుకోక మానడు కదా? ఆ సన్యాసి మీద, అతనితో వచ్చిన యువతి మీద విరుచుకపడ్డాడు. ఆ స్త్రీని బసనుండి బయటికి రాకుండా తలుపుకు గొళ్ళెం పెట్టాడు. ఆ సన్యాసిని శిరిడీ నుండి తరిమికొట్టాడు. అలా ఆ స్త్రీని ఒక వారంరోజులపాటు తిండీతిప్పలు లేకుండా ఆ గదిలోనే బంధించి ఆ తరువాతే ఆమెను విడుదల చేసి ఇంటికి పొమ్మని గట్టిగా మందలించి, వదిలేశాడు. ఆ తరువాత కొద్దిరోజులకు తెలిసింది ఆ సన్యాసి ఆమెను రహస్యంగా లేవదీసుకొని శిరిడీకి వచ్చాడని!

నానావలీకి వెరపెరుగని వెఱ్ఱి ధైర్యం. తరచూ తేళ్ళు, మండ్రగబ్బలు, కాళ్ళ జెఱ్ఱులు, కప్పలు, బల్లులు, ఎలుకలు మొ॥న జీవులను చేత్తో పట్టుకొనో, వంటిమీద వేసుకొనో, లేకపోతే వాటిని నోట్లో పెట్టుకొని, అవి నలిగి చనిపోకుండా జాగ్రత్త పడుతూ, వీధుల వెంట తిరుగుతుండేవాడు. ఎటువంటి పాము కనిపించినా చటుక్కున పట్టుకొని తన దుస్తులలో దోపుకొనేవాడు. అదేమి చిత్రమోగాని ఆ విష జంతువుల వల్ల అతనికెలాంటి హానీ కలిగేదికాదు. అంతేకాదు అతడూ వాటికెలాంటి హానీ చేసేవాడుకాదు. పైన చెప్పిన విధంగా సరదాగా వాటితో కొంతసేపు వినోదించి ఎక్కడో వదలిపెట్టేసేవాడు. కానీ ఆ విషజంతువులను వంటిమీద వేసుకొని అతను ఊర్లో వీధులమ్మట తిరుగుతూ ఉంటే చూచిన జనం భయంతో హడలిపొయ్యేవారు. చాలామంది అతడికి అతీతశక్తులున్నాయనీ, అతడొక మంత్రవేత్త అనీ నమ్మేవారు. ఆ కారణంగా అతని జోలికెవ్వరూ వెళ్ళేవారు కాదు.

కొందరు భక్తుల్లో నానావలీకి ఏం దోషం కనిపిస్తుందో తెలియదుగానీ, మసీదు బయట పొంచి ఉండి వారు బయటకు రాగానే పైబడి కొట్టేవాడు. వారు "ఎందుకు కొడతావ్?" అని అడిగితే, నానావలీ "ఎందుకో పోయి బాబా నడుగు!"

అని తాపీగా సమాధానమిచ్చి వెళ్ళిపోయేవాడు. ఆ భక్తులు బాబా దగ్గరకెళ్ళి జరిగిన విషయం చెప్పి, నానావలీపై ఫిర్యాదు చేస్తే, బాబా, ***"అలా చేశాడా? అతనితో కొంచెం జాగ్రత్తగా ఉండండి"*** అని ఓదార్పుగా అనేవారేగానీ నానావలీని ఏమాత్రం మందలించేవారు కారు!

నానావలీ దాడి ఊరకే చిన్నాచితకా వ్యక్తులపైనో లేక అనామక సాధు సన్యాసుల పైననో ఉండేదా?– అంటే ఎంతమాత్రం కాదు. నానావలీ 'బాధితుల' జాబితాలో శ్రీహెచ్.వి.సాఠే, శ్రీఉపాసనీబాబా మహరాజ్ వంటి అత్యంత ప్రముఖ సాయిభక్తులూ ఉన్నారు!

బాబాను అత్యంత సన్నిహితంగా సేవించిన ప్రముఖ భక్తుల్లో శ్రీహరివినాయక్ సాఠే ఒకరు. ఈయన ఆనాటి బ్రిటిష్ ప్రభుత్వంలో డిప్యూటీ కలెక్టరుగా పనిచేశారు. శిరిడీలోనే స్థిరపడాలనే సంకల్పంతో గురుస్థాన్ వేపచెట్టు ప్రక్కన స్థలం కొనుగోలుచేసి ఇల్లు కూడా కట్టించుకున్నాడు. అదే శ్రీసాయిచరిత్ర చదివిన వారికి సుపరిచితమైన సాఠేవాడా. ఏ కారణంచేతనో (స్పష్టంగా తెలియడంలేదు) గానీ, నానావలీకి సాఠే అంటే సుతారమూ గిట్టేదికాదు. తరచూ అతనిపై దాడిచేసి అవమానించేవాడు. సాఠే ఇక భరించలేక ఒకసారి "ఇక మీదట శిరిడీలో నేనుగానీ నానావలీగానీ ఒక్కరే ఉండాలి!" అని పంతంతో శపథం కూడా చేశాడు. ఆ తరువాత ఏం జరిగిందో శ్రీసాఠే మాటలలోనే చూద్దాం! శ్రీసాఠే బాబాతో తనకుగల అనుభవాలను గూర్చి చెబుతూ, ఇలా అన్నారు:

"బాబా సర్వరాజలాంఛనాలతో మసీదు నుండి చావడికి బయలుదేరేటప్పుడు నేను బాబా దర్బారు యొక్క రాజచిహ్నాన్ని (ధ్వజాన్ని) పట్టుకొని బాబా ముందు నడిచేవాడిని. అంతటి విశిష్టమయిన సేవ నాకు లభించిందని చాలామందికి నాపై అసూయగా ఉండేది. వాళ్ళు, శిరిడీ గ్రామస్థులు కూడబలుక్కుని నానావలీని నాపై ఉసిగొల్పి, నన్ను తరిమెయ్యాలని కుట్రపన్నారు. ఒకసారి చావడి ఉత్సవంలో నేను బాబా దర్బారు లాంఛనధ్వజాన్ని పట్టుకొని బాబా ముందు నడుస్తున్నాను. ఇంతలో హఠాత్తుగా నానావలీ నా మీదపడి ఒక గాజుపెంకుతో నా మెడ వెనుక గాయపరచాడు. ఆత్మరక్షణార్థం నేను అతణ్ణి రోడ్డు ప్రక్కనే పడివున్న ఒక కట్టెలమోపుపై త్రోసి కదలకుండా అదిమిపెట్టాను. అది చూచి బాబా, ***"సాహెబ్, అట్లా చెయ్యొద్దు! జాగ్రత్త!"***

అని కేకవేశారు. తరువాత శిరిడీలో గాలి నాకు ప్రతికూలంగా ఉందని గ్రహించి చాలా జాగ్రత్తగా మెలగడం మొదలెట్టాను. ఒకరోజు బాబాకు నైవేద్యం తీసికొని మసీదుకు బయలుదేరబోతున్నాను. ఇంతలో మా మామగారు (దాదాకేల్కర్) పరుగు పరుగున వచ్చి నన్ను మసీదుకెళ్ళవద్దనీ, అక్కడ మసీదు ద్వారం బయట నానావలీ నన్ను చంపడానికి ఒక గొడ్డలి చేతపట్టుకొని నిలబడి ఉన్నాడని చెప్పాడు. అంతే, నేను బాబావద్ద సెలవు కూడా తీసుకోకుండా అటునుండి అటే శిరిడీని శాశ్వతంగా వదలిపెట్టి వెళ్ళిపోయాను". మరో సందర్భంలో నానావలీ తనపై కక్ష కట్టడానికి గల కారణాన్ని వివరిస్తూ సాఠే ఇలా అన్నారు: "1915 డిసెంబరులో దక్షిణ భిక్ష సంస్థను స్థాపించాను. దానికి నేను అధ్యక్షుణ్ణి ... శిరిడీ సంస్థానం (ద.భి.స) ఆర్థిక సంబంధమైన వ్యవహారాలన్నీ నా స్వాధీనంలో ఉండడంతో నామీద అందరికీ శత్రుత్వం పెరిగి, నానావలీ ద్వారా నన్ను శిరిడీ నుండి తరిమేసి, ఆపై నాకు కోర్టుద్వారా నోటీసులు ఇవ్వడందాకా వెళ్ళింది". 1916లో స్వంత ఇల్లు, అన్నీ విడిచి శిరిడీ వదలివెళ్ళిన శ్రీసాఠే మళ్ళీ శిరిడీలో అడుగుపెట్టడానికి సాహసించలేదు. డిప్యూటీ కలెక్టరు హోదాలో పనిచేస్తూ అధికారం, హంగు, డబ్బు దస్కం కలిగిన శ్రీసాఠే వంటి ఉన్నత ప్రభుత్వాధికారే అలా నానావలీని, అతనికి శిరిడీ గ్రామంలో ఉండే పలుకుబడిని, బలాన్ని చూచి భయపడ్డాడంటే, ఇక సామాన్యుల సంగతి చెప్పాలా?

ఇక ఉపాసనీబాబా మహరాజ్ విషయానికొస్తే ఆయన నానావలీ వల్ల పడిన బాధలు అంతా ఇంత అని చెప్పనలవి కాదు. శ్రీఉపాసనీ శిరిడీకి వచ్చిన క్రొత్తలో నానావలీ పెద్దగా ఉపాసనీ అంటే పట్టించుకోలేదు. కానీ, కొంతకాలం గడిచి, శ్రీఉపాసనీ వద్దకు భక్తులు, భక్తురాళ్ళు రావడం, పాదపూజ చేయడం మొదలైన తరువాత నానావలీ దృష్టి ఉపాసనీ మీదకు మళ్ళింది. ఇక శ్రీఉపాసనీని హింసించి వేధించడమే తన నిత్యకృత్యమైనట్లు ప్రవర్తించేవాడు. ఏ సమయంలో పడితే ఆ సమయంలో ఖండోబా ఆలయం తలుపులు తట్టి, శ్రీఉపాసనీ నిద్రపోతున్నా లేపి ఎడాపెడా కొట్టేవాడు. అక్కడెవరైనా భక్తులు శ్రీఉపాసనీ దర్శనం కోసం వచ్చి ఉంటే వారిని తరిమికొట్టేవాడు. పెంట, పేడ తెచ్చి ఉపాసనీ ప్రక్కన వేసి, ఆ అశుద్ధాన్ని ఉపాసనీ ఒంటిమీద వేసి పులిమేవాడు. శ్రీసాయి, ఇతర భక్తులందరూ చూస్తుండగనే శ్రీఉపాసనీ దుస్తులు ఊడదీసి నగ్నంగా నిలబెట్టాడు. ఒక్కోసారి నానావలీ బలవంతంగా ఉపాసనీ

చేత మోకాళ్ళు చచ్చుబడి కీళ్ళు వాచేదాకా గుంజిళ్ళు తీయించేవాడు. మరోసారి ఉపాసనీని మహా అవమానకరంగా బండబూతులు తిట్టేవాడు. ఒకసారి నానావలీకీ భయపడి శ్రీఉపాసనీ ఖండోబా గుడి సమీపంలో ఒక నిలువెత్తు గొయ్యి త్రవ్వి ఎవ్వరూ తనను సమీపించకుండా పైన ముళ్ళకంప వేసుకొని దాన్లో పడుకొన్నాడు. నానావలీ ఎలాగో వెతికి పట్టుకొని, ఓపిగ్గా ఆ ముళ్ళకంపనంతా తీసి, ఉపాసనీని బయటకీడ్చి, ఒళ్ళు హూనమయ్యేలా ఎడాపెడా కొట్టి తాపీగా తన దారిన తాను మరలివెళ్ళాడు. ఉపాసనీ వెళ్ళి ఈ బాధలను గూర్చి బాబాతో మొరపెట్టుకొంటే, బాబా అతణ్ణి ఓదార్చి నానావలీ పట్ల జాగ్రత్తగా ఉండమని హితవు చెప్పి పంపేవారు కానీ నానావలీని మాత్రం మందలించేవారు కాదు.

తమను ఇంతగా హింసించినా శ్రీసాఠేగానీ, శ్రీఉపాసనీ మహరాజ్‌గానీ ఆ తరువాతైనా నానావలీ గుణశీలాలను నిందిస్తూ మాట్లాడలేకపోవడం ఇక్కడ గమనార్హం. అంతేకాదు! నానావలీ దౌర్జన్యపూరితమైన ప్రవర్తనపట్ల బాబా వహించిన ఉపేక్షాభావాన్ని కూడా ఆయా భక్తులు 'ఎందుకో' తప్పుపట్టి నిందించకపోవడం కూడా గమనించవలసిన విశేషం.

నానావలీ ప్రవర్తన పట్ల ఎవ్వరూ నిర్దిష్టమైన ఆరోపణలు చెయ్యలేదనడం కూడా నిజంకాదు. నానావలీ చేత అవమానింపబడ్డ కొందరు వ్యక్తులు కోపర్‌గాంలోని పోలీసు అధికారులకు నానావలీపై రకరకాల అభియోగాలతో ఫిర్యాదు చేస్తూ కేసుపెట్టారు. అతడు స్త్రీలతో అసభ్యంగా ప్రవర్తిస్తున్నాడనీ, పూర్తి నగ్నంగా వీధుల్లో తిరుగుతాడనీ, తన ఇచ్ఛ వచ్చినట్లు రౌడీయిజం ప్రదర్శిస్తూ గ్రామప్రజలను, శ్రీసాయిని దర్శించవచ్చే భక్తులను భయభ్రాంతులను చేస్తున్నాడనీ – ఇలా ఎన్నో ఆరోపణలను చేశారు. ఆ ఫిర్యాదుపై పోలీసులు శిరిడీ వచ్చి నానావలీని ప్రశ్నించారు. దానికి నానావలీ "నన్నేమీ ప్రశ్న అడగాల్సిన అవసరంలేదు. నామీద చేయబడ్డ అభియోగాలనన్నింటినీ నేను ఒప్పుకుంటున్నాను. మీకు చేతనైన విధంగా శిక్షించుకోండి!" అన్నాడు. పోలీసులు అతణ్ణి అరెస్టుచేసి కోపర్‌గాం మేజిస్ట్రేటు ముందు హాజరుపరచడానికి బయలుదేరమన్నారు. అతడు దారిలో బాబా వద్దకెళ్ళి, నవ్వుతూ "నాకు అత్తవారింటి నుండి పిలుపొచ్చింది. వెళ్ళొస్తా!" అని చెప్పి, సంతోషంతో త్రుళ్ళుతూ పోలీసుల వెంట వెళ్ళాడు. కోపర్‌గాంలో అతణ్ణి ఒకరోజంతా

పోలీసుస్టేషన్లో కూర్చోబెట్టి జైలులో తోస్తామని బెదిరించారు. దానికతడు "ఆహాఁ! నిరభ్యంతరంగా జైల్లో పెట్టండి! ఎక్కడైతేనేం కూర్చునేదే గదా?" అని నిర్లక్ష్యంగా తాపీగా జవాబిచ్చాడు. మరుసటిరోజు కోర్టులో, "నీ తరఫున వాదించడానికి వకీలు ఎవరూ లేరా?" అని మేజిస్ట్రేటు ప్రశ్నిస్తే "స్వంత తెలివి లేకపోతే వకీలును పెట్టుకోవాలి! నాకా అవసరం లేదు. నా తరఫున నేనే మాట్లాడుతాను. అయినా, నేను నాపైన చేయబడ్డ అభియోగాలన్నింటినీ అంగీకరిస్తున్నాను గదా?" అని అన్నాడు. "అయితే ఇక నీవు చెప్పవలసింది, అడుగవలసింది ఇంకేమీ లేనట్లేనా?" అని అడిగాడు మేజిస్ట్రేటు. దానికి "నేను దిగంబరంగా అందరి ముందు తిరుగుతానని గదా వారంటున్నది? సరే అయితే నా మర్మేంద్రియాలపై వెంట్రుకలు పెరిగి ఉన్నాయో గొరిగేసి ఉన్నాయో చెప్పమనండి!" అన్నాడు నిర్లక్ష్యంగా నానావలీ. ఆ ప్రశ్నకు ఫిర్యాదుదారులు నిరుత్తరులయ్యారు. నానావలీ నిష్కపటమైన ప్రవర్తనను చూచి మేజిస్ట్రేటుకే అతనిపై ఆసక్తి కలిగి కేసును లోతుగా దర్యాప్తు చేశాడు. నానావలీపై చేయబడ్డ ఆరోపణలన్నీ నిరాధారమైనవిగా తేలడంతో, అతనిని విడుదల చేశారు.

బాబాకు నానావలీ వీరభక్తుడే అయినా వివేకాన్ని మాత్రం 'జయించకుండా' అట్టే పెట్టుకొన్నాడు. నానావలీకీ ఏ అట్టహాసాలు, ఆడంబరాలంటే గిట్టవో, అవన్నీ 1912–18 మధ్యకాలంలో బాబా దర్బారులో కూడా చేరాయి. బాబా కీర్తి నలుదిశలా ప్రాకింది. వేలాది భక్తులు బాబా దర్శనం కోసం చీమలబారుల్లా రాసాగారు. ఆరతులు, పూజలు, ఉత్సవాలు, ఛత్రచామరాది సమస్త రాజోపచారాలు బాబాసేవలో ప్రవేశపెట్టబడ్డాయి. సహజంగానే ఈ తంతంతా నానావలీకి సుతరామూ గిట్టేది కాదు. ఒకరోజు – ఈ ఆడంబరాలు బాబాలో కూడా ఏమైనా అహంకారాన్ని, దంభాన్ని కలిగించాయేమో తేల్చుకోవడానికో, తేల్చి ప్రపంచానికి తెలియజేయడానికోగానీ ఒకరోజు భక్తులతో క్రిక్కిరిసివున్న బాబా దర్బారు (మసీదు) లోనికి హఠాత్తుగా ప్రవేశించాడు. నేరుగా బాబా దగ్గరకెళ్ళి "లే అక్కణ్ణుంచి! నేను కూర్చోవాలి!" అన్నాడు. బాబా ఏ మాత్రం తొణక్కుండా వెంటనే తన 'గాదీ' (ఆసనం) పైనుండి లేచి ప్రక్కన నిలబడ్డారు. నానావలీ బాబా ఆసనంపై తాపీగా కూర్చొన్నాడు. అతని దుస్సాహసం చూచి భక్తులు నిర్ఘాంతపోయారు. తమ దైవానికి అపచారం చేయతలపెట్టిన నానావలీపై వారి కోపం కట్టలు త్రెంచుకొని ముందుకురకడానికి సిద్ధంగా ఉంది. కానీ

బాబా ముఖంలోని ప్రశాంతత, ప్రసన్నత వారి చేతులను, నాలుకలను కట్టిపడేసింది. అలా కొన్ని నిముషాలు బాబా గాదీపై కూర్చొని, 'శభాష్' అని కేకపెడ్తూ లేచి బాబాను తిరిగి ఆసనంపై కూర్చోమన్నాడు. బాబా తన ఆసనం అలంకరించగానే, ఆయన పాదాలకు సాగిలబడి మ్రొక్కి, ఉప్పొంగే ఆనందంతో గంతులేసుకుంటూ, అక్కణ్ణుండి నిష్క్రమించాడు. ఈ సంఘటనను గురించి బాబా ఆ తరువాత ఒక్క మాట కూడా మాట్లాడలేదు; ఆయన్ను అడిగే ధైర్యం ఎవరికీలేదు కానీ నానావలీ వద్ద ఎవరైనా ఈ విషయాన్ని గురించి ప్రస్తావిస్తే, "సాయిఫకీరు వంటి ఫకీరు మరెక్కడా ఉండబోరు!" అని గర్వంగా అనేవాడు తప్ప మరింకేం మాట్లాడేవాడు కాదు.

## గురువృష్టి గురికి గుర్తు నానావలీ

చిత్రమేమిటంటే శ్రీసాయిచరిత్రలోను, శిరిడీలోని శ్రీసాయిభక్తజన జీవితంలోనూ ఇంతటి విశిష్ట స్థానం గలిగిన ఈ విచిత్ర భక్తుని పుట్టుపూర్వోత్తరాల గురించి మనకు లభిస్తున్న వివరాలు సమగ్రంగా లేవు.

లభించిన వివరాలను స్థూలంగా వర్గీకరిస్తే, నానావలీ పుట్టుపూర్వోత్తరాలు గురించిన వివరాలు రెండు విధాలుగా ఉన్నాయి. అందులో ఒకటి;

నాసిక్ వెళ్ళే మార్గంలో నానావలీ అనే ముస్లిం మహాత్ముని దర్గా ఉంది. సంతానం లేని ఓ ముస్లిం దంపతులు తమకు గాని సంతానం కలిగితే, తమకు పుట్టే మొదటి బిడ్డను ఆ దర్గాసేవకే అంకితం చేసి అర్పించుకుంటామని మ్రొక్కుకున్నారట. ఆ తరువాత వారికో మగబిడ్డ జన్మించాడు. మ్రొక్కుకున్న ప్రకారం వారు ఆ బిడ్డను దర్గావద్దే విడిచి వెళ్ళిపోయారు. ఆ పిల్లవాడు ఆ దర్గా నీడనే, ఆ సమాధి సేవలోనే పెరిగి పెద్దవాడయ్యాడు. క్రమంగా ఆ పిల్లవాడితో బాటు అతనిలోని భక్తివైరాగ్యాలు కూడా పెరిగాయి. అప్పుడప్పుడు ధ్యానస్థుడై ఉన్నప్పుడు ఒకవిధమైన దివ్యావేశంలో అతడు అక్కడ చేరిన భక్తుల హృదయాలలోని కోరికలను ఆలోచనలను ప్రకటించి, అవి తీరేందుకు మార్గం చెప్పేవాడట. నానావలీ ఔలియానే ఆ బాలుడిలో (పూని) ప్రవేశించి అలా సిద్ధులు ప్రకటింపజేస్తున్నారని ప్రజలు నమ్మేవారు. అందువల్ల ఆ బాలుడిని కూడా 'నానావలీ' అనే వ్యవహరించేవారు. ఒకసారి నానావలీ ఔలియా ఆ బాలుడికి స్వప్నదర్శనమిచ్చి, "శిరిడీ వెళ్ళి శ్రీసాయిబాబాను సేవించుకొమ్మని

ఆదేశించాడట". ఆ దివ్యాదేశాన్ననుసరించి ఆ బాలుడు (నానావలీ) శిరిడీకి చేరి, అక్కడే శ్రీసాయి సేవలో స్థిరపడ్డాడు. అతడు శిరిడీ చేరే నాటికి బాబా శిరిడీ వచ్చి చాలా సంవత్సరాలయింది.

మరికొందరి వాదన ప్రకారం – నానావలీ జన్మతః హిందువు, బ్రాహ్మణుడు! అతని అసలు పేరు శంకరనారాయణవైద్యయనీ, అతడు చిన్ననాటినుండి చెండోర్ లోని నానావలీ దర్గాను సేవిస్తూ ఉండడంవల్ల అతడికి నానావలీ అనే పేరొచ్చిందనీ, తన గురువు యొక్క దివ్యాదేశాన్ననుసరించి నానావలీ శిరిడీ చేరాడనీ అప్పటికింకా బాబా రెండవసారి శిరిడీ చేరలేదనీ, శిరిడీకి బాబా ఆగమనం కోసం వేచివున్న నానావలీ, బాబా చాంద్‌భాయ్‌పాటిల్ పెళ్ళిబృందంతో శిరిడీలో అడుగుపెట్టగానే బాబాకు ఎదురేగి "క్యా కాకా, తు ఆయా?" (ఏం మామా! నువ్వొచ్చేశావా!) అని చనువుగా ఆనందంగా పలుకరించాడనీ, తన అవతారకార్యాన్ని గురించి అతడు ముందుగా ప్రకటిస్తాడేమోనని బాబా అతనితో ***"తూ చుప్ హెూ!" ("నోరు మెదపొద్దు!")*** అని హెచ్చరించారనీ, ఆనాటి నుండి అతడు బాబా గురించి ఎప్పుడూ మాట్లాడేవాడు కాడనీ చెప్పారు.

రెండవ వాదం వినిపించే భక్తులు బ్రాహ్మణ వంశంలో పుట్టిన నానావలీ ముస్లిం దర్గాను ఎందుకు సేవించవలసి వచ్చిందో చెప్పలేకపోతున్నారు. అంతేకాదు! అతడు బాబా రెండవసారి శిరిడీకి రాకముందే శిరిడీకి వచ్చాడన్న దానికి కూడా నిర్దిష్టమైన ఆధారాలు కనపడటంలేదు. "The sage of Sakori" అనే గ్రంథంలో సమగ్ర సాయి చరిత్రకారుడు శ్రీసాయిచరిత్ర పరిశోధకుడు అయిన శ్రీబి.వి.నరసింహస్వామిగారు నానావలీని గురించి ప్రస్తావిస్తూ అతడు ఇటీవలే (అంటే 1910కి కొంచెం ముందు) శిరిడీ వచ్చినట్లు (who has recently arrived at Shirdi) అనే వ్రాశారు.

అంతేకాదు! ఇతని వేషభాషలు కూడా విచిత్రంగానే ఉండేవి. ఒక్కోసారి ముస్లిం ఫకీరు వేషం ధరించేవాడు. ఒక్కోసారి హిందూ సన్యాసిలా కాషాయం కట్టుకొనేవాడు కానీ ఎక్కువభాగం ముస్లిం ఫకీరు వేషంలోనే ఉండేవాడు. ఇక్కడ అక్కడ అని లేకుండా ఎక్కడపడితే అక్కడ ఉండేవాడు, కానీ ఎక్కువగా మసీదు ప్రక్కనున్న మారుతి ఆలయంలో బస చేసేవాడు. తాత్యాకోతేపాటిల్ తరువాత బాబాను 'మామా' (కాకా) అని ఆప్యాయంగా సంబోధించిన భక్తుడు నానావలీయే.


సామాన్యంగా భక్తులు బాబా సన్నిధిలో ఎక్కువకాలం గడపడానికి ఆరాట పడతారు. కానీ, నానావలీ మాత్రం ఎప్పుడో రోజుకు ఒకటి రెండుసార్లు బాబా దగ్గరకొచ్చి నమస్కరించి వెళ్ళిపొయ్యేవాడు. “సాయిసేవలో ఉంటూ బాబా పనులు చూసుకుంటూ ఉండేవాడు” అని తన ‘సాయి సచ్చరిత్ర’ గ్రంథంలో శ్రీహేమాద్పంతు వ్రాశారు. దీన్నిబట్టి అతడు కొంతకాలం సాయి వ్యక్తిగతసేవలో కూడా గడిపాడని తెలుస్తుంది.

బాబా అంటే ఇతడికి పంచప్రాణాలు. బాబాను నానావలీ ఎంత ప్రాణాధికంగా ప్రేమించాడంటే 1918 అక్టోబరులో బాబా మహాసమాధి చెందినపుడు భక్తులంతా బోరుబోరున విలపిస్తుంటే నానావలీ మాత్రం మసీదు ముంగిట కొంతసేపు మౌనంగా నిలబడి తరువాత మారుతి ఆలయం చేరి, అన్నం, నీరు ముట్టుకోకుండా “కాకా, కాకా” అని పలవరిస్తూ, (బాబా మహాసమాధి చెందిన) పదమూడవ రోజున ప్రాణాలు విడిచి, సాయి పదైక్యం చెందాడు. అంతకు మునుపు కూడా నానావలీ తరచూ అనేవాడు. “బాబా కనుమరుగైతే ఆ తరువాత నేనూ ఎక్కువ రోజులు బ్రతకను! బాబా నా హృదయాన్ని పూర్తిగా జయించారు!” అని. అలాగే బాబా మహాసమాధి చెందిన 13వ రోజుకు నానావలీ కూడా దేహత్యాగం చేశాడు.

మరో విశేషమేమంటే, తనకు అనవసరమైన విషయమేమీ లేదన్నట్లు ప్రతి విషయంలోనూ తలదూర్చే నానావలీ, బాబా సమాధి అనంతరం ఆయన దేహాన్ని ఏ మతధర్మాల ప్రకారం సమాధి చెయ్యాలని రేగిన వివాదంలో ఎంతమాత్రం తలదూర్చలేదు. మత సంబంధమైన వివాదాలెన్నివున్నా, దైవసంకల్పానుసారం, బాబాకు మల్లే, నానావలీని కూడా ముస్లిం సాంప్రదాయం ప్రకారం సమాధి చేశారు. ఆ నానావలీ సమాధి లెండితోట గేటు ముందు మనకు దర్శనమిస్తుంది.

శ్రీసాయి అవతరించినపుడు ఆయన పరతత్త్వం యొక్క దివ్యాంశం ఒకటి (శ్రీసాయి ఉపాంగంగా) నానావలీ రూపంలో అవతరించిందని కొందరు సాయిభక్తుల ప్రగాఢ విశ్వాసం.





ఉపాసనీ మహరాజ్

# ఉపాసనీ మహరాజ్

శ్రీసాయిబాబా వంటి పరిపూర్ణ సద్గురుమూర్తుల విషయంలో తప్పిస్తే సామాన్యంగా ఒక వ్యక్తి కీర్తిప్రతిష్ఠలతోపాటు ఆ వ్యక్తిపట్ల విమర్శ, వివాదం కూడా పెరగడం మనం చూస్తున్నదే. మురికిపట్టిన మసిపేలికకు మట్టి అంటితే ఎవ్వరూ పట్టించుకోరు. అదే, శుభ్రమైన తెల్లని గుడ్డపై రవ్వంత మరక అంటినా కొట్టవచ్చినట్లు అందరి గమనింపుకు వస్తుంది. సామాన్యునిలోని దోషాలు ఎవ్వరూ పట్టించుకోరు. కాని మహాత్ములలో కించిత్తు లోపం కనిపించినా అది విశేషంగా చర్చనీయాంశమవుతుంది.

"గోమూత్ర మాత్రేన పాయో వినష్టం తక్రస్య గోమూత్ర శృతేన కిమ్వ? అల్పైశ్చ దోషైః మహతం వినష్టిః పాపి యాసం పాపశృతేన కింవ?" — అని ఆర్యోక్తి. అంటే – "స్వచ్ఛమైన పాలలో ఒక్క బొట్టు గోమూత్రం కలిసినా విరిగిపోతాయి. కాని మజ్జిగలో ఎంత గోమూత్రం కలిపినా ఏమీ కాదు! అలానే, చిన్న దోషమైనా మహాత్ముల గొప్పతనాన్ని పాడుచేస్తుంది. అదే దుర్జనులు ఎన్ని పాపాలు చేసినా అవి లెక్కలోకి రావు!" అని భావం. ప్రముఖ సాయిభక్తుడు, వేలాదిమందిచే సద్గురువుగా, సాక్షాత్తూ దైవస్వరూపుడుగా ఆరాధింపబడుతున్న శ్రీఉపాసనీబాబా మహరాజ్ అద్భుతచరిత్ర, పైన పేర్కొన్న ఆర్యోక్తికి సత్యదూరం కాదని (పరోక్షంగా) సాక్ష్యమిస్తుంది.

అంతేకాదు! శ్రీసాయిమహిమకు, సద్గురువుగా శ్రీసాయి సమర్థతకు, బాబా భక్తవాత్సల్యానికి, సాయి సంప్రదాయం యొక్క విశిష్టతకు, సాధకుని దీక్షకు (కేవలం) బాబా అనుగ్రహంవల్ల సాధకుడు పొందగలిగిన ఉన్నత ఆధ్యాత్మికస్థితికి, శరణాగతి తత్త్వానికి, ఉన్నత ఆధ్యాత్మికస్థితి పొందినా అరిషడ్వర్గాదుల పట్ల అజాగ్రత్తగా ఉంటే

సాధకుడు పొందే దుష్పరిణామాలకు– ఇలా ఎన్నో సత్యాలకు శ్రీఉపాసనీబాబా చరిత్ర ప్రత్యక్ష సాక్ష్యం. శ్రీఉపాసనీబాబా గాథ ఆధ్యాత్మికసాధన సాగరంలో ఒక సాహస యాత్ర! ఇందులో సాయిభక్తులు తెలుసుకొని ఆచరించదగ్గ ఆదర్శాలు, జాగ్రత్తగా వర్జించవలసిన అంశాలు కోకొల్లలు; అవి సాయిపథంలో మనకు వెలుగు చూపించి నడిపించే వెలుగుదివ్వెలు.

## ఎవరు సాయి శిష్యులని చెప్పుకోగలిగింది?

"బాబా, మీ మహిమ మీతోనే అంతరించిపోతుందా? లేకపోతే ఎవరైనా వారసుడున్నాడా?" అని ఒక భక్తుడు శ్రీసాయిబాబాను అడిగాడు. దానికి బాబా ***"అరే, చింకిపాతలతో ఒకడు వస్తున్నాడు కదా?"*** అని జవాబిచ్చారు. (– శ్రీహెచ్.వి. సాఠే స్మృతుల నుండి). బాబా ఆ మాటలు ఎవరిని ఉద్దేశించి అన్నారో తెలియదు కాని, ఆ తరువాత కొంతకాలానికి (1911 జూన్‌లో) చింకి పేలికలు ధరించి బాబాను ఆశ్రయించిన శ్రీఉపాసనీబాబాయే శ్రీసాయి ప్రస్తావించిన ఆ వారసుడని చాలామంది సాయిభక్తులు భావించారు. అయితే కొందరలా భావించుతారని మాత్రమే బాబా ముందుగా (తమ సహజ ధోరణిలో) సూచించారని కూడా అనుకోవచ్చు! లేదా తమ సంప్రదాయానికి వారసుడయ్యే 'అర్హతగల' వ్యక్తి రాబోతాడని బాబా సూచించి ఉండవచ్చు కూడా! ఎందుకంటే, తనకు ***"వారసులెవ్వరూ లేర"***నీ, ***"సమాధి నుండి కూడా తమ అవతార కార్యాన్ని నెరవేరుస్తాన"***నీ శ్రీసాయిబాబా స్పష్టంగా చెప్పే ఉన్నారు. ఈనాటికీ బాబా వారసులే కాదు, ఆయన శిష్యులు కూడా ఎవ్వరూ లేరు! ***"ఎవరు నా శిష్యులమని చెప్పకొనేది? నా గురువును నేను సేవించినట్లు ఎవరు సేవించగలరు?"*** అని బాబానే అన్న మాటలు అక్షరసత్యాలు.

ఉపాసనీ మహరాజ్ సాయిబాబా వారసుడని కొందరు భక్తులు భావించారని చెప్పుకొన్నాం. అలా వారు ఊరకే నిరాధారంగా భావించలేదు. శ్రీఉపాసనీ గురించి బాబా ఇచ్చిన యోగ్యతా పత్రం అటువంటిది. శ్రీఉపాసనీతో బాబా ఒకసారి ***"ఈ ప్రపంచమంతా ఒక ఎత్తు, నీ ఒక్కడివీ ఒక ఎత్తు"*** అనీ, మరోసారి ***"నీకు చాలా మంచి భవిష్యత్తుంది. ఇంకెవ్వరికీ అటువంటి భవిష్యత్తు లేదు"*** అనీ, ఇంకో సందర్భంలో ***"చిరకాలం నిలచి, ఇతరులకు శ్రేయస్సునిచ్చే మహావృక్షాలనెన్నో నీవు నాటవలసి***

***ఉంది"*** అనీ – అన్నారు. ఉపాసనీమహరాజ్ మీద అంత ప్రత్యేక అభిమానాన్ని చూపుతూ, బాబా ఆయన గురించి అంత గొప్పగా చెప్పడం చూచి, అసూయతో ఓర్వలేని భక్తుడొకరు, "బాబా, ఇంతకాలంగా మేము మిమ్మల్ని సేవించుకొంటున్నాము. నిన్నగాక మొన్న వచ్చిన ఈ ఉపాసనీకి మీ శక్తులంతా ధారబోస్తున్నట్టు తామ్ర (రాగి) ఫలకంపైన దానపత్రమిచ్చేశారే!" అని బాబానడిగాడు.

దానికి బాబా, ***"అవును, ఈ మసీదులో కూర్చుని నేనెన్నడూ అబద్ధం చెప్పను. నేను చెప్పవలసిందేదో చెప్పాను. ఇతడికి (ఉపాసనీకి) నా సర్వస్వం ఇచ్చేశాను. మంచిగానీ, చెడ్డగానీ - అతడెటువంటి వాడయినా - అతడు నా వాడు. అతని పూర్తి బాధ్యత నాది. ఇక దానపత్రమంటారా? రాగి ఫలకమేం ఖర్మ స్వర్ణఫలకం పైనే దానపత్రం వ్రాసిచ్చాను!"*** అని ఖండితంగా జవాబిచ్చారు. అంతేకాదు! 1913 గురుపూర్ణిమనాడు శ్రీమతి చంద్రాబాయి అనే భక్తురాలిని శ్రీఉపాసనీకి గురుపూజ చేయమని ఆదేశించారు కూడా!

ఏ తండ్రయినా తన బిడ్డ తనకంటే గొప్పవాడు కావాలని కోరుకొంటాడు. ప్రేమమూర్తి అయిన సద్గురువు కూడా తన శిష్యుడు తనంతటివాడు కావాలని (ఎందుకంటే సద్గురు స్థితి కంటే మించిన స్థితి ఉండదు గనుక) అభిలషిస్తాడు. కానీ ఎంతమంది అలా అవుతారనేది వారి వారి పరిపాకం మీద ఆధారపడుతుంది. శ్రీఉపాసనీ తమను ఆశ్రయించినప్పుడు బాబా ఆయనతో ఇలా అన్నారు: ***"నీవు నాలుగు సంవత్సరాలపాటు ఇక్కడే ఉండాలి. ఆ నాలుగేళ్ల గడువు పూర్తి అయిన తరువాత దైవం నిన్ను అనుగ్రహిస్తాడు. అప్పుడు షామా నిన్ను సగౌరవంగా బయటకు తెచ్చి, ప్రపంచానికి ప్రకటిస్తాడు!"*** అని. కానీ ప్రారబ్ధ బలమో, మరేకారణం వల్లనో బాబా పెట్టిన ఆ గడువు పూర్తి చెయ్యలేకపోయారు శ్రీఉపాసనీ. సుమారు మూడు సంవత్సరాల తరువాత బాబా అనుమతి కూడా తీసుకోకుండా శిరిడీ విడచి వెళ్ళిపోయారు! "బాబా చెప్పిన గడువు పూర్తి చేసుంటే పరిస్థితి ఎలా ఉండేదో మనమిప్పుడు ఊహించలేం!" అంటారు శ్రీసాయిచరిత్రనే గాక శ్రీఉపాసనీబాబా చరిత్రను కూడా సమగ్రంగా రచించిన శ్రీబి.వి. నరసింహస్వామిగారు. ఆయనే అంటారు, "నాటిన విత్తనం మొలకెత్తి పెరిగి పెద్దదైంది కాని, ఆ చెట్టు పెరగవలసిన పద్ధతిలో మాత్రం పెరగలేదు!" అని.

## శ్రీసాయి మార్గం కష్టమా? సులభమా?

శ్రీఉపాసనీ మహరాజ్ చరిత్ర పరిశీలిస్తే ఆధ్యాత్మికతలోని వివిధ దశలు మనకు ఆయనలో కనిపిస్తాయి. ప్రాణాయామ సాధనలో తనకు సంభవించిన అనారోగ్యాన్ని నివారించుకొనేందుకు ఒక ఆర్తుడుగా ఆయన బాబాను ఆశ్రయించారు. బాబా ఆజ్ఞననుసరించి తన భార్యను, బంధువులను విడచి శిరిడీలో ఉన్నారు. శ్రీజి.ఎస్. ఖాపర్డే, శ్రీకాకాసాహెబ్ దీక్షిత్ మొ॥న పండితులు చేస్తున్న సత్సంగాలకు జిజ్ఞాసువుగా హాజరై ఎన్నో ఆధ్యాత్మిక గ్రంథాలను అధ్యయనం చేశాడు. బాబా ఆదేశించిన 'సాధన'ను అనుష్ఠిస్తూ విరాగిగా ఆయన పడిన కష్టాలు, అసూయాపరులు ఆయనను పెట్టిన హింసలు చదివితే ఎవ్వరికైనా కంటనీరు రాకమానదు. ***"ఇప్పుడెంత కష్టపడితే ముందు ముందు అంత సుఖపడతావ్!"***.... అని ఆయనతో బాబా అన్న మాటలు నిజమై, 1914 తర్వాత ఆయన గొప్ప సద్గురువుగా, సాక్షాత్తూ దైవంగా వేలాదిమందిచే ఆరాధింపబడ్డారు. మహాత్మాగాంధీ వంటి జాతీయనాయకులు కూడా తమ ఉద్యమాలకు ఆశీస్సులిమ్మని శ్రీఉపాసనీని దర్శించారు. కీర్తితో పాటు సంస్థలు, సంబారాలూ పెరిగాయి. కానీ ఎన్నో కారణాల వల్ల ఆఖరుకు ఎన్నో వివాదాలకు, విమర్శలకు, వ్యాజ్యాలకు లోనైనారు. అలా ఎందుకు జరిగింది? బహుశా శ్రీఉపాసనీ అసలైన సాయిపథం విడిచి, భిన్నమైన మార్గంలో పయనించినందువల్లనేమోననిపిస్తుంది.

ఈ వివిధ దశలు ఆయన ఆంతర్యంలోని వివిధ దశల పరిపాకానికి బాహ్య రూపాలా అనిపిస్తాయి. అందుకు ఒక్క ఉదాహరణ. శ్రీఉపాసనీ, బాబా ఆదేశంపై శిరిడీలోని ఖండోబా ఆలయంలో ఉన్నకాలంలో కొన్నిరోజులు స్వయంపాకం చేసుకొని, ముందు బాబాకు నివేదించి, తర్వాత భుజించేవారు. ఒకసారి బాబా ఆయనతో, ***"నీవు నైవేద్యం తీసుకొని మసీదుకు రావడమెందుకు? నేనే అక్కడికొస్తాను"*** అన్నారు. ఆ తరువాత ఒకరోజు శ్రీఉపాసనీ భోజనం తయారుచేస్తూంటే, అక్కడ ప్రక్కనవున్న గోడకానుకొని ఒక శూద్రుడు చూస్తూ నిలబడి ఉన్నాడు. సనాతన ఛాందస విశ్వాసాల దుష్ప్రభావం నుండి ఇంకా విముక్తుడు కాని శ్రీఉపాసనీ, శూద్రుడి చూపు పడితే ఆ భోజనం మైల పడుతుందని భావించి, అతణ్ణి అక్కడ నుండి వెళ్ళమని గద్దించాడు. ఆ శూద్రుడు మౌనంగా వెళ్ళిపోయాడు. ఆ తరువాత నైవేద్యం తీసికొని బాబా వద్దకు వెళ్ళగానే, బాబా, ***"నేను అక్కడికొస్తే ఛీదరించుకొని తరిమేశావు. భోజనం***

***తీసుకొని ఇప్పుడిక్కడికొచ్చావు"*** అంటూ మండిపడ్డారు. శ్రీఉపాసనీ ఆశ్చర్యంతో బాబా అక్కడికెప్పుడు వచ్చారని ప్రశ్నిస్తే, ***"నీవు వంట చేస్తుండగా అక్కడే గోడకానుకొని నిలబడి ఉన్నాను"*** అన్నారు. అలా అహంకారాన్ని పెంచి, ఆధ్యాత్మిక పురోభివృద్ధికి ఆటంకంగా నిలిచే కులాభిమానాన్ని, మడి, మైల మొ॥న దురాచారాల పట్ల విశ్వాసాన్ని శ్రీఉపాసనీ జయించేందుకు దోహదం చేశారు బాబా. ఇలా ఎన్నో ఆటంకాలను బాబా కృపతో అధిగమించిన శ్రీఉపాసనీలో కొంతకాలం తరువాత అద్భుతమైన మహిమ ప్రకటమయ్యింది. ఒకసారి 'నెవాసా' గ్రామం నుండి దినకర్ అనే అతను తన మిత్రుల ప్రోద్బలంతో శిరిడీ వచ్చాడు. అతనికి బ్రాహ్మణుడైన తాను మ్లేచ్ఛ(ముస్లిం)డైన సాయిబాబాకు నమస్కారం చేయడమేమిటనే అభిమానం మనస్సులో ఉంది. అయితే అందరితోబాటు మసీదు చేరి బాబాకు నమస్కరించబోయాడు. కానీ బాబా కోపంతో ఉరిమి చూడటంతో నమస్కరించలేకపోయాడు. తరువాత మసీదునుండి 'బయటపడి' ఉపాసనీ మహరాజ్ గురించి విని, ఖండోబా ఆలయానికెళ్ళాడు. అతడు శ్రీఉపాసనీకి నమస్కరించబోగా, అప్పటివరకు కాళ్ళు జాపుకొని కూర్చుని ఉన్న ఉపాసనీ, తమ కాళ్ళు ముడుచుకొని కులాభిమానమున్న వాడి ముఖం చూడటం కూడా పాపమన్నట్టు ప్రక్కకు తిరిగి, "సాయిబాబా ముస్లిం! నీవొక బ్రాహ్మడివి! బాబాకు నమస్కారం చేసుకోలేని నీకు ఇక్కడ మాత్రం ఏం పని?" అంటూ కోపంతో గద్దించి, బాబాకు, తమకు తాదాత్మ్యం ప్రకటించారు. అది రెండవదశ. ఇక మూడవదశలో అదే ఉపాసనీ మహరాజ్ శిరిడీ వదలి సకోరిలో స్థిరపడ్డ తరువాత ఒక దేవాలయం నిర్మించి ఆ ఆలయంలోకి హరిజనుల ప్రవేశాన్ని నిషేధించారు. మంత్రోపదేశాలు, మడి, మైల మొ॥న ఆచారాలు బాబా నిరసించారు. ***"మా సంప్రదాయమే వేరు!"*** అని బాబానే అన్నారు. కానీ శిరిడీ వదలి సకోరిలో సద్గురువుగా స్థిరపడ్డ తరువాత శ్రీఉపాసనీ మంత్రోపదేశాల దగ్గర నుండి యజ్ఞయాగాది వైదిక కర్మకాండ వరకూ అన్నీ ప్రోత్సహించారు. ఆ విధంగా, శ్రీసాయిబాబాకు, శ్రీసాయి సంప్రదాయానికి తాను వారసుడు కాననీ తానే ప్రకటించుకొన్నట్లయింది!

ఒక మహాత్ముని చరిత్రలో ఈ విధమైన విమర్శనాత్మక విశ్లేషణ ఎంతవరకు సమంజసం అనే ప్రశ్న కొందరు పాఠకులకు కలుగవచ్చు. శ్రీఉపాసనీ మహరాజ్ వంటి మహాత్ముల చరిత్రలు సరదాగా కాలక్షేపానికి చదువుకోవలసినవికావు. ఆధ్యాత్మిక

మార్గంలో పయనించే సాధకులకు – వారు ముందు ముందు ప్రయాణించబోయే మార్గంలో ఎదురయ్యే సమస్యలను, సదుపాయాలను తెలియజేసే మార్గదర్శినులు (guides). ఈ దృష్ట్యా వారి చరిత్రలను సద్విమర్శనాత్మకమైన విశ్లేషణతో అధ్యయనం చెయ్యడం సాధకులకు ఎంతైనా అవసరం.

అందుకే “శత్రోరపి గుణాః వాచ్యా। దోషా వాచ్యా గురోరపి।” (– అంటే “శత్రువులైనా వారిలో ఉన్న సుగుణాలను మెచ్చుకోవలసిందే! గురువులైనా సరే వారిలో దోషాలుంటే ఎత్తి చూపవలసిందే!”) అని పంచమవేదమైన ‘మహాభారతం’ ఉద్బోధిస్తున్నది. దోషాలను ఎత్తి చూపడమంటే దోషారోపణ చెయ్యడంకాదు. ఆ దోషాలను వివేకంతో గుర్తించి, ‘ఎత్తి’ మన ‘బుద్ధి’కి ‘చూపి’ అంతటి గురువులలో కూడా చోటుచేసుకున్న దోషాలకు మనం గురి కాకుండా జాగ్రత్తపడాలి. అందుకే పూర్వం వేదాన్ని బోధించే ఆచార్యులు తమ శిష్యులకు – నిత్యప్రార్థనలో భాగంగా – “…యాన్యవద్యాని కర్మాణి తాని సేవితవ్యాని నో ఇతరాణి…” (తైత్తిరీయారణ్యకం) – అంటే, ‘మా (ఆచార్యుల) లోని దోషప్రవర్తనను చూచి వాటిని అనుసరించవద్దు! మాలో ఉన్న సుగుణాలనే ఆదర్శంగా తీసుకొని ఆచరించండి!’ – అని ప్రబోధించేవారు.

## ‘కారు కారు గురువులు ‘కా’ గుణింతం చెప్ప’

శ్రీఉపాసనీ మహరాజ్ వంటి మహనీయులు తమ సాధనలో ఎదుర్కొన్న సమస్యలు, కామ క్రోధాది అరిషడ్వర్గాలను జయించడానికి వారు అనుసరించిన పద్ధతులు, ఆ సాధనలో బాబా వారికిచ్చిన శిక్షణ, సాయి రక్షణ, వారు సాధించిన అద్భుతస్థితి మొదలైనవన్నీ సామాన్య సాయిభక్తులుగా మనం గ్రహించవలసినవి.

అంతేకాదు! ఈ చరిత్రలనుండి ‘అసాధారణ’ సాయిభక్తులు కూడా గ్రహింపవలసిన ‘పాఠాలు’ కూడా ఎన్నో ఉన్నాయి. శ్రీసాయికృపాలబ్ధమైన కొద్దిపాటి తెలివితేటలు, పాండిత్యం, వాక్చాతుర్యం ఉండగానే, తామేదో గొప్ప సద్గురువులమని భ్రమిస్తూ, సాటి సాయిభక్తులను భ్రమింపజేస్తూ, తమ జీవితంలో ఏనాడూ ఏ సజీవమైన గురువునూ శిష్యులుగా సేవించకపోయినా, అహర్నిశలు శిష్య లక్షణాలను గురించి, గురుసేవామహాత్మ్యాన్ని గురించి ఏకరువు పెడుతూ, తెలివిగా తమను తాము ‘గురువులు’గా ప్రదర్శించుకుంటూ, సాక్షాత్తూ సాయి స్వరూపులుగా పాదపూజలు

అందుకొనేందుకు సాహసిస్తున్న వారినెందరినో మనం చూస్తున్నాం. ఎంతో కఠోర తపస్సు, శ్రీసాయి విశేష కృప కలిగిన శ్రీఉపాసనీ మహరాజ్ వంటి మహనీయులే సత్యమైన సాయి సంప్రదాయాన్నుంచి కొంచెం ప్రక్కకు నడిచినంత మాత్రాన, ఎలా బాబా రక్షణను కోల్పోయారో గుర్తిస్తే, అటువంటి ఆత్మవంచన పరవంచనలకు తావుండదు. "పూజాసత్కారాల వలన, ముక్తుడయినవాడు కూడా బంధంలో చిక్కుకుంటున్నాడు" ("అభిపూజిత లాభాంశ్చ ... ర్ముక్తో పి బధ్యతే" – మనుస్మృతి) అన్న శాస్త్రవాక్యాన్ని, "కాదు కాదు గురువు 'కా'గుణింతము చెప్ప" అన్న వేమన యోగీంద్రుని సూక్తిని స్మరించి, జాగరూకులై మెలగాలి. బాబా దయవల్ల తమకు లభించిన కొద్దిపాటి విజ్ఞానాన్ని సాటి సాయిభక్తులతో పంచుకొనే అవకాశం కలిగించిన సాయికృపకు వినమ్రులై 'సాయి స్వరూపులు'గా, 'సద్గురువులు'గా ఇతరులచే పూజలందుకోవడానికి సిద్ధమైన తమ దుస్సాహసానికి, దురహంకారానికి సిగ్గుతో తలవంచుకొనగలగాలి. సాయి సంప్రదాయంలో శ్రీసాయి వినా సద్గురువు లేడు!... అవసరం లేదు!!... రాదు!

ఇవన్నీ శ్రీఉపాసనీ మహరాజ్ వంటి మహనీయుల చరిత్రలవల్ల మనకొనగూరే ప్రయోజనాలలో కొన్ని మాత్రమే.

***"ఏది ఏమైనా అతడు (శ్రీఉపాసనీ) నావాడు!"*** అన్నారు బాబా. అలా బాబా విశేషకృపకు పాత్రుడైన ధన్యుడు, సామాన్యులకసాధ్యమైన కఠిన సాధనను బాబా సన్నిధిలో చేయగలిగే అవకాశాన్ని పొందిన భాగ్యశాలి – శ్రీఉపాసనీ మహరాజ్. శిరిడీ ఆరతుల్లో మనం పాడుకొనే, "సదాసత్స్వరూపం చిదానందకందం..." అనే (సంస్కృత) సాయి మహిమను వర్ణించే స్తోత్రాన్ని ('సాయి మహిమ్న స్తోత్రాన్ని') రచించి మనకందించింది – శ్రీఉపాసనీ మహరాజ్.

శ్రీబి.వి. నరసింహస్వామీజీ వంటి వారికి మొదట స్ఫూర్తినిచ్చి, సమగ్ర సాయి చరిత్ర రచనకు, విస్తృత సాయిప్రచారోద్యమానికి కారకులయ్యారు – శ్రీఉపాసనీ మహరాజ్.

అంతే కాకుండా 'శ్రీసాయి సచ్చరిత్ర'లో "సాయిభక్తశ్రేష్ఠుడు"గా కీర్తించబడ్డ ఈ మహనీయుని చరిత్ర పారాయణ మనకు అవశ్యం శ్రీసాయి కృపను కలిగించగలదు.

ఇక, శ్రీఉపాసనీ మహరాజ్ జీవితచరిత్ర వివరాలకొద్దాం :

## ఆత్మాన్వేషణలో అంటని ఆహారాన్వేషణ

మహారాష్ట్రీయుల పేర్లు ఆంధ్రులకు కొంత తికమకగా, చాలా పెద్దవిగా తోచడం సహజం. శ్రీసాయిబాబా చరిత్ర చదివే పాఠకులకు సామాన్యంగా ఎదురయ్యే గందరగోళం ఇది. ఉదాహరణకు శ్రీఉపాసనీబాబా పూర్తిపేరు – కాశీనాథ్ గోవింద ఉపాసనీశాస్త్రి. ఇందులో మొదటిది మాత్రమే – కాశీనాథ్ – వ్యవహార నామం, అంటే అసలు పేరు. రెండవది తండ్రిపేరు. మూడవది వంశనామం. ఇలా మహారాష్ట్రీయుల పేర్లన్నింటిలో వ్యక్తిపేరు, తండ్రిపేరు, వంశనామం వరుసగా రావడం సంప్రదాయం.

ఈ ఉపాసనీల స్వగ్రామం నాసిక్ జిల్లాలోని సతానా. నిప్పులు కడిగే ఆచార నిష్ఠలకు వీరి కుటుంబం పెట్టింది పేరు. అనాదినుండి వీరి వృత్తి పౌరోహిత్యం. ఆ రోజుల్లో పౌరోహిత్యం ద్వారా బాగా సంపన్నులుగా ఉన్నప్పటికీ, ఆధునిక విజ్ఞానం, పాశ్చాత్య నాగరికతల ప్రభావం వల్ల పౌరోహిత్యానికి విలువతగ్గి, శ్రీగోపాల ఉపాసనీ శాస్త్రిగారి తరానికి కుటుంబం ఆర్థికంగా చితికిపోయింది. శ్రీగోపాల ఉపాసనీశాస్త్రి బరోడా సంస్థానంలోని పండిత పరిషత్తులో మహారాజుకు ముఖ్య సలహాదారుడుగా కొంతకాలం పనిచేశారు. తరువాత సతానాలోనే పౌరోహిత్యం, భగవస్మరణలో తమ శేషజీవితం గడుపుతూ, తమ చివరి రోజులలో సన్యాసం స్వీకరించారు. ఈయన తమ 69వ యేట వారి వంశగురువులైన ఉద్ధవమహరాజ్‌ను స్తుతిస్తూ కొన్ని స్తోత్రాలు వ్రాశారు. శ్రీగోపాలశాస్త్రి తన కుమారుడైన గోవింద గోపాల ఉపాసనీశాస్త్రికి సంప్రదాయ విద్యలోను, గణిత జ్యోతిష్యాలలోను మంచి ప్రవేశం కలుగజేసాడు. కానీ, అవేవీ కుటుంబ పోషణకు ఉపయోగపడకపోవడంతో ఆయన తమ స్వగ్రామమైన సతానా వదలి, ధూలియా కోర్టులో దస్తావేజులు వ్రాసే గుమాస్తాగా జీవనం సాగించాడు. తన జ్యోతిష, గణిత శాస్త్ర పరిజ్ఞానాన్ని రంగరించి 'ఖేటక రత్నాకరము', 'తారిఖోత్పత్తి' అనే గ్రంథాలు రచించారు. కానీ, అవేవీ ప్రచురణకు నోచుకోలేదు. గోవిందశాస్త్రిగారికి మొత్తం 5 మంది కుమారులు, ఒక కుమార్తె. శ్రీకాశీనాథ్ ఉపాసనీ ఈయన రెండవ కుమారుడు. పెద్దకుమారుడు (శ్రీఉపాసనీబాబా అన్నగారైన) బాలకృష్ణ గోవింద ఉపాసనీశాస్త్రి ప్రఖ్యాత సంస్కృత పండితుడు. హిందూ ధర్మ న్యాయశాస్త్ర విషయాల్లో ఆనాడు ఈయనను అధికారికంగా భావించి, గౌరవించేవారు. కాశీనాథ్ తన 22వ యేటివరకు తన తాతగారైన గోపాలశాస్త్రిగారి

వద్దనే సతానాలో పెరిగాడు. కాశీనాథ్ కుటుంబ నేపథ్యం క్లుప్తంగా ఇది. సనాతన ఛాందస ఆచార వ్యవహారాలలో పుట్టి పెరిగిన శ్రీకాశీనాథ్‌పై వాటి ప్రభావం ఆ తరువాత ఆయన జీవితంలోనూ స్పష్టంగా కనిపిస్తుంది.

1870, మే నెల 5వ తేదీన జన్మించిన శ్రీకాశీనాథ్‌కు తన 8వ యేట ఉపనయనమైంది. తరువాత మూడు సంవత్సరాలు స్థానిక ఎలిమెంటరీ స్కూలులో చదివాడు. మొదటే చదువంటే అంతంతమాత్రం ఆసక్తి ఉన్న కాశీనాథ్ ఒకసారి తన ఉపాధ్యాయుడు ఏదో కారణానికి వాతలు రేగేట్లు కొట్టడంతో, అసలు స్కూలుకే వెళ్ళనని హఠం వేశాడు. ఆ తరువాత తన తాతగారు ఇంట్లోనే కాశీనాథ్‌కు చదువు చెప్పారు.

కాశీనాథ్‌కు తన తాతగారు చెప్పే చదువు సరిగా బుర్రకెక్కకపోయినా, నిత్యం ఆయన చేసే పురాణకాలక్షేపంలో చెప్పే కథలు బాగా మనస్సుకెక్కేవి. పురాణాలలో చెప్పబడ్డ మాదిరి – విశ్వామిత్రుడు, ధృవుడులాగా – తానూ తపస్సు చేసి మంత్ర శక్తులను, సిద్ధులను సాధించాలనే కోరిక క్రమంగా కాశీనాథ్‌లో బలపడుతూ వచ్చింది. తన తాతగారు నిర్దేశించిన విధంగా, సంప్రదాయానుసారం నిత్యపూజానుష్ఠానాలు చేస్తున్నా, మిగతా సమయాలలో మంత్రజపం, ప్రణవజపం, ప్రాణాయామం మొ॥నవి అభ్యాసం చేస్తుండేవాడు. చదువుసంధ్యలు అబ్బక ఎప్పుడూ జపధ్యానాలంటూ కూర్చుని ఉండే కాశీనాథ్‌కు సహజంగానే 'ఎందుకూ పనికిమాలినవాడు'గా, సోమరిగా ముద్రపడింది.

బాల్యవివాహాలు ఆ రోజుల్లో అతి సామాన్యం. కాశీనాథ్‌కు తన 14వ యేట ఎనిమిది సంవత్సరాల వయస్సున్న దుర్గాబాయి అనే బాలికతో వివాహం జరిగింది. వివాహం జరిగాక కూడా కాశీనాథ్ పంథాలో మార్పురాలేదు. స్వగ్రామం వదలిపెడ్తే ఏమన్నా బాగుపడుతాడేమోనన్న ఆశతో గోపాలశాస్త్రిగారు కాశీనాథ్‌ను ధూలియాకు పంపాడు. అక్కడ తన తల్లిదండ్రుల వద్ద కొంతకాలం ఉండి, ఒకరోజు ఉత్తరం వ్రాసిపెట్టి ఇల్లు వదలి వెళ్ళిపోయాడు. సుమారు నాలుగురోజుల పాటు కాలినడకన ప్రయాణించి 80 మైళ్ళ దూరంలో ఉన్న నాసిక్ చేరాడు. కాశీనాథ్ తల్లిదండ్రులు అతని కోసం వెదకి వెదకి చివరకు మానుకొన్నారు. నాసిక్ చేరిన కొద్దిరోజులకే కాశీనాథ్‌కు ఇంటిమీద గాలి తిరిగి, అక్కడ తన బంధువుల ఇల్లుచేరి తల్లిదండ్రులకు ఉత్తరం వ్రాశాడు. ఒక మాసం తరువాత తిరిగి ఇల్లు చేరాడు.

కాశీనాథ్ నాసిక్ నుండి తిరిగి వచ్చిన కొద్దిరోజుల తరువాత ఆయన భార్య ఆకస్మికంగా మరణించింది. అయితే భార్య చనిపోయి కొన్ని వారాలు కూడా తిరక్కుండానే, కాశీనాథ్‌కు మళ్ళీ పెళ్ళయింది. ఈ రెండో పెళ్ళినాటికి కాశీనాథ్ వయస్సు 15; వధువు వయస్సు తొమ్మిదేళ్ళు.

ఒక్కసారి ఏ బాదరబందీ లేకుండా ఇల్లు వదలి తిరగడానికి అలవాటుపడ్డ తరువాత ఎవరికైనా ఇంట్లో కాలు నిలవడం కష్టమే. రెండోసారి పెళ్ళయిన కొద్ది రోజులకే కాశీనాథ్ తిరిగి ఇల్లు వదలి వెళ్ళిపోయాడు. ఎక్కడెక్కడో తిరిగి కొద్ది మాసాల తరువాత తిరిగి ఇల్లు చేరాడు. ఇలా రెండవ వివాహమైన తరువాత ఐదు సంవత్సరాల కాలంలో 5, 6 సార్లు ఇల్లు విడిచిపోయాడు. ఇంటిపట్టున ఉన్నప్పుడు ఆయుర్వేద వైద్యగ్రంథాలు చదువుతుండేవాడు.

1890లో మళ్ళీ కాశీనాథ్‌కు ఇల్లు వదలి వెళ్ళాలనిపించింది. ఏదైనా పని నేర్చుకొని స్వంతంగా వ్యాపారం చేసుకుంటానని ఇంట్లో చెప్పి బయటపడ్డాడు. పూనా చేరి, అక్కడ ఓంకారేశ్వరాలయంలో కొంతకాలం గడిపాడు. ఒంటిమీదున్న ధోవతి తప్ప చేతిలో పైసా లేదు! ఆకలిబాధ తట్టుకోలేనప్పుడు బస్తీకి వెళ్ళి, భిక్ష చేసి కడుపు నింపుకొనేవాడు.

## గుహలోన దాగినా గురి తప్పని గురుకృప!

అలా కొంతకాలం గడిచింది. అక్కడా మనఃస్థిమితం దొరక్కపోవడంతో అక్కడి కంటే ఏకాంతము, ప్రశాంతత ఉండే ప్రదేశానికి వెళితేనన్నా ధ్యానంలో నిలకడ లభిస్తుందేమోనని, పూనా వదలి బొంబాయి రోడ్డు పట్టాడు. కొంతకాలం ఒక బ్రహ్మచారి సాధువును సేవించి, బ్రహ్మచర్య ప్రాశస్త్యాన్ని గురించి, శివోపాసన గురించి నేర్చుకొన్నాడు.

ఆ సాధువు వద్ద సెలవు తీసుకొని, బొంబాయి దిశగా నడుస్తూ కళ్యాణ్ చేరాడు. కొన్నిరోజులుగా ఆహారం లేకపోవడంవల్ల కాశీనాథ్‌కు విపరీతమైన ఆకలి, నీరసం కలిగాయి. కళ్యాణ్‌లో ఏ బ్రాహ్మణ గుమ్మం ముందు నిలుచుని భిక్ష అడిగినా ఎవ్వరూ పిడికెడు కబళం పెట్టలేదు. ఆకలికి శోష వచ్చేసింది. నీళ్ళతో కడుపు నింపుకొని ఒక చెట్టు క్రింద కూలబడ్డాడు. తన దయనీయమైన స్థితిని తలుచుకొని కుమిలిపోయాడు.

దుఃఖం కట్టలు త్రెంచుకొంది. పందొమ్మిదేళ్ళ కాశీనాథ్ అలా రోడ్డు ప్రక్కన కూర్చుని రోదిస్తుండడం, ఆ దారినే పోతున్న ఓ వృద్ధురాలు గమనించి, దగ్గరకొచ్చి, విషయం విచారించి ఓదార్చింది. తానూ తన జీవితంలో పడ్డ కష్టాలు కాశీనాథ్‌కు చెప్పి, తన తండ్రి వద్ద నేర్చుకొన్న ఒక మరాఠీ సూక్తి వినిపించింది. ఆ సూక్తి భావం: "ఏమీ దొరక్కపోతే, నీళ్ళు త్రాగైనా ప్రాణాలు నిలుపుకో! దైవాన్ని ప్రేమించు! నీ దురదృష్టానికి వగవకు! కష్టాలను ఓరిమితో సహించు. భాగ్యదేవత వరించినా నిరాకరించు. కోరికలు త్రెంచుకో! ఏది ఏమైనా, మహాత్ముల సాంగత్యం మాత్రం విడవొద్దు!" ఆ సూక్తి కాశీనాథ్ మనస్సులో ఎంత గాఢంగా హత్తుకుపోయిందంటే, ఆ తరువాత కొన్ని రోజుల వరకు ఆ సూక్తిని ఓ మహామంత్రంలా జపించాడు. ఎన్నో ఏళ్ళ తరువాత కాశీనాథ్‌కు రమారమి అలాంటి ఉపదేశాన్ని శిరిడీలో శ్రీసాయిబాబా చెయ్యడం గమనార్హం. అంతేకాదు! ఈ సంఘటన జరిగిన కొద్దిరోజుల తరువాత కాశీనాథ్‌కు కలిగిన అద్భుత ఆధ్యాత్మికానుభూతిని (ఆ వివరం ముందు తెలుసుకొందాం) కూడా గమనిస్తే, నిస్సందేహంగా ఆ ఉపదేశం సర్వజీవస్వరూపుడైన సద్గురు సాయినాథునిదే అని అవగతమవుతుంది.

అంతటి చక్కని ఉపదేశాన్నందించి కాశీనాథ్‌లో వివేకాన్ని సంయమనాన్ని మేల్కొల్పిన ఆ వృద్ధురాలు అన్నం పెడతానంటే కాశీనాథ్ తిరస్కరించాడు. కారణం ఆమె బ్రాహ్మణ కులానికి చెందకపోవడమే! ఆకలితో మాడుతున్నా కులాల పట్టింపు మాత్రం వదులుకోలేదు కాశీనాథ్! ఛాందస ఆచార వ్యవహారాలు కాశీనాథ్ నరనరాల్లో ఎలా జీర్ణించుకుపోయాయోననేదానికి ఈ సంఘటన ఒక ఉదాహరణ. కాశీనాథ్ కులాభిమానానికి, ఛాందసానికి ఆ వృద్ధురాలు జాలిపడి, ఎలా చేస్తే భిక్ష సులభంగా దొరుకుతుందో ఒక చిట్కా చెప్పి, తన దారిన తాను వెళ్ళిపోయింది. వీధి గుమ్మం ముందు నిలుచుని మగవారిని భిక్ష అడిగేకంటే, దొడ్డి గుమ్మం దగ్గరకెళ్ళి, స్త్రీలను భిక్ష అడిగితే తేల్గిగా అన్నం దొరుకుతుందన్నదే – ఆమె చెప్పిన చిట్కా! కాశీనాథ్ ఆ సలహా పాటించాడు. అమోఘంగా పనిచేసింది. అంతేకాదు, కాశీనాథ్ జీవితచరిత్ర పరిశీలిస్తే ఆయన తన జీవితాంతం ఆ చిట్కాను గుర్తుంచుకొన్నాడని కూడా స్పష్టమవుతుంది.

కాశీనాథ్‌కి ఇక కళ్యాణ్‌లో ఉండ మనస్కరించలేదు. కళ్యాణ్ వదిలి ముందుకు సాగాడు. ఇంతలో తన తాతగారిని చూడాలని మనస్సులో గుబులుపుట్టింది. అంతే!

మరల తన ప్రయాణం దిశ మార్చి, సతానా వైపు నడవసాగాడు. దారిలో నాసిక్ దాటి, ఓ పది మైళ్ళు నడిచి చాంద్వాడి సమీపించేసరికి మధ్యాహ్నమైంది. అక్కడ రోడ్డు ప్రక్కనే ఒక శివాలయం కనిపిస్తే, కాసేపు విశ్రాంతి తీసుకుందామని అక్కడ నడుంవాల్చాడు. కనుచూపుమేర దూరంలో దట్టమైన అడవి, దాని మధ్య రీవిగా తలెత్తి చూస్తున్న బోర్గఢ్ కొండలు కనిపించాయి. ఒక కొండశిఖరం దగ్గర ఉన్న పెద్ద కొండరాయి మరుగున ఏదో గుహ తోచింది. అప్పటికే హృదయంలో బ్రతుకు మీద రోసివున్న కాశీనాథ్‌కు ఆ గుహచేరి అక్కడే మరణించే వరకు ప్రాయోపవేశం చేయాలని తీవ్రంగా అనిపించింది. వెంటనే బయలుదేరి ఆ కొండచేరి ప్రక్కనే ఉన్న ఒక చెట్టు ఆసరాతో ఎంతో కష్టం మీద నేల నుండి సుమారు 20, 30 అడుగుల ఎత్తున ఉండే ఆ గుహను చేరుకొన్నాడు. అది సుమారు నాలుగైదు అడుగుల ఎత్తు, తొమ్మిదడుగుల పొడవు, నాలుగడుగుల వెడల్పు ఉన్న చిన్న గుహ. అక్కణ్ణించి చూస్తే దూరంగా కనిపించే గవల్వాడి భిల్లుల గుడిశెలు తప్ప ఎక్కడా నరసంచారంలేదు. తన ప్రాయోపవేశానికి అదే తగిన ప్రదేశమని తృప్తిపడి, హఠం వేసుకుకూర్చుని, మరణం కోసం ఎదురుచూస్తూ, అలాగే రెండు రోజులు అన్నం, నీళ్ళు లేకుండా గడిపాడు. మూడవరోజున ఊరికే కూర్చొనడమెందుకని, మంత్ర జపం చేయడం మొదలెట్టాడు.

అలా కూర్చున్న కాశీనాథ్‌కు అప్రయత్నంగా సమాధిస్థితి లభించింది. దేశకాల పరిస్థితులు, పరిమితులు మనస్సు నుండి అదృశ్యమయ్యాయి. అలా ఎంత కాలం గడిచిందో తెలియదు. కానీ ఎవరో – పాము చర్మం వొలిచినట్లు – తన చర్మం ఒలుస్తున్నట్లు తోచింది. విపరీతమైన భయంతో కూడిన అదురుపాటుతో బాహ్యస్మృతి కలిగింది. చూస్తే తన ప్రక్కన ఎవ్వరూ లేరు! తన చర్మం మామూలుగానే ఉంది. ఆ భయం నుండి తేరుకొనేసరికి నాలుక విపరీతమైన దాహంతో పిడచగట్టుకు పోతున్నది. నీటి కోసం అరచినా తన అరణ్య రోదనం వినిపించుకొనే వారెవ్వరూ అక్కడ ఉండరని కాశీనాథ్‌కు తెలుసు. పోనీ వెళ్ళి ప్రయత్నిద్దామంటే, కాళ్ళు చేతులు చచ్చుపడిపోయి కదలించలేని స్థితిలో ఉన్నాయి. ఇక చెయ్యగలిగింది లేదు. మరణం తథ్యమని తోచింది. అయినా తానా గుహ చేరింది మరణించడంకోసమేననే విషయం గుర్తుకొచ్చి, నిస్పృహతో మళ్ళీ మగతలోకి జారిపోయాడు. ఇంతలో హఠాత్తుగా

ఉరుములు మెరుపులతో ఆకాశంలో మేఘాలుకూడి జడివాన కురిసింది. గుహలోకి ధారలుగా నీళ్ళు రాసాగాయి. వర్షానికి మేలుకొన్న కాశీనాథ్ వంగి తన ముందు మడుగు కట్టిన నీటితో నాలుక తడుపుకొన్నాడు. కొద్దిగా ఓపిక పుంజుకొని, ఆ నీటినే త్రాగాడు. దాహం తీరగానే మగతగా కళ్ళు మూతలుపడ్డాయి. ఆ స్థితిలో ఆయనకొక దివ్యదర్శనమైంది. అందులో తాను నీళ్ళు త్రాగేందుకు ఒక కాలువ దగ్గరికి పోతున్నట్లు, ఇంతలో ఒక హిందూ సాధువు, ఒక ముస్లిం ఫకీరు కనిపించి, తన శరీరం మీదున్న చర్మాన్ని ఒలిచేసి, లోపల ధగధగ మెరిసిపోతున్న దివ్యదేహాన్ని చూపుతూ, "చావాలనుకొంటున్నావా, ఏం? మేము నీ వెంటే ఉన్నాం. మేము నిన్ను చావనియ్యం!" అని అంటూ అదృశ్యమయ్యారు. కాశీనాథ్‌కి వెంటనే మెలకువ వచ్చింది. తననేదో దివ్యశక్తి అదృశ్యంగా ఉండి రక్షిస్తుందనీ, ఇప్పుడప్పుడే తన చావు వ్రాసిపెట్టిలేదనీ తీర్మానించుకొన్నాడు. శక్తి కూడగట్టుకొని అక్కడే నిలచివున్న నీటితో తన శరీరాన్ని నెమ్మదిగా మర్దన చేసుకొన్నాడు. చచ్చుపడిపోయిన అవయవాలు క్రమంగా కొంచెం స్వాధీనంలోకి వచ్చాయి. కానీ, అక్కణ్ణుంచి బయటపడడమెలా? గుహ అంచుచేరి, చేతికందిన చెట్టుకొమ్మ పట్టుకొని, భగవంతుడి మీద భారం వేసి, క్రిందకు దూకాడు. అంతెత్తు నుంచి క్రిందపడ్డా, స్వల్పంగా దోక్కుపోవడం తప్పించి ప్రమాదకరమైన గాయాలేమీ తగల్లేదు. లేచి నిలబడే ఓపిక కూడా లేని కాశీనాథ్, నెమ్మదిగా నేలమీద ప్రాకుతూ, సుమారు రెండుమైళ్ళ దూరంలోని భిల్లుల గుడిశెల దగ్గరకు చేరుకొన్నాడు. దయనీయమైన అతని పరిస్థితికి జాలిపడి, ఆ భిల్లులు అతనికి ఆహారమిచ్చి ప్రాణం నిలబెట్టారు. ఈసారి కాశీనాథ్‌కు తన 'కులం' అడ్డు రాలేదు! 'ఆపద్ధర్మం'గా భావించి ఆ భిల్లుల చేతి ఆహారంతో ప్రాణాలు నిలుపుకొన్నాడు. బాగా కోలుకొనేవరకు కొన్ని రోజులు అక్కడే ఉండి, ఆ తరువాత అడవిలో కట్టెలు కొట్టి, నాసిక్‌లో అమ్మి, వచ్చిన డబ్బు ఆ భిల్లులకిచ్చి తీర్చలేని వాళ్ళ ఋణాన్ని కొంచెమైనా తీర్చుకొన్నాడు. అలా అక్కడ కొన్ని వారాలుండి, జూలై 22, 1890న తిరిగి సతానాలోని తన ఇల్లు చేరాడు. ఇల్లు చేరాక క్యాలెండరు చూచి లెక్కకడితే తాను బోర్గఢ్ కొండగుహలో కొన్ని నెలల పాటు సమాధి స్థితిలో ఉన్నాడని తెలుసుకొని, తానే ఆశ్చర్యపోయాడు!

ఇది బాహ్యదృష్టికి గోచరించే కాశీనాథ్ జీవితం. అయితే, తన బాల్య జీవితం గురించి, తనకు కలిగిన వివిధ అనుభూతుల గురించి, శ్రీఉపాసనీ బాబా

దృక్పథమేమిటో, ఆయన మాటల్లోనే తెలుసుకుందాం. ఒకసారి తన బాల్యాన్ని గూర్చిన స్మృతులను వివరిస్తూ, శ్రీఉపాసనీబాబా ఇలా అన్నారు...

## 'తన్నుతానెరిగిన' మైనం ఎరిగించిన ఉపాసనీ!

తాము ఆధ్యాత్మికంగా అంత ఉన్నతస్థితికి ఎలా పరిణతి చెందారో వివరించమని 1930లో ఒకసారి శ్రీబి.వి.నరసింహస్వామిగారు శ్రీఉపాసనీబాబాను అడిగారు. దానికి శ్రీఉపాసనీబాబా, తన బాల్యస్మృతులను నెమరువేసుకొంటూ, ఇలా అన్నారు:

"నాకీ స్థితి ఎలా కలిగిందో, ఆ స్థితి పొందడానికి ముందు జరిగిన పరిణామ క్రమమేమిటో తప్పక చెప్తాను. కానీ, ఇది వినేముందు ఒక్క విషయం మాత్రం గుర్తుంచుకోవాలి! భగవత్సాక్షాత్కారమన్నది ఒక్క జన్మలో, ఒక నిర్ణీతకాలంలో చేసిన సాధన ఫలితం కాదు... నా ఈ ఆధ్యాత్మికస్థితి నేను ఎన్నో జన్మలుగా చేసిన సాధనల ఫలితమే..."

"ఏడేళ్ళ వయస్సులో నా మనఃస్థితి ఎలా ఉండేదో చెప్తాను. సాధారణంగా అది ఆత్మవిచారం గురించి పట్టించుకొనే వయస్సు కాదు. కానీ, నేను మాత్రం ఆ వయస్సులోనే తరచు ఏకాంతంలో కూర్చుని ఆత్మవిచారణలో మునిగి ఉండేవాడిని".

"ఆ రోజుల్లో, మా నాన్నగారు, మా చిన్నాన్నగారు, మా తాతగారు జీవనోపాధికై ఎంతో శ్రమించడం చూస్తూండేవాణ్ణి. వారంత శ్రమపడుతుండడం చూస్తుంటే నాకు చాలా బాధగా ఉండేది. ఏ శరీరం కోసం అంత శ్రమపడుతున్నారో అది చివరకు ఏ మాత్రం కృతజ్ఞత చూపించదు కదా" – అని అనిపించేది. మా పొరుగున ఉండే ఒక వ్యక్తి హఠాత్తుగా కలరాతో మరణించడం నేను చూచాను. ఆ సంఘటన నన్నెంతో ప్రభావితం చేసింది. ఈ ప్రపంచం అశాశ్వతమనీ, ఈ దేహపోషణకు శ్రమపడడం ఉత్త తెలివితక్కువతనమని నాకు తేలింది.

నేను స్కూలు మానేసిన తరువాత మా తాతగారు నాకు చదువు చెప్పేవారు. ఆయన నాచే అమరకోశం వల్లె వేయించేవారు. పుస్తకం పట్టుకొని కూర్చుంటే, "అబ్బా! ఎన్ని పదాలున్నాయి దీన్లో! వీటినన్నింటినీ కంఠస్థం చెయ్యటం వల్ల ఏమిటి ఉపయోగం? మహా అయితే సంస్కృతం ధారాళంగా వ్రాయగలుగుతాను. అంతే

కదా?" అని అనిపించి, గిర్రున కంట్లో నీళ్ళు తిరిగేవి. ఒకసారి నా కన్నీళ్ళు చూచి మా చిన్నాన్నగారు, 'ఎందుకేడుస్తున్నావ'ని అడిగారు. ఏమీ దాచుకోకుండా నా బాధంతా ఆయనతో వెళ్ళబోసుకొన్నాను, నా వేదాంత ధోరణికి మా పెద్దవాళ్ళు ఆశ్చర్యపోయారు. అయితే వారు నన్ను సమర్థించలేదు సరికదా, నా ఆలోచనా పంథా మార్చడానికి ప్రయత్నించేవారు. కానీ, నేను మాత్రం నా ధోరణి విడిచిపెట్టలేదు.

"నాకు పట్టుదల, ధైర్యం జాస్తిగా ఉండేవి. ఏదైనా ఆలోచన వస్తే వెంటనే ఆచరణలో పెట్టడానికి ఏ మాత్రం జంకేవాణ్ణికాదు. ఆ తరువాత వచ్చే పరిణామాల గురించి అసలు ఆలోచించేవాణ్ణికాదు. నా స్థూలశరీరం కంటే నేను అన్యంగా ఉన్నాననే స్పృహ నా చిన్ననాటి నుండి నాలో ఉంది. ఒకసారి దాన్ని పరీక్షించేందుకు, తిరుగుతున్న ఒక కొయ్యచక్రంలో వేలుపెట్టాను. నా వేలు నలిగిపోయి, పెద్ద గాయమైంది. నేను తాత్వికచింతనకు బాగా అలవాటుపడ్డప్పటికీ ఆచార కర్మకాండను మాత్రం మానలేదు. పెద్దల తృప్తికోసం వారు చెప్పినట్లు అన్నీ (ఆచారకాండ) చేసేవాడిని. వాటివల్ల ఏం ఉపయోగమో నాకర్థమయ్యేదికాదు".

"ఆ రోజుల్లో నా దేహం పట్ల ఎంత జుగుప్స కలిగేదంటే, ఆత్మహత్య చేసుకొని దేహాన్ని విసర్జించాలనిపించేది. క్రమంగా ఆ భావం ఇంకా ఇంకా బలపడింది. అయితే, ఆత్మహత్య చేసుకొనే బదులు, హనుమంతునిలాగా ఆమరణాంతం ప్రాయోపవేశం చెయ్యాలని అనుకొన్నాను. ఎందుకంటే, అలా చెయ్యడం పాపంకాదు కనుక! ఇంటి నుండి పారిపోయి ఎక్కడైనా ఏకాంత ప్రదేశంలో కూర్చుని ప్రాయోపవేశం చేయాలని నిశ్చయించుకొన్నాను. ఏ పని చేస్తున్నా ఆ నా నిర్ణయం నుండి మనస్సు మరలేదికాదు. బాహ్యంగా చూస్తే, నా ప్రవర్తనకు, ఇతరుల ప్రవర్తనకు ఏమీ భేదం కనిపించకపోయినా, నాకు ఇతరులకు హస్తిమశకాంతరం భేదం ఉండేది. ఇతరులు తినడం తాగడం సుఖించడమే పరమార్థమనుకొంటే, నా మనస్సు మాత్రం వాటిపట్ల విముఖంగా ఉండేది.

"దేహత్యాగం" చేసుకొందామనే ఉద్దేశ్యంతో ఒకనాడు ఇల్లు వదలి బయల్దేరాను. కళ్యాణ్ దాటి సతానా వైపు పోతుండగా దారి ప్రక్కన ఒక గుడి కనిపించింది. అక్కడి నుండి చూస్తుంటే ఒక కొండ శిఖరం నా దృష్టినాకర్షించింది. నేను ఎంతోకాలంగా అన్వేషిస్తున్న ఏకాంతప్రదేశం అదేనని తోచింది. అది నాకనువైనదో కాదో చూద్దామని

వెంటనే అక్కడికి బయలుదేరాను. అక్కడికి చేరేసరికి చీకటిపడడంతో వెనక్కి తిరిగి రావడానికి సాధ్యంకాలేదు. ఆ రాత్రి అక్కడే గడపడానికి సిద్ధపడ్డాను. ఇల్లయితేనేమి? అడివైతేనేమి? నాకు పెద్ద తేడా ఏమీ తోచేదికాదు. ఆ రాత్రంతా అక్కడే గడిపాను.

అక్కడ మామూలుగా సుఖాసనంలో కూర్చోనున్నాను. కొంతసేపటికి ప్రాపంచికమైన ఆలోచనలన్నీ ఒక్కసారి మాయమయ్యాయి! నా (స్థూల) దేహస్ఫురణ మాత్రం తెలుస్తున్నది. మొదట మృత్యువు కోసం ఎదురుచూస్తూ కూర్చున్నాను. కానీ తరువాత, దాని ఇష్టం వచ్చినప్పుడు అదే వస్తుందనిపించింది. ఊరక కూర్చునే కంటే భగవన్నామం చేసుకోవడం ఉత్తమం కదా– అని తోచింది. కానీ నా మనస్సు నామంలో కూడా మగ్నంకాలేదు. ఒక్కసారిగా మనస్సు నిరామయమై నన్ను నేను సాక్షిగా చూస్తుండిపోయాను. దాన్నే సమాధిస్థితి అంటారు. మానవ జీవితానికి పరమ గమ్యం అదే! ఆ స్థితి పొందినవాడు అనంతమైనశక్తిని, తిరుగులేని ఆనందాన్ని అనుభవిస్తాడు. యోగాభ్యాసంలో అదే చివరిమెట్టు!"

## కలిమిలేముల కడలి కెరటాలపై కాశీనాథ్!

బోర్గఢ్ కొండగుహలో శ్రీకాశీనాథ్ పొందిన ఆధ్యాత్మికస్థితిని గూర్చిన వివరం పదిమందికీ తెలిసింది. 'ఎందుకూ పనికిమాలినవాడ'నీ, 'జులాయి'యనీ తన బంధు వర్గాలలో కాశీనాథ్‌కున్న ముద్ర క్రమంగా చెరిగిపోయి, దాని స్థానే సంఘంలో గౌరవం పెరిగింది. అంతేగాక ఆ సంఘటన కాశీనాథ్‌లో కూడా ఎంతో ఆత్మవిశ్వాసాన్ని కలిగించింది.

శ్రీకాశీనాథ్ బోర్గఢ్ గుహ నుండి స్వగృహానికి తిరిగి వచ్చిన 18 రోజులకు – అంటే తే. 8–8–1890దిన, కాశీనాథ్ తండ్రిగారు దివంగతులైనారు. తన తాతగారైన గోపాలశాస్త్రిగారు కూడా పక్షవాతంతో మంచానపడ్డారు. పక్షవాతంతో తీసుకొంటున్న తన తాతగారిని కనిపెట్టుకొని ఉండి సేవచేస్తూ, వేళకు మందులు ఇవ్వడం మొ॥న బాధ్యతలన్నీ కాశీనాథ్ వహించాడు. తన తాతగారి వైద్యం నిమిత్తం ఆయుర్వేద వైద్యులు చెప్పిన విధంగా మందులు కొని తేవడం, మందులు నూరడం మొ॥ పనులు చేస్తూ ఉండటం వలన, కాశీనాథ్‌కు ఆయుర్వేద వైద్యంతో పరిచయం కలిగి, ఆ వైద్యం నేర్చుకోవాలనే అభిలాష కూడా కలిగింది. ఆ మరుసటి సంవత్సరం (అంటే 1891లో)

శ్రీగోపాలశాస్త్రిగారు మరణించారు. అప్పటికే కుటుంబం ఆర్థికంగా బాగా చితికిపోయి పూర్తిగా అప్పుల్లో మునిగివుంది. ఆ తరువాత సుమారు ఒక్క సంవత్సరంపాటు కేవలం లోకమాన్య శ్రీబాలగంగాధర్ తిలక్ అందజేసిన భృతిమీద ఆధారపడి కుటుంబం గడిచింది. ఆ కాలంలోనే కాశీనాథ్ రెండవ భార్య కూడా గతించింది. ఈలోగా కాశీనాథ్ అన్నగారైన బాలకృష్ణశాస్త్రి ఎంతో కష్టపడి కుటుంబాన్ని నెట్టుకొస్తున్నాడు. కాశీనాథ్ కూడా ఆయుర్వేదం నేర్చుకొని, వైద్యవృత్తి చేద్దామనే ఉద్దేశ్యంతో సాంగ్లీ వెళ్ళి, అక్కడ ఎలాగో కష్టపడి తనను తాను పోషించుకొంటూ, శ్రీవెంకటరమణాచార్య అనే ప్రసిద్ధ ఆయుర్వేద వైద్యుని వద్ద శిష్యుడిగా చేరి ఆయుర్వేదం, సంస్కృతం నేర్చుకోసాగాడు.

మొదట జలగాంలో వైద్యవృత్తి ప్రారంభించాడు కాశీనాథ్. ఆ తరువాత 1896లో, ప్రఖ్యాత న్యాయవాది, స్టేట్ కౌన్సిల్ సభ్యుడుయైన శ్రీజి.ఎస్.ఖాపర్డే సహాయంతో అమరావతిలో వైద్యవృత్తి చేపట్టాడు. స్వతంత్రంగా ఒక వైద్యశాల ప్రారంభించి స్వంతంగా కొన్ని మందులు తయారు చెయ్యడమే గాక, 'భేషజరత్నమాల' అనే వైద్య విషయక మరాఠీ మాసపత్రికను కూడా ప్రచురించసాగాడు. అమరావతిలో స్థిరపడడానికి ముందే కాశీనాథ్‌కి మూడవ వివాహం జరిగింది.

ఆదిలోనే హంసపాదన్నట్లు కాశీనాథ్‌కు 1896లోనే ఒక దురదృష్టకరమైన సంఘటన జరిగింది. జలగావ్‌లోని ఒక దేవాలయంలో ఎవరో ఇచ్చిన ప్రసాదాన్ని తన చేతులమీదుగా అక్కడున్న భక్తులకు పంచాడు కాశీనాథ్. ఆ ప్రసాదంలో పొరబాటున ఏదో విషపదార్థం కలసి ఉండటంతో అది తిన్న వారందరూ తీవ్ర అస్వస్థతకు గురయ్యారు. వారిలో కొందరు మరణించారు కూడా. ఈ దుర్ఘటనలో కాశీనాథ్ దోషమేమీ లేకపోయినా, దానికి నిమిత్తమాత్రుడయ్యాడు గనుక ప్రభుత్వం ఆ కేసు విచారించి, కాశీనాథ్‌కు నాలుగు నెలల సాధారణ జైలుశిక్ష విధించింది.

మామూలుగా అయితే వృత్తిపరంగా కాశీనాథ్‌కు అది పెద్ద దెబ్బ. కానీ చిత్రమేమంటే, ఆ తరువాతే కాశీనాథ్‌ను భాగ్యదేవత వరించింది. క్రమంగా ఆ తర్వాత పదేళ్ళలో వైద్యవృత్తిలో బాగా పుంజుకొని అమరావతి, నాగపూర్‌లలో గొప్ప వైద్యునిగా ప్రసిద్ధి పొందాడు. సంతానం లేదన్న ఒక్క కొరత తప్ప, అనుకూలవతియైన భార్య, డబ్బు, పేరుప్రతిష్ఠలతో కాశీనాథ్ జీవితం సంతోషంగానే దొర్లిపోసాగింది.

(కాశీనాథ్‌కు తన మూడవ భార్యవల్ల ఒక బిడ్డ కలిగినా, ఆ బిడ్డ పుట్టిన నెలరోజులలోనే మరణించింది.)

శ్రీకాశీనాథ్ జీవితం అలాగే కొనసాగి ఉంటే 'డా॥కాశీనాథ్'గానే ఆయన జీవితం అంతమైయుండేది! కాశీనాథ్ తన సద్గురు మహిమావిశేషంవల్ల 'ఉపాసనీబాబా మహరాజ్'గా ప్రకటమై ఉండేవాడేకాదు! ఏదో సాహసం చెయ్యకుండా సాఫీగా జీవితం గడపడం కాశీనాథ్ ప్రవృత్తికే విరుద్ధం! ఆ రాజుల్లోనే గ్వాలియర్ సమీపానగల కొన్ని ఎస్టేట్లు అతి చౌకగా అమ్మకానికి ఉన్నాయనే వార్త కాశీనాథ్‌లో దురాశను రేకెత్తించింది. ముందుగా సుమారు రూ. 600/– లు చెల్లించి దాదాపు 2000 ఎకరాల ఎస్టేటుకు జమీందారు (మల్‌గుజార్) అయ్యే అవకాశాన్ని జారవిడుచుకోదల్చుకోలేదు. ముందూ వెనుక ఆలోచించకుండా వైద్యుడుగా తాను ఆదా చేసిన పైకం వెచ్చించి ఒక ఎస్టేటు కొనుగోలు చేసి, వైద్యవృత్తిని మానుకొని ఆ ఎస్టేటుకు నివాసం మార్చాడు. కానీ, ఆ ఎస్టేటు వ్యవహారంలో దిగాకగానీ కాశీనాథ్‌కు దాన్లో ఉండే సాధకబాధకాలు తెలిసిరాలేదు. క్రొత్త ప్రదేశం కావడం, ఎస్టేటు అద్దెలు సరిగ్గా వసూలు కాకపోవడం, అంతకు మునుపున్న మల్‌గుజార్లలతో వైరం, కోర్టు వ్యాజ్యాలు మొ॥న ఎన్నో సమస్యల వల్ల ప్రభుత్వానికి తక్కిన వాయిదాలు చెల్లించలేక, ఉన్నది కూడా పూర్తిగా తుడిచిపెట్టుకొనిపోగా, ఆ ఎస్టేటు 'భూతాన్ని' వదిలించుకొని రెండు సంవత్సరాల తరువాత మళ్ళీ అమరావతి చేరాడు. వైద్యవృత్తి ఒకసారి మానివేస్తే, మళ్ళీ పుంజుకోవడం కష్టం. కాశీనాథ్ విషయంలోనూ అదే అయ్యింది. అదీగాక, ఎస్టేటు గొడవలు, సమస్యలవల్ల కాశీనాథ్ ఆరోగ్యం కూడా దెబ్బతిన్నది. పోనుపోనూ తన రాబడి పూర్తిగా సన్నగిల్లడంతో, వైద్యవృత్తి పూర్తిగా మానివేశాడు. మనశ్శాంతి కోసం 1910 ఏప్రిల్ 10వ తేదీన సతీసమేతంగా పుణ్యక్షేత్రాలు దర్శించేందుకు బయల్దేరాడు.

ఈ మధ్యకాలంలో మామూలుగా చేసే పూజ, పునశ్చరణ మొ॥నవి తప్ప చెప్పుకోదగ్గ ఆధ్యాత్మికానుభూతులు పొందలేదు, ఏ సాధనలూ కాశీనాథ్ చెయ్యలేదు.

### ఉపాసనీకి 'ఊపిరి' పోయగల సద్గురువెవరో

కాశీనాథ్ దంపతులు తీర్థయాత్రలు చేస్తూ, నర్మదానదీతీరాన, అడవి మధ్యలో ఉన్న ఒక చిన్న కొండపై నిర్మించబడ్డ సోమనాథ గౌరీ శంకరాలయాన్ని దర్శించారు.

కాశీనాథ్‌కు అక్కడి ప్రశాంతత, సాధనకెంతో అనుకూలంగా తోచింది. ఆలయం లోపల, అక్కడి ఓంకార లింగం ప్రక్కన, నిశ్చింతగా కూర్చుని ఎంతో కాలం క్రితం మానివేసిన ప్రాణాయామం అభ్యసించడం మొదలుపెట్టాడు.

బోర్గఢ్ కొండల్లో కలిగిన దివ్యానుభవం తరువాత ఎంతోకాలం గడిచినప్పటికీ, శ్రద్ధగా యోగాభ్యాసం ప్రారంభించేసరికి, పాత సంస్కారం మేల్గొని, కాశీనాథ్ శ్వాస కేవలకుంభకంలో నిలచిపోయి, మనస్సు సమాధి స్థితిలో లయమైంది. కాసేపటికి కాశీనాథ్ భార్య యథాలాపంగా తన భర్తవైపు చూచింది. ఉచ్ఛ్వాసనిశ్వాసాలు లేకుండా అచేతనంగా పడివున్న భర్తను గమనించి భయభ్రాంతురాలైంది. ఆందోళనతో వెంటనే ఏం చెయ్యడానికి పాలుపోక, ప్రక్కన ఉన్న నీటిని కాశీనాథ్ ముఖంపై చిలకరించి, బలంగా కుదిపిలేపింది. ఆ చర్యతో కాశీనాథ్‌కు హఠాత్తుగా ఒక్కసారి బాహ్యస్మృతి కలిగింది. సమాధిస్థితి నుండి మనస్సులో సంకల్పము, శ్వాసప్రక్రియ నెమ్మదిగా మొదలై సాధారణ స్థితికి రావాలి. కానీ ఈ హఠాత్పరిణామం వల్ల బాహ్యస్మృతి ఒక్కసారిగా కలిగిందిగానీ, అంత వేగంగా శ్వాసప్రక్రియ పుంజుకోలేదు. కాశీనాథ్ ఉక్కిరిబిక్కిరై బలవంతంగా శ్వాస తీసుకోవడానికి ప్రయత్నించడంలో, శ్వాస ప్రక్రియకు సంబంధించిన కొన్ని కండరాలు, నాడీమండలం అదుపు కోల్పోయాయి! చాలా సహజంగా అప్రయత్నంగా జరుగవలసిన ఉచ్ఛ్వాసనిశ్వాసాలు పూనికతో ప్రయత్నిస్తేగానీ జరుగని పరిస్థితి కలిగింది. శ్వాస తీసుకుంటుంటే గురకవంటి శబ్దం రాసాగింది. కాశీనాథ్ దంపతులు నాగపూర్ తిరిగి వెళ్ళారు. కానీ, శ్వాస సమస్య మాత్రం తీరలేదు. బలవంతంగాగాని శ్వాస ఆడకపోవడంతో, నిద్రపోతే ఒకవేళ నిద్రలో శ్వాస ఆగి మరణిస్తానేమోననే తీవ్రభయం శ్రీకాశీనాథ్‌కు పట్టుకుంది. దాంతో నిద్ర కూడా పట్టేదికాదు. అంతేకాదు! ఘనపదార్థాలేమైనా నమిలి మ్రింగాలన్నా, మలవిసర్జన చెయ్యాలన్నా కష్టమయ్యేది. ఆ స్థితి ఎంత దుర్భరమో ఎవరయినా ఊహించవచ్చు!

తన ఆరోగ్యమే అంత ప్రమాదకరంగా ఉన్నప్పుడు ఇక కాశీనాథ్ ఇతరులకేమి వైద్యం చెయ్యగలడు? అందువల్ల, వైద్యవృత్తిని ప్రక్కన పెట్టి, తన ఆరోగ్యం బాగు కోసం ఎందరో ప్రముఖ వైద్యులను సంప్రదించాడు. కానీ, వారికెవరికీ కాశీనాథ్ వ్యాధి తత్వం, చికిత్స బోధపడలేదు. అది వైద్యచికిత్సకు లొంగే సాధారణ 'వ్యాధి'

కాదనీ, ప్రాణాయామాభ్యాసంలో వచ్చిన ఆ రుగ్మతకు, హఠయోగంలో నిష్ణాతులైన యోగులే నివారణ మార్గం చూపగలరనీ తేల్చి చెప్పారు.

అలా ప్రముఖ వైద్యులే తమ నిస్సహాయత ప్రకటించడంతో, కాశీనాథ్ ఇక తన ఆరోగ్యం మెరుగవడం కల్ల అని భావించాడు. ఏ క్షణాన్నైనా మరణం తథ్యమని తలచి, ఆఖరి క్షణాల్లోనైనా తన బంధుమిత్రుల మధ్య గడపాలని, స్వగ్రామమైన ధూలియా చేరాడు. వైద్యం మీద ఆశచావక, ఎన్నో రకాల మందులు వాడాడు. కాశీనాథ్ రుగ్మత పూర్వజన్మ కర్మఫలమనే విశ్వాసంతో, తన మాంగల్యబలం కోసం కాశీనాథ్ భార్య ఔదుంబర వృక్షం చుట్టూ 1,25,000 ప్రదక్షిణలు చేసింది. కానీ, కాశీనాథ్ పరిస్థితి ఏ మాత్రం మెరుగవలేదు.

అలా సుమారొక ఏడాది గడిచాకగానీ, ఎవరైనా గొప్ప యోగులను దర్శించి, నివారణోపాయం తెలుసుకోవాలనే సలహా గట్టిగా కాశీనాథ్ మనసుకెక్కలేదు. కానీ, అటువంటి ఉత్తమ యోగులెక్కడున్నారని నేరుగా వెళ్ళడం? అందుకని, ఇద్దరు కుర్రవాళ్ళను తనకు సహాయంగా తీసుకొని 1911 ఏప్రిల్‌లో యోగుల కోసం అన్వేషిస్తూ ప్రయాణమయ్యాడు. ఒకటి రెండు రోజుల తరువాత ఆ యువకులను కూడా వెనక్కి పంపివేసి, ఒక్కడే తన జీవన్మరణ సమస్యను పరిష్కరించగల సద్గురుమూర్తి కోసం అన్వేషణ ప్రారంభించాడు!

## పారిపోదామనుకున్నా పోగలిగేదెక్కడికి?

తన రుగ్మతను నివారించగల యోగసిద్ధుని కోసం అన్వేషిస్తున్న ఉపాసనీకి, అహ్మద్‌నగర్ సమీపాన గల రాహురీ అనే ఊరిలో కులకర్ణి అనే గొప్ప యోగి ఉన్నాడని తెలిసింది. వెంటనే రాహురీ వెళ్ళి ఆ యోగిపుంగవుణ్ణి దర్శించి తన బాధ వెళ్ళబోసుకున్నాడు. ఆ మహాత్ముడు కాశీనాథ్ అస్వస్థతకు చికిత్స సూచించడానికి బదులు, కాశీనాథ్ చాల గొప్ప యోగస్థితిలో ఉన్నాడనీ, అతడి సుషుమ్నానాడి ఎటువంటి ప్రయత్నం లేకనే మేల్కొన్నదనీ, ఆ స్థితి చాల అరుదైనదనీ వివరించాడు. అంతటి ఉన్నతస్థితినందిన కాశీనాథ్‌ను ముందుకు నడిపించగల సమర్థుడు శిరిడీలో ఉన్న ఔలియా సాయిబాబానేనని, వెంటనే బాబాను దర్శించమని సలహా ఇచ్చాడు. కానీ "ఔలియా" "సాయి" అన్న మాటలు విన్న ఉపాసనీకి సద్బ్రాహ్మణుడైన తాను

ఒక మహమ్మదీయుణ్ణి ఆశ్రయించడానికి మనస్కరించలేదు. శ్రీసాయిబాబా అన్ని కులమతభేదాలకతీతుడని ఆ యోగి ఎంత నచ్చచెప్పజూచినా, కాశీనాథ్ తన జాత్యహంకారాన్ని వదలలేకపోయాడు! కులాభిజాత్యం ఎంతటివారి వివేకాన్నైనా ఇట్టే మాయం చెయ్యగలదనడానికి ఇదో దృష్టాంతం.

ఒకసారి రాహురీ దారమ్మట పోతుండగా, కాశీనాథ్‌కు ఒక వృద్ధుడు ఎదురు పడి, తనకై తానే కాశీనాథ్ సమస్యను గూర్చి అడిగి, “ఇదేమంత పెద్ద సమస్య కాదు. ఇది వాతప్రకోపం. నీవు భరించగలిగినంత వేడిగా వేడినీళ్ళు త్రాగుతుండు, నీ ఆరోగ్యం చక్కబడుతుంది. చల్లని నీరు మాత్రం ముట్టుకోవద్దు” అని చెప్పి వెళ్ళిపోయాడు. దారమ్మటపోయే దానయ్య ఉచిత సలహాలను ఎవరు మాత్రం లెక్కచేస్తారు? కాశీనాథ్ కూడా ఆ వృద్ధుని అయాచిత సలహాను పెడచెవిన పెట్టి, మోరేగావ్ అనే ఊళ్ళో పారక్ అనే ఒక (హిందూ) యోగి ఉన్నాడని తెలిసి, ఆయన దర్శనం కోసం బయలుదేరాడు. దారిలో జజూరీ అనే ఊరి దగ్గరకు రాగానే కాశీనాథ్‌కు హఠాత్తుగా తన జీవితంపై, ఆరోగ్యంపై విరక్తి కలిగి, అక్కడే దారి ప్రక్కన ఒక జిల్లేడుపొదలో కూర్చుని ధ్యానస్థుడయ్యాడు. ఆకలి వేసినప్పుడు ఆ జిల్లేడుపండ్లు కోసుకొని తినేవాడు! అలా ఏడు రోజులు కూర్చున్నాడు. ఎనిమిదవరోజు విపరీతంగా దాహంవేసి నీటికోసం ప్రక్కనే పారుతున్న ఒక వాగు దగ్గరకు పోయాడు. ఆ వాగులోని చల్లని నీటిని దోసిట్లోకి తీసుకోబోతుండగా కాశీనాథ్‌కు అంతకు మునుపు రాహురీలో కనబడ్డ వృద్ధుని హెచ్చరిక స్ఫురణకు వచ్చింది. మనస్సులో ఆ వృద్ధుని గురించి ఆలోచన రావడమేమిటి, విచిత్రంగా ఆ వృద్ధుడు అతనికి పోతూ కనిపించాడు. కాశీనాథ్‌ను చూచి ఆ వృద్ధుడు కోపంగా, “వేడినీళ్ళు తప్పిస్తే చన్నీళ్ళు త్రాగవద్దని చెప్పాను కదా? పో! పోయి ప్రక్క గ్రామంలో ఎవరినైనా వేడినీళ్ళు అడిగి త్రాగు!” అని తీవ్రంగా మందలించాడు. కాశీనాథ్ నివ్వెరపోయి చూస్తుండగానే అదృశ్యుడయ్యాడు. కాశీనాథ్ కిక్కురుమనకుండా ప్రక్క గ్రామానికి వెళ్ళి అక్కడ చింతోపంత్ చెల్సారే అనే గృహస్థు ఇంట్లో వేడినీళ్ళు త్రాగగానే, కాశీనాథ్‌కి విపరీతంగా చెమట పోసింది. తరువాత కాశీనాథ్ శ్వాససంబంధమైన రుగ్మత చాలావరకు తగ్గిపోయింది.

ఇక్కడ గమనించవలసిన విషయం ఏమిటంటే, రహస్య యోగశాస్త్రగ్రంథాలలో జిల్లేడు, వేడినీళ్ళు, తీవ్ర యోగాభ్యాసంలో ఒక్కోసారి సంభవించే ‘వాతహతానికి’

పథ్యంగా (చికిత్సగా) చెప్పబడి ఉంది. వినాయకుణ్ణి లంబోదరుడుగా చిత్రిస్తూ ఆయనకు జిల్లేడు నైవేద్యంగా సమర్పించడంలోని రహస్యార్థమిదే. తన భక్తుణ్ణి తానెప్పుడు 'పతనం' కానివ్వక కంటికి రెప్పవలె కాపాడుతానని ప్రతిజ్ఞ చేసిన ఆ సద్గురువే, కాశీనాథ్‌కు అతనికి తెలియకుండానే చికిత్స చేశాడు. మరో విషయమేమిటంటే, వేడినీళ్ళ కోసం యాదృచ్ఛికంగా కాశీనాథ్ యాచించిన చింతోపంత్ కుటుంబీకులు మంచి సాయిభక్తులు! ఆ వేడినీళ్ళ వైద్యం మంచి గుణం చూపడంతో ఆ చికిత్సనే పాటిస్తూ, సుమారు 20 రోజులు జజూరీలోనే గడిపాడు కాశీనాథ్. ఆ వ్యవధిలో అతని ఆరోగ్యం పూర్తిగా కుదుటపడి, స్వస్థత చేకూరింది. ఇక ఇంటికిపోయి వైద్యవృత్తి ప్రారంభిద్దామనుకొన్నాడు కానీ, తన రుగ్మత ఇంకా శాశ్వతంగా నయం కాలేదేమోననే అనుమానం పీడించడం మొదలైంది. ఎందుకైనా మంచిదని అంతకుముందు అనుకొన్న ప్రకారం పాఠక్ యోగిని దర్శించడానికి మోరేగావ్ వెళ్ళాడు. కానీ, ఆ సమయానికి అక్కడ ఆ యోగి లేడు. అక్కడి నుండి, ప్రసిద్ధ సిద్ధపురుషుడు, దత్తావతారంగా ప్రఖ్యాతుడయిన శ్రీనారాయణ మహరాజ్‌ను దర్శించడానికి ఖేడ్‌గాంభేట్ వెళ్ళాడు.

కాశీనాథ్‌ను చూడగానే శ్రీనారాయణమహరాజ్ చూపిన ఆదరణకు కాశీనాథ్ ఉక్కిరిబిక్కిరయ్యాడు. ఆ మహాత్ముడు కాశీనాథ్‌కు తాంబూలం ఇచ్చి వేసుకోమని, "నీ లోపల, బయట బంగారువన్నె పూత పూసి ఉంది. మనం మాట్లాడుకోవలసిన పనేంలేదు" అన్నారు. కాశీనాథ్ మళ్ళీ మరుసటి రోజున శ్రీనారాయణమహరాజ్‌ను దర్శించగానే శ్రీమహరాజ్, "మళ్ళీ ఎందుకొచ్చావ్? నీవు నావద్దకు రావలసిన అవసరంలేదు. నీ పని ఎప్పుడో పూర్తయింది!" అన్నారు. కాశీనాథ్‌కు ఆ మాటలేమీ బోధపడలేదు. తన 'పని' అంటే తన 'ఆరోగ్య విషయం' అని అనుకొన్నా, 'లోపల, బయట పూతపూసి ఉండడం' విషయం ఏమిటో అర్థం కాలేదు.

తన ఆరోగ్యం పూర్తిగా బాగైందనే నిశ్చయానికొచ్చి, ఇక ఇంటికి బయల్దేరాడు. తాను తిరిగి ఇంటికి బయలుదేరి వస్తున్నట్లు తన అన్నగారికి ఉత్తరం కూడా వ్రాశాడు. దారిలో ఎందుకో యోగి కులకర్ణిగారిని దర్శించాలనిపించి, ఆయన దగ్గరకెళ్ళాడు. కులకర్ణియోగి తిరిగి కాశీనాథ్‌ను శ్రీసాయిబాబాను దర్శించమని మరీ మరీ ఒత్తిడి చేశాడు. ఆ మహాత్ముడు అంతగా చెప్తుంటే, ఆ మాట తోసెయ్యలేక కాశీనాథ్ శిరిడీ వెళ్ళి (1911 జూన్ 27వ తేదిన) ప్రథమంగా శ్రీసాయిబాబాను దర్శించాడు.

శిరిడీలో ఒకటి రెండురోజులుండి ఇంటికి వెళ్ళడానికి బాబాను సెలవు కోరాడు కాశీనాథ్. బాబా అనుమతించలేదు. తాను ఇంటికి వెళ్ళి తీరాలని ఇంకా శిరిడీలో ఉండడం వీలుకాదని పట్టుబట్టాడు కాశీనాథ్. వెళ్ళి ఎనిమిదిరోజుల తరువాత మళ్ళీ శిరిడి తిరిగివచ్చే షరతు మీద అనుమతిస్తానన్నారు బాబా. తనకున్న ఆర్థిక తదితర సమస్యల దృష్ట్యా అది కూడా సాధ్యపడదన్నాడు కాశీనాథ్. అయితే శిరిడీలోనే ఉండమన్నారు బాబా. కాశీనాథ్‌కు ఏమి చెయ్యడానికీ పాలుపోలేదు. మనస్సులో కటకటపడుతూ దిగాలుపడి కూర్చున్నాడు. అది గమనించి బాబా ***"ఏమి చెయ్యడానికీ నీకు పాలుపోతున్నట్లులేదు. సరే నీవంతగా వెళ్ళదలచుకొంటే వెళ్ళు, వెళ్ళగలిగితే! నేను చెయ్యగలిగినదేదో నేను చేస్తాను"*** అన్నారు. ఆ మాటలకు బాబా తాను వెళ్ళడానికి అనుమతించారని భావించి కాశీనాథ్ శిరిడీ విడిచి ఇంటి దారిపట్టాడు. చేతిలో చిల్లిగవ్వ లేకపోవడంచేత ఇంటికి చేరాలని ఎంత ఆతృతగా ఉన్నా, నడకతప్ప వేరే గత్యంతరంలేదు. కాశీనాథ్ దారిలో గ్రామాలలో ఆగి విశ్రాంతి తీసుకుంటూ ఇంటిదారిపట్టి నడవసాగాడు. ఏడురోజులు గడిచి, ఎనిమిదవరోజున విచారిస్తే తాను శిరిడీకి ఎనిమిదిమైళ్ళ దూరంలో ఉన్న కోపర్‌గాం చేరాడని తెలుసుకొని దిగ్భ్రాంతుడయ్యాడు. కోపర్‌గాంలో ఒక బ్రహ్మచారి బువావద్ద బసజేశాడు. ఆ బ్రహ్మచారి ఎందుకో కాశీనాథ్‌ను చూడగానే శిరిడీ వెళ్ళమని ఉద్బోధించసాగాడు. కానీ, కాశీనాథ్ అతని మాటలు వినిపించుకోలేదు. ఇంతలో బండిలో శిరిడీ వెళుతున్న ఒక యాత్రికుల బృందం అక్కడికొచ్చి, అక్కడి నుండి తమకు శిరిడీ దారి చూపే వారెవరైనా కావాలని అడిగారు. బ్రహ్మచారి వారికి కాశీనాథ్‌ను చూపాడు. వాళ్ళు కాశీనాథ్‌ను ఎంతో బలవంతంచేసి, ఒప్పించి తమతో శిరిడీ తీసుకెళ్ళారు.

కాశీనాథ్ శిరిడీ చేరి బాబాకు నమస్కరించగానే, బాబా అతడితో ఇలా అన్నారు:

బాబా : *వచ్చావా? నీవిక్కణ్ణించి ఎప్పుడు వెళ్ళావు?*

కాశీనాథ్ : పోయిన గురువారం.

బాబా : *ఇక్కణ్ణుండి ఎన్ని గంటలకు బయలుదేరావు?*

కాశీనాథ్ : మూడు గంటలకు.

బాబా : *ఈ రోజు ఏం వారం?*

కాశీనాథ్ : గురువారం.

బాబా : *ఇప్పుడు ఎన్ని గంటలు అయింది?*

కాశీనాథ్ : మూడు గంటలు.

బాబా : *నీవిక్కడ నుండి బయలుదేరి సరిగ్గా ఎంత కాలమైంది?*

కాశీనాథ్ : వారం రోజులైంది....ఈ రోజుకు ఎనిమిది రోజులు.

బాబా : *అలాగా? అయితే ఇక్కడ నుంచి వెళ్ళేముందు ఎనిమిదిరోజుల్లో ససేమిరా తిరిగి రానంటివే.*

కాశీనాథ్ : ఇది ఎట్లా జరిగిందో నాకర్థంకావడంలేదు. ఇదంతా మీరు చేసినపనే.

బాబా : *చూడు! ఈ ఎనిమిదిరోజులు నేను నీలోనే ఉన్నాను. పో! పోయి వాడా (దీక్షిత్ వాడా)లో ఉండు!*

ఘటనాఘటనసమర్థుడైన శ్రీసాయి దివ్యసంకల్పం ముందు తమ ఇష్టాయిష్టాలు, ప్రయత్నం ఎందుకు కొరగావని గుర్తించాడు కాశీనాథ్. ఎవరికైనా ఆ గుర్తింపే శరణాగతికి తొలిమెట్టు!

## సాయి సన్నిధిలో శ్రీఉపాసనీ

*"పోయి వాడాలో ఉండు!"* అన్న బాబా ఆజ్ఞ ఉపాసనీకి అయోమయంగా తోచింది. ఫలానా గమ్యాన్నిగానీ, ఫలానా సాధన చేయమనిగానీ నిర్దేశించకుండా ఊరకే వాడాలో ఉండడంవల్ల సాధించేదేమిటో కాశీనాథ్‌కు అర్థంకాలేదు. కానీ, బాబా ఆజ్ఞాపించినట్లు వాడా(దీక్షిత్ వాడా)లో ఉండసాగాడు. ఊరకే కూర్చోలేక మిగిలిన సాయిభక్తులతో కలసి మసీదుకు వచ్చి కూర్చోవడము, ఆరతులలో పాల్గొనడం చేసేవాడు. అక్కడి సాయిభక్తులను బాబా గురించిన వివరాలను, ఆయన లీలలను భక్తుల అనుభవాలను, బాబా విచిత్ర బోధనాపద్ధతులను గురించి అడిగి తెలుసుకొని, వాటిని గూర్చి చింతన చేసేవాడు. అక్కడి భక్తులందరూ బాబాను సాక్షాత్తు దైవంగా భావించడం గుర్తించాడు. బాబా తత్త్వాన్ని గురించి, ఆయన లీలలను గురించి తెలుసుకొని, చింతన చేసిన కొద్దీ, కాశీనాథ్‌కు బాబాపై భక్తివిశ్వాసాలు కుదరసాగాయి.

శ్రీకాశీనాథ్ హృదయంలో నాటుకొని మొలకెత్తుతున్న భక్తియనే మొలక త్వరగా పెరిగి, దృఢమైన మహావృక్షంగా పెరగడానికి బాబా అనుగ్రహించిన కొన్ని

లీలలు దోహదం చేశాయి. తాను బాబాను గురించి వినకముందే, ఆయనను దర్శించక ముందే శ్రీసాయి తనను అనుక్షణం కాపాడి, తన జీవితాన్ని నడిపిస్తున్నారనే 'సత్యం' అనుభవపూర్వకంగా తెలుసుకోవడం భక్తునికి అన్ని లీలలకన్నా అమోఘమైనది. ఆ ఎఱుక భక్తుని అత్యంత శీఘ్రగతిన తన సద్గురువుకు అనన్యంగా శరణు పొందేలా చేస్తుంది.

ఒకరోజు కాశీనాథ్ ఇతర భక్తులతో పాటు మసీదులో కూర్చొని ఉన్నాడు. బాబా మాటిమాటికి కాశీనాథ్ వైపు చూసి, నర్మగర్భమైన చిరునవ్వు నవ్వుతూ తమ సహజ ధోరణిలో ఇలా అన్నారు: *"ఒకరోజు నేనలా నడుస్తూ పోతుండగా, ఒక గర్భిణిని చూచాను. ఆమె కడుపు చాలా పెద్దదిగా బాగా ముందుకు పొడుచుకొచ్చినట్లుంది. కానీ ఆమె కాళ్ళు, చేతులు మాత్రం బాగా సన్నగా, బలహీనంగా ఉన్నాయి. ఆమె ఒంటరిగా ఉంది. బాధతో మూలుగుతున్నది. కర్ర సహాయంతోగానీ నడవలేని స్థితిలో ఉంది. ఆమెను చూచి నవ్వుతూ, "నువ్వు నాకు తెలుసు. నీవు నన్ను గుర్తుపట్ట గలవా? నీవు చాలా సంవత్సరాలుగా ఈ గర్భాన్ని మోస్తున్నట్లున్నావు! ఇంకా ప్రసవం ఎందుకుకాలేదు?" అని అడిగాను. దానికామె ఏమీ జవాబు చెప్పలేకపోయింది. ఆమె స్థితి చూచి నేనే మళ్ళీ ఇలా చెప్పాను. "జరిగినదేదో జరిగిపోయింది. ఇప్పటికైనా మించిపోయింది లేదు. వేడినీళ్ళు మాత్రమే త్రాగడం నియమంగా పెట్టుకో! నీకు సుఖప్రసవమవుతుంది" అని. నా మాటలామె ఏ మాత్రం లెక్కచేయకుండా నీళ్ళు త్రాగడానికి ఒక కాలువ దగ్గరకెళ్ళింది. అది చూచి, అరే! ఆ చన్నీళ్ళు త్రాగితే ఆమె అనవసరంగా చస్తుందే! ఆమెతో పాటు ఆమె గర్భంలో ఉన్న అసంఖ్యాకమైన బిడ్డలు కూడా మరణిస్తారు అన్న ఆందోళనతో ఆమె దగ్గరకెళ్ళి, "చూడు! చన్నీళ్ళు త్రాగొద్దని చెప్పానా లేదా? ఈ కాలువ దగ్గరకెందుకొచ్చావ్? ఆ కనిపించే ఊళ్ళోకెళ్ళి, వేడినీళ్ళు పెట్టించుకొని త్రాగు" అని మందలించాను. ఆమె అలాగే చేసింది. ఇప్పుడామె కులాసాగా ఉంది. అదంతా వాతప్రకోపం తప్ప మరేమీకాదు. అప్పుడప్పుడూ అలా జరుగుతుంది".*

బాబా మాటలలోని అంతరార్థం కాశీనాథ్‌కు తప్ప అక్కడున్న వారెవ్వరికీ అర్థంకాలేదు. ఆ మాటలకర్థం స్ఫురించిన కాశీనాథ్ హృదయం ప్రేమ, కృతజ్ఞతా భావాలతో పులకరించింది.

## అది ఋణానుబంధమా? కరుణానుబంధమా?

బాబా మాటలు విన్న కాశీనాథ్ హృదయం ఆశ్చర్యానందాలతో పులకరించింది. గతంలో జరిగిన సంఘటనలన్నీ ఒక్కొక్కటే తన స్మృతిపథంలో గిర్రున కదలాడ సాగాయి. బోర్గఢ్ కొండ గుహల్లో తనకు అప్రయత్నంగా కలిగిన సమాధి అనుభవం; ఆ అనుభవంలో తాను చూచిన దివ్యదర్శనం; అందులో దర్శనమిచ్చిన ముస్లిం ఫకీరు; రాహురీలో రోడ్డుపై కనిపించి తన రుగ్మతకు అయాచితంగా చికిత్సామార్గాన్ని బోధించి, తిరిగి జజూరీ వద్ద తాను కాలువలో నీరు త్రాగబోతుంటే సమయానికి వారించి మందలించి హఠాత్తుగా అదృశ్యుడైన వృద్ధుడు; యోగికులకర్ణి తనను బాబాను దర్శించమని మరీమరీ ఒత్తిడి చేసిన వైనం; తాను శిరిడీ వదలి వెళ్ళాలన్నా వెళ్ళలేక విచిత్ర పరిస్థితుల్లో తిరిగి శిరిడీ చేరిన వైనం; తన మనస్సు ప్రాపంచిక విషయాలపై ఎంత పరుగెత్తుతున్నా ఎవరో నడిపిస్తున్నట్లు తనను బలవంతంగా ఆధ్యాత్మిక లక్ష్యం వైపుకు తోస్తున్న వివిధ సంఘటనల కూర్పు.... ఇవన్నీ కాశీనాథ్‌కు జ్ఞప్తికొచ్చాయి. ఆ సంఘటనలు జరిగిన కాలంలో తాను బాబాను భక్తిశ్రద్ధలతో ఆశ్రయించడం మాట అటుంచి, అసలు బాబా పేరు కూడా వినలేదే! విన్న తరువాత కూడా బాబా ఒక 'ముస్లిం' అనే చులకన భావనే ఉండేదికానీ, భక్తిభావం లేదే! యోగికులకుర్ణిగారి మీద గౌరవంతో ఆయన మాట తోసెయ్యలేక శిరిడీ వచ్చాడుగానీ తానేనాడూ బాబాపై గురుభావంతో తన దృష్టి నిలపలేదు. అయినా, బాబా తాను జీవితంలో వేసిన ప్రతి అడుగు వెనుక ఉండి నడిపిస్తూ, తాను నిర్లక్ష్యం చేసినా పట్టించుకోక కాపాడుతున్నారు. 'అనన్య చింతయంతో మాం... యోగక్షేమం వహామ్యహం.....' అన్న గీతావాక్యం తాను చిన్ననాటినుండి ఎరిగినదే! 'తనను ఎవరైతే అనన్యంగా చింతన చేస్తాడో, సర్వధర్మాలు తన కోసం పరిత్యజిస్తారో వారి యోగక్షేమాల బాధ్యతను తాను వహిస్తాన"ని శ్రీకృష్ణ భగవానుని హామీ! కానీ ఈ సాయి భగవానుడు ఏ షరతులు, నియమాలు విధించకుండా...బేషరతుగా... ప్రజల యోగక్షేమాల బాధ్యత వహించే కరుణావతారుడు. అయినా తనపై బాబాకు ఇంత ప్రేమ ఎందుకు? తానేం చేశాడని? ఆయన వైపు తాను ఒక్క అడుగు కూడా వేయకపోయినా, తానే ఎన్నోవందల అడుగులు తనవైపు వేసి, ప్రేమతో చేయి అందించి అక్కున చేర్చుకున్నాడే! అవ్యాజమైన బాబా ప్రేమకు కారణమేంటి? ఆయన

సహజ కరుణాస్వరూపమే ఈ అకారణ ప్రేమకు కారణమా? అయితే ఆయన ప్రేమ అన్ని జీవులపై ఇదే విధంగా ప్రసరిస్తున్నదా? ప్రసరిస్తుంటే అందరూ ఆ సద్గురు కృపవల్ల తరించబడడం లేదేమి? ఈ సద్గురు అనుగ్రహపాశాన్ని కదలించి ముడివేసే తత్వమేమిటి?...

కాశీనాథ్ మనస్సులో ముప్పిరిగొంటున్న ఈ ఆలోచనలకు సందేహాలకు సమాధానమా అన్నట్లు బాబా 'ఒకసారి' కాశీనాథ్ వైపు ప్రసన్నంగా చూస్తూ, ఇలా అన్నారు:

*"మనకిద్దరికీ ఋణానుబంధముంది. మన కుటుంబాలు కొన్ని వందల వేల సంవత్సరాలుగా ఋణానుబంధంతో పెనవేసుకొని ఉన్నాయి. అందువల్ల మనిద్దరి మధ్యా భేదం లేదు!"* అని. అంతకు మించి కాశీనాథ్‌తో తమకు గల అనుబంధాన్ని గూర్చిన వివరాలను బాబా సూటిగా ఎప్పుడూ వెల్లడించలేదు.

అలా బాబా తమకు, కాశీనాథ్‌కు గల జన్మజన్మల అనుబంధ పాశంతో ఆత్మజ్ఞానమనే సుందర హర్మ్యంలో కట్టి పడేయాలనుకొంటుంటే, కాశీనాథ్ మనసు మాత్రం రోజులు గడిచేకొద్దీ సంసార సౌఖ్యాల వైపు పరుగెత్తసాగింది. దానికి తోడు శిరిడీలోని హోటల్ తిండి అతని ఆరోగ్యానికి ఏ మాత్రం పడడంలేదు. తనకొచ్చిన శ్వాసకోశ సంబంధమైన రుగ్మత ఇంకా పూర్తిగా తగ్గలేదనీ, తాత్కాలికంగా మాత్రమే ఉపశమించిందనీ, సరైన ఆహారం లేకపోతే అది మళ్ళీ తిరగబెట్టవచ్చునే సందేహం కాశీనాథ్‌ను పీడిస్తుండేది.

ఇదిట్లా ఉంటే, కాశీనాథ్‌పై బాబా చూపే ప్రత్యేక ఆదరాభిమానాలు అక్కడున్న ఇతర సాయిభక్తుల మనస్సులో అసూయ రేకెత్తించసాగాయి. అగ్నికి ఆజ్యం తోడైనట్లు కాశీనాథ్‌కు స్వాభావికంగా ఉండే 'పెడసరి వైఖరి', పదిమందితో కలసిమెలసి స్నేహంగా ఉండలేకపోవడం మొ॥న కారణాలవల్ల కాశీనాథ్‌కు శిరిడీలో మిత్రులకన్నా శత్రువులే ఎక్కువయ్యారు. ఇక వాడాలో ఉండలేక ఊరి బయట ఉన్న ఖండోబా ఆలయంలోకి తన బస మార్చాడు.

బాబాకు సంబంధించిన విషయాలు తప్ప మరింకేవిషయంగానూ ఎవ్వరితోనూ మాట్లాడేవాడు కాదు. ఎవ్వరితోనూ కలివిడిగా ఉండక, దూరదూరంగా సంచరిస్తూ ఉండడం, ఒకవేళ ఎవరితోనైనా మాట్లాడినా, బాబాను గురించిన వివరాలే ఎంతో

ఆసక్తితో (ఏదో దర్యాప్తు చేస్తున్నట్లు) అడుగుతుండడం చూచి, బాబాను గూర్చి రహస్యంగా దర్యాప్తు చేయడానికి ప్రభుత్వం పంపిన గూఢచారేమోననే అనుమానం గ్రామస్థులకు కలుగసాగింది. ఈ అనుమానాలతో తన పూర్తి వివరాలు చెప్పమని కాశీనాథ్‌ను వేధించేవారు. కొందరు బెదిరించేవారు. మరికొందరు హేళనచేసి అవమానించేవారు. గ్రామస్థులు అలా అనుమానిస్తే, పోలీసులు అతను పరారీలో రహస్యంగా సంచరిస్తున్న విప్లవకారుడనే అనుమానంతో తరచూ వచ్చి తమ ప్రశ్నలతో రకరకాలుగా వేధించసాగారు. ఈ వేధింపులు పడలేక కాశీనాథ్‌కు ఎప్పుడెప్పుడు శిరిడీ వదలి తన ఇల్లు చేరుతామా అని ఉండేది. బాబాను తాను ఇంటికి వెళ్ళేందుకు అనుమతించమని ప్రార్థిస్తూ, మాధవరావ్ దేశ్‌పాండే (షామా) ద్వారా బాబాను ఎన్నోసార్లు అడిగించాడు. షామా ఆ విషయం బాబా వద్ద ఎప్పుడు ప్రస్తావించినా ***"అతనితో తేల్చుకోవలసిన లెక్కలు చాలా ఉన్నాయి"*** అంటూ అనుమతి ప్రసాదించేవారు కాదు బాబా. ఆ లెక్కలేవని ఎవరైనా అడిగితే, ***"నా దగ్గరకొచ్చే వారందరి జమాఖర్చుల లెక్కల గురించి నేను అల్లాకు జవాబు చెప్పకోవాలి!"*** అని నర్మగర్భమైన సమాధానమిచ్చేవారు.

అలా కొన్ని రోజులు గడిచాయి. మళ్ళీ ఒకసారి కాశీనాథ్ ఇంటికిపోవడం గురించి బాబాను షామా అడగ్గా, ***"దాదాపు లెక్కలన్నీ సరిపోయాయి. ఇక మూడు నాలుగు బండ్ల సరుకు లెక్క మాత్రం మిగిలి ఉంది!"*** అన్నారు బాబా. ఇంకా కొన్ని రోజులు గడిచిన తరువాత 1911 జూలై ఆఖరులో – ***"కాశీనాథ్ లెక్కలన్నీ సరిపోయాయి"*** అని తేల్చి చెప్పారు బాబా.

## అవధులులేని ఆ అనుగ్రహ వాహినికి ఆనకట్టలు లేవు!

బాబా 'లెక్కలే'వో తేలాయి గనుక, ఇక ఇంటికెళ్ళవచ్చుననే ఆలోచనతో కాశీనాథ్ మనస్సు ఆనందంతో గంతులేసింది. కానీ, బాబా ఆజ్ఞ విన్న కాశీనాథ్ ఒక్కసారిగా హతాశుడయ్యాడు. ***"అతని లెక్కలన్నీ సరిపోయాయి. అందువల్ల, అతను ఇక నాలుగు సంవత్సరాలు శిరిడీలోనే ఉండాలి"*** అన్నారు బాబా. ఆ పరిస్థితుల్లో ఇంకా నాలుగేళ్ళపాటు శిరిడీలో తాను దుర్భర జీవితాన్ని గడపాలనే ఆలోచనతో కాశీనాథ్ నవనాడులు కృంగిపోయాయి. నిరాశానిస్పృహలు ముప్పిరిగొన్నాయి.

దుఃఖభారాన్ని తట్టుకోలేక పెద్దగా ఏడ్చేశాడు. *"సబూరితో (ఓర్పుతో) నాలుగేళ్ళు గడిపితే, నాలుగేళ్ల తరువాత నీకు ఖండోబా పూర్ణానుగ్రహం లభిస్తుంది"* అని బాబా అతణ్ణి ఓదార్చారు. ఆ నాలుగేళ్ళు కాశీనాథ్ ఏం చేయాల్సి ఉంటుందని బాబాను అడిగాడు షామా. దానికి జవాబుగా బాబా, *"అతడు ఏం చెయ్యనక్కరలేదు. విఠోబా ఆలయంలో ఊరక కూర్చోమను ("ఉగే ముగే") చాలు!"* అంటూ, కాశీనాథ్ వైపు తిరిగి, *"నీకింకెవ్వరితోనూ పనిలేదు. నీకు ఉజ్వల భవిష్యత్తు ఉంది. అంతటి చక్కని భవిష్యత్తు మరింకెవ్వరికీ లేదు"* అన్నారు. మళ్ళీ బాబానే అక్కడున్న వారితో ఇలా అన్నారు: *"అతని యోగ్యత అటువంటిది! ప్రపంచమంతా ఒక ఎత్తు; అతనొక్కడే ఒక ఎత్తు! రొట్టె, కూర తింటూ అతడు ఊరక కూర్చుంటే చాలు. మిగిలినదంతా నేను పూర్తిచేస్తాను"* అన్నారు.

బాబా ఆ మాటలంటున్నప్పుడు మసీదులో చాలా మంది భక్తులున్నారు. ఆ మాటలు వారిలో అసూయను రేకెత్తించాయి. వారిలో ప్రభు సమాజానికి చెందిన బొంబాయి నివాసి, ఉండబట్టలేక బాబాను ఇలా అడిగాడు, "ఇది మరీ బాగుంది బాబా! మేము ఎంతోకాలం నుండి మిమ్మల్ని ఆశ్రయించుకొని ఉన్నాము. నిన్నగాక మొన్న ఇక్కడికొచ్చిన ఈ అనామకుడికి నాలుగేళ్ళలో మీ పూర్ణానుగ్రహం కలుగుతుందని చెబుతున్నారు. ఇంతటివాడు ప్రపంచంలోనే లేడని కూడా అంటున్నారు. ఇంతకాలం మేము మీకు చేసిన పూజలు ఎందుకూ పనికిరాకుండా పొయ్యాయా? ఈనాడు ఇతనికి రాగి రేకుమీద దానపత్రం రాసిచ్చినట్లు హామీ ఇచ్చారే!"

ఆ భక్తుని మాటలకు బాబా ఏ మాత్రం తొణక్కుండా ఆ భక్తుని ముఖంలోకి చూస్తూ, నిష్కర్షగా, *"నా మాటలు అబద్ధాలనుకుంటున్నావా, ఏమిటి? ఇది అబద్ధాలు చెప్పే వారి మసీదు అనుకుంటున్నావా? నేను చెప్పవలసిందేమిటో చెప్పాను! నాకున్నదంతా ఇచ్చేశాను. రాగిరేకుపైన దానపత్రం రాసిచ్చానా - అని కదా నీవు అడిగింది? రాగిరేకు మీద ఏం ఖర్మ! బంగారు రేకుమీదే రాసిచ్చాను! అయితే ఏమంటావ్?"* అని అన్నారు. ఆ మాటలంటూ కాశీనాథ్ వైపు తిరిగి *"నువ్వేమంటావ్? రాగిరేకు మంచిదా? బంగారురేకు మంచిదా?"* అని అడిగారు. ఇంకా నాలుగు సంవత్సరాలు శిరిడీలో గడపాలన్న దుస్సహమైన ఆలోచనతో స్థబ్ధుడైయున్న ఉపాసనీకి వెంటనే బాబాకు ఏం జవాబు చెప్పాలో తోచలేదు. "అటువంటి విషయాలలో నాకేమీ

పరిజ్ఞానం లేదు, బాబా!" అని నెమ్మదిగా గొణిగాడు. బాబా తన ప్రశ్నకు తానే సమాధానమిస్తున్నట్లు, *"రాగిరేకు చిలుంపట్టి పాడవుతుంది. కానీ బంగారం మాత్రం ఎంత వాడినా చెక్కు చెదరదు. నీవు మేలిమి బంగారంవంటి వాడవు! ఎక్కడున్నా నీవు దైవానివే! బంగారు రేకుపై దానపత్రం రాసి నీ చేతికిస్తున్నాను. దాని అర్థం పూర్తిగా మనసుకు పట్టించుకో! ఇక మీద నీవు తరచు నా దగ్గరకు రానవసరం లేదు. ఎప్పడయినా ఒకసారి రావచ్చు. వచ్చినా నాతో ఏమీ మాట్లాడకూడదు. నేనూ నీతో ఏమీ మాట్లాడను. నాలుగేళ్లయినాక, మహల్సాపతి (ఖండోబా) అనుగ్రహం నీకు పూర్తిగా లభించి, సర్వం నీకే బోధపడుతుంది. నీ పూర్వీకులకు, నాకు కొన్ని వందల ఏళ్ళుగా ఋణానుబంధముంది!"* అని అన్నారు.

"బాబా నాకిదంతా ఎందుకు? మీరు అంతటి బరువుబాధ్యతలు నాపై పెట్టడానికి నేను ఏ మాత్రం తగినవాణ్ణికాదు. మీరు చెప్పే విషయాలు సాధించాలనే కోరిక కూడా నాకు లేదు. నన్ను ఇంటికి వెళ్ళనివ్వండి. దయచేసి నాకు సెలవివ్వండి" అని దీనంగా మొరపెట్టుకున్నాడు.

బాబా మాత్రం అతని దీనతను ఏ మాత్రం లెక్కచెయ్యకుండా, *"అటువంటి ఆలోచనలన్నీ కట్టిపెట్టు! నీవేమిటో నాకు పూర్తిగా తెలుసు. నేనెవరో కూడా ముందుముందు నీకే తెలుస్తుంది. గతంలోను, ఇప్పడు కూడా నేను నీవెంటే ఉన్నాను. మంచిగానీ, చెడుగానీ గతంలో నీవు చేసిన పనులన్నింటికీ నాదే పూర్తి బాధ్యత. నీవు నన్ను గుర్తించలేదు. కానీ నిన్ను గురించి మాత్రం నాకు క్షుణ్ణంగా తెలుసు. గత ఎన్నో సంవత్సరాలుగా నీ గురించే తీవ్రంగా ఆలోచిస్తున్నాను. ఇక నీవిప్పడు పోయేదెక్కడికి? వచ్చేదెక్కడికి? నీవేం చెయ్యలేకపోతే ఊరకే గమ్మున కూర్చో! (బాబా తన ఛాతిని తన చేతితో తట్టుతూ దృఢంగా అన్నారు) నేను స్వయంగా నీవెంట ఉండి, టిక్కెట్టు తీసిచ్చి, రైలుబండిలో ఎక్కించి, దారిలో ఏ ఆటంకం లేకుండా చూస్తూ నిన్ను చివరికంటా గమ్యం చేరుస్తాను!"* అని పలికారు.

కాశీనాథ్ వైపుకి బాబానుండి పొంగిపొరలుతున్న అనుగ్రహ ప్రవాహాన్ని చూచి నివ్వెరపోతూ, ఇంతకు మునుపు బాబాను ప్రశ్నించ సాహసించిన బొంబాయి భక్తుడే మళ్ళీ ఆతృతగా, "ఏమిటిది బాబా? ఈ వ్యక్తికి మీ దగ్గర ఉన్నదంతా ఇచ్చేస్తున్నారా ఏమిటి?" అని అడిగాడు.

*"అవును! అంతా అతనికి ఇచ్చేశాను. అతడు మంచిగానీ, చెడుగానీ - అతడు నావాడు. అతనికి, నాకు ఏం భేదం లేదు. ఇక అతని పూర్తి బాధ్యత నాదే"* అన్నారు స్థిరస్వరంతో.

## ఛాందస ఆచారాల చేటురోగానికి బాబా చేదుమందు!

కాశీనాథ్ భవిష్యజ్జీవితం గూర్చి, ఆధ్యాత్మికస్థితిని గూర్చి, బాబా తమ తీర్పును నిర్ద్వంద్వంగా ప్రకటించినా, కాశీనాథ్ జీవనపంథాలో మాత్రం పెద్ద మార్పేమీ కనిపించలేదు. అయితే, ఆ తరువాత భోజనం చెయ్యడానికి, అప్పుడప్పుడు ఆరతిలో పాల్గొనేందుకు తప్ప సామాన్యంగా బయట ఎవరితోనూ కలిసేవాడు కాదు. అమరావతి వాస్తవ్యుడైన శ్రీజి.యస్. ఖాపర్డే ప్రఖ్యాత న్యాయవాది, ప్రముఖ రాజకీయ నాయకుడు. కాశీనాథ్ పూర్వం అమరావతిలో స్థిరపడి వైద్యవృత్తి చేపట్టడానికి శ్రీఖాపర్డే ఎంతో సహాయం చేశాడు. శ్రీఖాపర్డే 1912 జనవరి నుండి మార్చి వరకు బాబాను సేవిస్తూ శిరిడీలో ఉన్నాడు. మంచి పండితుడైన శ్రీఖాపర్డే తాను శిరిడీలో ఉన్నన్నినాళ్ళు గొప్ప వేదాంత గ్రంథాలైన 'పరమామృతం'ను, 'పంచదశి'ని చదివి అప్పుడు శిరిడీలో ఉన్న కొందరు సాయిభక్తులకు వివరించేవారు. శ్రీఖాపర్డే చేసే ఆ సత్సంగాలకు మాత్రం కాశీనాథ్ శ్రద్ధగా హాజరయ్యేవాడు. తక్కిన సమయాన్ని స్నాన, జపానుష్ఠానాలలోను, భగవద్గీత, విష్ణుసహస్రనామాల పఠనంలోను గడిపేవాడు. అప్పుడప్పుడు "రామగీత", "ఆధ్యాత్మిక రామాయణం" పారాయణ చేసేవాడు.

అలా సుమారు ఒక 10 నెలలు గడిచాయి. ఒకనాడు హఠాత్తుగా తన భార్యకు చాలా ప్రమాదంగా జబ్బు చేసిందని, వెంటనే బయలుదేరి రమ్మని కాశీనాథ్‌కు ఇంటి దగ్గర నుండి ఉత్తరం వచ్చింది. కాశీనాథ్‌కు తన భార్యంటే ఎంతో మక్కువ, మమకారం. తాను చేసుకొన్న మూడు వివాహాలలోను, ఈ మూడవ భార్యతోనే కాశీనాథ్ ఎక్కువకాలం సుఖమయ సంసారజీవితం గడిపాడు. బాబా తనను శిరిడీలో నాలుగు సంవత్సరాలుండమని ఆదేశించిన తరువాత కొద్దిరోజులకు, తాను శిరిడీ వదలడానికి వీలులేకపోతే తన భార్యనయినా శిరిడీ పిలిపించుకొనేందుకు అనుమతించమని షామా ద్వారా బాబాను అడిగించాడు. బాబా ఆ కోరిక విని (నర్మగర్భంగా) చిరునవ్వు నవ్వి, *"ఆమె తప్పక ఇక్కడికి వస్తుందిలే!"* అన్నారు. ఆమెను

శిరిడీకి పిలిపించడానికి బాబా అనుమతించారని ఆనందిస్తూ, "బాబా, అయితే ఆమెను వెంటనే ఇక్కడకు రమ్మని ఉత్తరం వ్రాయమంటారా?" అని ఆత్రంగా అడిగాడు. *'వద్ద'*ని నిక్కచ్చిగా జవాబిచ్చారు బాబా! ఇది జరిగి కొన్ని మాసాలు గడచీ గడవక ముందే, ఇప్పుడీ ఉత్తరం! ఆ ఉత్తరం తీసుకొని బాబా వద్దకు వెళ్ళి తన భార్యను చూడడానికి ధూలియా వెళ్ళడానికి అనుమతించమని ప్రార్థించాడు. బాబా అంగీకరించలేదు. ఆ తరువాత ఒక వారం రోజులకు – తన భార్య (6-2-1912న) మరణించిందనే వార్త తెలిసింది. ఆ వార్త విన్న కాశీనాథ్ దుఃఖానికి అంతులేదు. తన భార్యే గతించాక ఇక తనకు ఖండోబా దేవుని అనుగ్రహం వస్తే ఎంత? రాకుంటే ఎంత? – అని బాబా వద్ద బావురుమన్నాడు. అప్పటికైనా తనమీద దయతో తనను ఇంటికి పంపమని బ్రతిమాలాడు. బాబా అతన్ని ఓదారుస్తూ, *"ఆమె ఎక్కడికెళ్ళింది? ఇక్కడకే (-అంటే తన వద్దకే) చేరింది. ఆమెకు ఉత్తమగతులు ప్రాప్తించాయి"* అని అన్నారు. కానీ, బాబా మాటలకు కాశీనాథ్ ఊరడిల్లలేదు. దుఃఖభారంతో తన బసకు వెనుదిరిగిపోయి, మళ్ళీ బాబా దగ్గరకొచ్చి, ఒక పదిరూపాయలు దక్షిణ సమర్పించి, "బాబా, ఈ దక్షిణ స్వీకరించి, నా భార్యకు సద్గతిని అనుగ్రహించండి!" అని వేడుకొన్నాడు. బాబా ఆ దక్షిణ స్వీకరించడానికి నిరాకరించి, *"నేను అనుగ్రహించేదేదో ఇంతకుమునుపే అనుగ్రహించాను. ఇక ఇప్పడు క్రొత్తగా అనుగ్రహించేదేముంది?"* అంటూ, ఆ డబ్బు కాశీనాథ్‌కు తిరిగిచ్చేశారు. అప్పటికీ ఊరడిల్లని కాశీనాథ్‌తో బాబా మళ్ళీ ఇలా అన్నారు: *"నీ పూర్తి బాధ్యత నాది! విఠోబా ఆలయానికి వెళ్ళి ఊరక కూర్చో! ఇంతక్రితం నేను చెప్పినట్లు నడుచుకో! తరువాత షామా వచ్చి నిన్ను బయటకు లాక్కొస్తాడు. అప్పడు నేను నిన్ను బహిర్గతంచేసి, కూర్చోబెడతాను. ఇక ఇతర ఆలోచనలన్నీ కట్టిపెట్టు!"* మళ్ళీ ఒక్క క్షణం ఆగి, తన గుండెమీద చేయిపెట్టి చూపుతూ, *"ఈ ప్రపంచమంతా ఒక ఎత్తు! నీవొక్కడివే ఒక ఎత్తు! నీవు చేసుకొన్న పుణ్యం అలాంటిది!"* అన్నారు.

కాశీనాథ్‌ను గమ్మున ఊరకే కూర్చోమని ఆదేశించిన బాబా, తాము మాత్రం ఊరక ఉండలేదు. వివిధ 'సంఘటనల' ద్వారానూ, అదృశ్యంగానూ కాశీనాథ్‌ను సంస్కరించి, తమకు, కాశీనాథ్‌కు మధ్య కాశీనాథ్ కట్టుకొన్న అహంకారమనే 'గోడ'ను నేలమట్టం చేసేందుకు నడుం బిగించారు.

మనలో బలంగా మిగిలివున్న బూజుపట్టిన సంప్రదాయ వాసనలు, ఛాందస భావాలు మన ఆధ్యాత్మికసాధనకు, ఆత్మోన్నతికి ప్రధాన అవరోధాలు. కాశీనాథ్ విషయంలో కూడా బాబా మొదట వేసిన గొడ్డలివేటు, కాశీనాథ్ ఛాందస భావాలమీదే!

తాను సద్బ్రాహ్మణుడనీ, బాబా ముసల్మాననీ మొదట బాబాను దర్శించడానికే ఇష్టపడని కాశీనాథ్ చివరకు ఆ ముసల్మాను 'సద్గురువు'నే ఆశ్రయించవలసి వచ్చింది. చిన్ననాటి నుండి కాశీనాథ్ మనస్సుకు పట్టిన ఛాందస సంప్రదాయమనే బూజు తెరలలో నుండి చూస్తే, బాబా ఒక 'మ్లేచ్ఛుడు'! అయినా, ఒక మ్లేచ్ఛుని సద్గురువుగా 'గ్రహించి' శరణు పొందవలసిరావడంలోనే కాశీనాథ్ మనస్సుకు పట్టిన బూజు చాలావరకు వదిలింది. ఇక మిగిలింది కూడా వదలాలి!

బాబా రోజూ చిలుం పీల్చేవారు. తాము పీల్చి, ఆ చిలుంగొట్టాన్ని, ఆ సమయంలో తమ ప్రక్కన కూర్చోనున్న భక్తునికందించేవారు. ఆ భక్తుడు పీల్చి తరువాత తన ప్రక్కన ఉన్న భక్తునికందించేవాడు. అలా చిలుం అందరు పీల్చాక మళ్ళీ బాబా చేతికొచ్చేది. మళ్ళీ అదే వరుస! కాశీనాథ్ శిరిడీ వచ్చిన తొలి రోజులలో ఒకసారి మసీదులో బాబాతో కూర్చోనున్నాడు. కాశీనాథ్‌కు బాబా చిలుం గొట్టమందించి, పీల్చమన్నారు. నిప్పులు కడిగే ఆచారవ్యవహారాల మధ్య పెరిగిన కాశీనాథ్ దృష్టిలో పొగత్రాగడమంటే మహాపాపం. అదీగాక నానాజాతి మత కులాలకు చెందినవాళ్ళు 'ఎంగిలి' చేసిన ఆ చిలుం గొట్టంతో పొగ పీల్చడమంటే ప్రాణాంతకమైన పని! పొగ పీల్చలేనని కాశీనాథ్ ఎంత తప్పుకోజూచినా, బాబా ఒప్పుకోలేదు. కాశీనాథ్‌కు చిలుం పీల్చక తప్పలేదు. సమర్థ సద్గురుని హస్తస్పర్శ పొందిన ఆ చిలుం పొగ యజ్ఞధూపం కంటే కూడా పరమ పావనమైనదనే విషయం ఆనాడు కాశీనాథ్ గ్రహించలేదు. కాశీనాథ్ అనే ఏమిటి? ఛాందస ఆచారాలనే దీర్ఘరోగగ్రస్తులైన వారెవ్వరూ గ్రహించలేరు!

కాశీనాథ్ చిలుం పీల్చడం అవగానే బాబా అతనితో ***"నీవుండే గుడికి ఎవరైనా వస్తుంటారా?"*** అని అడిగారు. "లేదు బాబా, సామాన్యంగా ఎవ్వరూ అక్కడికి రారు" అని జవాబిచ్చాడు కాశీనాథ్. ***"ఎవ్వరూ రాకపోతే పోయిందిలే! నేను వస్తుంటాను. అయితే నేనొకవేళ అక్కడికి వస్తే, నువ్వు నన్ను గుర్తుపట్టి చిలుం తయారు చేసిస్తావా?"*** అని అడిగారు బాబా. బాబా 'చిలుం' అని దేన్ని ఉద్దేశించి అన్నారో

అర్థంకాని కాశీనాథ్ "బాబా, మీరేం అంటున్నారో నాకు బోధపడడంలేదు. నేను మీకోసం చిలుం ఎక్కడ నుండి తెచ్చి ఇచ్చేది?" అని అడిగాడు. బాబా చిరునవ్వు నవ్వి ***"సరి సరి! దానికేంలే"*** అన్నారు. ఎప్పుడూ ఎక్కడికి రాని బాబా తన బసకు రావడమేమిటి? 'వస్తే, నన్ను గుర్తుపడ్తావా?' అని అడుగుతారేమిటి? రావాలే గానీ ఆయన్ను తాను గుర్తించకపోవడమేమిటి? – అని తికమకపడ్డాడు కాశీనాథ్.

## నిప్పులుకడిగే నికృష్టపు నిష్ఠాచారం - సద్విచారానికి గ్రహచారం!

ఉపాసనీశాస్త్రిని "ఊరక" కూర్చోమని బాబా ఆదేశించారు. కానీ బాబా మాత్రం ఊరకే లేరు. సద్గురు హస్తాలు ముడిపదార్థంగా సంస్కారహీనంగా ఉన్న శిష్యుని హృదయ చైతన్యాన్ని, తన అంతరంగానికి ప్రతిరూపంగా మలచడానికి అవిశ్రాంతంగా పనిచేస్తూనే ఉన్నాయి. "ఊరక" కూర్చోలేక మనం చేసే "సాధనలు" ఒక్కోసారి ఆ సద్గురు కార్యానికి అవాంతరాలు కూడా కావచ్చు! అందుకే బాబా అన్నారు: ***"గురువుకు పగ్గాలప్పగించిన తరువాత చింతకు తావేలేదు!"*** అని. మనం చేయవలసింది, చెయ్యలేకుండా ఉన్నది, సంకల్పాల(కోరికల)నే మన జీవితపు పగ్గాలను బాబాకు అప్పగించి, నిశ్చింతగా ఉండటమే!

ఆధ్యాత్మికసాధనలకు పరమావధి "ముక్తి". దేనినుండి ముక్తి? తాను పరిమితుడననే "భావం" నుండి విముక్తుడై, 'తాను' సర్వగతుడననే జ్ఞానంలో స్థిరంగా ఉండడం. ఈ సత్యాన్నే వేదాంతగ్రంథాలు వివిధ యుక్తులతో వర్ణిస్తున్నాయి. బోధించ యత్నిస్తున్నాయి. కానీ, "సర్వం ఖల్విదం బ్రహ్మ", "అహం బ్రహ్మాస్మి" మొ॥న మహా వాక్యాలు ఎంతకాలం మననం చేసినా, భగవంతుడు సర్వజీవహృదయాంతరస్థుడని ఎంత భావన చేసినా, ఆ సత్యం ఎంతమందికి అనుభవంలోకి వస్తున్నది? సర్వజీవుల లోనూ ఉన్న చైతన్యం 'ఒక్కటే' అనే "గుర్తింపు" సాధనలో మొదటి మెట్టయితే ఆ ప్రజ్ఞతో అనుభవంలో అచంచలంగా ఉండటం చివరి మెట్టు. ఆ గుర్తింపును శిష్యునికి అనుభవపూర్వకంగా అనుగ్రహించడం ఏ వేదాంతగ్రంథాలు, సామాన్య గురువులు చెయ్యలేని కార్యం. శ్రీసాయిబాబా అనుక్షణం ఆయన ప్రతి కదలికలోనూ సమర్థవంతంగా చేసిన కార్యమూ ఇదే! ఈ విషయంలో శ్రీసాయికి సాటి, ప్రపంచ ఆధ్యాత్మిక చరిత్రలోనే మరొకరు కనిపించరు!

*"నేను నీ బసకొస్తాను, నేనొస్తే నన్ను గుర్తుపట్టి నాకు చిలుం ఇస్తావా?"* అని కాశీనాథ్‌ను బాబా అడిగినప్పుడు, కాశీనాథ్ తికమకపడ్డాడు. ఎప్పుడూ ఎవరి బసకూ రాని బాబా తన బసకు రావడమేమిటి? – అని. బాబా మాట్లాడే మాటల్లో ఎక్కువభాగం ఇలాగే ఒక పట్టాన అర్థంకానివిగా ఉంటాయి. అలాగే ఇది కూడానని కాశీనాథ్ దాన్ని గురించి ఎక్కువ ఆలోచించకుండా మర్చిపోయాడు.

నిప్పులు కడిగే నిష్ఠాచారాలలో పెరిగిన కాశీనాథ్‌కు బయట ఎక్కడ పడితే అక్కడ తినడం వల్లకాలేదు. అందువల్ల 1911 అక్టోబరులో తానుండే ఖండోబా ఆలయంలోనే వంటచేసికొని 'మడి'గా తినాలని నిర్ణయించుకొని, స్వయంపాకం మొదలెట్టాడు. వంట పూర్తయిన తరువాత ముందుగా కొంత భోజనాన్ని మసీదుకు తీసుకెళ్ళి బాబాకు నివేదించి ఆపై బసకు తిరిగొచ్చి భుజించేవాడు. క్రమంగా అతనికిది నిత్యకృత్యమైంది.

ఒకసారి బాబాకు కాశీనాథ్ నైవేద్యం తీసుకొని బయలుదేరబోతుండగా, ఒక కుక్క అతని చేతిలోని ఆహారాన్ని ఆశగా చూస్తూ వెంటబడ్డది. కానీ బాబాకు నివేదించడానికి తీసుకెళ్తున్న నైవేద్యాన్ని బాబాకు నివేదించకముందే కుక్కకు పెట్టడం "అపచారం" అని భావించి, ఆ కుక్కకు ఒక్క ముద్ద కూడా పెట్టకుండా మసీదు చేరాడు. కాశీనాథ్‌ను చూస్తూనే బాబా ***"ఇంత ఎండలోపడి ఇంతదూరం రావడమెందుకు? నేనక్కడే కూర్చొని ఉంటినే?"*** అన్నారు. కాశీనాథ్ "మీరు అక్కడ ఎక్కడ కూర్చుని ఉన్నారు బాబా?" అని ఆశ్చర్యంగా అడిగాడు. అందుకు బాబా ***"నీవు వంట చేస్తున్నంతసేపూ అక్కడే కూర్చుని చూస్తుండినాను కదా?"*** అన్నారు. "నేను వంట చేస్తున్నప్పుడు అక్కడ ఒక నల్లకుక్క తప్ప మరింకెవ్వరూ లేరే!" అని అన్నాడు కాశీనాథ్. ***"అవును, అదే నేను!"*** అన్నారు బాబా. బాబా తన చెంతనే ఉన్నా గుర్తించలేని తన అజ్ఞానానికి సిగ్గుపడ్డాడు కాశీనాథ్. ***"నేను నీ బసకొస్తే నన్ను గుర్తుపట్టి, చిలుం ఇస్తావా?"*** అని కొన్ని మాసాలముందు బాబా అడిగిన ప్రశ్నలోని అంతరార్థం ఇప్పుడు బోధపడింది కాశీనాథ్‌కు. మరోసారి ఇటువంటి పొరపాటు చెయ్యకూడదని నిశ్చయించుకొని తిరిగి బసకు చేరాడు. మరుసటిరోజు వంట పూర్తవగానే మళ్ళీ అంతకు ముందురోజు కనిపించిన నల్లకుక్క కనిపిస్తుందేమోనని చూశాడు. కానీ ఆ కుక్క కనిపించలేదు! అలా కొన్ని రోజులు గడిచాయి.

ఒకరోజు కాశీనాథ్ మామూలుగానే వంట చేసుకుంటున్నాడు. ఖండోబా గుడి ప్రక్కనున్న చిన్నగోడ అవతల 'తక్కువ కులానికి' చెందిన ఒక భిక్షగాడు నిలబడి, గోడపై నుండి కాశీనాథ్ చేసే వంటవైపు ఆత్రంగా తొంగి తొంగి ఆకలి చూపులు చూస్తున్నాడు. భోజనంపై కులం తక్కువవాడి కళ్ళు పడితే ఇంకేమైనా ఉందా? మడి మంట కలిసిపోదూ? చేసిన వంట మైల పడిపోదూ? నిష్ఠాచార బ్రాహ్మణుడైన కాశీనాథ్ ఆ భిక్షగాణ్ణి చూస్తూనే కొంపలంటుకుపోయినట్లు గయ్యిమని లేచి అతన్ని తిట్టి అక్కణ్ణుండి తరిమాడు.

తరువాత యథావిధిగా బాబాకు నైవేద్యం తీసుకొని మసీదుకు బయలుదేరాడు. కాశీనాథ్‌ను చూస్తూనే బాబా ఉగ్రులై, ***"ఎందుకొచ్చావిక్కడికి? మొన్న నేను అక్కడికొస్తే ఒక్క ముద్ద కూడా పెట్టలేదు. ఈరోజు నేనక్కడ నిలబడడం కూడా అపరాధమన్నట్లు తరిమికొట్టావ్. ఇక మీదట నీవు నాకు భోజనం తేనక్కర్లేదు"*** అన్నారు.

"మిమ్మల్ని నేనెప్పుడు తిట్టి తరిమాను, బాబా?" అని అడిగాడు కాశీనాథ్ బిత్తరపోతూ. ***"గోడకానుకొని నిలబడి ఉంటే, అక్కడ నిలబడవద్దని తరిమేశావు కదా?"*** అన్నారు బాబా. "అక్కడ నిలబడి ఉన్నది మీరా బాబా?" అన్నాడు కాశీనాథ్ నిశ్చేష్టుడై. ***"అవును. అంతటా నేనే ఉన్నాను. అంతకు మించి అతీతంగానూ నేనే ఉన్నాను! నీ దృష్టి ఎక్కడపడితే, అక్కడ నేనే ఉన్నాను!"*** అన్నారు బాబా.

కాశీనాథ్ దుఃఖంతోనూ, పశ్చాత్తాపంతోనూ కుమిలిపోయాడు. ఆ పశ్చాత్తాపమనే 'తపన' నుండి సర్వజీవులలోనూ బాబానే ఉన్నారన్న ప్రజ్ఞ మేల్కొంది. నిష్ఠాచారమనే నికృష్ఠపు గ్రహచారం తలకెక్కినవాడికి సద్విచారం 'సున్న' అనే సత్యం మనోనేత్రం ముందు తళుక్కుమని మెరిసి – మాయమైంది!

## 'ఉపవాసీబాబా' చేసిన ఉపవాసతపవాసాలు

కాశీనాథ్ శిరిడీ వచ్చిన తరువాత కొంతకాలం ఒక హోటలులో పైకమిచ్చి భోజనం చేస్తుండేవాడు. అయితే ఒకరోజు శ్రీసాయిబాబా దక్షిణ అడిగి, కాశీనాథ్ దగ్గరున్న పైకమంతా – పైసలతో సహా – తీసేసుకొన్నారు! తరువాత కొంతకాలం సాటిభక్తులు ఉచితంగా పెట్టే ఆహారంతో గడిపాడు. అది తన ఆరోగ్యానికి సరిపోక పోవడంతో, కొంతకాలం స్వయంపాకం చేసుకొని భుజించాడు. శ్రీదాదాకేల్కర్

ఆ రోజుల్లో కాశీనాథ్ వంటకు కావలసిన సరుకులు పంపేవాడు. కానీ, అదీ ఎంతో కాలం సాగలేదు. కొందరు భక్తుల సూచనపై దీక్షిత్ వాడాలో బాలాపాటిల్ అనే భక్తుడు నడుపుతున్న భోజనశాలలో కొంతకాలం అతిథిగా భోజనం చెయ్యడం మొదలెట్టాడు. రోజులు గడుస్తున్నకొద్దీ కాశీనాథ్ తన భోజనానికి వేరే ఏర్పాటు చేసుకోవడానికి ప్రయత్నించకపోవడంతో "ఎంతకాలమిలా ఇతనికి ఊరకనే భోజనం పెట్టాలి?" అనుకొని, ఒకరోజు విస్తరి ముందు కూర్చుని భోజనం చేస్తున్న కాశీనాథ్‌తో, "రేపటినుండి మీరు భోజనానికి వేరే ఏదైనా ఏర్పాటు చేసుకోండి!" అని చెప్పేశాడు బాలాభావ్.

పదిమంది ముందు అతడలా చెప్పడంతో కాశీనాథ్ అహం దెబ్బతిన్నది. అవమానభారంతో నిగ్రహం క్రుంగిపోయింది. "రేపట్నుంచి ఎందుకు? ఈరోజు నుంచే మానేస్తాను" అని వెర్రి కోపంతో కేకలేస్తూ, పంక్తిలోనుంచి లేచి ధుమధుమలాడుతూ భోజనశాల నిర్వాహకులను నానావిధాల దూషిస్తూ అక్కణ్ణుంచి వెళ్ళిపోయాడు. అవమానాగ్నితో మనస్సు దహించుకుపోసాగింది. "పొట్టకోసం ప్రాకులాడడం వల్లనే గదా తనకీ ఘోర అవమానం జరిగింది?" అనుకొని, తనకింత అవమానం జరగడానికి కారణమైన అన్నం ఇక ముట్టకూడదని ఆగ్రహంతో భీష్మప్రతిజ్ఞ చేసుకొన్నాడు. అన్నమే, తన ప్రయత్నంలేక తనను వెతుక్కుంటూ వచ్చినా తాకకూడదని తీర్మానించుకొన్నాడు. ఆ తరువాత కాశీనాథ్ అభిమానులు, మిత్రులు వచ్చి కొద్దిగానైనా ఆహారం తీసుకోమని ఎంత బ్రతిమిలాడినా ససేమిరా ఒప్పుకోలేదు. వారు తన కోసం తెచ్చిన భోజనాన్ని కుక్కలకు, పందులకు పెట్టేసేవాడు. అలా ఉపవాసాల వల్ల కాశీనాథ్ భారీకాయం చిక్కిశల్యమైంది. అతని పరిస్థితి చూచి కొందరు భక్తులు, ఆ విషయం బాబాకు నివేదించారు. ఎప్పుడూ ఉపవాసాలను అంగీకరించని బాబా, కాశీనాథ్‌ను ఆహారం తీసుకొమ్మని ఆదేశించారు. అయితే, ఆగ్రహంతో, కసితో ఉన్మత్తుడైన కాశీనాథ్ బాబా ఆజ్ఞ తోసెయ్యలేక ఎప్పుడైనా కొంచెంగా మాత్రమే ఆహారం తీసుకొనేవాడు. ఎక్కువభాగం నిరాహారిగానే గడిపేవాడు.

తనకుతానై కాశీనాథ్ విధించుకొన్న ఆ కఠిన ఉపవాసదీక్షవల్ల ప్రజల్లో అతనికి "ఉపాసనీ బాబా"కు బదులు 'ఉపవాసీ బాబా' అనే పేరు వచ్చింది!

ఇటు మితిమీరిన భోగలాలసత్వాన్ని అటు అలివిమాలిన "హఠ"యోగాన్ని శ్రీసాయిబాబా ఆమోదించలేదు. బాబా మనకు ఉపదేశించినది మధ్యేమార్గం. బాబానేకాదు, తత్త్వదర్శినులైన పూర్వ మహర్షులు, మహాత్ములు ఉద్బోధించినది కూడా అదే! అయితే, కాలపరిణామంలో, ఎన్నో సత్సాంప్రదాయాలు, సద్బోధలు మరుగునపడినట్లే, ఈ ఇహపర సాధనమైన మార్గం కూడా ప్రాధాన్యతను కోల్పోయి, ఇహపరాలకు దారులు వేరై, ఉపవాసాది కఠిన నియమాలద్వారా మనోదేహాలను బలవంతంగా తపింపజేసి, హింసింపజేసే సాధనలు ప్రబలాయి. ఈ వ్యర్థ సాధనా నియమాలవల్ల ఇహపరాలు రెండూ చెడడం తప్ప వేరే ప్రయోజనంలేదని, శ్రీసాయి మొ॥న సద్గురువులు హెచ్చరించారు. అందుకే ఈ ***"ఉపవాసాలు తపవాసాలు అక్కర్లేదు"*** అన్నారు బాబా. ఆకలి కడుపుతో భగవద్ధ్యానం చెయ్యడానికి శ్రీసాయి సుతారామూ అంగీకరించేవారు కాదు. సామాన్యంగాగానీ, వ్రతదీక్షలలో భాగంగాగానీ ఏకాదశివంటి పర్వదినాలలోగాని, తీవ్ర ఆధ్యాత్మికసాధనలో భాగంగాగానీ – ఏ రూపంగానయినా సరే ఉపవాసాన్ని బాబా ఆమోదించలేదు. పైగా నిరసించారు కూడా! ఉపవాసమంటే మనస్సును వ్యర్థమైన విషయాలతో నింపక, ఖాళీగా ఉంచుకొని, అందులో మన ఉపాసనాదైవాన్ని ప్రతిష్ఠించుకొని, ఆయనకు అంతరంగంలో దగ్గరవడం అన్నమాట! "ఉప" అంటే దగ్గరగా సమీపంలో అనీ, "వాసం" అంటే ఉండడం అనీ అర్థం. హృదయంలో భగవంతుని సామీప్యాన్ని అనుభవించడం – ఉపవాసం! కానీ, అసలైన ఈ అర్థంపోయి, నిరాహారంగా ఉండటమే ఉపవాసమనీ అదే ఉత్తమమైన తపస్సనే భావం అందరిలో స్థిరపడిపోయింది. ఇటువంటి దురభిప్రాయాన్ని ఖండిస్తూ సరైన ధ్యానయోగాన్ని బోధిస్తూ సర్వోపనిషత్సారమైన భగవద్గీత:

"నాత్యశ్నతస్తు యోగో స్తి నచై కాంత మనశ్నతః।

నచాతి స్వప్న శీలస్య జాగ్రతోనైవ చార్జున॥" — అంటే, "అర్జునా! అధికంగా తినేవాడికి, బొత్తిగా తిండిని వదలి ఉపవాసాలు చేసేవాడికి, ఎక్కువ నిద్రపోయేవాడికి, బొత్తిగా నిద్రపోనివాడికి ఈ ధ్యానయోగము సిద్ధించదు!" అని ప్రవచిస్తున్నది. మితమైన యుక్తమైన ఆహారము, విహారము ("యుక్తాహార విహారస్య") సాధకునికి విధింపబడిన నియమం. ***"స్వల్పంగా తిను! ఒకటి రెండు పదార్థాలతో తృప్తిపడు. రుచులకు పోవద్దు!"*** అని శ్రీసాయిబాబా ముముక్షువులకు చెప్పిన హితవు.

## ఉపవాస ఉన్మాదానికి బాబా చేసిన చికిత్స

శ్రీసాయి చెప్పిన హితవు పాటించకుండా కఠిన ఉపవాసాలతో ప్రొద్దుపుచ్చితే జరిగే మేలు కంటే కీడే ఎక్కువ. ఆకలి కడుపుతో ధ్యానానికి కూర్చుంటే మన దేహంలోని ప్రాణచలనం అస్తవ్యస్తమై శోషనిద్రలతో కూడిన ఒక విధమైన తమస్సు (మత్తు) మనస్సును ఆవరిస్తుంది. కొందరు ఆ మగతగా ఉండే అవస్థనే సమాధియనీ, మనస్సు "అమనస్క"మైందనీ భ్రమించటం కూడా కద్దు! అంతేకాదు! నిరాహారంగా మరీ దీర్ఘకాలముంటే, ఇంద్రియాలు పటుత్వం కోల్పోయి భ్రమలకు, విపరీతమైన (వికృతమైన) మనోవ్యాపారానికి దారితీస్తుంది. కొన్ని సందర్భాలలో మానసిక స్వస్థత కోల్పోయి ఉన్మత్తుడయ్యే ప్రమాదం కూడా ఉంది.

ఇటువంటి ప్రమాదమే మన 'ఉపవాసీ' (ఉపాసనీ)బాబాకు కూడా జరిగింది. దీర్ఘకాలం (సుమారు 1913 జనవరి నుండి ఒక్క సంవత్సరంపాటు!) నిరాహారిగా ఉండటంతో దేహారోగ్యం క్షీణించిపోయింది. ఎప్పుడూ ఏదో స్వప్నావస్థలో తేలిపోతున్నట్లుండేవాడు. ఏవో చిత్రవిచిత్ర దృశ్యాలు కంటి ముందు నిజంగా జరుగుతున్నట్లు తరచూ భ్రాంతికి లోనయ్యేవాడు. ఉన్నట్టుండి పరిసరాలను మరచిపోయి, తానేం చేస్తున్నాడో, ఎక్కడున్నాడో అనే విషయం స్పృహ తప్పేది. కంటి ముందు వస్తువులు వ్యక్తులు తలక్రిందులుగా కన్పించేవారు. దూరంగా ఉండే వస్తువులు దగ్గరగా, దగ్గరగా ఉండే వస్తువులు దూరంగా కనిపించేవి. మనస్సులో లోతుగా పాదుకుపోయిన అన్నద్వేషంవల్ల ఎప్పుడైనా ఏదైనా కొంచెం తిన్నా ఆ ముద్ద గొంతులోనే ఉన్నట్లు అనిపించేది. అన్నం పెంటలా కనిపించేది. చిన్న వస్తువులు భూతద్దంలోంచి చూస్తున్నట్లు చాలా పెద్దవిగా కనిపించేవి.

చిత్తచాంచల్యమనేది సామాన్యంగా అందరికి ఉండేదే; కానీ, ఆ చిత్తచాంచల్యం క్రియారూపం ధరించకుండా ఉండే నిగ్రహం కూడా ఆరోగ్యవంతుల సామాన్యలక్షణం. మనస్సుపై అటువంటి "అదుపు" పిచ్చివాళ్ళు, త్రాగుబోతులు కోల్పోతారు. అందుకే పిచ్చివాళ్ళు, మద్యం సేవించినవారు తమ మనస్సులో వచ్చిన ఆలోచన వచ్చిందే తడవు – యుక్తాయుక్తాలు, మంచిచెడ్డలు, ఆలోచించకుండా – ఆ పని చేయడానికి ఒడిగట్టడం జరుగుతుంది. ఇటువంటి "అవస్థే" దీర్ఘ ఉపవాసాలవల్ల కాశీనాథ్‌కూ కలిగింది.

శిరిడీలో కాశీనాథ్ ఆధ్యాత్మికసాధన దీక్ష ప్రారంభంలో అతనికి బాబా ఇచ్చిన ఆదేశం: *"నీవు మెదలకుండా కూర్చో! చేయవలసిందంతా నేను పూర్తి చేస్తాను!"* అని. కానీ, దాదాపు పిచ్చివాడైన కాశీనాథ్ చంచలచిత్తం అతన్ని ఊరక కూర్చోనిచ్చేది కాదు. అకారణంగా ఉన్నట్లుండి లేచి, వేళాపాళా లేకుండా, గమ్యం లేకుండా వీధులమ్మట తిరుగుతుండేవాడు. ఎవరైనా ఏదైనా పనిచేస్తుంటే పరుగున పోయి ఆ పని అందుకొనేవాడు. ఊరకే బావివద్ద నిల్చొని, నీళ్ళ కోసం వచ్చేవారికి నీళ్ళు తోడిపెట్టేవాడు. కూలీలు రోడ్డుపని చేస్తుంటే, వారితో కలిసి మట్టి, రాళ్ళు మోసేవాడు. పొలాల్లోకి పరుగెత్తి, కూలీలతోపాటు పొలంపని చేసేవాడు. కాశీనాథ్ పిచ్చిచేష్టలను గ్రామస్థులు జాలితో సహించేవారు. కొందరు వినోదించేవారు. పిల్లలు రాళ్ళు రువ్వుతూ వెంటబడేవారు. గేలిచేసేవారు. హింసించేవారు.

కాశీనాథ్ తనకుతానై విధించుకొన్న కఠినఉపవాస దీక్షవల్ల అతని మానసిక స్వస్థతే కాకుండా, దేహారోగ్యం కూడా విపరీతంగా దెబ్బతిన్నది. 1913 ఏప్రిల్‌లో డా॥చిదంబరం పిళ్ళే కాశీనాథ్ ఆరోగ్యం పరీక్షించినపుడు అతడి నాడి నిమిషానికి 40 ఉంది. ఆ తరువాత అది మళ్ళీ 20కి క్షీణించింది! శ్రీసాయి అనుగ్రహవిశేషము, మార్గదర్శకత్వమే లేనట్లయితే కాశీనాథ్ శాశ్వతంగా పిచ్చివాడై, అలాగే మరణించి ఉండేవాడే! కానీ, బాబా అనుగ్రహం వల్ల కాశీనాథ్ ఆ ప్రమాదం నుండి బయటపడ్డాడు. తమ దివ్యశక్తితో కాశీనాథ్‌కు స్వస్థత చేకూర్చడానికి బాబా ఏం చేశారో మనకు అగోచరం. కానీ బాహ్యంగా మాత్రం అతడికి స్వస్థత చేకూర్చడానికి బాబా చేసిన చికిత్స, తీసుకోమని ఆదేశించిన ఔషధం మాత్రం – ఆహారం!

## ఉపవాస తపవాసాల ఉన్మాదం - సాయి ఉపదేశాలతో చెలగాటం!

తమ భక్తులకు "ఉపస్సుతోను, తపస్సుతోను" ఎంత మాత్రం అవసరం లేదన్నారు బాబా. బాబా హితవు పెడచెవిన బెట్టి, కఠిన ఉపస్సు (ఉపవాసాలు)కు లంఘించుకొన్న ఉపాసనీ ఎలాంటి 'అవస్థ'లకు గురయ్యాడో ఇంతక్రితం తెలుసుకొన్నాం. ఇక 'తపస్సు' విషయం.

ఇంద్రియ సుఖాలపట్ల వ్యామోహాలతోను, సాంసారికమైన మమకారాలతోను, మన మనస్సులు ఎప్పుడూ ప్రాపంచిక విషయాలకోసం తాపత్రయపడుతూ 'తపిస్తూనే'

ఉన్నాయి. మనస్సును ఈ ఇంద్రియవిషయాలపై నుండి తప్పించి, నిజమైన తిరుగులేని ఆనందం కోసం తపింపజేయడమే నిజమైన 'తపస్సు'. ఈ 'మళ్ళింపు' బలవంతంగా కాక వివేకంతో, విచారణతో, ఆలోచనతో చేయవలసి ఉంది. "తపః" శబ్దానికి ఆలోచన అని అర్థం. అలా ఆలోచన, వివేకంతో కూడిన "నిగ్రహం" లేకుండా, పళ్ళబిగువున మనస్సును బలవంతంగా ఇంద్రియసుఖాల వ్యామోహం మీద నుండి తప్పింప యత్నిస్తే మనస్సు భగవంతుని కోసం తపించడానికి బదులు ఏ ఇంద్రియ భోగాలనుండి మనను మనం బలవంతంగా నిగ్రహించుకొంటున్నామో, 'ఆ భోగాలు లేకుండా పోయాయే' అని అంతరంగం తపిస్తుంటుంది. ఈ ఆంతర్య ఘర్షణ అలాగే కొనసాగితే అది సాధకుని కొంతకాలానికి క్రమంగా ఆత్మహింసానందము, పరహింసానందము మొ॥న మానసిక వికారాలకు గురిచేస్తుంది. సామాజిక స్థాయిలో ఆ మనోవికారాలే మతాచారాల ముసుగు తొడుక్కొని దేహాన్ని విపరీతమైన కఠిన నియమాలతో బాధపెట్టుకోవడమే సాధన, తపస్సుగా చలామణి అవడం మొదలవుతాయి. ఈనాడు మనం చూస్తున్న ఎన్నో ఆచారాలు అత్యంత, కఠిన నియమాలు పైన పేర్కొన్న మానసిక రుగ్మతల పర్యవసానమే!

(అయితే, శ్రీసాయిబాబా, శ్రీరమణమహర్షి, శ్రీరామకృష్ణ పరమహంస వంటి పరిపూర్ణ మహాత్ములు కూడా కొన్ని కఠిన నియమాలు పాటించారు కదా! మరి వాటి మాటేమిటి? – అనే సందేహం కలగవచ్చు. అలా 'కఠిననియమాలు'గా మనకు కనిపించేవి వారి స్థితిని ప్రతిబింబించే సహజ జీవితవిధానమే తప్ప, అవి వారు ప్రయత్నంతో ఆచరించినవికావు. విషయసుఖాలకతీతమైన బ్రహ్మానందంలో తేలియాడే వారికి ఆ జీవన విధానం 'కఠినంగానూ, నియమపాలనగాను' ఎలా ఉండగలదు? వారికి అత్యంత సహజమైన జీవితాచరణ మనకు మాత్రం ఎంతో 'కఠినం'గా తోచడం సహజం!)

కాశీనాథ్ జీవితం గమనిస్తే పైన వివరించిన విషయం ఇంకా స్పష్టంగా బోధపడుతుంది. దీక్షిత్ మొ॥న భక్తులలాగా కాశీనాథ్ బాబాపై భక్తితో తనకై తాను శిరిడీ వచ్చి స్థిరపడలేదు. కాశీనాథ్‌కు శిరిడీ నివాసం తప్పనిసరి పరిస్థితి! తప్పించుకుందామన్నా తప్పని స్థితి. ఒకవైపు మనసేమో ఇంటిపైకి, సంసారం వైపుకు లాగుతున్నది. పోవడానికా బాబా ఆజ్ఞలేదు! బాబా ఆజ్ఞను అతిక్రమించి వెళితే

ఏమౌతుందోననే భయం! పోనీ శిరిడీలో తన జీవితం ఒడిదుడుకులు లేకుండా హాయిగా ఉందా అంటే, అదీ లేదు! ఉండడానికా సరైన వసతిలేదు. స్థానికులతో శతృత్వం; సాటి సాయిభక్తుల అసూయ; శిరిడీలోని అల్లరిమూకల ఆగడాలు; తరచూ నానావలీ వచ్చిపెట్టే చిత్రహింసలు; క్షీణించిన ఆరోగ్యం; సానుభూతితో తన క్లిష్టపరిస్థితిని అర్థం చేసుకునే మిత్రులు కరువైన స్థితి; వీటికితోడు ఊరి బయట స్మశానానికి దగ్గరలో ఉన్న ఖండోబా ఆలయంలో రాత్రిళ్ళు ఉండాలంటే భయం! వీటితో శిరిడీలో కాశీనాథ్‌కు జీవితం దుర్భరంగా తోచసాగింది.

ఆ దుర్భరమైన అసహాయస్థితి వల్ల కాశీనాథ్‌కు తనమీద తనకు, చుట్టూ ఉన్న వ్యక్తులమీద – తనకు తెలియకుండానే – ఒకవిధమైన కసి ఏర్పడింది. సానుభూతితో, గౌరవంతో ఎవరైనా తనను సమీపిస్తే ఒక్కసారిగా కోపంతో వారిమీద విరుచుకు పడేవాడు. తిట్టేవాడు. వారిపై రాళ్ళు విసిరేవాడు. ఒక్కోసారి తనను తానే చిత్రవిచిత్ర రీతుల్లో హింసించుకొనేవాడు. ఒక్కోసారి సమాధిలాగా నిలువెత్తు గొయ్యి త్రవ్వి, దాన్లో పడుకొని తనమీద ముళ్ళకంపను దట్టంగా వేసుకొనేవాడు. కాశీనాథ్ విచిత్ర చర్యలు చాలామందికి ఉన్మాదంగా అనిపిస్తే, మరికొంతమందికి అవధూత చర్యలుగా, 'తపస్సు'గా తోచేవి.

1913లో – కాశీనాథ్ దీర్ఘ ఉపవాసాలతో తనను తాను హింసించుకొనే రోజుల్లో – ఒకసారి శ్రీబాపూసాహెబ్ సఖారాం జోగ్‌ను కాశీనాథ్‌కు భోజనం పెట్టమని బాబా ఆదేశించారు. జోగ్‌కు కాశీనాథ్ అంటే ఎంతో భక్తిగౌరవాలుండేవి. అయితే, తానొక్కడే కాశీనాథ్ జోలికెళ్ళడానికి భయపడి భీమాభాయి అనే భక్తురాలిని తోడు తీసుకొని ఖండోబా గుడికెళ్ళాడు. గుడి తలుపులు తట్టగానే 'ఎవరక్కడ?' అని కాశీనాథ్ గద్దిస్తూ కేకేశాడు. "నేను సఖారాంని! బాబా మీకు భోజనం పెట్టమని నన్ను పంపారు" అన్నాడు జోగ్. "అవసరంలేదు. ఛో! ఇక్కణ్ణుండి" అని కోపంతో లోపల నుండే అరిచాడు కాశీరాం. భీమాభాయి జోక్యం చేసుకొని "తలుపులు తెరవండి, బాపూ సాహెబ్ మీకు భోజనం తెచ్చాడు. లేచి భోంచెయ్యండి!" అని అంటూ, తలుపులు గట్టిగా నెట్టింది. తలుపులు తెరుచుకోగానే కాశీనాథ్ పట్టరాని కోపంతో భీమాభాయిని ఎడాపెడా కొట్టాడు. భయంతో జోగ్ దూరంగా పోయి "సాయిబాబా ఆజ్ఞానుసారం నైవేద్యం తెచ్చాను. మీరు తిని తీరవలసిందే" అని అన్నాడు. ఒళ్ళు తెలియని

కోపంతో ఉన్న కాశీనాథ్‌కు బాబా ఆజ్ఞ అని చెబుతున్నా లెక్కచెయ్యలేదు. "ఆ భోజనం తీసికెళ్ళి కాకులకు, కుక్కలకు పెట్టండి! పోండి" అని అరిచాడు. "మేము భోజనం తెచ్చింది మీకోసం కానీ కాకులకు, కుక్కలకు పెట్టడానికికాదు!" అన్నాడు జోగ్. "ఆ కాకులకు, కుక్కల కంటే నేను భిన్నంగా లేను. వాటికి పెడితే నాకు పెట్టినట్టే!" అన్నాడు కాశీనాథ్ బహుశా శ్రీసాయిని అనుకరిస్తూ! అటువంటి మాటలే శ్రీసాయి నోటి నుండి వచ్చినపుడు అవి భక్తులపై అద్భుత ప్రభావం చూపేవి. అంతటి స్థితి లేకుండా ఆ మాటలనుకరిస్తే అవి వినేవారికి మెట్టవేదాంతంగా తోచడం సహజం. సరిగ్గా అదే జరిగింది! కాశీనాథ్ మాటలకు జోగ్ "అంత పెద్ద వేదాంతం నాకర్థం కాదు! మీరు తింటారంటే ఈ భోజనం ఇక్కడ పెట్టి వెళ్తాను. లేకపోతే వెనక్కి తీసుకుపోతాను!" అన్నాడు. ఆ మాటలకు కాశీనాథ్ కోపం పట్టలేక అక్కడ పడివున్న రాయినొకదాన్ని తీసికొని జోగ్‌పైకి విసిరాడు. అది జోగ్ భుజానికి తగిలి, పెద్ద గాయమైంది. జోగ్ నిగ్రహం కోల్పోయి అక్కడ గుమికూడిన గ్రామస్థులను కాశీనాథ్‌ను పట్టుకొని కట్టిపడేయమని కోరాడు. అక్కడుండే జనం కాశీనాథ్‌పై పడి తాళ్ళతో కట్టి జోగ్ ఇంటిదగ్గర పడేశారు. అక్కడ కొంతసేపు బంధించి, తరువాత అలాగే బాబా వద్దకు ఈడ్చుకుపోయారు. బాబా జరిగిందంతా విని ***"అతడు సాధువు. అతన్ని మీరు బాధించకండి!"*** అని చెప్పి కాశీనాథ్‌ను బంధ విముక్తుణ్ణి చెయ్యమన్నారు. జనం కట్లు విప్పగానే, కాశీనాథ్‌తో బాబా, ***"ప్రశాంతంగా ఉండాలి పో! గుడికి పో!"*** అని ఆదేశించారు.

మరోసారి ఇలాగే రహతా వాస్తవ్యుడైన దౌలూసేఠ్ కాశీనాథ్‌పట్ల భక్తితో నమస్కారం చేసుకోవాలని, నైవేద్యం పెట్టాలనీ ప్రయత్నించాడు. కాశీనాథ్ ఎంత వారించినా వినలేదు! అయితే ఈసారి కాశీనాథ్ తన కోపాన్ని దౌలూసేఠ్ మీద చూపకుండా తనమీదే చూపించుకున్నాడు! దౌలూసేఠ్ చెప్పు తనచేతికి తీసుకొని ఆ చెప్పుతో తనను తాను వందసార్లు కొట్టుకొన్నాడు! దౌలూసేఠ్ మాత్రం భక్తి విశ్వాసాలతో ఆ చెప్పును ఇంటికి తీసికెళ్ళి పూజలో పెట్టుకొన్నాడు.

## కాశీనాథ్ హృదయకడలిలో కల్లోల కెరటాలు

శ్రీసాయిబాబా కాశీనాథ్ గురించి చెప్పిన ప్రశంసావాక్యాల దృష్ట్యా, కొంతమంది భక్తులకు కాశీనాథ్ విపరీత ధోరణి, విచిత్ర ప్రవర్తన, తపశ్చర్యలో భాగంగా, అవధూత

చర్యలుగా కనిపించినా, నిజానికవి కాశీనాథ్ మనస్సులో పారమార్థిక, సాంసారిక లక్ష్యాల మధ్య జరుగుతున్న అంతరసంఘర్షణకు, పెనుతుఫానులా చెలరేగుతున్న హృదయవేదనకు ప్రతిరూపాలు మాత్రమే. కాశీనాథ్ స్వయంగా చెప్పిన మాటలే ఈ సత్యానికి అద్దం పడుతున్నాయి.

కాశీనాథ్ మనసెరిగి, అతని విచిత్రపోకడలకు తగువిధంగా సర్దుకుపోగల అతి కొద్దిమందిలో డా॥పిళ్ళే, నర్సోబావాడికి చెందిన ఒక ప్రముఖ జ్యోతిష్కుడు కాశీనాథ్‌తో సన్నిహితంగా ఉండగలిగేవారు. ఒకసారి డా॥పిళ్ళేతో కాశీనాథ్ తన హృదయాన్ని విప్పి, తన బాధనిలా వెళ్ళబోసుకున్నాడు: "చూడు డాక్టర్! పోను పోను నా కష్టాలు, చెప్పుకోవడానికి కూడా వీలులేనంత దుర్భరంగా తయారవుతున్నాయి. ఒక పశువును కదలడానికి వీలులేకుండా ఒక గుంజకు కట్టేసి చితకబాదుతూ, చిత్రహింసలు పెడుతుంటే ఆ మూగజీవం తన బాధను వెళ్ళబోసుకోలేక ఎలా కుమిలి పోతుందో నా పరిస్థితికూడా సరిగ్గా అలాగే ఉంది". అదే విధంగా నర్సోబావాడి జ్యోతిష్కునితో "ఇప్పటివరకు నా జీవితంలో నేను చవిచూసినవన్నీ కష్టాలు, బాధలే. ఇక ముందుకూడా నేను సుఖపడగలనన్న ఆశలేదు. ఇల్లు, వాకిలి కోల్పోయాను. భార్య లేదు. బంధువులకు, ఆత్మీయులకు దూరమయ్యాను. చేతిలో చిల్లిగవ్వ లేదు. శరీరం తుక్కుతుక్కయింది. ఈ కష్టాలనంతా భరిస్తూ, ఇలా జీవచ్ఛవంలా మిగిలున్నాను. అంతెందుకు కట్టుకోవడానికి నాకొక మంచి గుడ్డముక్క కూడా లేదు. నా గతమంతా కష్టాలమయమే! ఇక భవిష్యత్తులోనయినా నేను సుఖపడే యోగముందా? లేదా?" అని బేలగా అడిగాడు కాశీనాథ్.

## సాయి సన్నిధిలో సాధన - సాధకుని అంతరంగ శోధన!

'తాను వేరు, జగత్తు వేరు' అనే భావమే అజ్ఞానం. అదే అహంకారానికి (పరిమితత్వానికి) ఆదికారణం. ఈ అహంకారమనే పునాదిపైన అరిషడ్వర్గాలనే ఇటుకలతో నిర్మించబడ్డ అడ్డుగోడ లేచి వ్యక్తిని బంధించి దుఃఖమనే చీకటిలో పడదోస్తున్నది. ఈ అడ్డుగోడను పడగొట్టటమే ఆధ్యాత్మిక సాధన. ***"ఈ ప్రపంచము మన మధ్య భేదమనే అడ్డుగోడను నిలుపుతున్నది. ఆ గోడను కూలదోస్తే చాలు!"*** అని బాబా చేసిన ఉపదేశంలోని సారంశమిదే! అయితే, మనలోని శుద్ధ చైతన్యానికి

పరిమితులు కల్పించి బంధించే ఆ 'గోడ'ను కూలదొయ్యడమెలా?– గుర్వనుగ్రహ బలంతో, వివేక అభ్యాసాలనే పనిముట్లనుపయోగించి ఛేదిస్తేగానీ, ఆ గోడ కూలదు! వీటిలో ఏది లోపించినా ఆ అహంకారపు అడ్డుగోడ కూలడం అసాధ్యం. గుర్వనుగ్రహం అందరికీ ఎప్పుడూ పుష్కలంగా ఉంటుంది. దాన్ని వివేకంతో సద్వినియోగం చేసుకొని, దీక్షగా అహంకార నిర్మూలనకు అభ్యాసం చెయ్యవలసి ఉంటుంది. కానీ, మనలోని విషయవాసనలు, సాంసారిక తాపత్రయాలు, వ్యామోహాలు ఆ ప్రయత్నం చెయ్యడంలో మనను నిర్వీర్యులను చేస్తాయి. సామాన్య సాధకుడికి సద్గురు సన్నిధి మొదట మొదట గాఢమైన శాంతిని భద్రతాభావాన్ని ప్రసాదిస్తుంది. కానీ, అది తాత్కాలికమే! సాధకుడు ఒక స్థితిని సాధించిన తరువాత, ఆ సద్గురు సన్నిధే అతని హృదయంలో చెప్పలేని అశాంతిని రేపుతుంది. సంధించి విడిచిన బాణంలా ఆ సన్నిధి వదలి ఎప్పుడెప్పుడు పారిపోదామా అని ఆరాటపడుతుంది. కారణం మామూలు పరిస్థితిలో హృదయంలో అణగిపోయిన వాసనలు, సద్గురు సన్నిధి ప్రభావంవల్ల, అహంకారపు చీకటి పొరలు చీల్చుకొని బహిర్గతమవడం ప్రారంభమవుతుంది. ఒక వైపు తాను సాధించదలుచుకొన్న ఉన్నత లక్ష్యం; మరో వైపు విజృంభించిన వాసనాబలం! ఈ రెండింటి సంఘర్షణలో సాధకుడు నలిగిపోతాడు. తన స్థితి తనకే దుర్భరంగా తోస్తుంది. ఈ దుర్భరస్థితిలో తపిస్తున్న సాధకుని అంతరంగంలో సాగే మథనమే– అసలైన తపస్సు! సామాన్యంగా, దీక్ష వహించి సాధనచేస్తే, హృదయకుహరంలో దాగిన వాసనలు బహిర్గతమై, నిర్మూలింపబడడానికి ఎన్నో సంవత్సరాలు, జన్మలు పడుతుంది. కానీ, శ్రీసాయిబాబా వంటి సద్గురుసన్నిధిలో వ్యక్తిలోని ఈ వాసనాచక్రభ్రమణం వేగం పుంజుకొని, సాధన అతి శీఘ్రగతిన సాగుతుంది. ఆ శీఘ్రగతిని తట్టుకొని ఎంతవరకు సాధకుడు తనను తాను నిలువరించుకోగలడన్న దానిపై సాధనలో అతడి జయాపజయాలు ఆధారపడి ఉంటాయి. ఈ సంఘర్షణ ఎంత తీవ్రంగా సాగితే సాధకుడిస్థితి అంత దుర్భరంగా, దుస్సహంగా తయారవుతుంది.

ఆ సంఘర్షణ సాధకుని శ్రేయస్సుకేనని తెలిసిన సద్గురువుకు మాత్రం అతని 'స్థితి' ఎంతో సంతోషదాయకంగా ఉంటుంది. సద్గురువు యొక్క సంతోషాన్ని గమనించిన సాధకుడు మాత్రం సద్గురుమూర్తి తన బాధను అర్థం చేసుకోవడం

లేదనీ, తన పరిస్థితి "పిల్లికి చెలగాటం - ఎలుకకు ప్రాణసంకటం"గా ఉందనీ కృంగిపోతాడు.

ఈ సాధనరహస్యం యొక్క నేపథ్యంలో చూస్తేగానీ, కాశీనాథ్ శిరిడీలో అనుభవించిన హృదయవేదన, అంతరంగ మథనం యొక్క ఆంతర్యం అవగతం కాదు! లేకపోతే శ్రీసాయిబాబా వంటి సద్గురుసామ్రాట్ సన్నిధిలో కాశీనాథ్ మనస్సులో శాంతి ఆనందాలు నెలకొనడానికి మారు అంతటి దుర్భర హృదయవేదన ఎలా కలిగిందా?– అనే సందేహం కూడా కలుగుతుంది.

కాశీనాథ్ తన హృదయ వేదనను డా॥ పిళ్ళే వంటి మిత్రులతో వెళ్ళబోసుకొనే కంటే, శ్రీసాయికే మొర పెట్టుకొని ఉండవచ్చుకదా అని కొందరికనిపించవచ్చు. నిజమే! కాశీనాథ్ ఒక్కసారి కాదు, తరచూ బాబాతో తన పరిస్థితిని గూర్చి మొరపెట్టుకొంటూనే ఉండేవాడు. కాశీనాథ్‌ను తరచూ మసీదుకు రావద్దని బాబా ఆజ్ఞాపించిన కారణంగా, బాబా లెండీకి పోయి వచ్చేటప్పుడు దారిలో ఆయన్ను దర్శించి, తన ఇక్కట్లు వినిపించేవాడు. బాబా అతడు చెప్పిందంతా సానుభూతితో విని *"అలా డీలాపడకు. నేనెప్పుడూ నీతో ఉన్నాను. ఇప్పుడు నీవెంత కష్టపడితే ముందు ముందు అంత సుఖపడుతావ్! ప్రపంచమంతా ఒకఎత్తు; నీవొక్కడివే ఒక ఎత్తు!"* అనేవారు బాబా. కానీ బాబా మాటలు కాశీనాథ్‌కు ఏనాడూ సరిగ్గా బోధపడేవి కావు.

శ్రీసాయి ఒకసారి కాశీనాథ్‌తో అన్నారు, *"నీవెన్నో వృక్షాలను నాటవలసి ఉంది!"* అని. *"అలాగే బాబా! ఖండోబాగుడి ప్రక్కన కొంత ఖాళీ స్థలముంది అక్కడ ఏం మొక్కలు నాటమంటారు? తులసిమొక్కలు నాటనా?"* అని అడిగాడు కాశీనాథ్. దానికి ఒక పసివాణ్ణి చూచినట్లు కాశీనాథ్‌కేసి చూస్తూ బాబా నవ్వుతూ ఇలా అన్నారు: *"ఏమిటి, తులసి మొక్కలు నాటుతావా? తులసి మొక్కలు ఎంతో కాలం జీవించవే! శతాబ్దాల తరబడి నిలిచి ఉండే మహావృక్షాలను నీవు నాటాలి. వాటివల్ల ప్రజలకెంతో మేలు కలగాలి. నీవు 14 రావిచెట్లను (అశ్వత్థ వృక్షాలను) నాటాలి. సరేనా? పోయి, రావి చెట్లు నాటు!"* అన్నారు. ఎంతోమందికి నీడనిచ్చి, సేదదీర్చి, కాపాడే మహావృక్షాల వంటి సద్గురువులనెందరినో కాశీనాథ్ తయారుచేయాల్సి ఉంటుందని బాబా భావం. కానీ, కాశీనాథ్‌కు బాబా మాటలలోని అంతరార్థం అర్థంకాక, ఆయన మాటలను యథాతథంగా గ్రహించి, ఖండోబా గుడి ప్రక్కన ఉండే ఖాళీస్థలంలో

14 రావి చెట్లు నాటే స్థలం లేదే అనే ఆలోచనలో పడ్డాడు. ఏం చెయ్యాలో పాలుబోక "మీరు చెప్పేది నాకేం పాలుబోవటం లేదు" అన్నాడు బాబాతో. బాబా చిరునవ్వుతో, ***"ఏ మాటలతో అవసరంలేకుండా ముందు ముందు అంతా నీకే అర్థమవుతుందిలే!"*** అన్నారు బాబా.

పరిపూర్ణమైన ఆత్మజ్ఞానంవల్ల మాత్రమే మనలోని వాసనలు సంపూర్ణంగా నాశనమవుతాయి. వివేకంతో కూడిన వైరాగ్యం సాధకునిలోని వాసనాబలాన్ని బలహీనం మాత్రమే చేయగలదు. పుట్టి పెరిగిన వాతావరణం, కుటుంబ సంప్రదాయం, సాంగత్యం మొ॥న వాటి ప్రభావం వల్ల మలినవాసనలు బలంగా పొడచూపకపోయినా, అవి నాశనమవవు. అవకాశం లభించినప్పుడు విజృంభించక మానవు. అందుచేత ఆత్మజ్ఞానం కలగడానికి ముందు ప్రకటమయ్యే 'వైరాగ్యం' కేవలం తాత్కాలికం మాత్రమే. సద్గురు సన్నిధి మనలో నిద్రాణంగా పొంచివున్న మలినవాసనలను బయటకు తెప్పించి, వాటితో పోరాటం చేయించి, తన కృపాబలాన్ని ఆసరాగా ఇచ్చి వాసనాక్షయం కలిగిస్తుంది.

కాశీనాథ్ విషయంలో ఇదే జరిగిందని ముందు చెప్పుకొన్నాం. దానికి మరో ఉదాహరణ. కాశీనాథ్ జీవితం పరిశీలిస్తే, బాల్యం నుండి తన తాతగారితో తప్ప, తక్కిన కుటుంబసభ్యులెవరిపట్ల ప్రత్యేక మమకారం ఉన్నట్లు కనిపించదు. బాల్యం నుండీ ఇళ్ళు పట్టకుండా తిరిగినవాడు. అయినా, బాబా సన్నిధి ప్రభావం చేత, కాశీనాథ్‌లో నిద్రాణంగా ఉన్న ఈషణత్రయాలు మేల్కొన్నాయి. తన కుటుంబ సభ్యులను చూడాలని, వారితో ఉండాలని తపన పెరిగింది.

ఒకసారి (1913లో) ప్రముఖ నవలా రచయిత శ్రీహెచ్.ఎస్.ఆప్టే శిరిడీ వచ్చి కాశీనాథ్‌ను కలిశాడు. ఆయన కాశీనాథ్ కుటుంబానికి మిత్రుడు. డా॥పిళ్ళే తదితరులతో తన మనసు విప్పి మాట్లాడినట్లే, శ్రీఆప్టేతో కూడా తన బాధ వెళ్ళబోసుకున్నాడు కాశీనాథ్. తానిక ఇంకెంతో కాలం జీవించననీ మరణించే ముందు తన బంధువులనొకసారి చూడాలని ఉందని వాపోయాడు. శ్రీఆప్టే ఈ విషయం కాశీనాథ్ అన్నగారైన శ్రీబాలకృష్ణ శాస్త్రికి ఉత్తరం వ్రాశాడు. శ్రీబాలకృష్ణ శాస్త్రి ఆ ఉత్తరం చూసి శిరిడీ వచ్చి తమ్ముణ్ణి చూచి, ఓదార్చి వెళ్ళిపోయాడు. ఆ తరువాత కాశీనాథ్ తల్లిగారు శిరిడీ వచ్చింది. ఆమె నేరుగా శ్రీసాయిబాబా దర్శనానికెళ్ళింది. ఆమెవరో

ఏమిటో ఎవరూ చెప్పకముందే, బాబా అక్కడ మసీదులో ఉన్న భక్తులకు ఆమెను చూపుతూ, ***"ఈ తల్లి ఎంతో పుణ్యం చేసుకుంది!"*** అన్నారు. వెంటనే ఆమెతో, ***"నీవు ఖండోబా ఆలయానికి పో!"*** అన్నారు. ఆమె బాబాకు నమస్కరించుకొని ఖండోబా గుడి దారిపట్టింది. దారిలో కొందరు గ్రామస్థులు "ఏమ్మా, ఖండోబా గుడికా నీవెళ్ళేది? అక్కడొక పిచ్చోడున్నాడు. జాగ్రత్త!" అని హెచ్చరించారు. ఖండోబా గుడి చేరి, తలుపుకొట్టింది. "ఎవరది?" అని గద్దిస్తూ అడిగాడు కాశీనాథ్ లోపలి నుండి. "నేను" అన్నది తల్లి. తన తల్లి గొంతును గుర్తించిన కాశీనాథ్ ఒక్క ఉదుటన లేచి తలుపు తీశాడు. తల్లిని చూచి, ఆమెను కౌగలించుకొని, బావురుమన్నాడు.

## సద్గురు సన్నిధిలో సాధన - దాని తత్త్వశోధన

శ్రీసాయి వంటి సమర్థ సద్గురువు యొక్క సన్నిధి ప్రభావం వల్ల సాధకుని అంతరంగంలో జరిగే వివిధ మార్పులు, ప్రక్రియలు (స్థూలంగా) మూడు దశలలో వ్యక్తమౌతాయి. సద్గురువు కృపావిశేష ప్రభావంవల్ల మన అంతరంగంలో సాగే ఆ మౌనరాగం యొక్క శృతిలయ విన్యాసాలు స్పష్టంగా అవగతం కావాలంటే, ముందు మన అంతరంగం యొక్క స్వరూప స్వభావాలేమిటో కొంచెంగానైనా అర్థమవ్వాలి.

మన అంతరంగం ఒక కొలను వంటిదనుకొంటే, అందులోని నీరు మనలోని ఎఱుక, లేక చైతన్యం. సహజంగా నిశ్చలంగా ఉండే నీటికి గాలివీచడమో, ఏదైనా వస్తువులు బయటనుండి నీళ్ళలో పడటమో జరగడంవల్ల చలనం కలిగి, ఆ చలనం అలల (తరంగాల) రూపంలో వ్యక్తమౌతుంది. అలాగే, బాహ్య జగత్తులోని వివిధ వస్తువుల, వ్యక్తుల సంఘటనల పట్ల (వల్ల) మన 'ఎఱుక' యొక్క ప్రతిస్పందనలే అలలు అలలుగా మన మనస్సులో చెలరేగే ఆలోచనలు. ఆ బాహ్య విషయాలనే ప్రేరణలు కొలనులోనికి విసరబడ్డ మట్టిబెడ్డల వలె – నీటి ఉపరితలాన్ని (మనస్సును) తాకి అలల సుడులు (ఆలోచనలు) రేపి, కొలను అట్టడుగుకు (హృదయంలో) చేరుకొని (విషయవాసనల రూపంలో) పేరుకుపోతాయి. నీటి (మనసు) ఉపరితలాన్ని తాకే వస్తువు (విషయ ప్రేరణ) యొక్క పరిమాణం, వేగాన్నిబట్టి అది సృష్టించే అలల తరంగ దైర్ఘ్యం, వేగం ఆధారపడి ఉంటుంది. ఒక్కొక్కసారి ఎన్నో విషయాలు, ఒక్కసారి వెంటవెంటనే మనస్సును తాకడం వల్ల అవి సృష్టించే సుడుల నుండి బయలుదేరే

కెరటాలు ఒకదానిలో ఒకటి కలిసి మరో సరిక్రొత్త కెరటం రూపుదిద్దుకోవచ్చు; లేదా, రెండు కెరటాలు పరస్పర విరుద్ధంగా ఢీకొని వాటి బలాన్ని కోల్పోనూవచ్చు! ఈ బాహ్య విషయప్రేరణలు మన మనస్సుయొక్క మెలకువ స్థితిలోనే (జాగ్రదావస్థలోనే) సామాన్యంగా మనకనుభవమౌతాయి. కనుక మెలకువ స్థితి యొక్క అంచు – అంటే మెలకువకు నిద్రకు మధ్యనుండే సంధి – కొలనుగట్టు వంటిది. మెలకువ స్థితిలో మన మనస్సనే కొలనులోపడ్డ విషయప్రేరణలు సృష్టించిన అలలు ఒడ్డుకుచేరి ఆ గట్టును ఢీకొని వెనక్కు ప్రతిస్పందిస్తాయి. అలా వెనక్కు ప్రతిస్పందించే అలల ప్రకంపనలే మనకనుభవమయ్యే కలలు (స్వప్నాలు). ఒడ్డును ఢీకొనే అలల స్వరూప స్వభావాల మీద, వాటి వేగాన్నిబట్టి, వెనక్కు మరలే ప్రతికంపన ఆధారపడి ఉంటుంది. అందుకనే జాగ్రదావస్థలో మనకు కలిగే అనుభవాల నీడల మాదిరి కలలు మనకు అనుభవమవుతుంటాయి.

ఈ కంపన – ప్రతికంపనల మధ్య నీరు (మనస్సు) తన సహజస్థితియైన స్థిరత్వం కోసం చేసే ప్రయత్నమే– సుషుప్తి! వివిధ విషయాల ప్రేరణలవల్ల చెలరేగిన అలలతో అల్లకల్లోలంగా ఉండే కొలనులా ఉంటుంది సామాన్యంగా మన మనఃస్థితి. నీటి ఉపరితలం అలలతో అల్లకల్లోలంగా ఉన్నప్పుడు కొలనుయొక్క అడుగు స్పష్టంగా కనిపించనట్లే, చిత్తచలనంలో చిరకాలంగా అంతరంగం అట్టడుగుపొరల్లో పేరుకొనిపోయిన విషయవాసనలు మనకవగతం కావు.

ఈ స్థితిలో సద్గురు కృపావిశేషంవల్ల, జన్మాంతర ఋణానుబంధం వల్ల సాధకుడు ఆర్తితో సద్గురు సన్నిధిచేరి, ఆయన పాదాలు ఆశ్రయిస్తాడు. సచ్చిదానంద స్వరూపమైన సద్గురు సన్నిధాన ప్రభావం వల్ల మన అంతరంగంలో సాగే కల్లోలం తక్షణం శాంతించి, అంతఃకరణ స్థిరత్వాన్ని పొందుతుంది. ఇదే సాధారణంగా మహాత్ముల సన్నిధిలోకి అడుగిడగానే మనకనుభవమయ్యే శాంతి ఆనందాలు. ఈ శాంతి ఆనందాలవల్ల సద్గురు సన్నిధిని చేరినవ్యక్తి ఆ సద్గురువుపట్ల మరింతగా ఆకర్షింపబడతాడు. శ్రీసాయిబాబా, భగవాన్ శ్రీరమణమహర్షి వంటి సద్గురుమూర్తులను దర్శించిన భక్తులందరికీ ఈ శాంతిఆనందాలు 'కొట్టొచ్చినట్లు' అనుభవమయ్యేవి. చంచలమైన చిత్తం వెంటనే శాంతించి, మనస్సు అప్రయత్నంగా ధ్యానస్థమవుతుంది. శ్రీసాయి సన్నిధిలో అప్రయత్నంగా అందరికీ అనుభవమయ్యే ఈ అపూర్వ శాంతి

ఆనందాలను గూర్చి, శ్రీజి.ఎస్. ఖాపర్డే, శ్రీమతి తర్ఖడ్ మొదలైన భక్తులు తమ స్మృతులలో వ్రాశారు. ఈ వివరాలు శ్రీసాయిచరిత్రలలో చూడవచ్చు. ఇది సద్గురు సన్నిధిలో సాధకుడు పొందే మొదటిదశ.

## సాయిసన్నిధి - సాధకుల పాలిట పెన్నిధి!

అలా సద్గురు సాన్నిధ్యానికి ఆకర్షింపబడ్డ భక్తుడు మరికొంతకాలం ఆ శాంతి ఆనందాలను అనుభవిస్తూ, వాటిని సుస్థిరం చేసుకొందామనే తపనతో సద్గురు సాన్నిధ్యంలోనే ఉంటూ సాధన చేసుకోవాలని తలుస్తాడు. గురుకృప ఉంటే ఆ తలంపు నెరవేరుతుంది కూడా! కానీ అలా ఆ దివ్యసన్నిధిలో కొంతకాలం గడిపేసరికి, క్రమంగా సాధకుని అంతరంగంలో ఎప్పుడూ లేనంత భావతీవ్రతతో రకరకాల కోరికలు, విషయవాంఛలు, ప్రాపంచిక వ్యామోహాలు చెలరేగి, మనస్సు తిరిగి చంచలమవుతుంది! శాంతి ఆనందాల స్థానే ఏదో తెలియని హృదయవేదన చోటు చేసుకోనారంభిస్తుంది. మనసు సులభంగా ధ్యానంలో నిలువదు. ధ్యాస, విషయానుభవాల వైపుకు లాగుతుంటుంది. మొదట బాగా జరుగుతుండిన జప ధ్యానాలు అసలు కుదరకుండా పోతుంటాయి. ఎందుకో అర్థంకాదు. చాలావరకు జయించేశామని 'అనుకొంటుండిన' కామ, క్రోధ, మద, మత్సరాది వికారాలు ఇనుమడించిన భావతీవ్రతతో మనస్సును ఆక్రమించుకొంటాయి. ఎన్నో రకాల అపవిత్రపుటాలోచనలు మనసులో తొంగిచూస్తుంటాయి. "ఛీ! ఛీ!! ఇదేమిటి? పవిత్ర సద్గురుసన్నిధిలో కూడ ఇటువంటి పాడు ఆలోచనలు వస్తున్నాయే! నా అంతటి పాపాత్ముడు మరొకడుంటాడా?" అని తనను తాను ఛీదరించుకొంటాడు. మనసులో తేలే చెత్త ఆలోచనలను లోనికి అణచివేయడానికి ప్రయత్నించేకొద్దీ, అవి రెట్టింపు బలంతో పైకి తన్నుకొస్తుంటాయి. "ఆత్మసాక్షాత్కారం కోసం కూర్చుంటే తన పాపాత్మ స్వరూపం నగ్నంగా ఇలా సాక్షాత్కరిస్తున్నదేమిటి?"– అని కించపడతాడు.

కొలనులోని నీటి ఉపరితలంపైన అలల ఉధృతి (చలనం) తగ్గి, నిశ్చలం అయ్యేకొలదీ, కొలను అడుగు స్పష్టంగా గోచరించడమేగాక అంతకు ముందు అడుగున పేరుకొని ఉన్న క్రుళ్ళు నెమ్మదిగా పైకి తేలడం మొదలవుతుంది. ఇదే ఈ దశలో సాధకుని అంతరంగంలో కూడ జరిగేది.

చాలా అరుదుగా జరిగే విషయమైనా, ఒక్కొక్కసారి కొందరు వ్యక్తుల విషయంలో అంతర్గతమైన వాసనలు ఒక్కసారిగా – కట్టలు త్రెంచుకొని ప్రవహించే వరదనీటిలా – అతి ఉధృతమైన వేగంతో వెలికి వస్తాయి. ఆ ఉధృతికి ఒక్కొక్కసారి మనస్సుపై సామాన్యంగా ఉండే 'అదుపు' కోల్పోయి, చూచేందుకు వారు ఉన్మత్తంగా ప్రవర్తిస్తున్నట్లు కనిపిస్తుంది. అయితే ఇది తాత్కాలికం! వాసనలు బహిర్గతమయ్యే వేగం తగ్గగానే, అంతకుముందు కంటే ఎక్కువ స్థిరమైన, నిర్మలమైన వ్యక్తిత్వాన్ని సంతరించుకుంటారు. స్వభావసిద్ధంగా మనసులో బలంగా ఏర్పడ్డ కోరికలు, వాసనలు సహజరీతిన బహిర్గతం కాకుండా బలవంతంగా త్రొక్కిపట్టి బాహ్యంగా దానికి భిన్నమైన మరో వ్యక్తిత్వాన్ని (personality) వ్యక్తం చేస్తూ, పరస్పర విరుద్ధమైన వ్యక్తిత్వపు ధోరణుల సంఘర్షణలో వ్యవహరించే వ్యక్తుల్లోనే సామాన్యంగా పైన చెప్పిన "ఉధృత పరిణామం" కనిపిస్తుంది.

క్రమంగా ప్రాపంచిక వాసనల బలం పెరిగి, సాధనయొక్క లక్ష్యం పట్ల శ్రద్ధ, దీక్ష క్షీణించడం ప్రారంభమవుతుంది. ఎప్పుడెప్పుడు ఆ సద్గురువు సన్నిధి నుండి బయటపడదామా! అని మనసు ఉవ్విళ్ళూరుతుంటుంది. సాధనలో మనసు నిలువక, తిరిగి లౌకిక వ్యవహారాలలోకి వచ్చానని చెప్పుకోవడానికి అవమానం కనుక, సద్గురు సన్నిధినుండి బయటపడేందుకు అవసరమైన ఉపాయాలు, కారణాలు వెతుక్కొంటాడు. అంతకు మునుపు జ్ఞప్తికి రాని ధర్మాలు, సాంసారిక బాధ్యతలు, కర్తవ్యాల పట్ల హఠాత్తుగా 'కళ్ళు' తెరుస్తాడు. వాటికి తానే 'అనివార్యమనే' ప్రాముఖ్యాన్నిచ్చి, సద్గురువు యొక్క ప్రత్యక్ష సాన్నిధ్యపు కక్ష్యనుండి రాకెట్ వేగంతో బయటపడతాడు. కాదు! బయటపడ్డానని భావిస్తాడు. కానీ, సద్గురుని ప్రేమ పంజరం నుండి బయట పడ్డాననుకొనే ఆ సాధకుడనే పిచ్చుక, తన కాలికి సద్గురు కృపావీక్షణమనే దారం కట్టబడి ఉన్నదని గ్రహించడు. సర్వత్రా నిండి ఉన్న సద్గురు అనుగ్రహశక్తి, సాధకుణ్ణి తిరిగి సాధనా కక్ష్యలోకి రప్పించే పరిస్థితులను కల్పించసాగుతుంది. సామాన్యంగా ఎక్కువశాతం సాధకులు ఈ దశలోనే శ్రద్ధాయుతమైన సాధనకు తాత్కాలికంగా దూరం అవుతారు. సద్గురువు సశరీరులుగా ఉంటే ఇంకొక ప్రమాదం కూడా ఉంది! హృదయాంతరాళాల లోపలి పొరలనుండి బహిర్గతమవుతున్న విషయవాసనా ప్రకోపం – సాధకుడు ఒక్కోసారి బాహ్యంగా సద్గురుసన్నిధి నుండి దూరంగా పోలేని

పరిస్థితులే ఉంటే – అక్కడే తన లౌకికవాసనల అభివ్యక్తీకరణకు పరిస్థితులు కల్పించుకుంటుంది. అందుకే సద్గురుమూర్తులను ఆశ్రయించిన ఎందరో సాధకులు క్రమంగా తాము అక్కడ చేరిన లక్ష్యం మర్చిపోయి 'ఆధ్యాత్మిక రాజకీయాల్లో' సాటి భక్తుల తోటి వర్గపోరాటాలలో, మత్సరాలలో, (సంస్థలుంటే) సంస్థాగతమైన వ్యవహారాలలో తలదూర్చి మునిగిపోతారు.

ఉపాసనీబాబాను తరచు తమ దర్శనానికి కూడా మసీదుకు రాకుండా, ఖండోబా ఆలయంలోనే ఏకాంతంగా ***"ఊరక కూర్చోమని"*** బాబా ఆదేశించిన కారణాలలో ఇదీ ఒకటి.

అయినా ఈ విషయంలో సాయిభక్తులకు మాత్రం ఎటువంటి భయానికి తావు లేదు. ఎందుకంటే ***"తమ భక్తుని ఎన్నటికీ పతనం కానివ్వననీ,*** (అంతర్యంలోగాని, బాహ్యంగాగాని) ***ఆతడు తనకెంతో దూరాన ఉన్నా - సప్తసముద్రాలకావల ఉన్నా - పిచ్చుక కాలికి దారంకట్టి లాగినట్లు - తమ వద్దకు రప్పించుకొంటాన"***ని బాబా ఇచ్చిన హామీ!

## సాయి భక్తుల సాధనలో బాబా పాత్ర!

ఇక సద్గురు కృపాబలం వల్ల తప్పని సరైతేనేమి (ఉపాసనీబాబా విషయంలో జరిగినట్లు) సాధకుని వివేకబలంవల్లనైతేనేమి, లక్ష్యశుద్ధిని కాపాడుకొని, సద్గురు సన్నిధిలో సాధన కొనసాగిస్తే, మూడవ దశ ఆరంభమౌతుంది. ఈ దశలో సాధకుడు తన ప్రయత్నం ఒట్టి భ్రమేననీ, నిజానికి తన సాధనను నడిపించేది సద్గురు కృపాహస్తమేననీ స్పష్టంగా గ్రహిస్తాడు. శ్రీసాయిబాబా వంటి సమర్థ సద్గురువు తన దివ్యశక్తి చేత, సాధకుని అంతరంగంలో పేరుకొన్న మలిన వాసనలను – ఇటు భౌతికంగానూ, అటు మానసికంగానూ – కొన్ని దివ్యానుభవాలనిచ్చి, వాటి ద్వారా నిర్మూలిస్తాడు. ఎన్నోజన్మల కఠోరతపస్సు చేసినా క్షాళనకాని మలిన విషయవాసనలను సద్గురువు కేవలం తన కృపావిశేషంతో మటుమాయం చేస్తాడు. భౌతికంగా తమ లీలల ద్వారా, చర్యలద్వారా ఎలా ప్రబోధించి సద్భావనలు మన అంతరంగపు లోతులలో నాటుకొనేలా చేయగలరనేది శ్రీసాయిబాబా చరిత్ర చదివితే ఇట్టే అవగతమౌతుంది. ఇక అంతఃకరణ మాలిన్యాన్ని శుద్ధి చేసేందుకు సద్గురువు సామాన్యంగా ఎన్నుకొనేది

– వివిధ 'స్వప్నానుభవాలు', 'దివ్యదర్శనాలు'. ఎందుకంటే– నిద్రావస్థలోను, సరైన ధ్యానస్థితిలోను సాధకుని అంతరంగం బలహీనంగా, పలుచగా ఉండి, సద్గురు ప్రభావాన్ని నిరోధించకుండా గ్రహించి, ఆయన సంస్కరణకార్యాన్ని సుగమం చేస్తుంది.

జాగ్రదావస్థలో కలిగిన అనుభవాల ప్రతికంపనలే కలల (స్వప్నాల)రూపంలో మనకవగతమౌతాయని ముందు తెలుసుకొన్నాము. కానీ, సామాన్యంగా మనకొచ్చే స్వప్నాలు మన విషయవాసనలను బలపరచి, వాటిని భద్రంగా హృదయపులోతుల్లోకి నెట్టివేస్తాయి. కానీ, సద్గురువు సన్నిధిలో సాధకునికి అనుభవమయ్యే స్వప్నాలు, అతని అంతరాళపు లోపలిపొరల్లో దాగిన వాసనలను బయటకునెట్టి వాటిని నిర్మూలిస్తాయి. స్వప్నం వంటి ఆ దివ్యానుభవం కలిగిన తరువాత సాధకుని మనఃస్థితిలో, ఆలోచనాధోరణిలో, దృక్పథంలో పెద్ద మార్పు కొట్టొచ్చినట్లు కనిపిస్తుంది. ఒక్కోసారి ఆ అనుభవాలు సాధకుని భౌతికంగాను, తనచుట్టూ ఉన్న పరిస్థితులలోను కూడా మార్పులు కలుగజేస్తుంది. భీమాజీపాటిల్‌కు వచ్చిన ప్రమాదకరమైన క్షయ రోగాన్ని బాబా రెండు స్వప్నానుభవాల ద్వారా నివారించిన లీల మొదలైనవి ఇందుకుదాహరణలు. అదే మనోచాంచల్య రూపాలైన సాధారణ స్వప్నాలకు, గుర్వనుగ్రహంవల్ల కలిగే దివ్యస్వప్నాలకు ఉన్న తేడా. ఉప్పుకప్పురాలలాగా అవి చూచేందుకు ఒకేలా ఉన్నా, అనుభవించి చూస్తేగానీ వాటి రుచులలోని తేడా బోధపడదు. ఈ కారణంగానే మహాత్ముల దర్శనానికి, వారి సమాధివంటి పవిత్ర క్షేత్రాలకు వెళ్ళినపుడు 2, 3 రోజులు నిద్రచేయాలనే నియమం పెద్దలు విధించినది. (పైన పేర్కొన్న 'దశలు' కేవలం అవగాహనా సౌలభ్యానికి చేయబడ్డ విశ్లేషణే తప్ప, అవి ఆధ్యాత్మికస్థితులలోని హెచ్చుతగ్గులను సూచించే నిర్దిష్ట కొలమానికలు కావని పాఠకులు గుర్తించ ప్రార్థన. అంతేకాకుండా, సద్గురు సాన్నిధ్యంలో దీర్ఘకాలం ఉంటూ సాధన చేసుకొనే వారిలోనే ఈ సాధన పరిణామదశలు ప్రస్ఫుటంగా కనిపిస్తాయి. ఇతరుల్లో ఈ పరిణామం, మార్పులు అంత స్పష్టంగా గమనికకు రావు.) కొందరి విషయంలో, వారివారి వాసనాబలం దృష్ట్యాగానీ, ఇతరులతో ముడిపడివున్న వారి ప్రారబ్ధకర్మ స్వభావం దృష్ట్యాగానీ, మరేకారణం చేతగానీ, ఆ సాధకునిలోని కొన్ని వాసనల క్షయం భౌతికానుభవాల ద్వారానే జరుగుతుందని సద్గురువు సంకల్పమైతే, తదనుగుణమైన పరిస్థితులు కల్పించబడి, ఆయా అనుభవాలద్వారానే

వాసనాక్షయమౌతుంది. ఈ దశలో అత్యున్నత స్థితికి చేరిన సాధకులు, సద్గురు భక్తులు కూడా ఇంద్రియ భోగలాలసతకు, ధన వ్యామోహానికి, కీర్తికాముకత్వానికి లోనైనట్లు కనిపిస్తారు. ప్రపంచం వారిని యోగభ్రష్ఠులుగా పరిగణిస్తుంది. (శ్రీఉపాసనీ బాబా విషయంలో జరిగిందిదే) అయితే 'ఎవరు వాస్తవంగా యోగభ్రష్ఠులో, ఎవరు వాసనాక్షయ సాధనమైన యోగంలో ఉన్నారో' గ్రహించే యోగ్యత, సామర్థ్యం, అధికారం – శ్రీసాయి వంటి పరిపూర్ణ సద్గురుమూర్తులకే తప్ప అన్యులకు అసాధ్యం!

ఈ సాధనాతత్త్వ నేపథ్యంలో చూస్తేగానీ, శ్రీఉపాసనీబాబా జీవితంలోని (ముందు ముందు చెప్పబోయే) సంఘటనలు, అనుభవాలు సరిగ్గా అవగతంకావు!

ఈ సందర్భంలో మరో విషయం ప్రస్తావించడం అప్రస్తుతం కాదు. పైన వివరించిన సద్గురు సన్నిధి ప్రభావం గురించి చదివిన తరువాత, అటువంటి ప్రభావం శ్రీసాయి సశరీరులుగా ఉన్నప్పుడు ఉండేదేమోగానీ, ఈనాడూ శిరిడీలో అంతటి ప్రభావం ఉంటుందా? – అనే సందేహం కొందరు సాయి భక్తులకు కలుగవచ్చు. సరైన రీతితో శ్రీసాయి చరిత్ర చదువని వారికి, శ్రద్ధతో శిరిడీ దర్శించని వారికి మాత్రమే కలిగే సందేహమిది. ఎందుకంటే, ***"సమాధి అనంతరం మరింత ముమ్మరంగా తమ అవతారకార్యాన్ని కొనసాగిస్తాననీ", "పిలిస్తే పలుకుతాననీ, తలిస్తే దర్శనమిస్తాననీ"*** బాబా చేసిన ప్రతిజ్ఞలు నిత్యసత్యాలని అసంఖ్యాక సాయి భక్తుల అనుభవం. శిరిడీ దర్శించిన వేలాది భక్తులకందరకు సామాన్యంగా కలిగే అనుభవం ఒకటున్నది. అది 'కాలగతి' (passing of time) స్ఫురణకు రాకపోవడం. అంతేకాదు, అక్కడ ఉన్నన్ని రోజులు (వారం, పదిరోజులు) మన సమస్యలు, ప్రాపంచిక బంధాలు, బాధ్యతలు గుర్తుకేరావు. రోజులు క్షణాల్లా దొర్లిపోతాయి. "అరె! మనం శిరిడీ వచ్చి ఇన్ని రోజులయిందా? నిన్న వచ్చినట్లుంది!" అని శిరిడీ వదలి వెళ్ళేరోజు అందరూ అనుకోవడం కద్దు! చూచేందుకు ఇది చాలా చిన్న విషయంగా కనిపించినా, సూక్ష్మంగా ఆలోచిస్తే ఇది చాలా అద్భుతమైన విషయమని అవగతమవుతుంది. అహంకారపు లోపలి పొరలు బలహీనమైతేగానీ, 'కాలగతి' స్ఫురణకు రాకుండా పోదు. నిర్వికల్పసమాధిలో మాత్రమే కాలగతి పూర్తిగా స్ఫురణకు రాకుండా పోతుందని యోగశాస్త్రం చెబుతున్నది. ఆ స్థితికి కూడా అతీతమైన స్థితిలో ఉన్న శ్రీసాయియొక్క సన్నిధి ప్రభావం వల్లనే శిరిడీలో మనం ఆ అనుభవం

యొక్క అంచులు రుచి చూస్తాం! ఇది సామాన్యంగా మన గుర్తింపుకు రాకుండానే జరిగిపోయే విశేషం. అంటే పైన వివరించినట్లు సద్గురు సన్నిధిలో అనుభవమయ్యే మొదటిదశ అన్నమాట. ఆయన సన్నిధి ప్రభావం వల్లనే మన వంటి పామరులకు కూడా రోజులు క్షణాల్లా గడిచినపుడు, శ్రీసాయి తమ వయస్సు లక్షల సంవత్సరాలని చెప్పడంలో ఆశ్చర్యం ఏముంది? శిరిడీలో శ్రీసాయి సన్నిధి నిత్యసత్యం; ఆయన కృపారసం కుండబోతగా ఇప్పటికీ వర్షిస్తూనే ఉంది. సాయిలీలా ప్రబోధం నిరంతరంగా కొనసాగుతూనే ఉంది!

ఇక ప్రస్తుత కథాంశమైన శ్రీఉపాసనీబాబా జీవిత విశేషాలకొద్దాం!

## మన సాధన నిమిత్తం - సాయి కృపయే సమస్తం!

ఒకరోజు సాయంత్రం కాశీనాథ్ ఖండోబా ఆలయంలో కూర్చుని సంధ్య వార్చుకుంటున్నాడు. ఆలయం వాకిట్లో ఎవరో ఉన్నట్లనిపించి తలత్రిప్పి చూశాడు. వాకిట్లో తన తాతగారైన గోపాలశాస్త్రిగారు నిలబడి తనకేసి "ఇలా చూడు!" అన్నట్లు చేయి ఊపుతూ, ఏదో అంటున్నారు. ఆ క్షణంలో కాశీనాథ్‌కు తన తాతగారు ఏనాడో సుమారు ఇరవై ఏండ్ల క్రితమే మరణించాడన్న విషయం బొత్తిగా స్ఫురణకు రాలేదు! ఆయన మాటలు అస్పష్టంగా ఉండటంతో, "ఆఁ, ఏమిటి?" అంటూ చెవులు రిక్కించి విన్నాడు. గోపాలశాస్త్రి నెమ్మదిగా "అహమ్మద్‌నగర్, అహమ్మద్‌నగర్" అంటున్నాడు. శిరిడీ గ్రామమున్న జిల్లాపేరు, ఆ జిల్లా కేంద్రం పేరది! ఆ జిల్లా పేరు పనిగట్టుకొని తనకెందుకు చెబుతున్నాడో కాశీనాథ్‌కు అర్థం కాలేదు. కళ్ళు చిట్లించి తనకు ఆయన చెప్పదలచుకొన్నది బోధపడలేదన్నట్లు చూశాడు. అప్పుడు మళ్ళీ గోపాలశాస్త్రి ఆ పేరులోని అక్షరాలను విరచి, నెమ్మదిగా "అహం, మద్, గార్" అని ఒత్తి ఒత్తి పలికాడు. ఆ మాటల్లోని భావం అర్థం చేసుకునేందుకు ప్రయత్నిస్తున్నంతలో గోపాలశాస్త్రి రెప్పపాటులో మాయమయ్యాడు. గోపాలశాస్త్రి అదృశ్యుడైన తరువాత గానీ కాశీనాథ్‌కు స్ఫురణకు రాలేదు - తన తాతగారు ఏనాడో మరణించారనీ, తనకు కన్పించింది ఆయన ప్రేతాత్మ అని! ఆ విషయం స్ఫురించగానే భయంతో, దిగ్భ్రాంతితో కొంచెంసేపు చలించిపోయాడు. కొంతసేపటికి తేరుకొని ఆలోచించే సరికి తన తాతగారి మాటలోని మర్మం బోధపడింది. "అహం" = అహంకారము,

"మద్" = మదము, కామము – ఈ రెండూ "గార్" అంటే విఘ్నప్రాయాలని ఆయన చెప్పదలచుకొన్నట్లు స్ఫురించింది.

గోపాలశాస్త్రి కనిపించడం, చిత్రమైన రీతిలో ఉపదేశించడం, ఆ ఉపదేశం యొక్క అంతరార్థం – కాశీనాథ్‌లో ఏదో తెలియని సంఘర్షణను, భావతీవ్రతను ప్రేరేపించింది. ఆ భావ సంఘర్షణనుండి బయటపడడానికి తన తాతగారు చేసిన ఉపదేశాన్నే ఒక మహామంత్రంగా నిరంతరం జపిస్తూ, మననం చేసుకోసాగాడు. ఖండోబా ఆలయంలో ఉన్నా, బయట ఎక్కడకు పోయినా నిలుపకుండా "అహ్మద్ నగర్, అహ్మద్‌నగర్" అని ఉచ్చరిస్తూ ఉండేవాడు. ఆయనలా చెయ్యడానికి వెనుకగల కారణాలు తెలియని ప్రజలు, అతడి "పిచ్చి బాగా ముదిరిందని" భావించి, నవ్వుకొనేవారు.

అయితే అహంకార మమకారాలు, మదమత్సరాది అరిషడ్వర్గాలు, విషయ వాసనలు సాధకునికి విఘ్నప్రాయాలనే విషయం, ఆధ్యాత్మిక విద్యలో 'అ, ఆ'లవంటి ప్రాథమిక పాఠాలు. సుమారు 20 వంవత్సరాలపాటు తీవ్ర యోగాభ్యాసంలోను, వివిధ సాధనలలోను గడిపిన కాశీనాథ్‌కు "అహం, మద్, గార్" అనే సూత్రం కొత్తగా తెలుసుకుంటున్న సత్యమేమీ కాదు, అయినప్పుడు సాధనలో అంతటి పరిణతిని పొందిన స్థితిలో వైరాగ్య బోధకమైన ఇంత సామాన్య 'పాఠం' కాశీనాథ్ హృదయంలో అంతటి అలజడిని ఎందుకు రేపింది? శ్రీసాయి సన్నిధిలో సాధన చేసుకొంటున్న కాశీనాథ్‌కు ఆ ఉపదేశం బాబానే చెయ్యవచ్చు కదా? దానికి మారు తన తాతగారు కనిపించడంలోని అంతరార్థం ఏమిటి? అది బాబాకే ఎరుక.

## గురుకృపలేక కామినీ కాంచనాలతో కలబడిపోరడం కల్ల

ఆధ్యాత్మికసాధనలో కామినీ కాంచనాలు అతి బలమైన అవరోధాలని మహాత్ములందరూ హెచ్చరించారు. 'కామిని' అంటే పురుషులకు స్త్రీలపై, స్త్రీలకు పురుషులపై ఉండే కామపూరితమైన వ్యామోహము; 'కాంచన'మంటే డబ్బు, ఆస్తిపాస్తులు, కీర్తి మొ॥న వాటిపై ఉండే మోహము. ఇవి వ్యక్తి అహంకార సౌధానికి మూలస్తంభాలవంటివి. వీనిలో కాంచనాన్ని జయించడం కామాన్ని జయించడం కంటే సులువని, భౌతిక (జీవ) ధర్మంతో ముడిపడి ఉన్న కామాన్ని జయించడం అత్యంత కష్టసాధ్యమని చాలామంది అనుకుంటారు. కానీ కాంచనాన్ని జయించడం

అనుకున్నంత సులభం కాదు. మనలోని కామ బలాన్ని గుర్తించవచ్చు. కానీ ధన వ్యామోహాన్ని గుర్తించడం చాలా కష్టం. అది కామంకంటె సూక్ష్మతరమైనది. గుర్తింపుకే ఒక పట్టాన చిక్కని దానిని పట్టుకొని నిర్మూలించడం మరింకెంత కష్టం? కూడు, గుడ్డ, గూడు సంపాయించుకోవడానికే కాదు, సంఘంలో గుర్తింపుకు, భోగాలకు, కీర్తికి, అధికారానికి, ఆఖరుకు – కామాన్ని సాధించేందుకు కూడా సాధనమైంది డబ్బు. పేదరికంలో డబ్బు లేదనే బాధ! ధనవంతునికి దాని సాంగత్యంవల్ల కలిగిన వ్యామోహం, అది పోతుందనే అభద్రతాభావం. వ్యక్తిత్వపు అణువణువునూ బంధించి నడిపించే సూక్ష్మతరశక్తి – ఈ డబ్బు. ఎవరికి వారు నిష్కర్షగా, నిశితంగా ఆత్మ పరిశీలన చేసుకుంటే గాని దీని విశ్వరూపం గోచరం కాదు.

కాశీనాథ్ మొదటి నుండి సంపదలను అనుభవించినవాడు కాదు. తాను అనుభవించిన పేదరికం, తెలియకుండా ఆయన అంతరంగంలో ఒక 'లేమి'ని సృష్టించి, ధన సంపాదనపై మోహాన్ని పెంచింది. అమరావతిలోను, నాగపూర్‌లోను వైద్యవృత్తి ద్వారా ఎంతో ధనం సంపాదించాడు కూడా. కానీ డబ్బు సంపాదించే కొద్దీ దానిపై వ్యామోహం, ఆశ, ఇంకా ఇంకా పెరుగుతుందే తప్ప తరగదనే సత్యం కాశీనాథ్ విషయంలో ఋజువయింది. ఇంకా ఆస్తిపాస్తులు సంపాదించి, ఒక ఎస్టేటుకు అధిపతి కావాలని ఆశపడ్డాడు. కానీ, ఆయన కోసం ఆయన సద్గురుమూర్తి సంకల్పించిన ప్రణాళిక తద్భిన్నమైనదవడంతో, కాశీనాథ్ ఆశలన్నీ అడియాశలైనాయి. తరువాత పరిస్థితులవల్ల శిరిడీ చేరినా ధనంపై కోరిక మాత్రం ఆయన అహంకారపు అంచులను దాటిపోలేదు. తన జేబులో ఉన్న డబ్బంతా బాబా దక్షిణగా అడిగి తీసుకొన్నారు. ముందు జాగ్రత్తగా షామా దగ్గర దాచి ఉంచిన పైకం కూడా సర్వజ్ఞుడైన సాయి తనదైన పంథాలో తీసేసుకొన్నారు. కట్టుకోవడానికి సరైన బట్ట కూడా లేదు. ఆ దుర్భర స్థితిలో సాధన కాశీనాథ్‌లోని ధనవ్యామోహాన్ని ఇంకా సూక్ష్మతరం చేసింది. తన ప్రయత్నంలో దాన్ని నిర్మూలించడం కాశీనాథ్‌కు అసాధ్యం. అంతటి బలమైన సూక్ష్మతర వాసనను శ్రీసాయి తమ అనుగ్రహంతో ఎలా నిర్మూలించారో చూద్దాం. ఇంతకుముందు చర్చించినట్లు శ్రీసాయి ఈ విషయంలో కాశీనాథ్‌కు కొన్ని దివ్యస్వప్నాలు ప్రసాదించి, ఆయన అంతరంగంలోని వాసనలు నిర్మూలించారు.

## సాయి అనుగ్రహముంటే అసాధ్యమేదీలేదు

ఒకరోజు కాశీనాథ్‌కు ఒక దివ్యదర్శనం కలిగింది. అందులో, కాశీనాథ్ తిరుగుతూ తిరుగుతూ ఒక పాత భవనంలోకి ప్రవేశించాడు. లోపల శ్రీసాయిబాబా కూర్చొని ఉన్నారు. శ్రీసాయి కాశీనాథ్‌ను చూడగానే చెవిలో ఏదో రహస్యం ఉపదేశించాలన్నట్లు దగ్గరకు రమ్మని సైగ చేశారు. కాశీనాథ్ వెంటనే బాబా దగ్గరకు పోబోతుండగా, అచ్చం తన పోలికలేగల ఒక నల్లటి రూపం కాశీనాథ్‌ను పట్టుకొని ఆపి, "నా మాట విను. సాయిబాబా దగ్గరకు పోకు. ఆయన చెప్పింది వినవద్దు!" అని వెనక్కు లాగుతున్నది. ఆ మాటలు పట్టించుకోకుండా బాబావైపు అడుగెయ్యాలని ఎంత ప్రయత్నించినా, ఆ నల్లటి వ్యక్తి మళ్ళీ మళ్ళీ కాశీనాథ్‌ను వెనక్కులాగుతున్నాడు. ఈ వ్యవహారం చూచి, బాబా తన ఉన్నతాసనం దిగి, అదాట్టుగా ఆ వ్యక్తి జుట్టు పట్టుకొని, ఎడాపెడా కొడుతూ, ఆ నల్లటి వ్యక్తిని ఆ ఇంటి బైటకు లాక్కుపోయి, ఆ ప్రక్కనేవున్న ఒక మురుగుకాలవ ప్రక్కన పడేసి, తగులబెట్టారు. ఈ తంతు జరుగుతున్నంతసేపూ ఆ నల్లటి వ్యక్తి తానే అని కాశీనాథ్‌కు అనిపిస్తున్నది. కానీ తనకు జరిగే ఈ చిత్రహింసను తానే సాక్షిగా చూస్తున్నాడు కూడా! నల్లటి వ్యక్తి తగలబడుతుంటే ఇక భరించలేక కాశీనాథ్ "బాబా ఏమిటిది? నీవు తగలబెడుతున్నది నన్నే! నన్నిలా ఎందుకు హింసలు పెడుతున్నారు?" అని ఆక్రోశంగా అడిగాడు. దానికి బాబా, ***"నేను తగులబెడుతున్నది నిస్సందేహంగా నిన్నే! కాదని ఎవరన్నారు? కానీ, అది నీ పాప రూపం. దాన్ని నేను నాశనం చేసేశాను. ఇక నీవు పాపం నుండి విముక్తుడవయ్యావు. భవిష్యత్తులో మనిద్దరం కలిసి చెయ్యాల్సిన కార్యం ఎంతో ఉంది. పాపం మిగిలివుంటే అదెలా సాధ్యమవుతుంది?"*** అని అన్నారు. అప్పుడు కాశీనాథ్, "సరె! ఇంతకూ నాకేదో చెప్పాలని పిలిచారే ఏమిటది?" అని అడిగాడు. ***"ఇక చెప్పాల్సిందేమీ లేదు. నీలోని అవరోధం తొలగిపోయింది. నేనేమీ చెప్పాల్సిన అవసరం లేకుండా, అన్నీ నీకే అర్థమవుతాయిలే!"*** అని అంటూ బాబా అంతర్ధానమయ్యారు. ఆ వెంటనే శ్రీసాయిబాబా గురువు కనిపించి, కాశీనాథ్ పాదాలపై తమ తల ఉంచి నమస్కరించారు. తన పరమగురువు అలా చేస్తుంటే కాశీనాథ్ భయంతో బిక్కచచ్చిపోయాడు. దిగ్భ్రాంతితో నిశ్చేష్టుడయ్యాడు. ఈ జరుగుతున్న వ్యవహారమంతా తనను పోలిన మరో రూపం గమనిస్తున్నట్లు తోచింది. కానీ అది

అంతకుమునుపు శ్రీసాయి దహించివేసిన పాపరూపం కాదు. అది కూడా తానే అనిపిస్తున్నది. మరి అదెవరు? – ఇంతలో ఆ దివ్యదర్శనం అంతమైంది.

మరోసారి కాశీనాథ్‌కు ఇంకొక దివ్యదర్శనం కలిగింది. అందులో శ్రీసాయిబాబా తనను ఎన్నో అంతస్తులుగల ఒక పెద్ద భవనం పైకి తీసుకెళ్ళి, అక్కడ వదిలేశారు. ఆ పరిసరాలను గమనిస్తూ కాశీనాథ్ ఒక అంధకార బంధురమైన అగాధం ప్రక్కన నిలబడ్డాడు. హఠాత్తుగా అందులోంచి ఒక నల్లటి చెయ్యి పైకొచ్చి, కాశీనాథ్ కాళ్ళు గట్టిగా పట్టుకొని, ఆ అగాధంలోకి గుంజసాగింది. “ఏయ్, చేతులు తీయి! ఎవరు నువ్వు? నన్నెందుకు లాగుతున్నావ్? నన్ను పోనీ. లేకపోతే ఈ విషయం సాయిబాబాతో చెప్పాల్సి ఉంటుంది!” అని కేకపెట్టాడు కాశీనాథ్. సాయిబాబా పేరు వినగానే, ఆ ఆకారం కాశీనాథ్‌ని వదిలేసింది. ఆ అగాధము నరకమని, దాని చెంతకు పోయిన వారిని అది లాగేసుకుంటుందనీ, ఆ దివ్యదర్శనంలోని కాశీనాథ్‌కు తెలిసింది. ఆపైన బాబా అతని చేతికొక దీపం ఇచ్చారు. దాన్ని తీసుకొందామా, వద్దా అని తటపటాయిస్తున్నంతలో, కాశీనాథ్ ఒక విచిత్రం గమనించాడు. సూర్యచంద్రులు ఇద్దరూ ఒకేసారి ఆకాశంలో వెలుగుతూ కన్పించారు. అప్పుడు బాబా అతడితో, వారికి సూర్యచంద్రుల వెలుగు అవసరంలేదనీ, వారు ఆ వెలుగు కంటే ఉన్నతమైన వెలుగులో ఉన్నారనీ, ఇచ్చిన దీపాన్ని తీసుకొమ్మని, అది ఎప్పుడూ అతడిని కాపాడుతుంటుందనీ చెప్పారు. అంతేకాదు, ***“ఈ దీపం నీ వద్ద ఉన్నంతకాలం నీకు ఎదురుండదు. నీ దారిలో ఉన్న ఆటంకాలన్నీ తొలగిపోతాయి. పైగా, దీనివల్ల భవిష్యత్తులో వందలాది మందికి వెలుగునివ్వగలవు!”*** అని కూడా అన్నారు. కాశీనాథ్ ఆ దీపం తీసుకున్నాడు. అంతటితో ఆ దర్శనం అంతమైంది.

మరో దివ్యదర్శనంలో కాశీనాథ్‌ను శ్రీసాయి ఒక రహస్యప్రదేశానికి తీసుకెళ్ళారు. అక్కడ కొన్ని వందల అడుగుల విస్తీర్ణంలో సుమారు 4, 5 అడుగుల ఎత్తున రూపాయి నోట్లు పేర్చి ఉన్నాయి. ఆ నోట్లకట్టలనానుకొని, అత్యంత ఖరీదైన బట్టలు, వెలగల ఆభరణాలు తొడుక్కొని ఒక వ్యక్తి రాజఠీవితో సింహాసనం వంటి పడకపై కూర్చొని ఉన్నాడు. సాయిబాబా అతడికేసి చూడమని చెప్పడంతో కాశీనాథ్ ఆ వ్యక్తిని చూస్తూ, “బాబా, ఎవరతను?” అని అడిగాడు. ***“అతడెవరో గుర్తుపట్టలేదా? అతడు నీవే! నీ పాప శరీరం అంతరించింది. అది నీ పుణ్యరూపం!”*** అన్నారు బాబా. తరువాత

అక్కడున్న ధనాన్ని చూపుతూ ***"ఇదంతా మనదే"*** అన్నారు. అంతటితో ఆగక, ఆ ప్రక్కన అలాగే రూపాయి నోట్లతో నిండి ఉన్న మరోగది చూపుతూ, ***"ఇలాంటి ధనాగారాలు ఇంకా వందలువేలున్నాయి. అవన్నీ మనవే! ఈ విషయమంతా ముందు ముందు నీకే తెలుస్తుందిలే!"*** అన్నారు. అంతటితో ఆ దర్శనం అంతమైంది. కానీ చిత్రం! ఆ దివ్యదర్శనంతో బాటు కాశీనాథ్ హృదయాంతరాళంలో ఉన్న ధనకాంక్ష కూడా అంతరించింది! ఎన్నో జన్మలు తీవ్ర వివేకాభ్యాసాలతో సాధనచేస్తేగానీ నశించని ధనకాంక్ష, శ్రీసాయి ఒక్క దివ్యదర్శనంతో మటుమాయం చేశారు! శ్రీసాయి కృపాబలముంటే సాధించలేనిది లేదు!

## ఆ 'గురుపూజ'లోని గురుతేమి? గూఢమర్మమేమి?

కామినీకాంచనాలలో డబ్బుమీద వ్యామోహాన్ని నశింపజేయటానికి కాశీనాథ్‌కు బాబా ఎలాంటి అనుభవాలు, దివ్యదర్శనాలు అనుగ్రహించారో చూశాం. కాంచనమనే నాణానికి డబ్బు, ఆస్తిపాస్తులు బొమ్మవంటివైతే, కీర్తి, అధికారం బొరుసువంటివి. అందువల్ల 'కామదహనకాండ'కు వెళ్ళబోయే ముందు, కాంచనంలోనే ఒక భాగమైన కీర్తికాముకత్వం విషయంలో శ్రీసాయి ఎలాంటి 'శిక్షణ' కాశీనాథ్‌కిచ్చారో చూద్దాం.

1913 జూలైలో కాశీనాథ్ జీవితంలో ఒక చిత్రమైన సంఘటన జరిగింది. అప్పటికి కాశీనాథ్ శిరిడీ వచ్చి సుమారు రెండు సంవత్సరాలైంది. కాశీనాథ్ సాధన పరిపూర్తికి బాబా విధించిన కాలపరిమితి ఇంకా రెండు సంవత్సరాలుంది. 1913 జులైలో గురుపూర్ణిమనాడు శ్రీసాయి అక్కడున్న చంద్రాబాయి బోర్కర్ అనే భక్తురాలిని పిలిచి, పూజాద్రవ్యాలు తీసుకెళ్ళి కాశీనాథ్‌ను పూజించమని ఆదేశించారు! చంద్రాబాయి బొంబాయిలోని విల్లెపార్లె నివాసి. అప్పటికే 10-15 ఏళ్ళుగా సాయి దర్శనార్థం తరచు శిరిడీ వస్తున్న సాయి భక్తురాలు. మంచి గుండెదిటవు గల మహిళ. బాబా ఆజ్ఞానుసారం చంద్రాబాయి పూజాద్రవ్యాలు తీసుకొని ఖండోబా గుడికెళ్ళింది. కాశీనాథ్ గుడిలో కూర్చుని ఉన్నాడు. చంద్రాబాయి నేరుగా వెళ్ళి, పూజాద్రవ్యాలు ప్రక్కనపెట్టి, ఉపాసనీకి నమస్కరించి, ఆయన పాదాలు పట్టసాగింది. ఉపాసనీ ఆశ్చర్యపడుతూ తటాలున తనకాళ్ళను వెనక్కు లాక్కొని, చంద్రాబాయితో "ఏమిటిది? నా కాళ్ళు ముట్టుకోవద్దు! ముందు, వెళ్ళిక్కడ నుండి!" అన్నాడు కఠినంగా.

చంద్రాబాయి ఆయన మాటలను వీసమెత్తు కూడా పట్టించుకోకుండా, "బాబా ఆజ్ఞానుసారం నేనిక్కడికొచ్చాను. బాబా ఆజ్ఞ నెరవేర్చకుండా వెనక్కి వెళ్ళను. దయచేసి నన్నాపొద్దు!" అన్నది. "ఏమిటి బాబా ఆజ్ఞ?" అని అడిగాడు కాశీనాథ్. "ఈరోజు నన్ను మీకు పూజచెయ్యమని చెప్పారు. అదీగాక, చాలారోజులుగా మీరు ఆహారం ఏమీ తీసుకోవడంలేదు. అందుకని నైవేద్యంగా భోజనంకూడా తెచ్చాను. ఈరోజు గురుపూర్ణిమ కూడా! నన్ను పూజ చేసుకోనివ్వండి!" అని వివరించింది చంద్రాబాయి. ఆ మాటలు చెబుతూ, తన మానాన తాను, ఉపాసనీకి గంధం పూయడం, పూలు వేయడం చేసుకుపోసాగింది. కాళ్ళు కడగడానికి కాశీనాథ్ పాదాలు తీసి పళ్ళెంలో పెట్టబోతుంటే, ఆయన విసురుగా కాళ్ళు దుప్పట్లోకి లాక్కుని, "ఇటువంటివి నాకు గిట్టవు! ముందు పో ఇక్కడి నుండి!" అని కసురుకొంటూ, ఆమెను కొట్టబోయాడు. చంద్రాబాయి ఏమాత్రం తొణక్కుండా, "కొడితే కొట్టండి. మీరు కొట్టినా, ఏంచేసినా నేను బాబా ఆజ్ఞను నిర్వర్తించకుండా తిరిగిపోను! అయినా ఈ శరీరం మీదనే అహంకారమెందుకు? ఆ శరీరం ఏదో మీ ఆస్తి అయినట్లు? దానిమీద మీకే సర్వహక్కులున్నట్లు మాట్లాడుతారేం? ఆ అహంబుద్ధి వదలి ఆ దేహం సర్వజగత్తుకు చెందిందని భావించండి!" అన్నది. ఆమె నోటి గుండా వెలువడ్డ యుక్తియుతమైన వేదాంతానికి వెంటనే ఏం సమాధానం చెప్పాలో కాశీనాథ్‌కు తోచలేదు. కాశీనాథ్ అయిష్టాన్ని అభ్యంతరాలను లెక్కపెట్టకుండా చంద్రాబాయి, పూజ పూర్తి చేసింది. "చంద్రాబాయ్! ఎందుకు నన్నిలా బాధపెడ్తావ్? నామానాన నన్నుండనీ!" అన్నాడు కాశీనాథ్ కోపంగా. దానికి చంద్రాబాయి, "ఈ విషయంలో మీరిక మాట్లాడటం వృథా. ఈ పూజ రోజూ ఇలా కొనసాగుతుంది. ఈ గురుపూర్ణిమ రోజున బాబా నా ద్వారా ఈ పూజకు ప్రారంభోత్సవం చేశారు. మీరెంత అభ్యంతరపెట్టినా ఇది ఆగదు!" అని చెప్పి, చంద్రాబాయి అక్కడి నుండి వెళ్ళిపోయింది. అయితే ఆమె మళ్ళీ ఎప్పుడూ కాశీనాథ్‌ను పూజించడానికి ప్రయత్నించలేదు. గురుపూర్ణిమనాడు ఉపాసనీకి పూజ చేయమని శ్రీమతి చంద్రాబాయిని బాబా పురమాయించడాన్ని, ఉపాసనీని పరిపూర్ణ సద్గురువుగా సాయిబాబా ప్రపంచానికి ప్రకటించడంగా కొందరు సాయిభక్తులు భావించారు. అయితే బాబా యొక్క ఆ చర్యను జాగ్రత్తగా పరిశీలిస్తే, ఆ భావానికి తేలిగ్గా రావడానికి దురవగాహమైన ఎన్నో చిక్కులు గోచరిస్తాయి.

## సాయి సద్గురునికి చెయ్యాలి 'గురుపూజ'!

## సాయి పేర అందుకోరాదు 'గురుపూజ'!!

మొదటిది, జూలై 1911లో కాశీనాథ్ శిరిడీ వచ్చినపుడు బాబా నాలుగు సంవత్సరాలు అతడు శిరిడీలో ఉండాలనీ ఆ తరువాత దైవానుగ్రహం అతనికి లభిస్తుందనీ, అప్పుడు షామా (మాధవరావు దేశపాండే) అతడిని బయట ప్రపంచానికి ప్రకటిస్తాడనీ చెప్పారు. కానీ, 1913 గురుపూర్ణిమ నాటికి బాబా విధించిన గడువులో సుమారు 2 సంవత్సరాలే పూర్తయింది. కాశీనాథ్ పరిపూర్ణ సద్గురువుగా రూపొందడానికి ఇంకా రెండుసంవత్సరాలుంది. పోనీ, బాబా నాలుగు సంవత్సరాలలో పూర్తి చేయమని చెప్పిన సాధనను కాశీనాథ్ సమర్థవంతంగా రెండు ఏళ్ళలోనే పూర్తి చేశాడేమో అనుకోవడానికి కూడా లేదు. ఎందుకంటే, ***"ఊరక కూర్చో"***నమని తప్ప కాశీనాథ్‌కు బాబా ఆదేశించిన సాధనంటూ ప్రత్యేకంగా ఏమీలేదు. అంటే, కాశీనాథ్ పరిపూర్ణతకు బాబా విధించిన నియమం (షరతు) కేవలం కాలపరిమితి మాత్రమే. అందువల్ల, విధించబడ్డ శిక్షణ కాలం సగంకూడా పూర్తవకముందే, శ్రీసాయి త్వరపడి కాశీనాథ్‌ను సద్గురువుగా ప్రపంచానికి ప్రకటించారనుకోవడం ఎంతవరకు సమంజసం? అదీగాక, బాబా ముందే నిర్ణయించిన ప్రకారం, కాశీనాథ్‌లోని సద్గురు తత్త్వాన్ని జగత్తుకు బహిర్గతం చేసే కార్యం షామా ద్వారా జరుగవలసివుందిగానీ, చంద్రాబాయి ద్వారా కాదు కదా?

రెండవది, గుడిలో విగ్రహానికి చేసే పూజలాగా భక్తులచే గంధపుష్పాక్షతలు వగైరా పూజాద్రవ్యాలతో షోడశోపచార పూజలందుకోవడమే సద్గురుతత్త్వానికి చిహ్నం అని గానీ, అలా బాహ్యపూజ చెయ్యడం భక్తుల విధి అని గాని, శ్రీసాయి ఎప్పుడూ భావించలేదు. ఒక గురుపూర్ణిమనాడు దాదాకేల్కర్ అనే భక్తునితో, ***"ఈరోజు గురుపూర్ణిమ అన్న విషయం తెలియదా?"*** అంటూ, మసీదులోని ఒక స్తంభాన్ని చూపి ***"పో! పోయి ఆ స్తంభాన్ని పూజించు!"*** అని ఆదేశించారు. ఒక్క మహల్సాపతిని తమ కంఠానికి గంధం రాయనివ్వడం తప్ప, ఎవ్వరినీ తమను బాహ్యంగా పూజించడానికి అనుమతించలేదు. మహల్సాపతికిచ్చిన 'అనుమతి' కూడా చిత్రమైన పరిస్థితులలో కొందరు ముస్లింలలోని మతమౌఢ్యాన్ని దెబ్బతీయడానికి ఉద్దేశింపబడినదే.

"అభిపూజిత లాభాంశ్చ। జుగుప్సే తైవ సర్వశః।

అభిపూజిత లాభైస్తు యతిర్ముక్తోపి బధ్యతే।। (మనుస్మృతి)

— అంటే, "పూజా సత్కారముల పట్ల యతి ఎప్పుడూ జుగుప్సాభావం కలిగి ఉండాలి. ఎందువల్లనంటే అటువంటి పూజాదులవల్ల, ముక్తుడైన సన్యాసి కూడా బంధంలో పడుతున్నాడు" – అని శాస్త్రం. అటువంటప్పుడు తాము స్వయంగా అంగీకరించని "గురుపూజ"లను, బాబా ఇతరుల విషయంలో – అదీ సాధకావస్థలో ఉన్న ఒక భక్తుని విషయంలో ప్రోత్సహించారనుకోవడం – అనుచితం!

ఇక మూడవది. ***"పూచిక పుల్లనైనా సరే నీ గురువుగా భావించి అచంచల విశ్వాసంతో అంటిపెట్టుకోగలిగితే తప్పక గమ్యం చేరుతావు!"*** అని బాబా అన్నారు. అంటే గురువు యొక్క స్థితి, సామర్థ్యంకంటే, భక్తుని భావనాబలానికే బాబా ప్రాముఖ్యాన్నిచ్చారన్నమాట! ఈ దృష్ట్యా శ్రీమతి చంద్రాబాయి బహుశా ఉపాసనీ మహరాజ్‌ను తన గురువుగా భావిస్తూ ఉండవచ్చు; అందువల్ల గురుపూర్ణిమనాడు ఆమెను ఆమె గురువును పూజించమని బాబా ఆదేశించారేమో? సరి! ఈ దృష్ట్యా గూడా పరిశీలిద్దాం. పైన వివరించిన ఉపాసనీ పూజ మొదలయిన వివరాలు, శ్రీఉపాసనీ బాబానే స్వయంగా చెప్పిన సమాచారం ఆధారంగా (శ్రీబి.వి. నరసింహస్వామిగారిచే) గ్రంథస్థం చెయ్యబడ్డది. ఆ విషయాన్ని గురించి శ్రీమతి చంద్రాబాయి బోర్కర్ కూడా ఏం చెప్పిందో చూద్దాం. ఆమె తమ స్మృతులను (సెప్టెంబరు 1936లో) స్వయంగా ఇలా చెప్పింది.

"నా గురుబంధువైన ఉపాసనీ మహరాజ్ శిరిడీ విడిచిపెట్టి ఖరగ్‌పూర్ వెళ్ళడానికి ముందు ఒక గురుపూర్ణిమనాడు సాయిబాబా నాతో పూజాద్రవ్యాలు నైవేద్యం తీసుకొనిపోయి మహరాజ్‌ను పూజించమని ఆదేశించారు. అలాగే నేను వెళ్ళి, సాయి ఆజ్ఞను తెలిపి ఉపాసనీ మహరాజ్‌కు పూజ చేశాను. ఆయన కూడా నేను పూజ చేయడానికి అభ్యంతరపెట్టలేదు. అయితే ఆ రోజు తరువాత మళ్ళీ నేనెప్పుడూ ఉపాసనీ మహరాజ్‌కు పూజ చెయ్యలేదు. ఒక సాటి గురుబంధువును ఏ దృష్టితో చూడాలో, అలాంటి దృష్టే ఉపాసనీ మహరాజ్ పట్ల నాకుండేది... కానీ, ఆయన పట్ల నాకున్న ఆ దృక్పథాన్ని ఆయన, ఇతరులు అపార్థం చేసుకొన్నారు. 'పంచకన్యా' సంస్థానంలో జరుగుతున్న మార్పుల విషయంలో సాయపడదామని

రెండేళ్ళ క్రితం సకోరి వెళ్ళాను. ఆ సంస్థ పట్ల నాకు సదభిప్రాయం లేదని అనుకొని, ఉపాసనీ మహరాజ్ కనీసం నాతో ఏకాంతంగా మాట్లాడటానికి కూడా అవకాశం ఇవ్వలేదు. నేను తిరిగి వెనక్కొచ్చేశాను". (చూ: ''Devotees Experiences of Sri Sai Baba'' Part-III Com. By Sri B.V. Narasimha Swami)

శ్రీమతి చంద్రాబాయి మాటలలో మనం గుర్తించవలసిన ముఖ్య అంశాలు రెండున్నాయి. ఒకటి, ఆమె ఉపాసనీ మహరాజ్‌ను సాటి గురుబంధువుగానే తప్ప, గురువుగా ఎప్పుడూ భావించలేదని, తన దృష్టిని ఇతరులతోపాటు శ్రీఉపాసనీ మహరాజ్ కూడా అపార్థం చేసుకొన్నారని, ఇక తను చేసే పూజకు శ్రీఉపాసనీ అభ్యంతర పెట్టలేదనేది రెండవది. శ్రీఉపాసనీ, ఇతరులు చంద్రాబాయి "దృష్టి"ని ఎలా ఏమని 'అపార్థం' చేసుకున్నారన్న చర్చ ఇక్కడ మనకు అప్రస్తుతం. కానీ ఆమె బహుశ ఉపాసనీని గురువుగా భావించి ఉండటంవల్ల, బాబా ఆమెను గురుపూజకు ఆదేశించారేమోనన్న అభిప్రాయం పూర్తిగా నిరాధారమని తేలడం మాత్రం మనకిక్కడ ప్రస్తుతమైన విషయం.

దీన్నిబట్టి, ఉపాసనీ మహరాజ్ హృదయాంతరాళంలో అజ్ఞాతంగా ఉన్న కీర్తికాంక్షను, పూజాసత్కారాలపైన వ్యామోహాన్ని తన ప్రత్యేకపంథాలో వెలికితెచ్చి, ఆపైన వాటిని నిర్మూలించేందుకు ఆ గురుపూజను ఒక మిషగా శ్రీసాయి ప్రయోగించి ఉండవచ్చు. ఇటువంటి అంశాలలో ముఖ్యంగా ఉపాసనీ సాధనపట్ల శ్రీసాయిబాబా అనుసరించిన విధానానికి ఈ అభిప్రాయం సరిపోతుంది. (ఆ విధానం గురించి ఇంతకు మునుపే కొంతవరకు, సవివరంగా చర్చించాము.) అయితే ఈ 'ప్రయోగ' ఫలితాలు ఏమిటోనన్నది ముందు ముందు తెలుసుకొందాం. ఈ అంశాన్ని గురించి ఇంతగా చర్చించడానికి ఒక కారణముంది. ఉపాసనీకి "పూజ" చేయమని బాబా ఆదేశించిన దృష్టాంతాల వంటివి ఉటంకిస్తూ ఈనాడు కొందరు ప్రముఖ సాయిభక్తులు నిర్లజ్జగా షోడశోపచారాలతో కూడిన "గురుపూజ"లను, సన్మాన సత్కారాలను స్వీకరిస్తూ, ప్రోత్సహిస్తుండడం దృష్ట్యా ఇంత చర్చ అవసరమైంది. అటువంటి 'గురుపూజలు' శ్రీసాయి భక్తోద్యానవనంలో మొలచిన గంజాయి మొక్కల వంటివి. అయితే ఒక్క విషయం మాత్రం మనం గుర్తుంచుకోవాలి. బాబానే చెప్పినట్లు శ్రీసాయి చర్యలు అత్యంత అగాధాలు. వాటి అంతరార్థం అంత సులభంగా మనకు అంతుబట్టవు!

## దివ్యదర్శనాలు, స్వప్నాలు - సాయి అనుగ్రహ సోపానాలు

శ్రీసద్గురు కృపాలబ్ధమై వ్యక్తియొక్క హృదయగత వాసనలను నిర్మూలించి, ఆధ్యాత్మికంగా ఉన్నతదశకు తీసుకెళ్ళే దివ్యస్వప్నాలు, దర్శనాలకు, వ్యక్తి అంతరంగంలో నిద్రాణంగా ఉన్న వాసనలను మరీ బలపరచే సాధారణ అనుభూతులకు గల భేదాన్ని గురించి ఇంతకుమునుపే సవివరంగా తెలుసుకొన్నాము. సద్గురువుయొక్క ప్రభావంవల్ల కలిగే దివ్యదర్శనాలలో ఆ సద్గురుమూర్తి యొక్క ముద్ర అంటే, ఆ దివ్య దర్శనంలోనే – ఆయన రూపమో, ప్రమేయమో, నామమో – స్పష్టంగా ఉండి, వాసనాప్రకోపం, తదితర కారణాలవల్ల కలిగే స్వప్నాలేమో అని పొరపాటుపడ వీలు లేకుండా ఉంటాయి. ఇంతకుముందు వివరించిన కాశీనాథ్‌కు కలిగిన దివ్య దర్శనాలే ఇందుకు ఉదాహరణ. అయితే, శ్రీసాయి దివ్యహస్త ప్రభావం లేనివేమో అనిపించే (వాటి ప్రభావాల దృష్ట్యా) మరెన్నో దర్శనాలు, స్వప్నాలు శ్రీఉపాసనీకి అనుభవమయ్యాయి. వాటిలో ఆయన వ్యక్తిత్వాన్ని తీవ్రంగా ప్రభావితం చేసిన రెండు అనుభవాలను మాత్రం ఇక్కడ తెలుసుకొందాం.

కాశీనాథ్ చాలాకాలం అన్నద్వేషంతో, దీర్ఘ ఉపవాసాలతో గడిపాడని ఇంతకు ముందు తెలుసుకొన్నాం. ఆ దీర్ఘ ఉపవాసకాలం యొక్క చివరిలో కాశీనాథ్‌కు ఒక అనుభవం కలిగింది. హఠాత్తుగా భూమి, ఆకాశం, సూర్యమండలం తనకు ఎంతో దూరంలో తమ చుట్టూ తాము పరిభ్రమిస్తున్నట్లు, తాను వాటికి బయట సాక్షిగా ఉండి, ఆ పరిభ్రమణాన్ని చూస్తున్నట్లు, క్రమంగా ఆ మూడు జగత్తులు పరిణామంలో చిన్నవవుతూ తన సమీపానికి వచ్చి, ఒక సుడిగాలిలా తనలోకి చొచ్చుకొనిపోయి, అదృశ్యమైనట్లు అనుభవమైంది. ఆ తరువాతి రోజులలో ఆ అనుభవాన్ని గురించి వివరిస్తూ, శ్రీఉపాసనీమహరాజ్ తనకు కనిపించిన మూడు జగత్తుల పరిభ్రమణం ఆ జగత్తుల అశాశ్వతత్వాన్ని దానికి వేరుగా సాక్షిగా ఉండి చూస్తున్న తనకు శాశ్వతమైన ఆత్మతత్వాన్ని తెలిపాయని వివరించారు. ఈ అనుభవానికి శ్రీఉపాసనీ చరిత్రలో ఎంతో ప్రాముఖ్యం ఉంది.

శ్రీఉపాసనీ మహరాజ్ స్వీయ పర్యవేక్షణలో రచింపబడ్డ ఆయన మరాఠీ జీవిత చరిత్ర "ఉపాసనీ లీలామృతం"లో ఈ అనుభవాన్ని శ్రీఉపాసనీకి కలిగిన జ్ఞానోదయం (ఆత్మసాక్షాత్కారం)గా వర్ణించబడింది.

అంటే, శ్రీఉపాసనీ మహరాజ్ కూడా తనకు కలిగిన ఈ అనుభవాన్నే తమ ఆత్మసాక్షాత్కారంగా భావించారన్నమాట.

శ్రీఉపాసనీ వ్యక్తిత్వాన్ని తీవ్రంగా ప్రభావితం చేసిన మరో అనుభవం. ఒకసారి శ్రీఉపాసనీకి ఒక వలయం కనిపించింది. తానా వలయంలో ఉన్నాడు. హఠాత్తుగా సుమారు పదహారేళ్ళ వయస్సున్న ఇద్దరు అమ్మాయిలు ఆయన్ను పట్టుకొని ఒక విశాలమైన మైదానంలోకి తీసికెళ్ళారు. ఆ మైదానం మధ్యలో ఆకాశానికంటే ఒక స్తంభముంది. ఆ అమ్మాయిలు శ్రీఉపాసనీని ఆ స్తంభానికి కట్టేశారు. తనను విడిచిపెట్టమని ఎంత ప్రాధేయపడ్డా, వారు, ఆ మైదానంలో ఆడుకొంటున్న ఇంకా కొంతమంది అమ్మాయిలు ఎవ్వరూ పట్టించుకోలేదు. అలా కొంతసేపు గడిచాక వారిలో ఇద్దరు అమ్మాయిలు కాశీనాథ్ వద్దకు వచ్చి, ఆయన స్త్రీగా మారితే విడిచి పెడతామని చెప్పారు. తాను స్త్రీగా మారటం ఎలా సాధ్యం అని అడిగాడు కాశీనాథ్. తాము మార్చివేస్తామన్నారు వారు. అలా చెబుతూ ఆయన చేతులకు గాజులు తొడిగి స్త్రీగా మార్చివేశారు. తరువాత ఆయన కట్లు వీడదీసి, ఒక్కొక్కరు ఒక్కటి చొప్పున నీతికథలు చెప్పి, ఆ కథలను పొట్లం కట్టినట్లు కట్టి, తోలుసంచిలో వేసినట్లు తన దేహంలోకి జార్చివేశారు. అంతటితో ఆ దర్శనం (స్వప్నం) అంతమయింది.

ఈ అనుభవం తరువాత కాశీనాథ్ వైఖరిలో ఎంతో మార్పు వచ్చింది. తాను ఒక స్త్రీనని చెబుతూ, స్త్రీలాగా ప్రవర్తించేవాడు. ఎవరైనా మహిళలు కనిపిస్తే పసుపు, కుంకుమలు, గాజులు కావాలని అడిగేవాడు. కన్నబిడ్డను వెతుక్కొనే తల్లిలా, "అయ్యో! నా బిడ్డ ఏమైనాడమ్మా? ఎక్కడికెళ్ళాడో!" అంటూ ఆదుర్దాగా అడుగుతూ తిరుగుతుండేవాడు. కాశీనాథ్ విచిత్ర ప్రవర్తన చూసిన వాళ్ళు "పిచ్చి ముదిరింది" అని అనుకొన్నారు. ఆకతాయి కుర్రకారు వేళాకోళం చేస్తూ కాశీనాథ్‌ను ఆటలు పట్టించేవారు. శ్రీఉపాసనీ భక్తులు, అభిమానులు మాత్రం అది ఆయన కామాన్ని జయించడంలో భాగంగా లింగభేదాన్ని అతిక్రమించే ప్రయత్నంగా భావించేవారు.

అయితే, శ్రీఉపాసనీలో ఈ మార్పు ఆయన జీవితాంతం నిలిచింది. ఆ తరువాత, ఆయన సకోరిలో స్థిరపడిన తరువాత కూడా, తాను భౌతికంగా పురుషదేహం కలిగివున్నా, అంతర్యంలో మాత్రం స్త్రీనే అనిపిస్తుంటుందని, తనకొచ్చిన దర్శనంలో అమ్మాయిలు చెప్పిన కథలు ఎప్పుడూ జ్ఞాపకంలో ఉంటుంటాయనీ, తాను దైవానికి

భార్యననీ, 'అఖండ సౌభాగ్యవతి'ననీ చెబుతుండేవారు. సాధారణంగా సాధువులు ధరించే పద్ధతిలో కాక, ఆయన జీవితాంతం ఒక గోనెపట్టాను నడుముకు చుట్టుకొని ఒక కొసను స్త్రీలు పైట వేసుకున్నట్లు భుజంపై వేసుకొనేవారు. సకోరిలో స్థిరపడ్డాకగూడా అప్పుడప్పుడు, తమ చివరిరోజులలో తరచుగా పూర్తిగా స్త్రీలా వేషం ధరించి దర్శనమిచ్చేవారు.

శిరిడీలో కాశీనాథ్ జీవితంలో పైన పేర్కొన్న మార్పులతోబాటు, అటు భక్తులు, విరోధులుకూడా ఎక్కువయ్యారు. ఎన్నోకారణాలుగా శిరిడీ స్థానికుల్లో శ్రీఉపాసనీ పట్ల విద్వేషం ఎక్కువైంది. నానావలీ పెట్టే బాధలు రోజురోజుకు మితిమీరిపోసాగాయి. నానావలీ ఒక విచిత్రమైన సాధువు. బాబాను ప్రాణాధికంగా ప్రేమించేవాడు. అతను శిరిడీ వచ్చినపుడు, తాను తన "మామ"ను (సాయి ఫకీరును) కాపాడుకోవడానికి వచ్చానని చెప్తుండేవాడు. అతనికెందుకో శ్రీఉపాసనీ మహరాజ్ అన్నా, శ్రీహెచ్.వి. సాఠే అన్నా సుతరామూ గిట్టేదికాదు. "వాళ్ళు శిరిడీలో ఉంటే మా సాయిఫకీర్ ప్రతిష్ఠకు భంగం" అని అనేవాడు. చివరకు వారు శాశ్వతంగా శిరిడీ వదలి వెళ్ళడానికి అతనే నిమిత్తమాత్రుడయ్యాడు.

అటువంటి పరిస్థితులలో కాశీనాథ్‌కు ఇక శిరిడీలో ఉండటం దుర్భరమని తోచింది. శిరిడీ వదలి వెళ్ళడానికి బాబాను అనుమతి అడిగితే ఆయన అంగీకరించరని తెలుసు. ఎందుకంటే, కాశీనాథ్ పరిపూర్ణతకు బాబా విధించిన గడువు అప్పటికి ఇంకా దాదాపు సగం మిగిలి ఉన్నది. అందువల్ల, 1914, జూలై 25వ తేదీ అర్ధరాత్రి, కాశీనాథ్ ఎవరికీ తెలియకుండా, మనసులోనే బాబాకు నమస్కరించుకొని శిరిడీ వదిలాడు.

### శిష్యరికానికి స్వస్తి! సద్గురుకార్యానికి నాంది!

శిరిడీ వదలిన శ్రీఉపాసనీ, నేరుగా షిండీ అనే ఊరు చేరాడు. అక్కడ కొన్ని వారాలు గడిపి, అక్కడినుండి బయలుదేరి నాగపూరు చేరాడు. అక్కడ డాక్టరు పిళ్ళే ఇంటిలో సుమారు ఒక మాసం రోజులు బసచేశాడు. శిరిడీ వదలిన తరువాత శ్రీఉపాసనీ ఆహారం విషయంలో చెప్పుకోదగ్గ మార్పువచ్చింది. మొదట్లో కాఫీ మాత్రం తీసుకొనేవాడు. షిండీలో ఉన్నప్పుడు వినాయకచవితినాడు (తే. 24-8-1914న)

శ్రీగణపతిరావు అనే భక్తుని ఇంటిలోని స్త్రీలు గట్టిగా పట్టుబట్టడంతో ఘనాహారం కూడా తీసుకొన్నాడు. అప్పటినుండి మామూలుగానే ఆహారం తీసుకోనారంభించాడు. కానీ, ఎంతో కాలం తీవ్ర ఉపవాసాలతో ఉండి హఠాత్తుగా మామూలు ఆహారం తీసుకోనారంభించడంతో శ్రీఉపాసనీ జీర్ణకోశం దెబ్బతిన్నది. తరచు తీవ్రమైన కడుపునొప్పి, మొలల(piles)తో బాధపడేవాడు. మొలలకు ఆపరేషన్ చెయ్యడం తప్పదని డాక్టర్లు సలహా ఇచ్చారు. వార్ధాకు చెందిన ఒక పార్శీ సర్జనును ఇందు నిమిత్తం పిలిపించారు. శ్రీఉపాసనీ ఆ సర్జనుతో తనకు క్లోరోఫారం కానీ, ఇంకే ఇతర మత్తుమందుగాని ఇవ్వనవసరం లేదని ఒప్పించి, అలాగే ఆపరేషనుకు సిద్ధమయ్యాడు. ఆ సర్జను మొలలు కత్తిరించి, ఎర్రగా కాలే ఇనుప కమ్ములతో కాల్చి (cauterization) కుట్లు వేశాడు. ఆ ఆపరేషన్‌కు మొత్తము సుమారు అరగంట పట్టింది. ఈ అతి బాధాకరమైన శస్త్రచికిత్స జరుగుతున్నంతసేపు శ్రీఉపాసనీ “అబ్బా” అని కూడా అనలేదు, సరికదా, “ఊఁ! కానీయండి డాక్టర్, ఏం ఫరవాలేదు!” అని ఆ సర్జనును ప్రోత్సహించాడు కూడా. ఆపరేషను అయిన తరువాత శ్రీఉపాసనీ నిగ్రహశక్తికి అబ్బురపడిన ఆ పార్శీ సర్జను, శ్రీఉపాసనీకి సాష్టాంగ నమస్కారం చేశాడు.

నాగపూర్‌లో డా॥ పిళ్ళే ఇంట్లో బసచేస్తున్న కాలంలో తరచు బయటకు వెళ్ళి భిక్ష చేసేవాడు. అంతకు ముందు ఎన్నో ఏళ్ళక్రితం శ్రీఉపాసనీ వైద్యుడిగా కొంతకాలం నాగపూరులో వైద్యవృత్తి చేశాడు. కానీ, ఎంతోకాలం గడిచిపోవడంవల్ల, రూపురేఖల్లో, వేషంలో ఎంతో మార్పు రావడంచేత ఎవ్వరూ ఆయన్ను గుర్తుపట్టలేదు. ఒకసారి ఒక సంఘటన జరిగింది. మామూలుగానే శ్రీఉపాసనీ ఒకరోజు రాత్రి సుమారు 8–9 గంటలప్పుడు ఒక బ్రాహ్మణ గృహానికి వెళ్ళి భిక్షకోసం నిలుచున్నాడు. ఎందుకో ఆ గృహస్థుకు శ్రీఉపాసనీని చూడగానే దొంగ ఏమోనని అనుమానం తోచి కొన్ని ప్రశ్నలు వేశాడు. శ్రీఉపాసనీ ఇచ్చిన అస్పష్టమైన సమాధానాలకు అతని అనుమానం ఇంకా బలపడి, ఉపాసనీని ఎడాపెడా కొట్టి తరిమాడు. తరువాత డా॥ పిళ్ళే ఇంటిలోని వారికి జరిగిన విషయం నవ్వుతూ చెప్పాడు శ్రీఉపాసనీ. అయితే వారు ఎంత అడిగినా తనను కొట్టిన వ్యక్తి చిరునామా మాత్రం ఇవ్వలేదు.

ఈ సంఘటన ప్రభావమో, మరే ఇతర కారణం వల్లనో ఆ తరువాత శ్రీఉపాసనీ భిక్షకు వెళ్ళడం క్రమంగా మానుకొన్నాడు. 1914 అక్టోబరులో నాగపూరు విడిచి,

డా॥ పిళ్ళే సోదరుడైన చిన్నస్వామి పిళ్ళేతో కలిసి ఖరగ్‌పూర్‌లోని అతనింటికి చేరాడు. నాగపూరు నుండి ఖరగ్‌పూర్ చేరడానికి రైలులో వారికి సుమారు 40 గంటలు పట్టింది. ఆ నలభై గంటలపాటు శ్రీఉపాసనీ – కనీసం కాలకృత్యాల కోసం కూడా – తాను కూర్చొన్న చోటునుండి కదలలేదు, ఆసనం మార్చలేదు. ఇది ఆసనసిద్ధికి, ఒక విధంగా పరాకాష్ఠ!

శ్రీఉపాసనీ కోరికపై చిన్నస్వామి పిళ్ళే ఆయనకు సంబంధించిన వివరాలు రహస్యంగా ఉంచాడు. అడిగిన వారికి శ్రీఉపాసనీ తన సోదరునికి సన్నిహితుడైన వ్యక్తి అని, మానసిక ఆరోగ్యం బాగాలేక వైద్యం చేయించుకొంటున్నాడని, గాలి మార్పు కోసం ఖరగ్‌పూర్ వచ్చాడని చెప్పేవాడు. అలా సుమారు రెండు నెలలు గడిచాయి. చిన్నస్వామి పిళ్ళే సాయిభక్తుడు. క్రిస్‌మస్ సెలవులకు అతను శిరిడీ వెళ్ళాడు. శ్రీఉపాసనీ మాత్రం అతనింట్లోనే ఉండిపొయ్యాడు. శ్రీఉపాసనీకి ఎందుకో ఆసక్తి కలిగి ఆ పొరుగునే ఉండే ఒక మరాఠీ కుటుంబానికి చెందిన మీరా ఆనే పదేళ్ళ అమ్మాయిని పిలచి ఆమెకు నీతికథల రూపంలో ఆధ్యాత్మిక విషయాలు బోధించేవాడు. చిన్నస్వామి శిరిడీ వెళ్ళగానే, చుట్టుప్రక్కల వాళ్ళు ముఖ్యంగా స్త్రీలు – శ్రీఉపాసనీ సత్సంగాలకు హాజరవడం ప్రారంభించారు. ఆయన ప్రవచనాలు విన్న తరువాత వారికి ఆయన పిచ్చివాడు కాదని, గొప్ప మహాత్ముడని తెలిసిపోయింది. క్రమంగా కొంతమంది భక్తులు – ప్రధానంగా మహిళలు ఆయనను ఒక అవతార పురుషునిగా భావించి పూజించడం ప్రారంభించారు. మొదట శ్రీఉపాసనీ ఆ పూజా సత్కారాలకు అభ్యంతరం చెప్పినా, క్రమంగా వారి ఒత్తిడికి తల ఒగ్గక తప్పిందికాదు. క్రిస్మస్ సెలవుల తరువాత చిన్నస్వామి శిరిడీ నుండి ఖరగ్‌పూర్ తిరిగి రాగానే, తాను రెండు నెలలపాటు శ్రీఉపాసనీని అజ్ఞాతంగా ఉంచడానికి పడ్డ శ్రమ వృథా అయిందని గ్రహించాడు. అలా, శిరిడీ నుండి శ్రీఉపాసనీ వేసిన అడుగు తిన్నగా సద్గురు పీఠంపై పడింది!

## వాసనాక్షయ పర్వంలో ఉపాసనీ అజ్ఞాతవాసం

శిరిడీ స్థానిక ప్రజలలో తన పట్ల పెరుగుతున్న వ్యతిరేకత, శతృత్వం, తన అంతరంగంలో చెలరేగుతున్న మనోవాసనల తుఫాను మొ॥న కారణాలవల్ల శిరిడీ నివాసం దుర్భరమని తోచి శ్రీసాయి ఆదేశానికి విరుద్ధంగా, బాబా విధించిన

గడువు పూర్తవకముందే కాశీనాథ్ శిరిడీ విడిచిపెట్టవలసివచ్చింది. అయితే, బాబా విధించిన గడువు ముగిసేవరకు తాను, తన స్వగ్రామానికి, బంధువుల ఇళ్ళకు వెళ్ళకుండా ఎక్కడైనా అజ్ఞాతంగా ఉండాలన్నది శిరిడీ వదిలే సమయంలో కాశీనాథ్ మొదట చేసుకొన్న సంకల్పం. ఆరంభంలో షిండి, నాగపూర్‌లలో తనకు తానై, విధించుకొన్న అజ్ఞాతవాస నియమాన్ని నిర్విఘ్నంగా అమలుపరచడంలో కొంతవరకు సఫలీకృతుడయ్యాడు కూడా! కానీ, ఖరగ్‌పూర్‌కు వచ్చేసరికి, మరి తన సంకల్పం బలహీనమవడంవల్లనో, లేదా తనను శిరిడీ విడిచి పోవడానికి ప్రేరేపించిన అంతర్గత వాసనలు బలం పుంజుకోవడంవల్లనో అజ్ఞాతవాస నియమం భంగమయింది. రాజ్యం నుండి పాండవులను వెళ్ళగొట్టిన కౌరవులు విరాటపురిలో పాండవుల అజ్ఞాతవాసాన్ని భంగపరచ యత్నించినట్లు, కాశీనాథ్ శిరిడీనుండి బయటకు వెళ్ళడానికి కారణమైన వాసనలు ఖరగ్‌పూర్‌లో కాశీనాథ్ అజ్ఞాతవాస నియమాన్ని భంగపరచేందుకు యత్నించాయి. అయితే, మహాభారత కథలో పరాజయం చెందింది కౌరవులయితే, ఇక్కడ అపజయం కాశీనాథ్‌ది.

ఖరగ్‌పూర్‌లో చిదంబరం పిళ్ళే ఇంటి బయట ఆవరణలో ఒక పనసచెట్టుంది. కాశీనాథ్ రోజులో ఎక్కువ భాగం ఆ చెట్టు క్రిందనే కూర్చుని తన చుట్టూ చేరిన భక్తులకు ఆధ్యాత్మిక ప్రవచనాలు చేస్తుండేవాడు. ఆ రోజులలో కాశీనాథ్ దేహం, పరిసరాలు చాల మురికిగా, అపరిశుభ్రంగా ఉంచుకొనేవాడు. సరిగ్గా స్నానం చేసేవాడు కూడా కాదు. ఆ పరిస్థితి చూచి కాశీనాథ్ మహిళా భక్తులందరూ, కాశీనాథ్‌కు వారానికొకసారి తలంటి నలుగుపెట్టి స్నానం చేయించాలని నిర్ణయించుకొన్నారు. మొదట కాశీనాథ్ అభ్యంతరపెట్టినా తరువాత వారి ఒత్తిడికి 'సరే'ననాల్సి వచ్చింది. మొదట స్నానం చేయించిన తరువాత వారు ఆయనకు గురుపూజ చేసేవారు. తరువాత ఆ పూజలు ఎక్కడబడితే అక్కడ, ఎప్పుడు బడితే అప్పుడు, శ్రీఉపాసనీ ఎక్కడ ఎలా ఉన్నా చేయడం ప్రారంభించారు. కడకు మలవిసర్జనకు వెళ్ళినా ఆయనను విడిచి పెట్టేవారుకాదు. ఒకసారి శ్రీఉపాసనీ కోపంతో లెట్రిన్ (మలవిసర్జనశాల)ను పూజించమన్నారు. ఆయన్ను పూజించడానికొచ్చిన స్త్రీలు వెంటనే అలాగే చేసేవారు. శ్రీఉపాసనీ తన మలవిసర్జనకు పీటలుగా ('కమ్మోడ్స్') రెండు ఇటుకలు ఉపయోగించేవారు. ఒకసారి ఆయన ఆ కోపంతో ఆ భక్తులను ఆ రాళ్ళనే పూజించమన్నారు. ఆ మహిళలు

మారుమాట్లాడకుండా ఆ రోజు ఆ ఇటుకలనే శ్రద్ధతో పూజ చేశారు! ఆ భక్తుల బారినుండి తప్పించుకోవడానికి, శ్రీఉపాసనీ వారిని ఒక్కోసారి కొట్టేవాడు. బూతులు తిట్టేవాడు. పిచ్చివాడిలా ప్రవర్తించేవాడు. కానీ ఆయన చర్యలన్నీ మహాత్ముడుగా ఆయనపట్ల ఆకర్షణ ('గ్లామర్')ను పెంచాయేగానీ, తగ్గించలేదు. ఆయన చర్యలు అవధూత చర్యలుగా, ఆయన చేత దెబ్బలు తినడం ఒక మహద్భాగ్యంగా భక్తులు భావించేవారు.

ఏ కారణం చేతనోగానీ, ఒకరోజు శ్రీఉపాసనీ హఠాత్తుగా చిదంబరం పిళ్ళై ఇల్లు విడిచి, నిమ్న కులస్థులైన కూలీలు నివసించే కూలీల వాడలోని భగూ అనే భక్తుని గుడిసెకు తన మకాం మార్చాడు. ఆ వాడ (హరిజనులు) అరుంధతీయులు నివసించే వాడల ప్రక్కన ఉన్నది. ఆ రోజులలో కులాల పట్టింపు చాలా ఎక్కువ. అప్పటికింకా మహాత్మాగాంధీ హరిజనోద్ధరణోద్యమం ఇంకా ప్రారంభమే కాలేదు. అయినా బ్రాహ్మణ తదితర ఉన్నత కులాలకు చెందిన భక్తులు ముఖ్యంగా స్త్రీలు – శ్రీఉపాసనీ కోసం భంగీలవాడకు కూడా తండోపతండాలుగా రావడం మొదలుపెట్టారు. వారు అక్కడ ఆయన పెట్టిన ప్రసాదం కూడా నిస్సంకోచంగా భుజించేవారు. శ్రీఉపాసనీ వారిలోని బ్రాహ్మణ స్త్రీల చేత కుమారిపూజ మొ॥ పూజలు, వ్రతాలపేర హరిజన బాలికలకు, వృద్ధ శూద్ర స్త్రీలకు స్నానం చేయించి భోజనవస్త్రాదులు ఇప్పించేవాడు. అయితే అంతమాత్రాన శ్రీఉపాసనీ కులవ్యవస్థకు వ్యతిరేకి అని భావించడం పొరపాటు. తన సన్నిధిలోను, తాను ఆదేశించినంత మట్టుకు తప్ప, విడిగా అస్పృశ్యులతో కలిసిమెలిసి వ్యవహరించడానికి తన అగ్రవర్ణాల భక్తులను నిషేధించేవాడు. తరువాత శ్రీఉపాసనీ కులవ్యవస్థ ఉండాలనీ, అందరూ కుల నియమాలను పాటించాలనీ ఉద్బోధించారు. ఈ విషయంలో కులమత విభేదాలకు అతీతము, వ్యతిరేకమైన శ్రీసాయితత్వాన్ని శ్రీఉపాసనీ అనుసరించలేకపోయాడు.

ఆ కాలంలో శ్రీఉపాసనీ ద్వారా ఎన్నో లీలలు, సద్గురుకృపాలబ్ధమైన ఎన్నో అద్భుత శక్తులు ప్రకటమయ్యాయి. శ్రీఉపాసనీ ఖ్యాతి ఖరగ్‌పూర్ నలుమూలలా వ్యాపించింది. భక్తుల, భక్తురాళ్ళ సంఖ్య రోజురోజుకు పెరుగుతున్నది. ఏదేమైనా శ్రీఉపాసనీ పరిపూర్ణ సద్గురు పదవికి శ్రీసాయిబాబా విధించిన గడువు, తనకై తాను విధించుకొన్న 'అజ్ఞాతవాసం' పూర్తికాకుండానే సద్గురు పీఠాన్ని అలంకరించవలసి వచ్చింది.

కానీ పెరుగుతున్న భక్తుల సంఖ్యకు సమానంగానే శ్రీఉపాసనీకి ఖరగ్‌పూర్‌లో విరోధులు పెరగసాగారు. ఉన్నత కుటుంబాలకు, బ్రాహ్మణ తదితర ఉన్నత కులాలకు చెందిన మహిళలు దాదాపు నగ్నంగా సంచరిస్తున్న శ్రీఉపాసనీకి స్నానాలు, పూజలు చేయించడం వంటి తంతు ఎంతోమందికి నచ్చలేదు. అనతికాలంలో శ్రీఉపాసనీ ఖరగ్‌పూర్‌లో పెద్ద వివాదాస్పద వ్యక్తిగా మారాడు.

1915 జూలైలో ఒకరోజు రాత్రి సుమారు 9 గం|| సమయంలో వరండాలో శ్రీఉపాసనీ తన భక్తురాళ్ళ మధ్య కూర్చుని ఏవో ఆధ్యాత్మిక విషయాలు ముచ్చటిస్తున్నాడు. భంగీలు (పాకీపనివాళ్ళు) దూరంగా కూర్చొని ఉన్నారు. ఇంతలో అగ్రవర్ణాలకు చెందిన నలుగురైదుగురు వ్యక్తులు చేతుల్లో లాంతరులు పట్టుకొని అటుకేసి వస్తున్నారు. ఎవరో శ్రీఉపాసనీ దర్శనార్థం వస్తున్నారని అక్కడున్నవారు భావించారు. అక్కడున్న లక్ష్మీబాయి ఖన్సీస్ అనే భక్తురాలు వారిని గుర్తించి, వాళ్ళు శ్రీఉపాసనీ శత్రువర్గానికి చెందిన వ్యక్తులని, ఒక పథకం ప్రకారం శ్రీఉపాసనీపై దౌర్జన్యం చెయ్యడానికే వస్తున్నారని తెలిపింది. అందరికీ అప్పుడేం చెయ్యాలో తోచలేదు. ఆందోళనతో భయభ్రాంతులయ్యారు. విరోధి బృందం అల్లంతదూరాన ఉండగనే, శ్రీఉపాసనీ అక్కడున్నవారితో, “అందరూ కదలకుండా మెదలకుండా నిశ్శబ్దంగా కూర్చోండి! ఎవ్వరూ పెదవి మెదపవద్దు!” అని ఆదేశించి తాను కూడా మౌనంగా ధ్యానంలో కూర్చున్నాడు.

ఆ వచ్చిన వ్యక్తులు దూరంగా కూర్చుని ఉన్న భంగీలను, “మహరాజ్ ఎక్కడ?” అని అడిగారు. వారు వరండాకేసి చూపించారు. వారు శ్రీఉపాసనీ కూర్చుని ఉన్న ఇంటి వరండాలో చూస్తే, అక్కడంతా ఖాళీగా ఉంది. ఎవ్వరూ కనిపించలేదు. వారు తిరిగి భంగీలను ప్రశ్నిస్తే వారదే చెప్పారు. లాంతరు పట్టుకుని ఆ ఇల్లంతా ఎంత గాలించినా వారికి శ్రీఉపాసనీ కానీ, ఆయన చుట్టూ కూర్చుని ఉన్న స్త్రీ జనంకానీ కనిపించలేదు. భంగీలు అబద్ధమాడుతున్నారని భావించి వారక్కడనుండి వెళ్ళిపోయారు. వారు వెళ్ళిపోగానే అక్కడున్న మహిళలందరూ పొట్ట చెక్కలయ్యేలా నవ్వసాగారు. తననేకాక, అక్కడున్న వారినందరినీ అదృశ్యులుగా చెయ్యగలిగిన శ్రీఉపాసనీ అద్భుత అదృశ్యకరిణి సిద్ధికి వారందరూ ఆశ్చర్యపోయారు. అప్పటికలా ఆ గండం గట్టెక్కింది.

అయితే అంతటితో శ్రీఉపాసనీ శత్రువర్గం ఊరుకోలేదు. వారిలో విద్యావంతులైన వారు శ్రీఉపాసనీ నగ్నంగా సంచరిస్తూ, స్త్రీలచేత స్నానము, పూజ మొ॥న సేవలు చేయించుకుంటున్నాడనీ, వర్గ విభేదాలకు, కొట్లాటలకు కారణమవుతున్నాడని, ఆయన సభ్య సమాజంలో అలా ఉండటం సమాజ శ్రేయస్సుకు భంగకరమని అలా ఎన్నో ఆరోపణలతో పోలీసులకు ఫిర్యాదుచేసి, శ్రీఉపాసనీపై కఠిన చర్య తీసుకోవాలని పోలీసు ఉన్నతాధికారులపై ఒత్తిడి తెచ్చారు. తత్ఫలితంగా ప్రభుత్వం ఆ ఫిర్యాదులను విచారించడానికి ఒక పోలీసు అసిస్టెంటు సూపరింటెండెంట్‌ను నియమించారు. అతను ఒక ఆంగ్లో ఇండియన్. ఫిర్యాదుదారులను వెంటబెట్టుకొని ఆ పోలీసు అధికారి శ్రీఉపాసనీ వద్దకు వెళ్ళాడు. ఆ సమయంలో శ్రీఉపాసనీ, అక్కడున్న ఆయన బృందం అన్నదానం చేసే ఏర్పాట్లలో మునిగి ఉన్నారు. అక్కడి పరిస్థితులను, వారి కార్యక్రమాలను పరిశీలించిన ఆ పోలీసు అధికారికి అప్పుడు అక్కడ ఎటువంటి అభ్యంతరకరమైన అంశాలు కనిపించలేదు. అతను వెనక్కి తిరిగిపోతూ చూసుకుంటే తన వెంట తెచ్చుకున్న తన పెంపుడు కుక్క కనిపించలేదు. అక్కడంతా వెతికి కనిపించకపోయేసరికి, “నా కుక్క ఎక్కడుందో చూశారా?” అని శ్రీఉపాసనీని అడిగాడు. “అది మీ ఇంటికే వెళ్ళిపోయింది” అని సమాధానమిచ్చాడు శ్రీఉపాసనీ. తను లేకుండా ఆ కుక్క ఇంటికెందుకెళ్ళిందా అని ఆశ్చర్యపోతూ ఆ పోలీసుఅధికారి వెళ్ళిపోయాడు. ఇంతకూ ఆ కుక్క శ్రీఉపాసనీ ప్రక్కనే కూర్చుని ఉంది! ఆ పోలీసు అధికారికి మాత్రం కనిపించలేదు. కొంచెంసేపు అయ్యాక శ్రీఉపాసనీ ఆ కుక్కను ప్రేమగా తట్టి, “ఇక బయలుదేరు. నీ యజమాని వెళ్ళిపోయాడు. ఆయనకంటే ముందు నీవు ఇల్లు చేరాలి!” అన్నాడు. వెంటనే ఆ కుక్క అక్కడినుండి లేచి రివ్వున ఇంటికి పరిగెత్తింది.

1915 ఆగష్టుకల్లా శ్రీఉపాసనీకి ఖరగ్‌పూర్‌లో శత్రువర్గం విపరీతంగా పెరిగిపోయింది. నానావలీ వంటి కొందరు భక్తుల విరోధాన్ని తప్పించుకోవడానికి శిరిడీ వదిలిన శ్రీఉపాసనీకి అంతకు వందరెట్ల వ్యతిరేకత, శత్రుత్వం ఎదురయ్యింది. ప్లేగు వ్యాధి శిరిడీలో వ్యాపించి ఉన్నపుడు శిరిడీ వదిలిపోతే ఆ ప్రమాదం నుండి బయటపడవచ్చునని తలుస్తున్న ఒక భక్తునితో శ్రీసాయిబాబా, ***“శిరిడీలో ఉంటే ప్లేగుతో మరణిస్తావనీ, శిరిడీ వదిలితే బ్రతుకుతావనీ భావించడం ఉత్త భ్రమ. నీవు***

***శిరిడీ వదలి వెళ్లవద్దు!"*** అని ఆదేశించారు. ఆ మాట శ్రీఉపాసనీ విషయంలో నూటికి నూరుపాళ్ళు నిజమైంది. అయినా శిరిడీలో లేని రక్షణ స్వర్గానికి వెళ్ళినా ఉంటుందా?

అదృశ్యకరణి వంటి అతీతశక్తులతో ఎంతకాలమని శత్రువర్గం బారినుండి వచ్చే ప్రమాదాలను తప్పించుకొనగలడు? మరోప్రక్క భక్తులు తాను ఖరగ్‌పూర్‌లో శాశ్వతంగా నివసించేందుకు కావలసిన ఏర్పాట్లు చేస్తున్నారు. ఆ పరిస్థితుల్లో శ్రీఉపాసనీకి ఖరగ్‌పూర్ విడిచి వెళ్ళడంకన్నా ఉత్తమ మార్గం కనిపించలేదు. హఠాత్తుగా ఒక రాత్రికి రాత్రి ఖరగ్‌పూర్ విడిచి తిరిగి నాగపూర్ చేరాడు.

నాగపూర్‌లో మీరా అనే భక్తురాలి ఇంట్లో మకాం చేశాడు. ఖరగ్‌పూర్‌లో ఉండగా శ్రీఉపాసనీ ఖ్యాతి నాగపూర్ వరకు వ్యాపించి ఉండటంతో ఆయన నాగపూర్ వచ్చాడనే వార్త తెలిసి ఎందరో అసంఖ్యాకంగా ఆయన దర్శనార్థం రాసాగారు. ఆ సమయంలోనే ధోండీబాయి అనే యువతిని ఆమె అత్తగారు పూర్తిగా శ్రీఉపాసనీ సేవలో ఉండటానికి వదలి వెళ్ళింది. తరువాత శ్రీఉపాసనీ స్థాపించిన 'కన్యాస్థాన్'కు అక్కడే అంకురార్పణ జరిగిందని చెప్పవచ్చు. అలా శ్రీఉపాసనీ నాగపూర్‌లో రెండు నెలలున్నాడు.

ఇంతలో శ్రీసాయిబాబా విధించిన నాలుగు సంవత్సరాల గడువు పూర్తి కావడంతో, 1916 ప్రారంభంలో భక్తబృందంతో కలిసి పూనావెళ్ళి అక్కడ కొన్ని రోజులు తన అన్నగారితో గడిపి అక్కడినుండి తన స్వగ్రామమైన సతానా వెళ్ళాడు. అక్కడ ఒకటి రెండు నెలలు తన బంధుమిత్రుల మధ్య గడిపి అక్కడి నుండి బయలుదేరి తిరిగి శిరిడీ చేరాడు. అయితే ఈసారి కాశీనాథ్‌గా కాదు, సద్గురు శ్రీఉపాసనీబాబా మహరాజ్‌గా!

## సద్గురు పాదాల చెంతనే సచ్ఛిష్యునికి ఆశ్రయం!

శిరిడీ చేరిన శ్రీఉపాసనీ మహరాజ్ అంతకు మునుపులాగే, ఖండోబా ఆలయంలో బసచేశాడు. ఖరగ్‌పూర్, నాగపూర్ మొదలయిన ప్రదేశాలలో శ్రీఉపాసనీ గడించిన కీర్తిప్రతిష్ఠలకు ఆనందిస్తున్న ఆయన అభిమానులు ఆయన దర్శనానికి రాసాగారు. ఇంకోవైపు పెరిగిన ఆయన కీర్తిప్రతిష్ఠలకు మరింత మత్సరంతో ఉన్న ఆయన అసూయాపరులలోను, స్థానిక శత్రువర్గంలోను అలజడి ఆరంభమయింది. మళ్ళీ నానావలీ ప్రత్యక్షం! ఒకవైపు సత్కారాన్నీ, మరోవైపు ఛీత్కారాన్ని, మరింకోవైపు

నానావలీ పెట్టే నానాహింసలు భరిస్తూ శ్రీఉపాసనీ ఎలాగో శిరిడీలో ఏడునెలలు ఉన్నాడు. ఆ కాలంలో శ్రీఉపాసనీని గూర్చి శ్రీసాయిబాబా ఏం చెప్పారో, అప్పటి శ్రీఉపాసనీ అనుభవాలేమిటో నిర్దిష్టంగా తెలియరావడంలేదు.

ఇక శిరిడీ వదలాల్సిన పరిస్థితుల్లో దౌలూశేఠ్ అనే సాయి భక్తుడు శ్రీఉపాసనీని రహతా తీసుకెళ్ళాడు. రహతా శిరిడీకి సుమారు మూడు మైళ్ళదూరంలో ఉండే పెద్ద గ్రామం. శ్రీఉపాసనీ రహతాలోను, అహమ్మద్ నగర్‌లోను కొంతకాలముండి 1917లో మళ్ళీ శిరిడీ సందర్శించాడు. అయితే ఈసారి తప్పనిసరి పరిస్థితుల్లో రెండు మూడు నెలల్లోనే శిరిడీనుండి బయటపడాల్సి వచ్చింది. శిరిడీ నుండి శ్రీఉపాసనీ మీరజ్ చేరాడు. మీరజ్‌లో ఉండగా రహతా సమీపంలోని సకోరి గ్రామానికి చెందిన రైతులు కొందరు శ్రీఉపాసనీని సకోరిలో స్థిరపడమని కోరారు. ఆపై శ్రీఉపాసనీ సకోరి వచ్చి 1917లో సకోరిలో స్థిరపడ్డాడు.

రహతాకు అతి సమీపంలో ఉండే సకోరి కూడా శిరిడీకి సుమారు మూడుమైళ్ళ దూరంలో ఉంది. మొదట్లో సకోరి రైతులు శ్రీఉపాసనీ ఎన్నుకొన్న ప్రదేశంలో (స్మశానానికి సమీపంలో) ఒక చిన్న కుటీరం నిర్మించి ఇచ్చారు. ఆ మరుసటి సంవత్సరం (1918) అక్టోబరులో శ్రీసాయిబాబా మహాసమాధి చెందారు. అప్పుడు శ్రీఉపాసనీ శిరిడీ వచ్చి బాలాసాహెబ్ భాటేతో పాటు శ్రీసాయి భౌతికకాయాన్ని శాస్త్రోక్తంగా సమాధి చెయ్యడంలో ప్రధానపాత్ర వహించారు.

శ్రీఉపాసనీ మహరాజ్ సకోరిలో స్థిరపడ్డాక ఎందరో భక్తులు ఆయన దర్శనార్థం రానారంభించారు. శ్రీఉపాసనీ ఆశీస్సుల ప్రభావంతో ఎందరికో క్షయ వంటి వ్యాధులు నయమైనాయి. భూత గ్రహపిశాచాల వల్ల పీడింపబడుతున్నామనుకొనే మానసిక రోగులకెందరికో శ్రీఉపాసనీ అనుగ్రహం వల్ల స్వస్థత చేకూరింది. ఇంకా ఎన్నో అద్భుత మహిమలు శ్రీఉపాసనీ ద్వారా ఆయన భక్తులకు ప్రకటంకాజొచ్చాయి. ఉదాహరణకు, శ్రీఉపాసనీ 1917లో దౌలూశేఠ్ వద్ద రహతాలో ఉన్నప్పుడు ఒక భక్తురాలు ఆయనకొక కమలాఫలాన్ని సమర్పించింది. సాధారణంగా, ఏ కమలా పండులోనూ 12 తొనలకంటె ఎక్కువ ఉండవు. కానీ శ్రీఉపాసనీ అందరి ఎదుట ఆ ఒక్క కమలానే ఒలిచి సుమారు 30 మందికి ఒక్కొక్క తొన ప్రసాదంగా ఇవ్వడం అక్కడున్న భక్తులందరికీ దిగ్భ్రమ కలిగించింది.

## సాయిమహిమను నిరూపించగలిగిన సాయిభక్తుడు!

శ్రీఉపాసనీ సకోరిలో స్థిరపడ్డ తరువాత అప్పటి నైజాం రాష్ట్రంలో ఉన్నత మంత్రి పదవిలో ఉన్న రాజా సర్ కృష్ణప్రసాద్ దివాన్ (?) కొన్ని రాజకీయ కారణాల మూలంగా పదవి కోల్పోయి శ్రీఉపాసనీ ఆశీస్సులకోసం సకోరి వచ్చి రెండునెలలపాటు ఉన్నాడు. ఆయన సకోరిలో ఉండగానే ఆయనకూడా ఊహించని అద్భుతరీతిలో తిరిగి పదవి చేపట్టమని నైజాం నవాబు నుండి కబురువచ్చింది. శ్రీఉపాసనీ అనుగ్రహబలం వల్లనే తన పదవి తనకు దక్కిందని భావించిన ఆ దివానుగారు జీవిత పర్యంతం శ్రీఉపాసనీకి భక్తుడై సేవించాడు.

1921-22 మధ్యకాలంలో శ్రీఉపాసనీపై ఎన్నో వ్యాసాలు, మరాఠీ వార్తా పత్రికలలో ప్రచురింపబడ్డాయి. 1922లో ప్రఖ్యాత మరాఠీ రచయిత శ్రీనాథ్ మఢో రచించిన 'శ్రీఉపాసనీ జీవితచరిత్ర' గ్రంథం ప్రచురితమైంది. ఈ ప్రచురణల వల్ల, నిజాం రాష్ట్ర దివాను పరపతి మూలంగా శ్రీఉపాసనీ కీర్తి ఆనతికాలంలో దేశం నలుమూలలకూ ప్రాకింది. బొంబాయి తదితర ప్రాంతాలనుండి ఎందరో భక్తులు తరచూ రాసాగారు.

పైన పేర్కొన్న కారణాలన్నిటికి మించి, శ్రీసాయిబాబా దేహత్యాగం వల్ల కొందరు సాయిభక్తుల హృదయాలలో ఏర్పడ్డ ఖాళీని శ్రీఉపాసనీ సమర్ధవంతంగా భర్తీచేయగలగడమే శ్రీఉపాసనీ ఖ్యాతికి మూలకారణమనిపిస్తుంది. శ్రీసాయిబాబా సశరీరులుగా ఉండగా శిరిడీలో బాబా ఆరతులు నిర్వహిస్తుండిన శ్రీబాపూసాహెబ్ జోగ్‌కు బాబా మహాసమాధి అనంతరం శ్రీసాయిబాబా స్వప్నంలో దర్శనమిచ్చి, "తాను ఇకపై సకోరిలో ఉపాసనీ మహరాజ్ రూపంలో ఉన్నాననీ, కనుక ఇకపై జోగ్ సకోరి వెళ్ళి శ్రీఉపాసనీని సేవించ"మని ఆదేశించారట. శ్రీజోగ్ ఆ తరువాత శ్రీఉపాసనీ శిష్యుడై సన్యాసం స్వీకరించి సకోరిలోనే స్థిరపడ్డాడు. శ్రీజోగ్ సకోరిలో స్థిరపడటానికి కొన్ని మాసాలముందే శ్రీకమలాకర్ గోవింద్ దీక్షిత్ (గురూజీ) అనే సాయిభక్తుడు కూడా సకోరి వెళ్ళి శ్రీఉపాసనీ వద్దనే స్థిరపడ్డాడు. ఈ దీక్షిత్ పూర్వం శిరిడీలో శ్రీఉపాసనీతోబాటు కొంతకాలం ఖండోబా ఆలయంలో ఉండేవాడు. శ్రీసాయిబాబా మహాసమాధి అనంతరం ఇతడిని బాబా సమాధిమందిరంలో పూజాదికాలకు శ్రీబాపూసాహెబ్ బూటీ నియమించాడు. కానీ శ్రీఉపాసనీమహరాజ్ పట్ల ఆకర్షితుడైన

ఈ దీక్షిత్ రెండు నెలలు మాత్రం సమాధిమందిరంలో పూజారిగా ఉండి, శ్రీబూటీ ఎంత మందలించినా లెక్కచేయకుండా సకోరీ వెళ్ళి అక్కడే స్థిరపడ్డాడు. అలానే దౌలూశేఠ్, శ్రీసాఠే, శ్రీఅమియాదాస్ మెహతా, చంద్రాబాయి బోర్కర్, శ్రీహన్స్‌రాజ్ మొ॥న సాయిభక్తులెందరో శ్రీసాయి మహాసమాధి అనంతరం శ్రీఉపాసనీమహరాజ్‌ను ఆశ్రయించారు.

శ్రీఉపాసనీమహరాజ్ కీర్తి దేశం నలుదిశలకు వ్యాపించి వేలాది భక్తులు ఆయనను మహాసిద్ధపురుషునిగా సద్గురుమూర్తిగా ఆరాధిస్తున్నా, ఎందరో తన సాయిభక్త సోదరులు తనను శ్రీసాయి మహిమకు వారసునిగా సాక్షాత్తూ సాయి స్వరూపునిగా భావిస్తున్నా శ్రీఉపాసనీ మాత్రం తన హృదయంలోని దృఢ సాయిభక్తికి అహంకారపు పొరలు క్రమ్మనీయలేదు. ***"ఈనాటి నా ప్రతిభకంతా కర్త నా గురువే! ఆయన ఆశీస్సుల ఫలితమే ఇదంతా!"*** అని శ్రీసాయిబాబా అనేవారు. అంతటి అద్వితీయ గురుభక్తుడైన సద్గురుమూర్తి అనుగ్రహానికి పాత్రుడైన శ్రీఉపాసనీ కూడా తనను ఆరాధించడానికొచ్చిన వారికి సదా శ్రీసాయి మహిమను గుర్తుచేసేవారు. స్వప్నంలో తనకొచ్చిన సందేశం ప్రకారం శ్రీసాయి-ఉపాసనీల అభేదత్వాన్ని దృఢంగా విశ్వసించి సకోరిలో స్థిరపడ్డ శ్రీజోగ్ తాను మునుపు శిరిడీలో శ్రీసాయిబాబాకు చేసినట్లుగానే ఉపాసనీకి కూడా పూజ, ఆరతులు నిర్వహిస్తానని పట్టుపట్టాడు. కానీ శ్రీఉపాసనీ మొదట జోగ్ తనకు పూజ, ఆరతులు ఇవ్వడానికి తీవ్రంగా అభ్యంతరం తెలిపారు. "సాయిబాబాతో నాకు సామ్యమేమిటి? ఆయనెక్కడ? నేనెక్కడ? ఆయన ఆకాశమంతటి ఉన్నతుడు. నేను అధఃపాతాళాన్నంటి ఉన్న అధముణ్ణి!" అనేవాడు. 1923-24లలో శ్రీఉపాసనీ ఒక దివ్యావేశంలో వివిధ అంశాలగురించి అనర్గళంగా భక్తులకు ప్రసంగపరంపరనందించారు. ఆ ప్రసంగాలన్నీ శ్రీఉపాసనీ ఆధ్వర్యంలో ప్రారంభించబడ్డ ఒక పత్రికలో ప్రచురింపబడ్డాయి. ఆ పత్రికకు శ్రీఉపాసనీ పెట్టిన పేరు "సాయివాక్సుధ". పలికేది తానయినా పలికించేవాడు సాయినాథుడనీ, అందుకని తన ప్రసంగాలన్నీ వాస్తవానికి శ్రీసాయి వాక్కులేనని చెప్పేవాడు శ్రీఉపాసనీ.

శ్రీఉపాసనీ యొక్క సాయిభక్తికి తార్కాణంగా ఇక్కడ మరో సంఘటనను ప్రస్తావించుకొందాం. శ్రీఉపాసనీ ప్రతి యేడు శ్రీసాయిబాబా పుణ్యతిథిని అత్యంత శ్రద్ధాభక్తులతో, శాస్త్రోక్తంగా, అత్యంత వైభవంగా జరిపించేవాడు. 1920లో

శ్రీసాయిబాబా ద్వితీయ వర్ధంతి మే-జూన్ మాసాలలో కాశీ క్షేత్రంలో జరిపించాలని సంకల్పించాడు శ్రీఉపాసనీ. సకోరి, బొంబాయి, పూనా తదితర ప్రదేశాలనుండి పెద్దసంఖ్యలో భక్తులు ఆ కార్యక్రమంలో పాల్గొనడానికి కాశీకి ప్రయాణమయ్యారు. తరువాత కాలంలో అవతార్ మెహర్‌బాబాగా ప్రఖ్యాతుడయిన తన శిష్యుడు మెర్వాన్‌ను, సదాశివ గోవిందషెల్కె పాటిల్ అనే భక్తుని పిలిచి, ముందుగా కాశీ వెళ్ళి ఆ కార్యక్రమం ఏర్పాట్లు చేయమని పురమాయించాడు. వారితో శ్రీఉపాసనీ "జరుగబోయేది మామూలు యాగం కాదు! అది జగత్తులోని పరిపూర్ణ సద్గురువుల సమావేశం. ఆ సమావేశానికి సాయిబాబా అధ్యక్షత వహిస్తారు" అన్నారు. మెర్వాన్, సదాశివపాటిల్ వెళ్ళిన తరువాత తక్కిన భక్తులను 15 రోజులు ఆగి బయలుదేరి, కాశీలో తనను కలుసుకొమ్మని చెప్పి, శ్రీఉపాసనీ ముందుగా బయలుదేరాడు. సకోరినుండి అంకయి కొండపైన అగస్త్య ఆశ్రమం, నర్మదాతీరంలోని ఓంకారేశ్వర్, ఉజ్జయిని సందర్శించి అలహాబాదు చేరాడు. అక్కడ ఒక మహమ్మదీయ మిత్రుని ఇంట్లో రెండురోజులు బసచేసి కాశీ చేరాడు. అక్కడ గంగాతీరంలో ఒక ఏకాంత ప్రదేశంలో నాలుగురోజులపాటు కదలకుండా కూర్చుని శ్రీసాయిబాబాకు, ఇతర సద్గురుమూర్తులకు శాస్త్రోక్తమయిన ఉత్తరక్రియలు నిర్వహించాడు. ఆపైన గంగలో స్నానం చేసి రామకృష్ణ దీక్షిత్ అనే గృహస్థు ఇంట బసచేశాడు. ఈలోగా శ్రీఉపాసనీ మహిమ గురించి విన్న ఎందరో ఆయన దర్శనార్థం రాసాగారు. సకోరి తదితర ప్రాంతాలనుండి వచ్చే భక్తులకోసం పెద్ద ఎత్తున వసతి సౌకర్యాలు ఏర్పాటు చేయబడ్డాయి. ఈలోగా శ్రీఉపాసనీ ఒక మారుతి ఆలయంలో ప్రక్కనే ఖాళీగా ఉన్న ఒక చిన్న రేకుల షెడ్డును తన మకాముగా ఎన్నుకొన్నాడు. నిప్పులు చెరిగే ఎండలో అతి తక్కువ ఎత్తులో నిర్మించబడ్డ రేకుల కప్పు క్రింద అలానే కూర్చుని వేలాదిమంది భక్తులకు దర్శనమిచ్చాడు శ్రీఉపాసనీ. ఎస్.వి.సాఠే, జోగ్, మెర్వాన్(మెహర్‌బాబా), యశ్వంతరావు బోరావ్కె తదితర భక్తులంతా శ్రీఉపాసనీ ఆదేశానుసారం శతచండి మహాయాగ నిర్వహణలో నిమగ్నులయ్యారు. నలభైమంది బ్రాహ్మణులచేత భగవద్గీత, రామగీత, సప్తశతి, ఆధ్యాత్మ రామాయణము, విష్ణుసహస్రనామము, గాయత్రి పారాయణ చేయించారు. పదకొండు రోజులపాటు జరిగిన యాగం, పారాయణ హనుమజ్జయంతికి పూర్తయింది. యాగమంటపం మధ్యలో శ్రీసాయిబాబా ఫోటో

ప్రతిష్ఠించారు. పన్నెండవ రోజున పెద్దఎత్తున బ్రాహ్మణ సంతర్పణకు ఏర్పాట్లు మొదలైనాయి. భోజనానికి కూర్చున్న బ్రాహ్మణులలో కొందరు యాగమంటపం మధ్యలో ప్రతిష్ఠించబడ్డ శ్రీసాయి చిత్రపటం చూచి "సాయిబాబా ముసల్మాను. ఒక ముసల్మాను పేర జరిగే సంతర్పణలో మేము భుజించము!" అని లేచారు. అంతకు ముందు యాగం నిర్వహించిన బ్రాహ్మణులు కూడా ఆ సమయంలో వారితో గొంతు కలిపారు. పెద్ద కలకలం చెలరేగింది. తాను సదాచార బ్రాహ్మణ కుటుంబానికి చెందిన వాడనేనని, సద్గురుమూర్తియైన శ్రీసాయిబాబా సకల మత భేదాలకు అతీతుడనీ శ్రీఉపాసనీ వారికి ఎంతోదూరం నచ్చచెప్పయత్నించాడు. వారు ససేమిరా అన్నారు. అంతకుముందు చెప్పినట్లు తలకు రూ. 5/– కాకుండా రూ. 15/– దక్షిణ ఇస్తానని, భోజనం చెయ్యమని బ్రతిమాలాడు. కులగర్వం తలకెక్కిన ఆ బ్రాహ్మణులు దక్షిణ మొత్తం చూచి కొంత మెత్తబడ్డారు. కానీ, ఒక్కసారి దిగిరావడం బాగుండదని, "అయితే ముందు ఆ సాయిబు ఫోటో అక్కణ్ణుంచి తీసెయ్యండి! అప్పుడు మేము భోంచేస్తాం!" అని షరతు విధించారు. శ్రీసాయిబాబా ఫోటో తీసివేయడానికి శ్రీఉపాసనీ ఏమాత్రం ఒప్పుకోలేదు. సరికదా శ్రీసాయిని గూర్చి అగౌరవంగా మాట్లాడుతున్న ఆ బ్రాహ్మణులపై ఆగ్రహం కలిగింది. వండిన భోజన పదార్థాలన్నీ పేదవారిని పిలిచి వడ్డించమని తన భక్తులను ఆదేశించాడు. వేలాదిమంది పేదలకు అన్నదానం జరిగింది. ఇంకా మిగిలిన ఆహార పదార్థాలను తీసుకెళ్ళి గంగానదిలో పోయమని చెప్పాడు శ్రీఉపాసనీ. అటు భోజన సంతర్పణ, ఇటు పెద్దమొత్తంలో దక్షిణ – రెండూ చేజారిపోయాయని చింతిస్తూ కొందరు బ్రాహ్మణులు శ్రీఉపాసనీ వద్దకు వచ్చి జరిగిన పొరపాటుకు చింతిస్తున్నామని చెపుతూ రాజీకొచ్చారు. కాని శ్రీఉపాసనీ మాత్రం ఇంకా తగ్గని ఆగ్రహంతో "మీరు కాశీపండితులు కదండీ! మీకు నేను చెప్పగలవాడనా? సాయిబాబాను నిరసించిన తరువాత ఈ సంతర్పణలో భోజనం చెయ్యడానికి మీరు సిద్ధమైనా నేను మాత్రం ఒప్పుకోను! సాయిబాబాను మీరు ముస్లిం అని నిరసించారు, సాయిని గూర్చి మీకేం తెలుసు? ఆయనే అసలైన పండితుడు!" అన్నాడు నిష్ఠూరంగా. ఏమైతేనేం? వైదిక సంప్రదాయానుసారం శ్రీసాయిబాబా పేర బ్రాహ్మణ సంతర్పణ చెయ్యాలని శ్రీఉపాసనీ యత్నించినా, శ్రీసాయి మాత్రం తనకు ప్రీతికరమైన పేదలకు అన్నదానం జరిపించుకున్నారు! ***"'అతిథి' అంటే అయిదున్నర***

*అడుగుల మానవుడేనని, బ్రాహ్మణుడేననా నీ భావం? వేళకు ఆకలిగొని వచ్చిన ఏ ప్రాణైనా, పక్షైనా, పురుగైనా - అతిథే ....ఆకలిగొన్నవారికి అన్నం, గుడ్డలు లేనివారికి గుడ్డలు ఇవ్వు. భగవంతుడు సంతోషిస్తాడు"* అన్నది శ్రీసాయి ప్రబోధం. సనాతన సంప్రదాయాలపేర సంతర్పణలు జరిపించడం సాయి సంప్రదాయం కాదు!

అదే సంవత్సరం (1920) అక్టోబరులో శ్రీసాయిబాబా మహాసమాధి ద్వితీయ వార్షికోత్సవ సందర్భంగా బొంబాయిలో ఒక సాయిభక్త సమ్మేళనాన్ని తమ ఆధ్వర్యంలో నిర్వహించవలసిందని శ్రీఅమియాదాస్ మెహతా శ్రీఉపాసనీని కోరాడు. శ్రీఉపాసనీ సంతోషంగా ఆ ప్రతిపాదనను అంగీకరించి ఆ సాయిభక్త సమ్మేళనంలో పాల్గొన్నాడు. ఈసారి కాశీలోవలెకాక, ప్రధానంగా పేదలకు అన్నదానం, వస్త్రదానం, సాయినామ సప్తాహం పెద్ద ఎత్తున నిర్వహించబడ్డాయి.

ఎన్నో మౌలికమయిన అంశాలలోనే శ్రీసాయిబాబా తమ ఆచరణ, ప్రబోధాల ద్వారా చూపిన ఆదర్శానికి భిన్నమైన మార్గాన్ని అనుసరించినా, కడవరకు శ్రీఉపాసనీ మహరాజ్ అచంచల గురుభక్తునిగా ప్రకాశించాడు. తన ద్వారా ప్రకటమైన అద్భుత మహిమలతో శ్రీసాయిమహిమను ఋజువుపరచి తన సద్గురుమూర్తి కీర్తిపతాకాన్ని దిగ్దిగంతాలలో ఎగురవేశాడు శ్రీఉపాసనీ! మత ఛాందసంలో మిడిసిపడుతున్న ఒక ముస్లిం మత గురువుతో శ్రీసాయిబాబా, *"ఎవరు నిజమైన ముస్లిం? భగవంతుని శక్తి ఋజువుచేయగలవాడే ముస్లిం"* అని ప్రకటించారు. ఈ దృష్ట్యా చూస్తే శ్రీసాయిని మించిన నిజమైన ముస్లిం, శ్రీఉపాసనీని మించిన సాయిభక్తుడు ఎవరున్నారు?

## ఆ సద్గురుమూర్తికి శ్రాద్ధకర్మలా?

1917లో శ్రీఉపాసనీ నివాసార్థం సకోరీ గ్రామం బయట స్మశానానికి దగ్గరలో ఒక చిన్న గుడిసె నిర్మించి ఇచ్చారు ఆ గ్రామానికి చెందిన కొందరు రైతులు. అంతకు కొన్ని మాసాల ముందు శిరిడీ నుండి మీరజ్ వెళ్ళేటప్పుడు శ్రీఉపాసనీతోపాటు తోడుగా శ్రీమతి దుర్గాబాయి కర్మార్కర్ అనే భక్తురాలు కూడా మీరజ్ వెళ్ళింది. అప్పటినుండి సుమారు 15 సంవత్సరాలపాటు ఆమె శ్రీఉపాసనీకి నీడవలె అంటిపెట్టుకొని సేవించింది. శ్రీఉపాసనీ సకోరిలోని ఆ చిన్న గుడిసెలో దుర్గాబాయితో కలిసి నివసించసాగాడు.

మొదట్లో చుట్టుప్రక్కల గ్రామాలనుండి అప్పుడప్పుడూ ఎవరో కొద్దిమంది మాత్రమే శ్రీఉపాసనీ దర్శనార్థం వచ్చేవారు. శిరిడీలోని ఖండోబా మందిరంలో ఉన్నప్పుడు ఎలా ఉండేవాడో అలాంటి జీవనసరళినే సకోరిలో కూడా మొదట్లో కొనసాగించాడు శ్రీఉపాసనీ. నడుముకు చుట్టుకొన్న గోనెపట్టా తప్ప దాదాపు దిగంబరంగానే సంచరించేవాడు. 1918-19లో దేశంలో "ఇన్‌ఫ్లుయంజా" వ్యాధి ప్రబలింది. వేలాదిమంది ఆ వ్యాధికి గురై చనిపోయారు. సకోరిలో కూడా ఎంతోమంది మృతి చెందారు. ఆ సమయంలో శ్రీఉపాసనీ దిక్కుమొక్కులేని శవాలను స్మశానానికి స్వయంగా మోసుకెళ్ళి దహన సంస్కారాలు చేసేవాడు. ప్రారంభంలో సకోరి గ్రామంలో కూడా శ్రీఉపాసనీ పట్ల ఎంతో వ్యతిరేకత ఉండేది. కానీ, ఆ తరువాత శ్రీఉపాసనీ దర్శనార్థం వచ్చే ప్రముఖ వ్యక్తులను చూచి, ఆయన కారణంగా సకోరికి ప్రాముఖ్యత పెరగడం, తద్వారా గ్రామాభివృద్ధి జరగడం చూచి గ్రామస్థుల వైఖరిలో క్రమంగా మార్పు వచ్చింది. సకోరి గ్రామ పాటిల్ అయిన శ్రీఆర్.ఎస్.రోహం ఇలా అంటారు : "చిన్నతనంలోనే నాకు శ్రీఉపాసనీ బాబాతో పరిచయం కలిగింది. ఆయన మొదట్లో సకోరి వచ్చి గుడిసెలో నివసిస్తున్న రోజుల్లో అప్పుడప్పుడు మా ఇంటికి వచ్చి చిన్న చిన్న పనులు చేస్తుండేవారు".

1918 అక్టోబరులో శ్రీసాయిబాబా మహాసమాధి చెందారు. శ్రీసాయిని భౌతికంగా దర్శించి, సంభాషించి సాంత్వన పొందుతుండిన సాయిభక్తులలో కొందరు క్రమంగా శ్రీఉపాసనీ వైపు ఆకర్షించబడ్డారు. తాను మాట్లాడే ప్రతి మాటా శ్రీసాయిబాబా పలికించేదేనని, ఆంతర్యంలో శ్రీసాయితో తనకు ఎప్పుడూ అఖండమైన అనుబంధం ఉందని చెప్పేవాడు శ్రీఉపాసనీ. ఆ కారణంగా సాయిభక్తులే కాక శ్రీసాయిని సజీవంగా దర్శించుకోలేని ఎందరో, శ్రీఉపాసనీ శ్రీసాయికి ఆధ్యాత్మిక వారసునిగా భావించి ఆయనను ఆశ్రయించారు. ఒక వ్యక్తి మరణిస్తే ఆ వ్యక్తి ఆత్మ ఉత్తమగతులను పొందడానికి అతడి వారసులు శ్రాద్ధకర్మలు నిర్వహించడం పరిపాటి. శ్రద్ధాభక్తులతో తమనాశ్రయించిన జీవులందరినీ ఉద్ధరించి సద్గతిని ప్రసాదించగల శ్రీసాయినాథుని వంటి సద్గురుమూర్తికి శ్రాద్ధకర్మలు నిర్వహించడం ఛాందస ఆచారాల పట్ల మనకున్న శ్రద్ధను తెలుపుతుందేగాని శ్రీసాయితత్త్వం పట్ల మన శ్రద్ధాభక్తులను తెలుపదు. శ్రీసాయి మహాసమాధి చెందగానే, శ్రీఉపాసనీ శ్రీసాయికి సశాస్త్రీయంగా ఉత్తరక్రియలు,

శ్రాద్ధకర్మలు నిర్వహించడంలో చూపిన శ్రద్ధ, ఏతావాతా శ్రీఉపాసనీ నిజంగా శ్రీసాయికి వారసుడనే భావం కలిగించడంలో మాత్రం కొంతవరకు సఫలీకృతమైంది.

## సద్గురువుల సాన్నిధ్యంలో మెహర్‌బాబా?

శ్రీఉపాసనీ సకోరిలో స్థిరపడ్డ తొలిరోజులలో ఆయనను ఆశ్రయించిన వారిలో శ్రీమెర్వాన్ షెరియర్ ఇరానీ ఒకరు. ఈయనే తరువాత కాలంలో అవతార్ మెహర్‌బాబాగా ప్రఖ్యాతుడైనాడు. శ్రీమెర్వాన్ 1921లో శ్రీఉపాసనీ సన్నిధిలో కొన్ని మాసాలున్నారు. శ్రీమెర్వాన్ ఆ కాలంలో శ్రీఉపాసనీకి అత్యంత అభిమాన పాత్రుడైనాడు. అంతేకాదు శ్రీఉపాసనీ ఖ్యాతి నలుదిశలా వ్యాపించడానికి దోహదం చేసిన శ్రీఉపాసనీ ప్రథమ జీవితచరిత్ర శ్రీనాథ్‌మఢోచే రచియింపబడటానికి ఈయనే నిమిత్తమైనాడు.

శ్రీమెర్వాన్ 1874 ఫిబ్రవరి 25వ తేదీన పూనాలో ఒక పార్శీ కుటుంబంలో జన్మించాడు. బాల్యంనుండి ఆధ్యాత్మిక విషయాల పట్ల ఆసక్తి కనబరచేవాడు. అప్పుడప్పుడు పార్శీ మతస్థుల స్మశానభూమి (మౌనశిబిరం)కి వెళ్ళి అక్కడ కొంతసేపు కూర్చొని వచ్చేవాడు. పూనాలో శ్రీమెర్వాన్ గృహానికి సమీపంలో బాబాజాన్ అనే గొప్ప సిద్ధురాలు నివసించేది. ఆమె అప్పటికే శతాధిక వృద్ధురాలు, అవధూత. 1913 మే నెలలో ఒకసారి శ్రీమెర్వాన్ సైకిలు మీద వెళుతుండగా ఆయన్ను దగ్గరకు పిలచి ప్రేమగా కౌగిలించుకొన్నది. ఆ రోజు నుండి శ్రీమెర్వాన్ తరచు శ్రీబాబాజాన్‌ను దర్శించి మౌనంగా ఆమె సన్నిధిలో కూర్చొని వస్తుండేవాడు. 1914 జనవరిలో శ్రీబాబాజాన్ ఒకరోజు మెర్వాన్‌ను దగ్గరకు పిలిచి అతని భ్రూమధ్యంలో సున్నితంగా చుంబించింది. దానితో శ్రీమెర్వాన్ శరీరంలో ఏదో విద్యుత్తు ప్రవహించినట్లు ఏదో తెలియని ఆనందపారవశ్యానికి గురయ్యాడు. ఆ పారవశ్యం శ్రీమెర్వాన్‌ను సుమారు మూడురోజుల వరకు వీడలేదు. అయితే ఆ తరువాత కూడా ఆయన ఏదో వేరేలోకంలో ఉన్నట్లు సంచరించేవాడు. తిరిగి ఆ ఆనందపారవశ్యాన్ని పొందాలని తపించేవాడు. పెద్దలు అదేదో మానసిక వ్యాధి అని భావించి ఎన్నో వైద్యాలు చేయించారు. కానీ ఫలితం లేకపోయింది. తాను కొన్నిరోజులు మాత్రం అనుభవించి కోల్పోయిన ఆ పరిస్థితిని తిరిగి సాధించేందుకు శ్రీమెర్వాన్ ఎందరో మహాత్ములను

దర్శించాడు. 1915 ఏప్రిల్‌లో పూనాకు సుమారు 35కి.మీ. దూరంలో ఉన్న ఖేడ్గాంభేట్‌లో శ్రీనారాయణ మహరాజ్‌ను దర్శించాడు. శ్రీనారాయణ మహరాజ్ మెర్వానును దగ్గరకు పిలిచి తన మెడలోని పూలమాలను తీసి అతని మెడలో వేసి మామిడి పండ్లరసం ప్రసాదంగా ఇచ్చి ఆశీర్వదించాడు. అక్కడినుండి శ్రీమెర్వాన్ బొంబాయిలో శ్రీటిపూబాబాను, నాగపూర్‌లో హజ్రత్ తాజుద్దీన్ బాబాను దర్శించాడు. కానీ ఆ మహాత్ముల దర్శనాశీస్సులేవీ మెర్వాన్‌లోని తపనను తీర్చలేకపోయాయి. తాజుద్దీన్‌బాబా దర్శనం చేసుకొని పూనా చేరిన తరువాత తిరిగి మామూలుగా మెర్వాన్ రోజూ బాబాజాన్ దర్శనానికి వెళ్ళేవాడు. ఆమె అతనితో తరచూ, "అబ్బాయీ! నీకు అవసరమైన నిధియొక్క తాళం చెవులు నావద్ద లేవు. నీకానిధి తాళం చెవులు కావాలంటే శిరిడీలో సాయి ఉన్నారు. ఆయనొక్కడే నీకా తాళం చెవులు ఇవ్వగలరు. ఆయన నీకానిధిని ప్రసాదిస్తాడేమో చూడు! ఆయనిస్తే తీసుకో" అనేది. శ్రీబాబాజాన్ కూడా శ్రీసాయిబాబా వలె "ఆధ్యాత్మిక జ్ఞానాన్ని" నిధి అని వ్యవహరించేవారు.

### శ్రీమెహెర్‌బాబా 'నిధి' - సాయిసన్నిధి!

బాబాజాన్ మాట మీద మెర్వాన్, ఆయన సహచరుడు చెహ్రాంజీతో కలిసి 1915 డిసెంబరులో శిరిడీ దర్శించాడు. అయితే వారికి శ్రీసాయిదర్శనం అంత సులభంగా లభించలేదు. చెహ్రాంజీ ముందుగా వెళ్ళి బాబాజాన్ ఆదేశానుసారం మెర్వాన్ షెరియన్ ఇరానీ వచ్చాడని చెప్పగానే, శ్రీసాయి కోపంగా, ***"అతడు ఇక్కడకు రావడానికి వీల్లేదు. నేనతన్ని చూడను!"*** అని కేకలేసి మెర్వాన్‌ను మసీదులోకి అడుగుపెట్టడానికి అంగీకరించలేదు. ఇక చేసేది లేక, బాబా లెండీ వెళ్ళే సమయంలోనైనా దర్శనం చేసుకొందామని వీధి ప్రక్కన వేచిచూస్తూ నిలబడ్డాడు మెర్వాన్. బాబా లెండీకి వెళుతూ తనను సమీపించగానే రోడ్డుమీదనే ఆయనకు సాగిలబడి మ్రొక్కాడు. బాబా తమ సహజ ధోరణిలో ***'పర్వర్దిగర్'*** అంటూ భగవంతుణ్ణి స్మరించి, మెర్వానును వెళ్ళిపొమ్మన్నట్లు చేయి ఊపుతూ ముందుకు సాగిపోయారు అంతే!

అప్పటికే శ్రీఉపాసనీబాబా గురించి విని ఉన్న శ్రీమెర్వాన్ అక్కడి నుండి నేరుగా ఖండోబా మందిరానికి వెళ్ళాడు. అప్పటికి సుమారు ఒకటిన్నర సంవత్సరం క్రితమే శిరిడీ వదలివెళ్ళి ఖరగ్‌పూర్, నాగపూర్ మొదలైన ప్రదేశాలలో ఉండి తిరిగి శిరిడీ

చేరి తన పూర్వపు మకామైన ఖండోబా ఆలయంలో బసచేసి ఉన్నాడు శ్రీఉపాసనీ. అంతేగాని కొన్ని చరిత్రలలో వ్రాసినట్లు శ్రీసాయి నేరుగా మెర్వానును శ్రీఉపాసనీని దర్శించమని ఆదేశించడం జరుగలేదు. తనను సమీపిస్తున్న మెర్వానును చూడగానే శ్రీఉపాసనీ ఉగ్రులై చేతికి దొరికిన ఒక రాయి తీసికొని మెర్వాన్‌పై బలంగా విసిరికొట్టాడు. ఆ రాయి అంతకు ముందు సుమారు రెండు సంవత్సరాల క్రితం బాబాజాన్ ముద్దుపెట్టుకొన్న స్థలంలో అంటే భ్రూమధ్యలో తగిలింది. ఆ దెబ్బతో శ్రీమెర్వాన్ నుదుటిపై గాయమై రక్తమొచ్చింది. అంతేకాదు పూర్తి బాహ్య (ప్రాపంచిక) స్పృహ కూడా కలిగింది. బాబాజాన్ అంతక్రితం మెర్వాన్‌తో "నీక్కావలసిన నిధి తాళం చెవులు సాయిబాబా ఒక్కరే ఇవ్వగలరు. ఆయన అవి ప్రసాదిస్తారేమో చూడు! ఇస్తే తీసుకో!" అని అన్నారు. జరిగిన సంఘటనను బట్టి శ్రీసాయి ఆ తాళంచెవులు మెర్వాన్‌కు ఇచ్చారో లేదో, ఇస్తే ఎలా ఇచ్చారో అన్న విషయం ఆ సద్గురుమూర్తికే ఎరుక!

అప్పటికి శిరిడీ వదలి వెళ్ళిన శ్రీమెర్వాన్ తిరిగి 1920లో (బాబా మహాసమాధి అనంతరం) సకోరి వచ్చి శ్రీఉపాసనీని దర్శించాడు. కాశీలో ఉత్తరక్రియల నిమిత్తం శ్రీఉపాసనీ నిర్వహించిన యాగ సమారాధనల ఏర్పాట్లలో శ్రీమెర్వాన్ చురుగ్గా పాల్గొన్నాడు. 1921-22లో కొన్ని మాసాలు శ్రీమెర్వాన్ సకోరిలో శ్రీఉపాసనీ సన్నిధిలో గడిపాడు. ఆ కాలంలో శ్రీఉపాసనీ గంటల తరబడి శ్రీమెర్వాన్‌తో గడిపేవారు. శ్రీమెర్వాన్ ఆ రోజుల్లో శ్రీఉపాసనీపై రచించిన ఒక గుజరాతీ ఆరతి గీతాన్ని చాలాకాలం పాటు సకోరి ఆశ్రమంలో ఆరతి సమయాలలో పాడేవారు. శ్రీమెర్వాన్ అప్పట్లో శ్రీఉపాసనీ అభిమానాన్ని ఎంతగా చూరగొన్నాడంటే, ఒకసారి శ్రీఉపాసనీ, "నేటితో నా బాధ్యతనంతా మెర్వాన్‌కు అప్పగించాను. ఈ యువకుడు ప్రపంచంలో పెద్ద సంచలనం తెస్తాడు. నేనతన్ని పరిపూర్ణుడుగా చేశాను!" అని ప్రకటించాడు. శ్రీమెర్వాన్ శ్రీఉపాసనీ ఆధ్యాత్మిక వారసుడని ఎందరో భావించారు. కానీ, ఏ కారణం వల్లనో శ్రీమెర్వాన్ 1922 చివరిలో సకోరినుండి వెళ్ళిపోయి, తిరిగి 1941 అక్టోబరులోనే అంటే శ్రీఉపాసనీ దేహత్యాగం చేయడానికి కొన్ని మాసాల ముందు శ్రీఉపాసనీ దర్శనానికి సకోరి వెళ్ళి తన గురువుతో ఒక అరగంట కాలం గడిపారు!

అహ్మద్‌నగర్ సమీపంలో స్థిరపడ్డ శ్రీమెర్వాన్ తరువాత కాలంలో 'అవతార్ మెహర్‌బాబా'గా ప్రఖ్యాతుడై వేలాదిమందికి ఆరాధ్యుడైనాడు. శ్రీమెహర్‌బాబా తన

జీవితాన్నంతటిని మౌననిష్ఠలోను, ఏకాంత ఉపవాసదీక్షలలోను, కుష్టు రోగుల సేవలోను గడిపారు. శ్రీసాయి, ఉపాసనీ, మెహర్‌బాబాల జీవిత సరళి, బోధనలను తులనాత్మకంగా పరిశీలిస్తే శ్రీసాయిబాబా ఆదర్శాన్ని, బోధనాసరళిని శ్రీఉపాసనీ, శ్రీఉపాసనీ సిద్ధాంతాలను శ్రీమెహర్‌బాబా వారసత్వంగా గ్రహించినది చాలా స్వల్పమని, బహుశా దాదాపు శూన్యమని తోస్తుంది. నిజానికి తాను ప్రత్యేకంగా శ్రీఉపాసనీ బాబా శిష్యుడనని మెహర్‌బాబా చెప్పినట్లు కనిపించదు.

శ్రీమెహర్‌బాబా తాము పంచ సద్గురువులు సాయిబాబా, బాబాజాన్, తాజుద్దీన్ బాబా, నారాయణ మహరాజ్, ఉపాసనీబాబాల తత్వానికి ప్రతీకగానే చెప్పుకునేవారు. ఈ అయిదుమంది సద్గురుమూర్తులలో మొదటి ముగ్గురు ఇస్లాం సాంప్రదాయంలో ప్రకటమైనవారే! అందువల్లే కాబోలు ఇస్లాంలోని సూఫీ సాంప్రదాయాన్ని ఆధునిక పరిస్థితులకు, భారతీయ సంస్కృతికి సమన్వయం చేసే ప్రయత్నం శ్రీమెహర్‌బాబా బోధనలలో మనకు కన్పిస్తుంది. శ్రీమెహర్‌బాబా కూడా "ప్రస్తుతం నాలో శ్రీసాయిబాబా తత్వమే అన్నింటికీ మించి ప్రధానంగా పనిచేస్తున్నది" అని అనేవారు. శ్రీసాయిబాబా, శ్రీఉపాసనీ మహరాజ్‌ల గూర్చి, "సాయిబాబా ఎంత గొప్పవాడో మనకెన్నటికీ అర్థంకాదు. మూర్తీభవించిన పరిపూర్ణతే ఆయన. ఆయన గురించి నాకు తెలిసినంతగా మీకూ తెలిసినట్లయితే, ఆయన ఈ సకల సృష్టికి సద్గురువని గ్రహిస్తారు! .... ఉపాసనీ మహరాజ్ కూడా ఎంత గొప్పవారంటే ఆయన అనుగ్రహం ప్రసరిస్తే ధూళి రేణువుకూడా దైవంగా మారిపోతుంది" అనేవారు శ్రీమెహర్‌బాబా. శ్రీమెహర్‌బాబా 1968 జనవరి 31వ తేది నిర్యాణం చెందారు.

## అన్ని అతివాదాలకు అతీతమైన ఆనందయోగం

ఇటు మితిమీరిన భోగలాలసత్వాన్నీ, అటు అలవిమాలిన ఆత్మహింసాకరమైన 'హఠ'యోగాన్నీ శ్రీసాయిబాబా ఆమోదించలేదు. అన్ని అతివాదాలకు అతీతమైన సమన్వయ సాధనను, మధ్యేమార్గాన్ని శ్రీసాయి ఉపదేశించారు. తమను కేవలం ఆనందస్వరూపంగా ధ్యానించమని ఆదేశించారు. జీవులను కష్టాల కడలి నుండి ఆనందపు అంచులకు చేర్చే అద్భుత నావ – శ్రీసాయినాథుడు. అర్థంలేని ఉపవాస తపవాసాలను శ్రీసాయి నిరసించారు. అనవసరంగా ఉపవాసాది వ్రతాలతో తమను

తాము హింసించుకొనే వారిని శ్రీసాయి **"వెర్రివాళ్ల"**నేవారు. అంతకాలం శిరిడీలో శ్రీసాయి సన్నిధిలో ఉన్నప్పటికీ శ్రీసాయికి సమ్మతంగాని తన 'మతాన్ని' పూర్తిగా వదులుకోలేకపోయాడు శ్రీఉపాసనీ!

సకోరిలో స్థిరపడ్డ తరువాత కూడా తాను అంతకుముందు శిరిడీలో అనుసరిస్తుండిన ఆత్మహింసాకరమైన తన 'తపోచర్యలకు' స్వస్తి పలకలేదు. హఠాత్తుగా ఒకరోజు ఒక వడ్రంగి పనిచేసే భక్తుణ్ణి రహస్యంగా పిలిచి, సుమారు 4x6 అడుగుల పరిమాణంలో ఒక చెక్కపంజరం (బోను) చేయించి, 1922 డిసెంబరు 24వ తేదీన అందులో తాను కూర్చొని ఆ పంజరాన్ని బిగింపజేసుకొన్నాడు. దర్శనానికొచ్చిన భక్తులు శ్రీఉపాసనీ తలుపు, ద్వారంలేని పంజరంలో అలా తనను తాను బంధించుకొని కనిపించేసరికి ఒక్కసారి నిశ్చేష్టులైనారు. అలా కాళ్ళు బాగా బార్లా చాపుకొని పడుకునేందుకు కూడా వీలులేని పంజరంలో బంధించుకొని తమకు తామై విధించుకొన్న ఆ కఠిన కారాగార శిక్షకు, పాదాలు తాకి నమస్కరించుకొనే వీలు లేనందుకు భక్తులు ఎంతో బాధపడ్డారు. అలా ఎందుకు చేసారని ప్రశ్నించిన వారికి సమాధానంగా తన పంజర బంధనంలోని పరమార్థాన్ని ఇలా వివరించారు శ్రీఉపాసనీ!...

"నేను మీకోసమే ఇలా నన్ను నేను బంధించుకొన్నాను. ఇది దైవసంకల్పం. భవిష్యత్తులో తననాశ్రయించే భక్తులకు ముక్తిని ప్రసాదించేందుకు, ఆ శ్రీకృష్ణపరమాత్మ తాను జన్మించడానికి ముందే కారాగారబద్ధుడైనాడు. సాధారణంగా చట్టప్రకారం కూడా ఒక నేరస్థుని విడుదల చెయ్యాలంటే అతనికి మరొకరు జామీను (హామీ) నిలబడాలి. అలాగే, నా భక్తుల కోసం నేను భగవంతుని న్యాయస్థానంలో ఇలా హామీగా నిలబడ్డాను. సతులు, సాధ్వులు, పతివ్రతలలాగే నేను కూడా జగత్కల్యాణార్థం కృషి చేస్తున్నాను. ఈ 'పింజరా'*[1] దర్శించువారి పాపాలు పరిహారమవుతాయి. ఈ 'పింజరా' ఆనందసాగరం. మరణించేముందు ఎవరైతే ఈ 'పింజరా'ను స్మరిస్తారో, వారు నిస్సంశయంగా, పరమపదాన్ని పొందుతారు".

అలా ఒక సంవత్సరం పైన గడిచింది. ఆ కాలంలో శ్రీఉపాసనీ భోజనం, నిద్ర, కాలకృత్యాలు అన్నీ ఆ చిన్న 'పింజరా'లోనే! తాము 'పింజరా'లో తనను తాను బంధించుకోవడానికి కారణంగా తానే ప్రకటించిన ప్రయోజనం ఎంతవరకు

---

*1 పంజరాన్ని మరాఠీలో 'పింజరా' అంటారు.

నెరవేరిందని శ్రీఉపాసనీ భావించారోగాని, 1924 జనవరిలో తన 'పింజరా'కు ఈశాన్యమూల ఒక తలుపు ద్వారం ఏర్పాటు చేయించి 'పింజరా' నుండి బయటకు వచ్చారు. అప్పటినుండి కొంతసేపు బయట, ఎక్కువసేపు 'పింజరా'లో గడిపేవారు. 'పింజరా'లో ఉన్నప్పుడు 'పింజరా' తలుపు తాళం వేయించి ఆ తాళం హైదరాబాదుకు చెందిన శ్రీరంగారావు అనే భక్తుని వద్ద ఉంచేవారు. శ్రీరంగారావును పరిచయస్థులంతా 'వకీల్ మామ' అని పిలిచేవారు. ఆయనే 1923-24 మధ్య కాలంలో శ్రీఉపాసనీ 'పింజరా'లో కూర్చుని చేసిన ప్రవచనాలను గ్రంథస్థం చేశారు. అవే మొదట 'సాయివాక్సుధ' అనే పేర శ్రీఉపాసనీ ప్రారంభించిన పత్రికలోనూ, తరువాత 'ఉపాసనీ వాక్సుధ' పేర అయిదు సంపుటాల గ్రంథంగానూ ప్రచురింపబడింది.

## ఉపాసనీ సతి గోదావరి మాతాజీ

సామాన్య సాంసారిక జీవితంలోలాగే ఆధ్యాత్మిక రంగంలో – ముఖ్యంగా ఆశ్రమాలలో – 'వారసుల' గూర్చిన వివాదాలు, ఉత్కంఠత, ఊహాగానాలు మెండు!

1922 వరకు శ్రీమెర్వాన్(మెహర్‌బాబా)నే శ్రీఉపాసనీ బాబా యొక్క సద్గురు పీఠానికి వారసుడని భావించారందరూ. కానీ, ఏ కారణం వల్లనో 1922లో సకోరి వదలివెళ్ళిన శ్రీమెర్వాన్ దాదాపు 20 సంవత్సరాల వరకు శ్రీఉపాసనీ దర్శనానికి కూడా సకోరి రాలేదు.

1924లో ప్రప్రథమంగా శ్రీఉపాసనీ దర్శనానికి వచ్చిన సుమారు పదేళ్ళ బాలిక శ్రీఉపాసనీకి కాబోయే వారసురాలని ఆనాడు ఎవ్వరూ ఊహించలేదు. ఆ బాలిక పేరు గోదావరి. స్వగ్రామం షేగాం! ప్రఖ్యాత సిద్ధపురుషుడు శ్రీగజానన్ మహరాజ్ అక్కడే నివసించి మహాసమాధి చెందారు. గోదావరి తాతగారైన భాస్కరరావు శ్రీగజానన్ మహరాజ్ భక్తుడు. శ్రీగజానన్ మహరాజ్ దేహత్యాగం చేయబోయేముందు తాను భాస్కరరావు వంశంలో జన్మించగలనని సూచించారట. శ్రీగజానన్ మహరాజ్ మహాసమాధి అయిన కొన్ని మాసాలకు 1914 డిశంబర్ 24వ తేదీన భాస్కరరావు కుమారుడైన వాసుదేవరావుకు ఒక కుమార్తె జన్మించింది. శ్రీగజానన్ మహరాజ్ తరచు 'గంగ-గోదా' అని అంటుండేవారు. అందువల్ల వాసుదేవరావు ఆ పుట్టిన బిడ్డకు 'గోదావరి' అని పేరు పెట్టారు. వాసుదేవరావు రైల్వేలో గుమాస్తాగా

పనిచేసేవారు. గోదావరికి 5 సం॥ల వయస్సప్పుడు ఆయనకు నాగపూరు బదిలీ అయింది. గోదావరి తల్లిదండ్రులు అప్పట్లో నాగపూరులో ప్రఖ్యాతులైన మోతీబాబా, జిమాదారా, జచ్చిల్‌పూర్‌కర్‌బాబా, సాయిమౌలా అనే మహాత్ములను సకుటుంబంగా దర్శించారు. నాగపూరులోని సకర్దారాలో నివసిస్తుండిన జచ్చిల్‌పూర్‌కర్ బాబా దర్శనానికి వెళ్ళినప్పుడు ఆయన గోదావరిని ఆశీర్వాదపూర్వకంగా నెత్తిమీద తట్టి ఒక పండు ప్రసాదంగా ఇచ్చారు. సాయిమౌలా దర్శనానికి వెళ్ళినప్పుడు ఆ మహాత్ముడు గోదావరిని దగ్గరగా పిలిచి తన మెడలో ఎవరో భక్తులు వేసిన పూలమాలను తీసి గోదావరి మెడలో వేసి, ఆమెకు పదవ ఏట వివాహం జరుగుతుందనీ, అయితే ఆమె అందరిలా సామాన్య గృహస్థ జీవితం గడపదనీ, ఒక గొప్ప మహాత్ముని సాంగత్యంవల్ల గొప్ప యోగినిగా ప్రఖ్యాతురాలవుతుందనీ పలికారు.

1924 ఫిబ్రవరిలో గోదావరి తన తల్లిదండ్రులతో కలసి శ్రీఉపాసనీ మహరాజ్ దర్శనార్థం సకోరి వెళ్ళింది. అప్పుడామెకు సుమారు పదేళ్ళ వయసు. గోదావరిని చూడగానే శ్రీఉపాసనీ ఎంతోకాలంగా ఆమె కోసమే ఎదురుచూస్తున్నవాడిలా ఎంతో ఆదరాభిమానాలు కనబరచారు. అప్పుడాయన తన 'పింజరా' బయట కూర్చొని ఉన్నారు. పూజ అయిన తర్వాత భక్తులందరూ వెళ్ళిపోయారు. కానీ శ్రీఉపాసనీ ప్రత్యేకంగా గోదావరిని తనవద్దనే ఉంచుకొని తాను భోజనం చేసే కంచంలోనే ఆమెను కూడా భుజింపజేశాడు. అలా నాలుగు రోజులు గడిచాయి. అయిదవరోజు తనకు నమస్కరించడానికి వచ్చిన గోదావరిని లేవనెత్తి తన తొడపై కూర్చుండబెట్టుకొని, అంతకుముందే ఎవరో భక్తులు తన మెడలో వేసిన పూలహారాన్ని తీసి గోదావరి మెడలో వేసి, అక్కడే ఉన్న దుర్గాబాయి కర్మార్కర్ వైపు అర్థవంతంగా చూస్తూ, "ఇక్కడి విషయాలంతా జాగ్రత్తగా గమనించుకో! ఇక ముందు ముందు ఇదంతా నీవే నిర్వహించాలి!" అన్నారు. శ్రీఉపాసనీ సూచనపై గోదావరిని సకోరిలోనే ఉంచడానికి అంగీకరించారు ఆమె తల్లిదండ్రులు.

## 'మాయాశక్తి' మహిమతో ముగ్ధుడైన యోగిమహరాజ్

అప్పటివరకు ఆశ్రమ వ్యవహారాలన్నీ సర్వాధికారిణిలా నిర్వహిస్తుండిన దుర్గాబాయి కర్మార్కర్‌కు, గోదావరి పట్ల శ్రీఉపాసనీ చూపించే ప్రత్యేక శ్రద్ధాభిమానాలు

మ్రింగుడుపడలేదు. చీటికిమాటికి గోదావరిని ఏదో మిషతో బాధించేది. ఆమె మీద శ్రీఉపాసనీకి ఏవో పితూరీలు చెప్పేది. ఆ మాటలు నమ్మి ఆయన ఒక్కోసారి గోదావరిని తీవ్రంగా తిట్టేవారు, కొట్టేవారు కూడా. శ్రీఉపాసనీ ఆగ్రహావేశాలకు తన మౌనసత్యాగ్రహంతో సమాధానమిచ్చేది గోదావరి. ఆ సమయానికి కోపావేశంలో గోదావరిని తిట్టేవాడేగానీ, తరువాత ఆమెతో మాట్లాడకుండా ఉండలేకపోయేవాడు శ్రీఉపాసనీ. ఆమె మౌనం ఆయనకు దుర్భరంగా తోచేది. మళ్ళీ ఆమె వద్దకు తానే పోయి ఏదో విధంగా అనునయించి, ప్రసన్నం చేసుకొని తిరిగి ఆమె తనతో మాట్లాడేటట్లు చేసుకొనేవాడు.

అలా సుమారు ఒక సంవత్సరం గడిచాక సకోరి ఆశ్రమంలోనే చిన్న హెూటలు నడుపుతుండిన శారదాబాయి అనే భక్తురాలి కుమారుడు విష్ణుపంత్ చందోర్కర్ అనే యువకుడితో స్వయంగా గోదావరికి వివాహం జరిపించారు శ్రీఉపాసనీ. విష్ణుపంత్ బొంబాయిలో చదువుకుంటుండేవాడు. ఏ కారణం వల్లనో విష్ణుపంత్ వివాహం జరిగిన వెంటనే గోదావరిని సకోరిలోనే వదలి తాను చదువుకోసం బొంబాయి వెళ్ళిపోయాడు. అప్పటినుండి గోదావరి సకోరిలోనే శ్రీఉపాసనీ సేవలో ఉండిపోయింది. వివాహం అయిందన్నమాటేగాని గోదావరీబాయి ఏనాడూ తన అత్తగారింట్లో ఉండేదికాదు. కనీసం అక్కడ భోజనం కూడా చేసేదికాదు. రోజులో ఎక్కువ భాగం శ్రీఉపాసనీ వద్దనే గడిపేది. ఆమె తీరు అత్తగారికి ఎంత మాత్రం నచ్చేది కాదు.

దుర్గాబాయికైతే ఆమె ఉనికే దుర్భరమైంది. గోదావరీబాయి పట్ల శ్రీఉపాసనీ చూపే ప్రత్యేక ప్రేమాభిమానాలు దుర్గాబాయిలో అసూయాద్వేషాలు రేకెత్తించాయి. ఏనాటికైనా గోదావరీబాయి అక్కడ తన స్థానానికి, అధికారానికి ముప్పని గ్రహించి, ఎలాగైనా ఆమెను అక్కడినుండి తరిమెయ్యడానికి యత్నించేది. ఆ రోజులలో తన అనుభవాలను గురించి చెబుతూ గోదావరీబాయి ఇలా అన్నారు: “అప్పుడు నా వయస్సు 13 లేక 14 సంవత్సరాలు. శ్రీవారి సన్నిధిలో నేను చేయగలిగిన సేవ నిష్ఠతో చేసేదాన్ని. కానీ, అదేం దురదృష్టమో నేను చేసే సేవ దుర్గాబాయి కర్మార్కర్‌కు నచ్చలేదు. మొదటినుండి ఆమె నన్ను నానారకాలుగా కష్టపెట్టేది. నన్ను కొట్టేది. పస్తులుంచేది. నా ఒక్కదాని చేత ఆశ్రమమంతా చిమ్మించేది. నా చేతులు గజ్జిలేచినా

నా చేతనే అంట్లు తోమించేది. ఎర్రటి ఎండలో కూలివాళ్ళతో బాటు నా చేతకూడా సున్నమురాళ్ళు మోయించేది... దుర్గాబాయి అలా తాను హింసించడమేగాక, ఇతర కన్యలతో కూడా కష్టాలు పెట్టించేది. నన్నెవరూ మంచిగా చూసేవారు కాదు... ఒక్క బాబావారు మాత్రమే నా పట్ల ప్రేమతో వర్తించేవారు. ఆయన ప్రేమమీద విశ్వాసంతో ఇతరులు ఎలా ప్రవర్తించినా నేను లెక్కపెట్టక దుర్గాబాయి పెట్టే బాధలన్నీ భరించాను. ఆమె వారాల తరబడి నాకు తిండి పెట్టేది కాదు. మంచినీటి చుక్క కూడా లభించకుండా చేసి యాతన పెట్టేది. ఇనుప చువ్వతో కొట్టేది. ఒకసారి తన చేతిలో ఉన్న చెట్లు కత్తిరించే కత్తెరతోనే నన్ను కొట్టింది. అలా రెండు మూడు ఏళ్ళు భయంకరమైన యమయాతనలు అనుభవించాను".

1927 సంవత్సరాంతంలో శ్రీఉపాసనీకి రక్తగ్రహణి వల్ల ఆరోగ్యం బాగా దెబ్బతిన్నది. వైద్యం కోసం ఆయన్ను నాసిక్ తీసుకెళ్ళారు. శ్రీఉపాసనీతో పాటు గోదావరీబాయి, బొంబాయికి చెందిన ప్రేమ అనే మరో బాలిక, హైదరాబాదుకు చెందిన సరస్వతీబాయి, మరో ఇద్దరు ముగ్గురు మహిళలు కూడా నాసిక్ వెళ్ళారు. దుర్గాబాయి సకోరీలోనే ఉండిపోయింది. రోజులు గడిచేకొద్దీ శ్రీఉపాసనీ ఆరోగ్యం ఇంకా ఇంకా క్షీణించసాగింది. ఇక ఆయన దేహత్యాగం చేస్తారేమోనని భక్తులు భావించారు. ఒకరోజు హఠాత్తుగా గోదావరి భర్త విష్ణుపంత్ బొంబాయి నుండి వచ్చి, విరక్తితో, తాను తన భార్యను (గోదావరిని) శ్రీఉపాసనీకి దానం చేయాలనుకుంటున్నానని చెప్పాడు. విష్ణుపంత్ నిర్ణయం గోదావరికి మహదానందం కల్గించింది. వివాహం జరిగిందన్న మాటేగానీ, వివాహమైన లగాయతు గోదావరీబాయి శ్రీఉపాసనీ వద్దనే ఉన్నది. విష్ణుపంత్ తాను గోదావరికి కట్టిన మంగళసూత్రాన్ని తీసివేసి ఆ క్షణంనుండి ఆమె తన భార్య కాదని, ఆమెను సంపూర్ణంగా శ్రీఉపాసనీకి అర్పించేస్తున్నాననీ ప్రకటించాడు. అంతటి పుణ్యకర్మను స్వీకరించే అర్హతగానీ, ఆ పుణ్యకర్మ ఫలాన్ని ప్రసాదించే సమర్థతగాని తనకు లేదనీ, అందువల్ల విష్ణుపంత్ తన భార్యను నాసిక్ (త్రయంబకేశ్వరం) క్షేత్రంలోని త్రయంబకేశ్వరుడికి సమర్పించడం సమంజసమనీ శ్రీఉపాసనీ సలహా ఇచ్చాడు. శ్రీఉపాసనీ సలహా ప్రకారం విష్ణుపంత్ మరికొంతమంది భక్తుల సమక్షంలో గోదావరీబాయిని త్రయంబక క్షేత్రంలో త్రయంబకేశ్వరుడికి తన భార్యను లాంఛనంగా దానంచేసి తన దారిన తాను బొంబాయి వెళ్ళిపోయాడు.

అయితే విష్ణుపంత్ వైరాగ్యం వివాహంపట్ల కాదు, అది తాను వివాహమాడిన గోదావరి పట్ల విరక్తే! ఎందుకంటే గోదావరిబాయితో తెగతెంపులు చేసుకొన్న కొద్దికాలానికే విష్ణుపంత్ మరో వివాహం చేసుకొన్నాడు. అప్పటికి గోదావరీబాయికి పదిహేనేళ్ళ వయస్సు.

ఆ తరువాత శ్రీఉపాసనీ వద్దనే ఉన్న ప్రేమ అనే పదకొండు సంవత్సరాల బాలిక తనను శ్రీఉపాసనీకి శాశ్వతంగా కన్యాదానం చేస్తే శ్రీఉపాసనీ ఆరోగ్యం బాగుపడుతుందని తనకొక దివ్యదర్శనం కలిగిందని, అందువల్ల తనను శ్రీఉపాసనీకిచ్చి కన్యాదానం చేయవలసిందనీ కోరుతూ బొంబాయిలో ఉన్న తన తల్లిదండ్రులకు ఒక ఉత్తరం వ్రాసింది. ప్రేమ తండ్రి శ్రీసుందర్రావు కుమార్తె ఉత్తరం చూడగానే హుటాహుటిన నాసిక్ వచ్చి శాస్త్రోక్తంగా తన కుమార్తెను శ్రీఉపాసనీకి కన్యాదానం చేశాడు.

శ్రీఉపాసనీ చరిత్రలో కన్యాదాన స్వీకారాధ్యాయం ఇక్కడ నుండి ప్రారంభమైంది.

## కన్యాకుమారి పదానికి ఉపాసనీ బాబా క్రొత్తభాష్యం

శ్రీఉపాసనీ ఆరోగ్యం రోజురోజుకు క్షీణించి ఆందోళనకరంగా పరిణమించడంతో భక్తులు శ్రీఉపాసనీచే వీలునామా వ్రాయించారు. ఆ వీలునామాలో శ్రీఉపాసనీ తన ఆశ్రమ ఆస్తిపాస్తులకంతటికీ గోదావరీబాయిని ఉత్తరాధికారిణిని చేశాడు. శ్రీఉపాసనీకి సమర్పించబడ్డ, ఇక సమర్పించబడబోయే 'కన్యల' తల్లిదండ్రులు తమ బిడ్డల గతి గురించి శ్రీఉపాసనీని ప్రశ్నించినప్పుడు ఆయన "నా తరువాత నా సర్వస్వానికి గోదావరియే యజమానురాలు. మిగిలిన వారందరూ ఆమె ఆజ్ఞానుసారం నడువవలసిందే. ఇందుకిష్టంలేని వాళ్ళు నిరభ్యంతరంగా ఇక్కణ్ణుంచి వెళ్ళిపోవచ్చు!" అని ఖరాఖండిగా చెప్పేశారు.

బహుశా శ్రీఉపాసనీ అభీష్టం, ఆయన వీలునామా, కన్యాదాన స్వీకారం మొదలయిన నూతన పరిణామాల దృష్ట్యా అప్పటివరకు సకోరీ ఆశ్రమాన్ని సర్వాధికారిణిలా నిర్వహించిన దుర్గాబాయి ఇక తానక్కడ కొనసాగడం పూలమ్మిన చోట కట్టెలమ్ముకోవడం వంటిదని గ్రహించి, ఇంకా శ్రీఉపాసనీ, ఆయన బృందం నాసిక్‌లో ఉండగానే, సకోరి విడిచి షోలాపూర్ వెళ్ళిపోయింది.

నెమ్మదిగా కొన్ని మాసాలకు శ్రీఉపాసనీ ఆరోగ్యం కోలుకోవడం మొదలైంది. ఇక ఆయన తిరిగి సకోరి వెళ్దామనుకుంటున్న సమయంలో హఠాత్తుగా గోదావరీబాయి న్యుమోనియాతో అస్వస్థురాలైంది. ఆమె త్వరగా స్వస్థురాలవాలనే ఆరాటంతో శ్రీఉపాసనీ ఆమె ఆరోగ్యం కోసం తిరుపతి వెంకటేశ్వరస్వామికి, హైదరాబాదు ప్రాంతానికి చెందిన పీరూసాహెబ్ అనే మహాత్మునికి ముడుపులు కట్టి, ఆ ఇరువురి పేర రెండు వెండి అందెలను చేయించి గోదావరి ఎడమకాలికి తొడిగి గోదావరీబాయి కోలుకోగానే ఆ ముడుపులు చెల్లించాడు. అయితే మళ్ళీ ముందు జాగ్రత్తగానో, మరేదో మ్రొక్కు మొక్కుకోనో మరో రెండు వెండి అందెలను ముడుపుగా చేయించి అలాగే మళ్ళీ గోదావరికి తొడిగాడు. శ్రీఉపాసనీ యొక్క ఈ చర్య చూచేందుకు చాలా చిన్నదిగా కనిపించినా, ఆ రోజులలో ఆయన మనోగతాన్ని పరిణతిని సూచించే సూచిక అని చెప్పొచ్చు. అసంఖ్యాకులకు కేవలం ఆశీర్వచన మాత్రంతో అత్యంత ప్రమాదకరమైన జబ్బులను చిటికెలో నయం చెయ్యగల మహాసిద్ధపురుషుడని, యోగీశ్వరుడని, సాక్షాత్ దైవస్వరూపుడని 'వందలాది' మందిచే నీరాజనాలందుకొంటున్న శ్రీఉపాసనీ తనకు ప్రేమాస్పదురాలైన వ్యక్తి ఆరోగ్యం కోసం ఒక సామాన్య ఆర్తునిలా దేవతలకు మ్రొక్కులు ముడుపులు చెల్లించడం గమనార్హం. అంతేకాదు, లోకోద్ధరణకు ఆవిర్భవించిన పుణ్యమూర్తి, సతీసాధ్వి, కన్యాకుమారి యోగినియైన గోదావరి, సచ్చిదానంద స్వరూపుడును, మహాయోగియైన శ్రీఉపాసనీ మహరాజు యొక్క మాయాశక్తి. ఈమె స్త్రీలోకానికి అఖండ సౌభాగ్యాన్నేగాక సర్వాభీష్టాలను సమకూర్చే మహాశక్తి అనే అర్థం వచ్చే కొన్ని శ్లోకాలను గోదావరీబాయిపై శ్రీఉపాసనీ రచించారు. శ్రీవిష్ణుమూర్తికి వైష్ణవి, ఈశ్వరునికి పార్వతి ఎలాగో, అలాగే గోదావరి తన యొక్క 'మాయాశక్తి', 'క్రియాశక్తి' అని చెప్పేవారు శ్రీఉపాసనీ.

1928 గురుపూర్ణిమకు కొంచెం ముందు సపరివారంగా తిరిగి సకోరి చేరాడు శ్రీఉపాసనీ. ఆ ఏడు గురుపూర్ణిమనాడు గోదావరిబాయిని తన కుడివైపు, ప్రేమబాయిని ఎడమవైపు 'పింజరా'లో చోటిచ్చి కూర్చొనబెట్టుకొన్నారు. శ్రీసాయిబాబా హస్తస్పర్శతో పునీతమైన ఒక రుద్రాక్షమాలను ఆరతి సమయంలో శ్రీఉపాసనీ మెడలో అలంకరించేవాడు శ్రీబాపూసాహెబ్ జోగ్. శ్రీఉపాసనీ ఆ రుద్రాక్షమాలను ఆ గురుపూర్ణిమ రోజున గోదావరిబాయి మెడలో వేసి ఆమెకు మంత్రదీక్షనిచ్చాడు.

ఆపైన అక్కడ సమావేశమైన భక్తులకు గోదావరిబాయి గొప్పతనాన్ని గూర్చి, మహాత్మ్యాన్ని గూర్చి ప్రస్తుతిస్తూ తన్మయంగా ప్రసంగించేవాడు శ్రీఉపాసనీ. "ఇక కొద్ది సంవత్సరాలలో ఈ గోదావరి మహిమలు ప్రకటమౌతాయి. లోకులు ఈమెను ఆదిశక్తిగా పూజిస్తారు. సాక్షాత్తు గంగ – గోదావరులు ఈమె రూపంలో అవతరించాయి. ఈమె దర్శనం మాత్రం చేతనే అనేక జన్మల పాపాలు క్షాళనమౌతాయి. మీరు నాకు నమస్కరించేముందు ఈ గోదావరికి నమస్కరించండి!" అని అనేవారు శ్రీఉపాసనీ. "అనేక జన్మార్జిత పాప సంక్షయో భవే భవత్పాద సరోజదర్శనాత్" అని 1911లో శ్రీసాయిబాబాను స్తుతించిన శ్రీఉపాసనీ 1928లో అదే భావంతో గోదావరిబాయిని ఉద్దేశించి స్తోత్రం చెయ్యడం గమనార్హం. గోదావరీబాయి గురించి తాను చేసే స్తోత్రపాఠాలవల్ల, భక్తులచే చేయించే పూజాదికాలవల్ల కూడా శ్రీఉపాసనీకి తృప్తి కలుగలేదేమో, ఒకనాటి మధ్యాహ్నం తానే స్వయంగా గోదావరిబాయిని పూజించి ఆరతి చేసి ఆమెకు 'కన్యాకుమారి' అని నామకరణం చేశాడు. సామాన్యంగా 'కన్య' 'కుమారి' అనే పదాలు 'అవివాహిత' 'అవివాహిత బాలిక' అనే అర్థంతో వాడబడుతాయి. 'కం' అంటే బ్రహ్మ, 'ని' 'నై' అంటే 'కొనిపోవునది' అంటే బ్రహ్మస్థితికి తీసుకొనిపోయేది 'కన్య' అనీ; కు–దుష్టత్వాన్ని, మారి = నశింపజేసేది, 'కుమారి' అని నిర్వచించి, 'కన్యాకుమారి' అనే పదానికి కొత్తభాష్యం చెప్పాడు. ఆ తరువాత శ్రీఉపాసనీ ఆశ్రమం "ఉపాసనీ కన్యాకుమారి స్థాన్"గా ప్రఖ్యాతమైంది. కన్యాకుమారియైన గోదావరీబాయి సద్గురు పీఠాన్నలంకరించి పాలించే స్థానమే 'కన్యాకుమారిస్థాన్'. అంతేకాదు సకోరిలో నిర్మింపబడిన దత్తమందిరంలో ప్రతిష్ఠించబడ్డ ఏకముఖ దత్తాత్రేయుని పాలరాతి విగ్రహాన్ని గోదావరిబాయి ముఖకవళికలతో స్వంత పర్యవేక్షణలో చెక్కించాడు శ్రీఉపాసనీ.

దీన్నిబట్టి గోదావరీబాయిపట్ల శ్రీఉపాసనీకున్న ఆరాధనాభావం ఎటువంటిదో, ఆమె అందరిచే దేవతా స్వరూపంగా పూజించబడాలని ఎంత ఆరాటపడ్డాడో స్పష్టమౌతుంది. కడకు గోదావరీబాయి పరంగా "మహాదేవ్యైచ విద్మహే కన్యాకుమారి ధీమహి! తన్నో గోదావరి ప్రచోదయాత్" అనే 'గాయత్రి'ని రచింపజేసి ఆమెను తన భక్తుల పాలిట 'ఉపాసనీదైవత'గా ప్రకాశింపజేయడంలో కృతకృత్యుడయ్యాడు శ్రీఉపాసనీ.

మొదట దాదాపు సమవయస్కులైన గోదావరి, ప్రేమలు ఇద్దరూ శ్రీఉపాసనీ గురుపీఠానికి కుడి ఎడమ భుజాలుగా ఉన్నారు. కానీ క్రమేణా గోదావరీబాయికి ఉపాసనీ హృదయపీఠంలోను, ఆయన గురుపీఠం మీద స్థానం పెరిగి, ప్రేమ క్రమేణా ఎడమైంది. 1928 తరువాత 2, 3 సంవత్సరాలలో గోదావరి, ప్రేమబాయిలు కాక భీమాబాయి, కమలాబాయి, రమాబాయి అనే ముగ్గురు బాలికలు శ్రీఉపాసనీకి కన్యాదానంగా సమర్పించబడ్డారు. వారిలో కమలాబాయి గోదావరీబాయి చెల్లెలు. కమలాబాయే కాకుండా గోదావరీబాయి మరో చెల్లెలు కుసుమాబాయి కూడా ఆ తర్వాత కన్య అయింది. గోదావరిబాయి తమ్ముడు – దత్తు ఐదేళ్ళ వయస్సులో మరణించగా ఆ బాలుడు యోగభ్రష్ఠుడని సంస్మరిస్తూ శ్రీఉపాసనీ ఆ కుఱ్ఱవానిని ఆశ్రమంలోనే భూగర్భ సమాధి చేశారు.

అన్ని సౌఖ్యాలకు దూరంగా ఉంటూ, కష్టాలను కోరి కౌగలించుకొనే శ్రీఉపాసనీ ఆత్మహింసాకరమైన స్వభావం గోదావరిబాయి ప్రభావం వల్ల ఎంతో మారింది. క్రమంగా సుఖమయ జీవితాన్ని ఆరంభించారు శ్రీఉపాసనీ. ఒక విధంగా గోదావరీబాయి ఆగమనం శ్రీఉపాసనీ జీవితంలో ఒక నూతనాధ్యాయానికి శ్రీకారం చుట్టిందనవచ్చు!

## సాయి వాక్కులెల్ల – కాబోవు ఎన్నటికి కల్ల!

శ్రీసాయి వాక్కు ఎన్నటికీ అసత్యం కాబోదు. *"ఇప్పుడెంత కష్టపడ్డా, ముందు ముందు అంత సుఖపడతావ్! విచారించకు. నీకు ఉజ్వలమైన భవిష్యత్తు ఉంది!"* అని శ్రీసాయిబాబా ఓదార్పుగా శ్రీఉపాసనీతో ఎన్నోసార్లు అనేవారు. బాబా భవిష్యద్వాణి సుమారు 1924 నుండి వాస్తవరూపం ధరించనారంభించింది. 1924–1934 మధ్యకాలం శ్రీఉపాసనీ జీవితంలో అత్యంత ఉచ్ఛదశ అని చెప్పవచ్చు. ఆ దశాబ్ది కాలంలో ఆయన వైభవం, కీర్తిప్రతిష్ఠలు నభోమండలంపై నర్తించాయి.

ఎందరో ఉన్నత రాజోద్యోగులు, రాజప్రముఖులు, సంపన్నులు, పండిత ప్రముఖులు శ్రీఉపాసనీకి భక్తితో పాదాక్రాంతులయ్యారు. వేలాదిమందిచే మహా సిద్ధపురుషునిగ, సాక్షాత్తు దైవస్వరూపునిగ నీరాజనాలందుకొన్నాడు. ఆయన జీవితం, బోధనలపై వివిధ భాషలలో ఎన్నో గ్రంథాలు వెలువడ్డాయి. స్థానిక వార్తాపత్రికలలో ఆయనను గురించిన వ్యాసాలు ఎన్నో ప్రచురితమయ్యాయి.

సకోరిలో శ్రీఉపాసనీ ఎన్నుకొని స్థిరపడ్డ స్మశానభూమి అనతికాలంలోనే సర్వాంగ సుందరమైన ఆశ్రమ ప్రాంగణంగా రూపుదిద్దుకొంది. శ్రీఉపాసనీ, కన్యలు, ఇతర అంతేవాసుల నివాసార్థం నిర్మింపబడ్డ భవన సముదాయమేగాక, ఒక పెద్ద దత్తాత్రేయ మందిరము, యజ్ఞ మంటపము, ధర్మశాల నిర్మాణమయ్యాయి. 1939లో శ్రీఉపాసనీ తల్లిగారు మరణించారు. ఆమెకు అంతిమఘడియలు సమీపిస్తున్నాయనగా, శ్రీఉపాసనీ తన తల్లికి స్వయంగా ఆతుర సన్యాసాన్నిచ్చాడు. వార్ధక్యం వల్లగాని, రోగగ్రస్తులవడం వల్లగానీ ఇక బ్రతుకుతాననే ఆశలేని వారు లాంఛనంగా తీసుకొనే సన్యాసాన్ని ఆతురసన్యాసము లేక అపత్సన్యాసము అంటారు. సామాన్యంగా సాంప్రదాయాన్ని ఛాందసంగా సమాదరించే శ్రీఉపాసనీ, ఈ విషయంలో మాత్రం ఆచారాన్ని కొంచెం అతిక్రమించడానికి వెనుకాడలేదు.

అలా ఇతరులకు ఆతుర సన్యాసదీక్షనివ్వడమనే ఆచారం శ్రీఉపాసనీ తన తల్లితోనే ఆరంభించలేదు. అంతకు మునుపు శ్రీబాపూసాహెబ్ జోగ్‌కు కూడా అలాగే ఆతుర సన్యాస దీక్షనిచ్చాడు. శ్రీసాయిబాబా మహాసమాధి అనంతరం బాపూసాహెబ్ జోగ్ శ్రీఉపాసనీని ఆశ్రయించి సకోరిలోనే స్థిరపడ్డ వైనం ఇంతకుముందే తెలుసుకొన్నాం. జోగ్ చాలాకాలంగా జీర్ణకోశానికి సంబంధించిన వ్యాధితో బాధపడుతూ ఉండేవాడు. 1926లో అతని ఆరోగ్యం మరీ క్షీణించింది. కొన్ని మాసాల పాటు భోజనం పూర్తిగా మానివేసి కేవలం వేడినీళ్ళు మాత్రం తీసుకొనేవాడు. దాంతో అతని ఆరోగ్యం యింకా క్షీణించి బాగా బలహీనమైనాడు. 1926 నవంబర్‌లో అతన్ని ఆతుర సన్యాసం తీసుకోమని సలహా ఇచ్చాడు శ్రీఉపాసనీ. జోగ్ అలాగే చేశాడు. ఆతుర సన్యాస స్వీకారం తరువాత ఒకటి రెండు మాసాలకు (అంటే 1926 డిసెంబరు తే.22 దిన) జోగ్ పరమపదించాడు. జోగ్‌ను కూడా ఆశ్రమ ప్రాంగణంలోనే సమాధిచేసి, ఆ సమాధికి నిత్యపూజాదికాలు జరిగేలా ఏర్పాటు చేశాడు శ్రీఉపాసనీ. శ్రీఉపాసనీకి నిత్య ఆరతి పూజాదికాలు ఆరంభించి శ్రీఉపాసనీని ఒక ఉపాస్యమూర్తిగా పాదుగొల్పడంలో ఒక పూజారిగా, పౌరాణికునిగా జోగ్ నిర్వహించిన పాత్ర స్వల్పమైనదేమీ కాదు.

ఉత్తమ విద్యాసంస్థలు నెలకొల్పడం, పేదలకు ఉచిత వైద్యవసతి కల్పించడం వంటి సామాన్య ప్రజోపకర కార్యాలపట్ల శ్రీఉపాసనీ ఏమాత్రం ఆసక్తి చూపేవాడు

కాదు. లౌకిక విద్యను బోధించే విద్యాలయాలను స్థాపించడమంటే ఆ విద్యను ప్రోత్సహించడమేనని నిష్కర్షగా చెప్పేవాడు. దేవాలయాలు నిర్మించడం, వివిధ ప్రదేశాలలో తన ఆశ్రమాలు నెలకొల్పడం వంటి కార్యక్రమాల కోసమే తన శక్తియుక్తులనంతా కేంద్రీకరించాడు శ్రీఉపాసనీ. సకోరిలో దత్తమందిరమేగాక, ఒక గణేశ ఆలయము, శనీశ్వరాలయము, ఖండోబా ఆలయము, లక్ష్మీ మందిరము కట్టించాడు. ఆ ఆలయాలలో సనాతన సాంప్రదాయానుసారం పూజార్చనలు జరిగేట్లు ఏర్పాటు చేశాడు. అంతేకాక శిరిడీలో ఉండగా తాను మకాము చేసిన ఖండోబా గుడికి మరమ్మత్తులు చేయించాడు. తన సద్గురుమూర్తియైన శ్రీసాయిబాబా పట్ల గౌరవసూచకంగానో, శ్రీసాయి జీవిత పర్యంతం నివసించిన మసీదుకు గురుతుగానో సకోరీలోని ఒక శిథిల మసీదుకు మరమత్తులు చేసి పునరుద్ధరించాడు. సకోరిలోనే కాకుండా శ్రీఉపాసనీ (వరుసగా) హైదరాబాదు, సతానా, సూరత్, ధర్మాపూరు, నాగపూరులలో కూడా తన ఆశ్రమాలు నెలకొల్పారు.

### కాంతా కనకాలు - కక్ష కార్పణ్యాలకు కారణభూతాలు

1924 – 34 మధ్యకాలం శ్రీఉపాసనీ జీవితంలో అత్యంత ఉచ్ఛదశ అని ముందు అనుకొన్నాం. అయితే ఆ తరువాత కూడా శ్రీఉపాసనీ వైభవానికేమీ లోటు రాలేదు. 1934 – 35 లలో శ్రీఉపాసనీకి వ్యతిరేకంగా పత్రికలలో, న్యాయస్థానాలలో పెద్ద ఎత్తున సాగిన ప్రచారము, వాదవివాదాల మూలంగా ఆయన ప్రతిష్ఠకు, యశస్సుకు మాత్రం పెద్ద విఘాతమే కలిగింది. ఈర్ష్యాఅసూయలను, శతృత్వాన్ని అయాచితంగా కొనితేవడంలో కాంతాకనకాలలో ఏ ఒక్కటైనా చాలని పెద్దలంటారు. మరి ఆ రెండింటినీ చేరదీసిన శ్రీఉపాసనీ వివాదగ్రస్తుడు కావడంలో పెద్ద విశేషం ఏముంది?

### వివాదాల వాన - వ్యాజ్యాలలో 'ఆన!'

సతారా జిల్లాలోని కిర్లోస్కర్‌వాడికి చెందిన శంకర్ వాసుదేవ్ కిర్లోస్కర్ అనే వ్యక్తి "కిర్లోస్కర్" అనే మరాఠీ మాసపత్రికను ప్రచురించేవాడు. ఆ పత్రిక 1934 ఫిబ్రవరి సంచికలో శ్రీఉపాసనీ మహరాజ్‌ను తీవ్రంగా విమర్శిస్తూ వ్రాసిన ఒక వ్యాసాన్ని ప్రచురించింది. శ్రీఉపాసనీకి వ్యతిరేకంగా సాగిన బహిరంగ వాదవివాదాలకు

ఆ వ్యాసం నాంది పలికింది. అదే చర్చను కొనసాగిస్తూ మరికొన్ని వ్యాసాలు 'కిర్లోస్కర్' 1934 మే, జూన్, ఆగష్టు సంచికలలో కూడా ప్రచురింపబడ్డాయి. ఆ వ్యాసాల రచయిత మీరజ్ (వాఘ్)కి చెందిన మహదేవ్ దివేకర్ శాస్త్రి. అతడు 'బ్రహ్మజ్ఞాన్ వా బాద్‌షాహి' ('బ్రహ్మజ్ఞానమా? రాజభోగమా?') అనే మరాఠీ గ్రంథాన్ని కూడా రచించాడు. 'కిర్లోస్కర్'లో ప్రచురింపబడ్డ తన వ్యాసాలను ఆ గ్రంథంలో పొందుపరచాడు. శ్రీఉపాసనీ తనకేవో అతీతశక్తులు, సిద్ధులు ఉన్నాయని భ్రమింపజేస్తూ మూఢభక్తులను మోసం చేస్తున్నాడనీ; అహర్నిశలు కామ సంబంధమైన అసభ్య సంభాషణలలోను, తనకర్పించబడ్డ కన్యలతో వ్యభిచరించడంలోనూ మునిగి తేలుతున్నాడనీ, పెద్ద మొత్తాలలో ప్రజల నుండి నిధులు వసూళ్ళుచేసి గుటకాయస్వాహా చేస్తున్నాడనీనూ – దివేకర్ శాస్త్రి ప్రధాన ఆరోపణలు. ఒక వ్యక్తిని అప్రదిష్ఠపాలు చేయడానికి ఎక్కడైనా సామాన్యంగా సంధింపబడే ఆరోపణాస్త్రాలే ఇవి. దివేకర్‌శాస్త్రి విమర్శక వ్యాసాల వెనుక శ్రీమతి దుర్గాబాయి కర్మార్కర్ అదృశ్యహస్తము, సహకారము ఉన్నాయని శ్రీఉపాసనీ భక్తకోటిలో కొందరు తలచారు. ఏది ఏమైనా, శ్రీఉపాసనీ కార్యకలాపాలపట్ల ఆనాటి సమాజంలోని ఒకవర్గంలో రాజుకుంటున్న తీవ్ర అసంతృప్తికి, వ్యతిరేకతకు 'కిర్లోస్కర్' వ్యాసాలు అద్దం పట్టాయని చెప్పవచ్చు. ఆ వ్యాసప్రచురణ లగాయతు ఒక సంవత్సర కాలంలో శ్రీఉపాసనీపై ఐదు కేసులు న్యాయస్థానాలలో పెట్టబడ్డాయి.

వాటిలో మొదటిది పరువునష్టం దావా. ఇది ఒక విచిత్రమైన కేసు. మనిషిలోని కపటప్రవృత్తికి, వంచనాశిల్పానికి, వ్యాజ్యస్వభావానికి ఇదొక మచ్చుతునక. కోపర్‌గాంకు చెందిన శివరాం విష్ణు భాంగ్రే అనే న్యాయవాది తానొక ఉపాసనీ బాబా భక్తుడననీ, 'కిర్లోస్కర్' వ్యాసాలు శ్రీఉపాసనీకి, ఆయన భక్తులకు ఎంతో అప్రతిష్ఠ కలిగించేవిగా ఉన్నాయని ఆరోపిస్తూ ఎస్.వి. కిర్లోస్కర్ పైన, దివేకర్ శాస్త్రి పైన 1934 ఆగష్టులో పరువునష్టం దావా వేశాడు. తన తరఫున ప్రధాన సాక్షులుగ శ్రీఉపాసనీ మహరాజ్‌ను, గోదావరీబాయిని పిటిషనరు పేర్కొన్నాడు. ఇక్కడ తమాషా ఏమిటంటే ఆ దావా వేసిన భాంగ్రే నిజానికి శ్రీఉపాసనీ భక్తుడే కాదు; అతడు శ్రీఉపాసనీ ప్రతికక్షి వర్గానికి చెందిన వ్యక్తి! శ్రీఉపాసనీని, గోదావరిబాయిని ఎలాగైనా రచ్చకీడ్చి కోర్టులో బోనెక్కించాలన్నదే ఆ దావా వెనుకున్న పరమార్థం. భాంగ్రే వర్గంవారు ఆశించిన విధంగానే కేసు ప్రధాన సాక్షులుగా కోర్టుకు హాజరు కమ్మని శ్రీఉపాసనీకి,

గోదావరిబాయికి సమన్లు అందాయి. పిటీషనరైన భాంగ్రే తన భక్తుడుగానీ, శిష్యుడు గానీ కాదనీ, అసలు అతనికి తనకు ఎటువంటి సంబంధమూ లేదనీ, తానొక సర్వసంగ పరిత్యాగిననీ, అందువల్ల తాను కోర్టుకు హాజరు కాకుండా ఉండేందుకు అనుమతించవలసినదనీ శ్రీఉపాసనీ కోర్టువారిని అభ్యర్థించాడు. కానీ, కోర్టు ఆ అభ్యర్థనను మన్నించలేదు. కడకు 1934 నవంబరులో శ్రీఉపాసనీ, గోదావరిబాయి అహ్మద్‌నగర్ న్యాయస్థానంలో సాక్షి వాఙ్మూలం ఇవ్వవలసే వచ్చింది. ప్రతికక్షి ప్లీడరు వేసిన పరిప్రశ్నలకు ('క్రాస్ ఎక్సామినేషన్'కు) సమాధానాలు చెప్పవలసే వచ్చింది. అలా ప్రత్యర్థుల పన్నాగం నెరవేరింది. వారు తమ ఆశయం నెరవేరగానే 'రాజీ' మిషతో కేసు ఉపసంహరించుకొన్నారు.

### జసే అసేల్ తసే!

అదే యేడు సెప్టెంబరులో ఉకల్‌గాంకు చెందిన వి.ఎల్. జగ్‌తప్ అనే రైతు శ్రీఉపాసనీపై ఒక కేసు పెట్టాడు. తాను శ్రీఉపాసనీ దర్శనార్థం సకోరి వెళ్ళి, ఆయనకొక టెంకాయ సమర్పించగా, ఆయన ఆ టెంకాయను తీసికొని తనపై విసిరాడనీ, అది తగిలి తన తలకు పెద్ద గాయమైనదనీ ఫిర్యాది ఆరోపణ. అయితే, ఆ కేసు విచారణకొచ్చిన సమయానికి ఫిర్యాది కోర్టుకు గైర్హాజరు కావడంతో కేసు కొట్టివేయబడింది.

ఇక మూడవ కేసు, 1927లో శ్రీఉపాసనీ మహరాజ్ తరఫున అప్పట్లో ఉపాసనీ సంస్థానానికి మేనేజర్‌గా వ్యవహరిస్తుండిన రఘునాథ్ కర్మార్కర్ తన వద్ద ప్రామిసరీ నోటుపై రూ.50,000/- ఋణంగా తీసుకున్నాడనీ, ఆ అప్పు తనకు చెల్లింపబడనందున ఆ మొత్తాన్ని తిరిగి ఇప్పించి, న్యాయం చేయవలసిందని కోరుతూ జి.ఎస్.రావటే అనే వ్యక్తి బొంబాయి కోర్టులో ఒక దావా వేశాడు. రఘునాథ్ కర్మార్కర్ 1928 వరకు సకోరిలో శ్రీఉపాసనీ సంస్థానానికి సర్వాధికారిణిలా వ్యవహరించిన శ్రీమతి దుర్గాబాయి కర్మార్కర్ కుమారుడు. శ్రీఉపాసనీ ఒక లిఖిత వాఙ్మూలంలో, రఘునాథ్ ఏనాడూ తన ప్రతినిధిగాగానీ, తన సంస్థానం మేనేజరుగాగానీ వ్యవహరించలేదనీ, అసలు తనకు ఫిర్యాది పేర్కొన్న ఋణం విషయంగానీ, సదరు ప్రామిసరీ నోటు సంగతిగానీ ఎంతమాత్రం తెలియదనీ కోర్టుకు విన్నవించుకున్నాడు.

రఘునాథ్ కూడా విచారణ సమయంలో కోర్టుకు హాజరుకాలేదు. ఆ తరువాత, ఏ కారణం చేతనో, ఫిర్యాది కేసును తనకై తానే ఉపసంహరించుకొన్నాడు.

1934 నవంబరులో బొంబాయి దేవదాసి చట్టం అమలులోకి వచ్చింది. శ్రీఉపాసనీ ఇద్దరు బాలికలను శ్రీకృష్ణుని విగ్రహంతో 1935 మే మాసంలో వివాహం జరిపించాడనీ, తద్వారా ఆయన బొంబాయి దేవదాసి రక్షణ చట్టాన్ని ఉల్లంఘించాడనీ ఆరోపిస్తూ కోపర్‌గాంకి చెందిన కె. హెచ్. దేశ్‌ముఖ్ అనే న్యాయవాది ఒక కేసు వేశాడు. ఆ కేసును విచారించిన మేజిస్ట్రేటు నిందితుని (శ్రీఉపాసనీ)పై చేయబడ్డ ఆరోపణ వాస్తవమేనని విశ్వసిస్తూ శ్రీఉపాసనీ చర్య – ఆయన మత విశ్వాసానికి సంబంధించినదే అయినా – చట్ట ఉల్లంఘన క్రిందకే వస్తుందని నిర్ణయించి శ్రీఉపాసనీకి రూ. 100/– జరిమానా శిక్ష విధిస్తూ తీర్పుచెప్పాడు. దానిపై శ్రీఉపాసనీ అహ్మద్‌నగర్ సెషన్సు కోర్టుకు అప్పీలు చేసుకొన్నాడు. కేసు విచారణలో సకోరీ ఆశ్రమంలోని కన్యలు – క్రింది కోర్టులో చెప్పినట్లుగానే – తమను శ్రీఉపాసనీయే స్వయంగా వివాహం చేసుకున్నారనీ, తమకు శ్రీకృష్ణుని విగ్రహంతో వివాహం జరుగలేదనీ 'ప్రమాణ పూర్వకంగా' కోర్టులో వాంగ్మూలమిచ్చారు. శ్రీఉపాసనీ కూడా తన వాంగ్మూలంలో అదే విషయం పునరుద్ఘాటించారు. కన్యలకు దేవతా విగ్రహానికి వివాహం జరిగిందన్న ఆరోపణకు తగిన ఆధారాలు సాక్ష్యాధారాలు ప్రాసిక్యూషన్ వారు చూపలేకపోయినందువల్ల సెషన్సు జడ్జి ఆ కేసు కొట్టివేస్తూ తీర్పునిచ్చాడు. ఇది శ్రీఉపాసనీ ఎదుర్కొన్న నాల్గవ వ్యాజ్యం.

ఇక ఆఖరిదైన ఐదవ కేసు శ్రీఉపాసనీపై హత్యానేరారోపణ! శ్రీఉపాసనీ 1935 సెప్టెంబరు మాసంలో ఒక యజ్ఞం నిర్వహించాడు. అది శ్రీఉపాసనీ సకోరీలో నిర్వహించిన మొట్టమొదటి యజ్ఞం. భారీ ఎత్తున జరిగిన ఆ యజ్ఞ నిర్వహణకోసం నిధులు సమకూర్చుకొనడానికి ఒక సంపన్న కుటుంబానికి చెందిన వ్యక్తిని శ్రీఉపాసనీ హత్యచేసి (చేయించి), శవాన్ని యజ్ఞమంటపం సమీపంలోనే పూడ్చిపెట్టారనీ – సకోరీ గ్రామానికే చెందిన రాజునాగు కోలీ అనే వ్యక్తి కోపర్‌గాం మేజిస్ట్రేటుకు ఒక ఫిర్యాదు చేశాడు. ఆ ఫిర్యాదును పురస్కరించుకొని రహతా పోలీసు సబ్–ఇన్‌స్పెక్టరు, కోపర్‌గాం మమ్లత్‌దారు హఠాత్తుగావచ్చి శ్రీఉపాసనీ ఆశ్రమాన్ని తనిఖీ చేశారు. ఆ సమయంలో ఇంకా యజ్ఞం కొనసాగుతున్నది. పోలీసులు ఆశ్రమ ప్రాంగణములో

చాలా జాగాలలో త్రవ్విచూచారు. ఏమీ కనిపించలేదు. వారు అక్కడే ఒక పంచనామా నిర్వహించి ఏ విధమైన సాక్ష్యాధారాలు లభించకపోవడంచేత తమకొచ్చిన ఫిర్యాదు బూటకమైనదిగా నిర్ణయించి కేసు కొట్టేశారు.

ఎన్నిరకాల వ్యాజ్యాలు వాద వివాదాలు విమర్శలు తనపై జడివానలా వర్షిస్తున్నా, శ్రీఉపాసనీ మాత్రం కించిత్తు కూడా చలించలేదు. తన పంథా మార్చుకోవడంగానీ, తాను చేపట్టదలచిన కార్యాలు – తాత్కాలికంగానైనా – నిలుపుదల చెయ్యడంగానీ చెయ్యలేదు. "జసే అసేల్‌తసే" ('ఉన్నదున్నట్లు ఉండనీ', 'జరిగేది జరుగనీ!') అనేది ఆయన మహామంత్రం. ఎవరేమంటున్నా, ఏమనుకుంటున్నా కన్యలను స్వీకరించడం మాత్రం మానలేదు. ఒక విధంగా చెప్పాలంటే కన్యాస్వీకారం పోనుపోను ఇంకా ముమ్మరమైందనే చెప్పాలి. అయితే, 1935లో ఈ విషయంగా జరిగిన కోర్టు కేసు తరువాత, తనకు సమర్పించబడ్డ కన్యలను శ్రీకృష్ణ విగ్రహంతో వివాహం జరిపించే బదులు, తానే ఆ కన్యలను బ్రహ్మ వివాహవిధిన స్వయంగా వివాహం చేసుకోసాగాడు. వివాహ సమయంలో మాత్రం లాంఛనంగా శ్రీకృష్ణ విగ్రహాన్ని తన ఒడిలో ఉంచుకొనేవాడు. అలా శ్రీఉపాసనీ మొత్తంమీద పాతికమంది కన్యలను వివాహమాడాడు. అయితే, వారిలో (మొట్టమొదట శ్రీఉపాసనీకి సమర్పించబడ్డ 'పంచ కన్యల'లో వారైన) సతిప్రేమ, సతిరమ– సుమారు 1934–35లలో తమ 'కన్యా జీవితాన్ని' పరిత్యజించి, సకోరి విడచి, మామూలుగా వివాహం చేసుకొని సామాన్య సాంసారిక జీవితాన్ని స్వీకరించారు. కానీ, చిత్రమేమంటే, కొన్నేళ్ళ తరువాత దురదృష్టవశాత్తూ, రమాబాయికి మరణము, ప్రేమాబాయికి వైధవ్యము ప్రాప్తించాయి.

## సూర్యయాగ దీక్షలో శ్రీఉపాసనీ స్త్రీ వేషధారణ!

1935లో శ్రీఉపాసనీ నిర్వహించిన మొదటి యజ్ఞం వేదపండితుల ఆధ్వర్యంలోనే జరిపించబడింది. అయితే, తాను నిర్వహించే యజ్ఞయాగాలు మామూలు పద్ధతిలో వేదపండితులచే కాకుండా కన్యల చేతనే జరిపించాలన్నది శ్రీఉపాసనీ ఆశయం. ఆ ఆశయంతో స్థానికుడైన ఒక శాస్త్రిగారి అధ్యాపకత్వంలో కన్యలకు వేదపఠనంలో తర్ఫీదునిప్పించాడు. రెండు మూడేళ్ళలో వాళ్ళు సుస్వరంతో వేదపఠనం చేయడం నేర్చుకొన్నారు. 1938 నుండి సకోరీలో జరిగే యజ్ఞయాగాలు,

వ్రతాలు కన్యలే చేయడం ఆరంభమైంది. ఆశ్రమ కార్యక్రమావళిలో భాగంగా సంవత్సరానికి ఏడు యజ్ఞాలు జరుపబడుతాయి. ఈ యజ్ఞయాగాల నిర్వహణ కోసం 1938లోనే శాశ్వతంగా ఒక పెద్ద యజ్ఞ మంటపం కూడా నిర్మింపబడింది. శ్రీఉపాసనీ సకోరీలోనే కాకుండా 1939లో సూరత్‌లో కూడా కన్యల ఆధ్వర్యంలో ఒక యజ్ఞం నిర్వహించాడు. వైదికాచారం ప్రకారం స్త్రీ, శూద్రులకు వేదాధికారం లేదు. అటువంటిది, సకోరీ ఆశ్రమ కన్యలు వేదమంత్రపఠనం చేస్తూ, యజ్ఞయాగాదులు నిర్వహించడం ఆ రోజుల్లో పెద్ద సంచలనం సృష్టించింది. అయితే కన్యలు ఆధ్వర్యం వహించే ఆ యజ్ఞయాగాదులు పురాణోక్తాలేగానీ, వేదోక్తవిధిన జరుపబడవు.

1941 సంక్రాంతికి శ్రీఉపాసనీ సకోరీలో ఒక సూర్యయాగం నిర్వహించాడు. కన్యల ఆధ్వర్యంలో ఆ యాగం ఎంతో భారీ ఎత్తున జరిగింది. శ్రీఉపాసనీ కూడా స్త్రీ వలె దుస్తులు ధరించి కన్యలతో బాటు కూర్చుని ఆ యాగం జరిపించాడు. ఆదిశక్తి లేక ఆది మాయ యొక్క తత్త్వానికి తన స్త్రీ వేషం సంకేతమని భక్తులకు వివరించాడు. శ్రీఉపాసనీ అలా స్త్రీ వేషధారణలో ఉండగా ఒక ఫోటో కూడా తీయడం జరిగింది.

సూర్యయాగం సమాప్తమైన తరువాత శ్రీఉపాసనీ సతానా, సూరత్, నాగపూరు, పూనా, షోలాపూరు, హైదరాబాదు మొదలైన ప్రదేశాలు ముమ్మరంగా పర్యటించాడు. తన స్వగ్రామమైన సతానాలో ఒక చక్కటి దేవాలయం నిర్మించాలన్నది శ్రీఉపాసనీ చిరకాలవాంఛ. ఆ వాంఛాసిద్ధికి తన వ్యక్తిగత పర్యవేక్షణలో సతానాలో ఆలయ నిర్మాణాన్ని ఆరంభించాడు. ఆ మిషపై తరచు స్వగ్రామం సందర్శిస్తుండేవాడు.

1941లో సూర్యయాగం తరువాత శ్రీఉపాసనీ ధోరణిలోను, ప్రవర్తనలోనూ ఏదో మార్పు కొట్టొచ్చినట్టు కనబడేది. శీఘ్రంగా తన పనులన్నీ చుట్టబెట్టేసేయాలనే ఆతృత, వానికి వ్యవధి చాలదేమోననే తొందర శ్రీఉపాసనీ చర్యలలో తొంగిచూసేవి. 1941 ఏప్రిల్ నుండి త్వరలో ఇక దేహత్యాగం చేయబోతామని తరచూ తన భక్తులకు పరోక్షంగా సూచించసాగాడు.

అదే సంవత్సరం అక్టోబరు నెలలో శ్రీఉపాసనీ తన తుది వీలునామాపై సంతకం చేశాడు. ఆ వీలునామా ప్రకారం తన సంస్థానం ఆస్తిపాస్తుల నిర్వహణార్థం అప్పటివరకు తన కర్పింపబడిన ఇరవైనాలుగు మంది కన్యలతో ఒక ట్రస్టును ఏర్పాటుచేసి, దానికి సతి గోదావరిబాయిని ప్రధాన ట్రస్టీగా నియమించాడు. తన

ఏకైక వారసురాలిగా సతి గోదావరిబాయిని పేర్కొంటూ, తన తదనంతరం కన్యలను శిష్యులను స్వీకరించి ఉపదేశమిచ్చే అధికారం ఆమెకొక్కదానికే ఉన్నదని స్పష్టం చేశాడు. ఈ విషయంగా ముందు ముందు ఎటువంటి వివాదానికి తావులేకుండా, "పురుషులలో కానీ, స్త్రీలలో కానీ సతి గోదావరి తప్ప ఇతరులనెవ్వరినీ నేను శిష్యునిగా పరిగ్రహింపలేదు" అని అత్యంత ఖండితంగా తన వీలునామాలో వ్రాశాడు శ్రీఉపాసనీ.

డిసెంబరు రెండవవారంలో హైదరాబాదు పర్యటన ముగించుకొని, పూనా వెళ్ళాడు శ్రీఉపాసనీ. పూనాలో ఉండగా అక్కడికి సమీపంలో ఉన్న అలందీ క్షేత్రం దర్శించాడు. అలందీలో శ్రీజ్ఞానేశ్వర్ మహరాజ్ జీవసమాధి ఉన్నది. శ్రీజ్ఞానదేవుని సమాధికి సాష్టాంగ నమస్కారం చేస్తూ ఒక అరగంటసేపు అలానే ఉండిపోయాడు శ్రీఉపాసనీ. అలందీ సందర్శనం తరువాత ఆయన ధోరణి మరీ వింతగా మారింది. తన పాదాలకు నమస్కరించేందుకు ఎవరినీ అనుమతించేవాడు కాదు. ఒక కొబ్బరికాయను తమ ముందుంచి అందరినీ ఆ టెంకాయకు నమస్కారం చేసుకోమని చెప్పేవాడు.

## జీవితమనే జపమాలకు ఎన్ని పూసలు?

శ్రీఉపాసనీ పూనాలో ఉన్న రోజుల్లోనే ప్రఖ్యాత సిద్ధపురుషుడైన శ్రీనారాయణ మహరాజ్ (ఖేడ్‌గాం) పూనా సందర్శించడం తటస్థించింది. శ్రీఉపాసనీతోను, శ్రీనారాయణ మహరాజ్‌తోను కూడా సాన్నిహిత్యం గల కృష్ణంభట్‌జీ అనే భక్తుడు ఆ ఇద్దరి మహాత్ముల సమావేశం ఏర్పాటుచేస్తే దివ్యంగా ఉంటుందని తలచాడు. అదీగాక, శ్రీఉపాసనీ ఎన్నో ఏళ్ళ క్రితం – శిరిడీలో శ్రీసాయిబాబాను దర్శించక మునుపే – ఖేడ్‌గాంలో శ్రీనారాయణ మహరాజ్ దర్శనం చేసుకొని ఆయన ఆశీస్సులు పొంది ఉన్నాడు. అందువల్ల శ్రీనారాయణ మహరాజ్‌ను దర్శించేందుకు శ్రీఉపాసనీ ఎంతో ఉత్సాహంతో వెంటనే బయలుదేరుతారని భక్తులు భావించారు. కానీ, వారి అంచనా తల్లక్రిందులైంది. కృష్ణంభట్ తన సంకల్పం నివేదించగానే శ్రీఉపాసనీ "ఆయనెంతో గొప్పవాడు; నేను చాలా చిన్నవాణ్ణి. ఆయనకు నా నమస్కారాలందజేయండి చాలు!" అంటూ శ్రీనారాయణ మహరాజ్‌ను దర్శించేందుకు నిష్కర్షగా నిరాకరించాడు. శ్రీఉపాసనీ నమస్కారాలు అందజేయడానికి కృష్ణంభట్ వెంటనే శ్రీనారాయణ మహరాజ్

విడిదికి వెళ్ళాడు. కానీ, శ్రీనారాయణ మహరాజ్ అంతకు కొద్దిసేపు క్రితమే పూనా విడిచి ఖేడ్‌గాం వెళ్ళిపోయినట్లు తెలిసింది. కృష్ణంజీ వెంటనే బయలుదేరి ఖేడ్‌గాం వెళ్ళి, అక్కడ శ్రీఉపాసనీ నమస్కార సందేశాన్ని – తన బాధ్యతగా – శ్రీనారాయణ మహరాజ్‌కు తెలిపాడు. శ్రీనారాయణ మహరాజ్ చిరునవ్వుతో, "నమస్కారాలు స్వీకరించడం జరిగిందని ఆయనతో చెప్పండి!" అన్నారు.

శ్రీఉపాసనీ చాలా రోజులుగా భోజనం చెయ్యడం పూర్తిగా మానివేసి, కేవలం కాఫీ మాత్రమే తీసుకోనారంభించాడు. కఠిన ఉపవాసాలవల్ల శ్రీఉపాసనీ దేహం బాగా బలహీనమైనది. డిసెంబరు 20, 21 తేదీలలో ఛాతీ నొప్పితో బాధపడుతూ కూడా మామూలుగా భక్తులకు దర్శనమిచ్చాడు. 22వ తేదీ మధ్యాహ్నం బయలుదేరి – నెలాఖరుకు తిరిగి సకోరీ తిరిగి రాగలనని ఆశ్రమంలో చెప్పి – తన స్వగ్రామమైన సతానా వెళ్ళాడు. అక్కడ ఆయన తలపెట్టిన ఆలయ నిర్మాణం దాదాపు పూర్తి కావస్తున్నది. ఆ ఆలయంలో పన్నెండు జ్యోతిర్లింగాలను తన స్వహస్తాలతో ఆయా స్థానాలలో ప్రతిష్ఠించి తన పని పూర్తయినట్లు నిట్టూర్పు విడిచాడు. అంతేకాదు! ప్రతిష్ఠ కార్యక్రమం పూర్తికాగానే, "నా పని పూర్తయింది. మిగిలింది మీరే చూసుకోవాలి!" అంటూ, ప్రతిష్ఠించిన లింగాల ముందు చాలాసేపు నేలపై దొర్లుతూ ఉండిపోయాడు. అయితే ఆనాటి రాత్రి ఆయన తీవ్ర అస్వస్థతకు గురవడంతో, మరుసటిరోజు నాసిక్ వెళ్ళాల్సిన తన కార్యక్రమాన్ని రద్దు చేసుకొని, సాయంత్రం 7 గంటలకల్లా తిరిగి సకోరీ చేరుకున్నాడు. ఛాతీనొప్పి ఎక్కువగా ఉండటంతో మామూలు ప్రకారం భక్తులకు దర్శనం కూడా ఇవ్వకుండా సరాసరి లోనికి వెళ్ళి పడుకున్నాడు. స్థానిక డాక్టర్‌ను కూడా పిలిపించారు. కానీ, ఆంతరంగిక భక్తులు చిట్కావైద్యంగా చేసిన ఆవాలపట్టీ వైద్యం తప్ప ఇతర ఏ ఔషధం తీసుకోవడానికి నిరాకరించాడు. అర్ధరాత్రి దాటిందాకా కన్యలకు ఏవో సలహాలిస్తూ ఉన్నాడు. తెల్లవారుఝామున తన ప్రక్కనున్న భక్తులతో "ఏమీ గాభరాపడవద్దు! ఇంకో అరగంటలో అంతా సర్దుకుంటుంది" అంటూ, కాళ్ళు బాగా బారచాపుకొని విశ్రాంతిగా పడుకున్నాడు. ఒకటి రెండు గంటల తరువాత శ్రీఉపాసనీలో ఏ విధమైన చలనం లేకపోవడం భక్తులు గమనించి, పరీక్షించగా అప్పటికే ఆయన దేహత్యాగం చేసినట్లు తేలింది. కోపర్‌గాం నుండి డాక్టరు వచ్చి చూచి ఆ విషయం నిర్ధారణ చేశాడు.

మరుసటిరోజు – అంటే క్రిస్మస్, గురువారం నాడు – శ్రీఉపాసనీ భౌతికకాయాన్ని ఆయన 'పింజరా' ముందు ఉత్తర దక్షిణాలుగ పరుండబెట్టి, సశాస్త్రీయంగా సమాధి చేశారు. శ్రీఉపాసనీ సజీవులై ఉన్నప్పుడే ఆయన పాలరాతి విగ్రహం ఒకటి చెక్కించ బడింది. ఆ విగ్రహాన్ని 1942 సంక్రాంతి నాడు – అంటే శ్రీఉపాసనీ దేహత్యాగం చేసిన తరువాత సుమారు ఇరవై రోజులకు – సతి గోదావరిబాయి చేతుల మీదుగా 'పింజరా'లో ప్రతిష్ఠించడం జరిగింది. సమాధి వద్ద ఒక జత పాదుకలు కూడా ప్రతిష్ఠించబడ్డాయి. సమాధి చుట్టూ ఒక చలువరాతి ఆవరణను నిర్మించారు. సమాధిని, పాదుకలను తాకడానికిగానీ, పూజ అభిషేకాదులు చెయ్యడానికిగానీ కన్యలకు తప్ప ఇతరులెవ్వరికీ అధికారము, అనుమతి లేదు. ఇతర భక్తులు సమాధి ఆవరణ బయట ప్రతిష్ఠించబడిన మరో జత పాలరాతి పాదుకలకు మాత్రమే నమస్కారం చేసుకోగల వీలుంది.

ఈ సందర్భంగా ఒక ఆసక్తికరమైన విషయాన్ని ముచ్చటించుకోవడం అసంగతం కాదేమో! శ్రీమతి సరస్వతీబాయి సక్సేనా హైదరాబాదుకు చెందిన రాజా నర్సింగ్ బహద్దుర్‌గారి మేనకోడలు; బాల్యవితంతువు; ఎంతో సంపన్నురాలు; శ్రీఉపాసనీకి అత్యంత ఆంతరంగిక భక్తురాలు. సకోరీ ఆశ్రమసేవకు తన జీవితాన్ని అంకితం చేసుకొన్న ఈమెను అందరూ ఆప్యాయంగా 'జీజీ' అని పిలిచేవారు. 1928లో రాజా నర్సింగ్ బహద్దుర్ హైదరాబాదు నగరానికి వెలుపల ఒక గుట్ట ప్రదేశాన్ని శ్రీఉపాసనీకి ధారాదత్తం చేశారు. ఏకాంతానికి ఎంతో అనుకూలమైన ఆ ప్రదేశమంటే శ్రీఉపాసనీకి ఎంతో ప్రీతి. ఆ గుట్టమీద శ్రీసాయిబాబా గుప్తపాదుకలున్నాయని భక్తులతో అనేవారు ఆయన. శ్రీఉపాసనీ దాదాపు ప్రతి సంవత్సరము హైదరాబాదు సందర్శించేవారు. ఆ గుట్టమీద ఒక మందిరము కొన్ని విశ్రాంతిగదులు నిర్మించారు. దాన్ని 'ఉపాసనీ టేకిడీ' అంటారు. ఈ 'ఉపాసనీ టేకిడీ' ప్రధానంగా జీజీ యొక్క కృషిఫలితమే. సుమారు 1930 ప్రాంతంలో ఒకసారి హైదరాబాదు వెళ్ళినపుడు ముడులు వేసి ఉన్న ఒక దారాన్ని జీజీకి కానుకగా ఇచ్చాడు శ్రీఉపాసనీ. అదేమిటని జీజీ అడిగితే, అది తాను ఉపయోగించే 'జపమాల' అని జవాబిచ్చాడు. ఆ మాలను జీజీ ఒక భరిణెలో పెట్టి భద్రంగా తన పూజలో ఉంచుకొన్నది. శ్రీఉపాసనీ దేహత్యాగం చేసిన చాలాకాలం తరువాత ఒకరోజు మరో భక్తునికి యథాలాపంగా ఆ మాలను చూపింది. అతడూ యథాలాపంగా ఆ మాలకున్న ముడులను లెక్కించాడు. అందులో

సరిగ్గా 71 ముడులున్నాయి. మామూలుగా జపమాలలో ఉపయోగించే సంఖ్య 108. మరి ఆ మాలలో 71 ముళ్ళు ఎందుకున్నాయో అని అనుకుంటుండగా, శ్రీఉపాసనీ సరిగ్గా తన 71వ ఏట దేహత్యాగం చేసిన విషయం గుర్తుకొచ్చింది. తన జీవితమనే సూత్రానికి ప్రారబ్ధానుసారం పడ్డ 71 సంవత్సరాల వయస్సుకు సంకేతంగా శ్రీఉపాసనీ ఆ ముడులు వేసి తన ఆయుర్దాయం 71 సంవత్సరాలని ముందే సూచించాడని భక్తులు భావించారు. మరొక్క విశేషం! శ్రీఉపాసనీ దేహత్యాగం చేసింది డిసెంబరు 24వ తేదీన. ఆ రోజు సతి గోదావరిబాయి జన్మదినం. అంటే, సతి గోదావరిబాయి 'జయంతి' నాడే శ్రీఉపాసనీ మహరాజ్ 'వర్ధంతి'!

## శ్రీఉపాసనీ ఉపదేశామృతం!

### ఒకరి మాట 'సోది' - మరొకరి నోట 'సూక్తి!'

మాటలలో స్వతహాగా ఏమీ మహత్వం లేదు. మాటలోని మహత్తు అవి పలికిన వారి మహాత్మ్యం మీద, అవి పలకడానికి వారికిగల అధికారిక సత్తామీద ఆధారపడి ఉంటుంది. శంఖులో పోస్తేగానీ తీర్థం కాదని అన్నట్లు, మహాత్ముల నోట వెలువడిన మాటే ఉపదేశమవుతుంది. శాస్త్ర వాక్యమైనా ఒక సామాన్యుడు చెబితే 'సోది'లా అనిపిస్తుంది. మహాత్ముల నోట వచ్చిన సామాన్య వాక్యమైనా 'సూక్తి'లా శోభిస్తుంది.

### గురువుకు గురుతేమి? దాని గూఢమేమి?

శాస్త్రవాక్యాలను సమర్థవంతంగా వివరించినంత మాత్రాన వారిని మహాత్ములు అనరు; పండితులు పౌరాణికులుగా వారు ప్రసిద్ధులు కావచ్చు. మరి సామాన్యునికి మహాత్మునికి గల భేదాన్ని గుర్తించడమెలా? నిజానికి, ఆ గుర్తింపుకు మూలం మహాత్ముల మహిమే కానీ, మరొకటి కాదు. మహనీయులలోని మహాత్మ్యం చక్కెరలోని మాధుర్యం వంటిది. చక్కెర "నేనిక్కడున్నాను! రండి! రారండి!!" అని చీమలను ఆహ్వానించదు. చక్కెరలోని మధురిమను తాము ఎక్కడున్నా గుర్తించి దానివైపుకు ఆకర్షింపబడే సహజ ప్రజ్ఞ చీమలకు స్వాభావికంగానే ఉంటుంది. నిజమైన మహాత్ములను లోకం ఏ ప్రచారం లేకపోయినా ఇట్టే గుర్తిస్తుంది. శ్రీసాయిబాబా తామొక సామాన్యమైన పేదఫకీరునని, అల్లాయే అందరికీ యజమానియనీ, తాము

ఆ సర్వేశ్వరుని సేవకుడననీ పదే పదే పలికినా, ఆయన నుండి సహజంగా ప్రకటమైన మహిమ మూలకంగా లోకం ఆయనను సద్గురు సామ్రాట్టుగా, అవతారపురుషునిగా, దైవస్వరూపునిగా గుర్తించి ఆరాధించింది. కానీ, మరికొందరు 'మహాత్ముల' పంథా దీనికి భిన్నంగా కనిపిస్తుంది. వారు ఈ లోకులు అజ్ఞానులని 'గ్రహించి' వారికి స్వయంగా తమలో గుప్తంగా ఉన్న మహిమను గుర్తించే జ్ఞానం ఉండదని సానుభూతితో గుర్తించి, తమ మహత్మ్యాన్ని తామే ప్రపంచానికి ప్రకటం చేసుకుంటారు. మరి ఇతరులకు తమ గొప్పదనం తెలియనప్పుడు, స్వయంగా తెలుసుకోలేనప్పుడు, తామే తెలియజెప్పక తప్పదు కదా?

శ్రీఉపాసనీ ఉపదేశాలలో – ఒక్క కన్యాకుమారి సతీ సిద్ధాంతం తక్క – సామాన్య హిందూ సాంప్రదాయ వేదాంతానికి భిన్నంగా విశేషంగా ఉన్నవి ఏవీ కనిపించవు. ఏ వేదాంత ప్రవచనాలనైనా దివ్య ప్రబోధాలుగా మార్చగలిగింది ఆ ప్రవచించేవారి దివ్యత్వంపై వారి భక్తులకు గల విశ్వాసమే! ప్రవచనానికి ప్రాణంపోసి, ప్రబోధంగా మార్చగలిగే ఆ 'విశ్వాసమే' శ్రీఉపాసనీ ఉపదేశాలలో ప్రధాన అంశం. సకోరీలో శ్రీఉపాసనీ సన్నిధిలో ఉంటూ ఆయన ఉపదేశాలను, జీవన శైలిని సునిశితంగా పరిశీలించి, ఆయన జీవిత చరిత్రను రచించిన శ్రీబి.వి. నరసింహస్వామిగారు, ఈ విషయంగా ఇలా అంటారు.

"శ్రీఉపాసనీ బాబా ఆశ్రమంలో మనకు ప్రధానంగా కనిపించే సిద్ధాంతాలలో అంధవిశ్వాసం అతి ముఖ్యమైనది. ఇక్కడి భక్తులు తమకు శ్రీఉపాసనీపైగల గ్రుడ్డి నమ్మకాన్ని చెదరకుండా ఉంచుకోవడానికి కృషి చేస్తారు. వారికి బాబానే దైవం; ఆయనేం చేసినా, అది సరియైనదే; దాన్ని ప్రశ్నించకూడదు; ఆయనేం చెప్పినా అది వారి మంచికే. భూత భవిష్యద్వర్తమానాలలో ఆయనకు తెలియనిది లేదు; ఆయన శక్తికి మించినది ఏదీ ఉండదు."*2

భక్తులకు తనపై అటువంటి "అంధవిశ్వాసం" పెంపొందేందుకు శ్రీఉపాసనీ కూడా ఇతోధికంగా కృషి చేసేవారు. ఆయన తన దర్శనానికొచ్చిన భక్తులతో తరచూ తన స్థితి గురించి తాను చేసిన ప్రకటనలు ఇందుకు ఉదాహరణ. వివిధ సందర్భాలలో ఆయన తనను గూర్చి తాను 'వెల్లడించిన' మాటలు ఒకచోట చేర్చి చూద్దాం.

---

*2 బి.వి. నరసింహస్వామి; 'Sage of Sakori' అధ్యా:23, పే. 106, 1985

## 'ఎవరు నా సరిసాటి? అన్నింట నేనే మేటి!'

"నా దివ్యత్వాన్ని గూర్చి ఎంత చెప్పినా అది మీకు పూర్తిగా అర్థం కాదు. నేను పొందినంతటి పరిపూర్ణ ఆధ్యాత్మికస్థితిని గత కొన్ని వందల సంవత్సరాల కాలంలో మరెవ్వరూ పొందలేదు. అంతటి అపూర్వ పరిపూర్ణతను ఇప్పుడు నాలోనే చూడగలరు. గత జన్మలలోను, ఈ జన్మలోను నేను చేసిన సాధనల ఫలితంగా నేనిప్పుడు అత్యున్నత ఆధ్యాత్మిక పదవిని అనుభవిస్తున్నాను. కానీ, అజ్ఞానులు నా దివ్యత్వాన్ని గ్రహించలేకపోతున్నారు. నేను సనాతనుడను; పురాణ పురుషుడను; నిర్వికల్పుడను; ద్వంద్వాతీతుడను; అన్నింటికీ నేను అతీతుడను. నేను ముక్తుడనుగాను, బద్ధుడనూ గాను; నేను సర్వసాక్షిని. నేనీ ప్రపంచంలో సంచరిస్తున్నా ప్రాపంచికుడను కాదు. ఈ ప్రాపంచిక వ్యవహారాలలో నేను లౌక్యంగా వ్యవహరించవలసి వస్తున్నందుకు నన్ను తప్పుగా అర్థం చేసుకోరాదు. నేను ఏకకాలంలో ఇటు లౌకిక స్థితిని, అటు దైవస్థితిని అనుభవిస్తూ ఉన్నాను. సదా నేను భగవచ్చైతన్యావస్థలో ఉంటూ, అవసరమైనప్పుడు ఈ స్థూలజగత్తుకు దిగి, వ్యవహరిస్తుంటాను... సర్వమూ నేనే! అన్ని నియమాలకూ నేను అతీతుణ్ణి. నేను ఎవ్వరికీ గురువునుకాను; ఎవ్వరికీ శిష్యుడనూ కాను. భక్తుల సంఖ్యను పెంచుకోవడం నా వృత్తి కాదు. అసలు, నావలె అంతటి నిజాయితీతో మిమ్మల్ని ఆధ్యాత్మిక పథంలో నడిపించే వారు మీకు దొరకరు!"*3

పైన ఉటంకించిన శ్రీఉపాసనీ వాక్యాలు చూస్తుంటే, తన దివ్యత్వాన్ని తానే పరిపరివిధాల ప్రకటించుకునే ఈ 'సంప్రదాయాన్ని'-బహుశా- శ్రీమెహర్‌బాబా తన గురువైన శ్రీఉపాసనీ మహరాజ్ నుండే గ్రహించి, తనదైన శైలిలో ఇంకొంచెం మెఱుగులు దిద్ది ప్రపంచానికి ప్రదర్శించినట్లు కనిపిస్తుంది.

## గురుభక్తికి గుఱుతేమి? దాని గూఢమేమి?

ఇటువంటి స్వీయ మహాత్మ్య ప్రకటిత వాక్యాలలో సామాన్యంగా కనిపించే ఆత్మోత్కర్ష అనే అంశాన్ని ప్రక్కనబెడితే, శ్రీఉపాసనీ ప్రకటనలలో ప్రధానంగా గమనించవలసిన అంశం ఒకటున్నది. అది ఈ 'సాయిభక్త విజయం'లో అవశ్యం

---

*3 'Contribution of Upasani Baba to Indian Culture' by Dr.S.N. Tipnis, Upasani Kanya Kumari Stan, Sakuri 1966, P. 87.

కూడా. తనకు ముందు కొన్ని శతాబ్దాల కాలంలో తాను పొందినంతటి పరిపూర్ణ ఆధ్యాత్మికస్థితిని మరెవ్వరూ పొందలేదని శ్రీఉపాసనీ ఉవాచ! అంటే, ఆయనకు ముందు కాలాలలో ప్రభవించిన మిగిలిన మహాత్ముల మాట అటుంచి, తాను శ్రీసాయిబాబా కంటే పరిపూర్ణుడనని పరోక్షంగా ప్రకటించినట్లయింది. తానెవ్వరికీ గురువును కానని అనడం సత్సంప్రదాయమే. నిజమైన సద్గురువెన్నడూ తనను తాను ఎవ్వరికీ గురువునని భావించడు. అయితే, ఏ సద్గురువూ తాను ఎవ్వరికీ శిష్యుడను కానని చెప్పుకోడు. జవహర్ ఆలి వంటి కపట ఫకీరు శిరిడీ వచ్చి, తాను శ్రీసాయిబాబా గురువునని ప్రజలకు చెబితే, శ్రీసాయి, అతని మాట కల్ల అని ఏ మాత్రం ఖండించకుండా, వినమ్రతతో అతనిని గురువును సేవించినట్లే సేవించారు. భగవాన్ రమణమహర్షి చెప్పినట్లు, ఈ జగత్తునంతా సద్గురుస్వరూపంగా దర్శించ గలవాడే జగద్గురువు. అదీగాక, శ్రీఉపాసనీ తాననుభవిస్తున్న కీర్తిప్రతిష్ఠలు, వైభవము శ్రీసాయి కృపావిశేషలబ్ధమైనవనే సత్యాన్ని మరచి, "నేను గత జన్మలలోను, ఈ జన్మలోను చేసిన సాధన ఫలితంగానే నేనీనాడు అత్యున్నత ఆధ్యాత్మిక పదవిని అనుభవిస్తున్నాను" అని చెప్ప సాహసించడం శోచనీయం. ***"ఈనాటి ఈ నా ప్రతిభ కంతకు కర్త నా గురువే!"*** అని సవినయంగా చాటిచెప్పిన శ్రీసాయికి, శ్రీసాయి 'వారసుని'గ జగతిలో గణుతికెక్కిన శ్రీఉపాసనీకి – ఈ విషయంలో – ఎంత వ్యత్యాసం! బహుశా ఇటువంటి అహంభావపూరిత ప్రకటనలు చేయడం మొదలైన నాటినుండే అప్పటివరకు తారామండలంలో నర్తిస్తున్న శ్రీఉపాసనీ కీర్తి పతాకం క్రమంగా అవనతం కావడం ఆరంభమైందేమో!

తాము ప్రత్యేకించి ఏ ఒక్క మతానికి చెందక, సర్వమతాల సమరసరూపాన్ని తమలో దర్శింపజేస్తూ, మహోన్నతమైన మానవతను, ప్రేమోన్మయమైన శరణాగతి పథాన్ని శ్రీసాయిబాబా ప్రబోధించారు. తద్భిన్నంగా శ్రీఉపాసనీ మహరాజ్ సనాతన 'హిందూధర్మ' పునరుద్ధరణకు కంకణం ధరించి, వేదాధ్యయనము, యజ్ఞయాగవ్రత ఉద్యాపనాది ఆచార క్రతుకాండను జరిపించి ప్రోత్సహించారు.

శ్రీసాయిబాబా 'ఉపవాస తపవాసాలను' ప్రోత్సహించలేదు; తమ సన్నిహిత భక్తులనెవ్వరినీ ఉపవాసాలు చేయనివ్వలేదు; ఆయన దృష్టిలో ఏకాదశి తదితర దినాలలో ఉపవాసాలు చేసేవారు మతిలేని "పిచ్చివాళ్ళు"! శ్రీసాయి అభిమతం

అద్వైతే, శ్రీఉపాసనీ శిరిడీలో ఉన్న రోజులలోనే కఠిన ఉపవాసాలను, “తపశ్చర్య” పేరిట ఎన్నో ఆత్మహింసాకర చర్యలను తనకు తానే విధించుకున్నారు; ఆ తరువాత, తననాశ్రయించిన భక్తులకు అదే విధానాలను విధించేవారు.

మన హృదయమనే వ్యవసాయ క్షేత్రం ఛాందస అంధవిశ్వాసాలనే అతివృష్టికి గురై, మతాలనే మళ్ళ మధ్య చిరకాలం నిలిచి క్రుళ్ళిపోయి కంపు కొడుతున్నది. కులతత్వమనే మురుగు నీరు వివేకమనే ఎండ తగిలి ఎండిపోనంతవరకు మానవతాబీజాలు మన హృదయక్షేత్రంలో మొలకెత్తవు; ఆత్మవికాసమనే ఫలసాయం చేతికందదు. ఆ సంకుచిత కులమతతత్వమనే కుళ్ళును రూపుమాప ఉదయించిన వివేకభాస్కరుడు శ్రీసాయినాథుడు. కులాభిజాత్యాన్ని చూస్తే ఆయన ఎంత మండి పడేవారో, సంకుచిత మతతత్వాన్ని ఆయన నిష్కర్షగా ఎలా నిరసించారో శ్రీసాయిచరిత్ర చదివిన వారందరికీ విదితమే.

శ్రీఉపాసనీ శిరిడీలో ఉన్న చివరిరోజులలో, శ్రీసాయిసన్నిధి ప్రభావం వల్ల, ఆయన లోని అంతకుమునుపుండిన బ్రాహ్మణ ఆభిజాత్యం, ఛాందస ఆచార పరాయణత్వం తాత్కాలికంగా తగ్గినట్లు కనిపించాయి. తమను భోజనానికి ఆహ్వానించిన శ్రీఉపాసనీ వద్దకు ఒక హరిజనుడి రూపంలో వెళ్ళడం వంటి శ్రీసాయిబాబా ప్రసాదించిన ఎన్నో అనుభవాలు శ్రీఉపాసనీలోని కులాభిజాత్యాన్ని పోగొట్టడానికి దోహదం చేశాయి. ఆ అనుభవాల ప్రభావం ఆయనపై ఉన్నంతవరకు కులమతాలకు అతీతంగా శ్రీసాయి చూపిన బాటలోనే నడిచాడు శ్రీఉపాసనీ. ఆయన సకోరిలో స్థిరపడక ముందు, గోరఖ్‌పూరు తదితర ప్రదేశాలలో ఎక్కువగా హరిజన వాడలకు వెళుతూ, హరిజనులకు సేవచేయడం చూస్తాం. కాలాంతరంలో, ఆయన సకోరిలో స్థిరపడ్డ తర్వాత, తన హృదయంలో శ్రీసాయికి దూరం అవడంచేతనో, లేదా – శ్రీమెహర్‌బాబా చెప్పినట్లు – ఆయన చుట్టూ దట్టంగా నెలకొన్న “బ్రాహ్మణ వాతావరణం” వల్లనో, శ్రీఉపాసనీలోని పూర్వ సంస్కారాలు తిరిగి తలెత్తి విజృంభించి వీరంగం ఆడడం ఆరంభించాయి. ఆయన ఉపదేశాలలో, వ్యవహార సరళిలో ‘కులం’ ప్రధాన పాత్ర వహించడం ప్రారంభమైంది. శ్రీసాయిబాబా కులతత్వాన్ని నిర్ద్వంద్వంగా నిరసిస్తే, శ్రీఉపాసనీ దానిని పనిగట్టుకొని ప్రోత్సహించారు. కులం భగవంతుని సృష్టి అనీ, దాన్ని కాదనకూడదనీ, ఎవరే కులంలో పుడితే వారు ఆ కులానికి సంబంధించిన కుల

ధర్మాన్ని అనుసరించాలనీ, కులధర్మాన్ని పాటించడం ఇహపర శ్రేయోదాయకమనీ – పదేపదే నొక్కివక్కాణించేవాడు. అంతేకాదు! ఒక సాయిభక్తునిగా శ్రీఉపాసనీ అస్పృశ్యతను ఆదరించిన వైనం అత్యంత ఆశ్చర్యకరం. "అగ్రవర్ణాలవారు అంటరాని వారితో కలసిమెలసి మెలగడం అంత మంచిదికాదు. దానివల్ల చెప్పనలవికానన్ని అనర్థాలు కలుగుతాయి. అంటరానివారితో కలసి తిరగడంవల్ల మిమ్మల్ని మీరు న్యూనపరచుకొన్న వారవుతారు. అలా అంటరానివారితో తిరిగినవాళ్ళు నరకానికి పోతారు... అంటరానివారు దేవాలయ ప్రాంగణంలో అడుగు పెట్టకూడదు. అది మహా పాపం. అస్పృశ్యుల ఆలయ ప్రవేశాన్ని ప్రోత్సహించేవారు ఆఖరుకు అష్టకష్టాలపాలవుతారు."*4 – ఇవి అస్పృశ్యతపై శ్రీఉపాసనీ అభిప్రాయాలు! భారత స్వాతంత్ర్యానంతరం అస్పృశ్యతా నిషేధచట్టం వచ్చినంతవరకు, సకోరిలో శ్రీఉపాసనీ నిర్మించిన దేవాలయాలలోకి హరిజనుల ప్రవేశం నిషిద్ధంగా ఉండేది!

తాను చేపట్టిన జాతీయోద్యమాలకు శ్రీఉపాసనీ ఆశీస్సులకోసం 1927లో మహాత్మాగాంధీ సకోరి సందర్శించాడు. హరిజనోద్ధరణ, అస్పృశ్యతా నివారణ తదితర సనాతన సంప్రదాయ విరుద్ధమైన అంశాలపై ఉద్యమం చేపట్టాడనో లేక, మరే కారణం చేతనో గాంధీజీని చూస్తూనే శ్రీఉపాసనీ ఆగ్రహంతో మండిపడుతూ, తన మొలకు చుట్టుకొన్న గోనెపట్టాను తీసివేసి, తన మర్మావయవాలు చూపుతూ "నీవు గొప్పవాడవైతే కావచ్చు! అయితే మాత్రం నాకేమిటి? అసలెందుకొచ్చావిక్కడికి?" అంటూ దుర్భాషలాడాడు! శ్రీఉపాసనీ అసభ్య ప్రవర్తనకు గాంధీజీ దిగ్భ్రాంతి చెంది, మౌనంగా అక్కడి నుండి నిష్క్రమించాడు. ఆ తరువాత 1931లో గాంధీజీ మొదటి రౌండ్ టేబుల్ సమావేశంలో పాల్గొనడానికి 'రాజపుటానా' అనే స్టీమరులో ఇంగ్లాండుకు వెళుతుండగా, అదే నౌకలో ప్రయాణిస్తున్న శ్రీమెహర్‌బాబాను కలవడం జరిగింది. ఆ సమావేశంలో శ్రీఉపాసనీని శ్రీమెహర్‌బాబా ఎంత సమర్థించ యత్నించినా, గాంధీజీ మాత్రం శ్రీఉపాసనీపై తనకున్న దురభిప్రాయాన్ని సుతరామూ మార్చుకోలేదు!*5

ఈ దృష్ట్యా మహా మహిమోపేతమైన శ్రీసాయి కీర్తికి – ఒక సాయిభక్తునిగా, 'శిష్యుని'గా శ్రీఉపాసనీ కొంతవరకు 'వారసుడు' అయ్యాడేమోగానీ, శ్రీసాయి అవతార

---

*4 Tipnis, S.N. "Contribution of Upasani Baba to Indian Culture," Sakuri, 1966 (PP 118-119).

*5 Purdom, C.B: "The Godman", Sheriar Press, Inc. S. California 1971, PP. 94-95.

కార్యానికి మాత్రం ముమ్మాటికీ 'వారసుడు' కాదనే చెప్పవలసి వస్తుంది. తన గురువు చూపిన బాటను వదలక, గురువు చెప్పిన మాటను మదిలో మరువక, తన గురువు ఉద్దేశించిన ఆశయ సిద్ధికి నిలిపిన ఆదర్శానికి తానంకితమై, సాధ్యమైతే తన సాటివారిని కూడా ఆ పథంలో నడిపించగలవాడే – నిజమైన శిష్యుడు. అదే గురుభక్తికి గుఱుతు; ఆ గుర్తే గురువై గమ్యం చేర్చడంలోని గూఢ మర్మం!

ఇక, శ్రీఉపాసనీ ఉపదేశాలలో వినూత్నమైనదిగా, విప్లవాత్మకమైనదిగా వినుతికెక్కిన 'కన్యాకుమారి' సిద్ధాంతం ఏమిటో, దాని స్వరూప స్వభావాలేమిటో దర్శిద్దాం!

## తరింపుకు శ్రీఉపాసనీ కనుగొన్న 'తరుణోపాయం!

శ్రీసాయిబాబా మహిమను వర్ణిస్తూ రచించిన 'శ్రీసాయినాథ మహిమ్నస్తోత్రము', సతిగోదావరిమాతపై రచించిన కొన్ని శ్లోకాలు తప్ప శ్రీఉపాసనీ 'రచనలు'గా చెప్పదగినవేవీ లేవనే చెప్పాలి. వివిధ విషయాలపై ఆయన చేసిన ప్రసంగాలలో కొన్నింటిని భక్తులు గ్రంథస్థం చేశారు. వాటిలో కొన్ని 'సాయివాక్సుధ' అనే పత్రికలో ప్రచురింపబడ్డాయి. వాటికి మరికొన్ని అముద్రిత ప్రసంగాలను కలిపి 'ఉపాసనీ వాక్సుధ' పేర ఆ తరువాత ప్రచురించడం జరిగింది. ఆ ప్రసంగాలను ఆంగ్లంలోకి అనువదించి 'The Talks of Sadguru Upasani Baba Maharaj' పేర నాలుగు సంపుటాలలో (ఆరు భాగాలుగా, సుమారు 2000 పుటలలో) ప్రచురింపబడ్డాయి. శ్రీఉపాసనీ ఉపదేశాల సారంగా ఆయన ప్రసంగాలలో ముఖ్యమైన వాటిని ఒక క్రమంలో కూర్చి, 'సతీచరిత్ర' అనే గ్రంథంగా ప్రచురించారు. ఈ 'సతీచరిత్ర' శ్రీఉపాసనీ భక్తులకు వేదం వంటిదని చెప్పవచ్చు. శ్రీఉపాసనీ ఉపదేశాలకు కేంద్రబిందువైన కన్యాకుమారీ (సతీ) సిద్ధాంతం యొక్క సమగ్రరూపాన్ని ఈ సతీచరిత్రలో మనం చూడవచ్చు.

శ్రీఉపాసనీ మహరాజ్ ప్రతిపాదించి ప్రచారం చేసిన సతీసిద్ధాంతం ఆయన ఉపదేశాలలో వినూత్నమైనదిగా, విప్లవాత్మకమైనదిగా వినుతికెక్కింది. అయితే, ఈ సిద్ధాంతం శ్రీఉపాసనీ యొక్క అపరోక్షానుభవ జనితమైన తత్త్వదర్శనంగా కాక, ఆయన ప్రయోగాత్మకంగా ప్రపంచంపై ప్రయోగించిన ఒక ప్రబోధాస్త్రంగానే కనిపిస్తున్నది. శ్రీఉపాసనీ చేబట్టిన వివిధ ఆధ్యాత్మిక ప్రయోగాలు, ప్రణాళికలు ఎలా పరిణామం చెంది సతీసిద్ధాంతంగా రూపొందాయో వివరిస్తూ శ్రీఉపాసనీ సన్నిహిత భక్తుడు,

శ్రీఉపాసనీ గోదావరీమాతల చరిత్రకారుడు అయిన శ్రీఎస్. సుబ్బారావు ఇలా అంటారు:

"బాబా సకోరి ఆశ్రమము నందు స్త్రీ పురుషుల ఆధ్యాత్మికోన్నతికి కొన్ని పరిశోధనలొనర్చెను. స్త్రీ పురుషులు వివాహితులై సంసార సంబంధమేమియు లేక పూర్వపు ఋషులవలె తపశ్చర్యయందే నిమగ్నులై జన్మ సాఫల్యమొనర్చుకొనవలెనని మున్ముందు కొన్ని వివాహములనిచట జరిపించెను. ఇట్టి ఆర్ష వివాహమునకు మనకతి సన్నిహిత ఉదాహరణ శ్రీరామకృష్ణ శారదామాతలు. కానీ ఈ ఉన్నతాశయము కలియుగమునందసాధ్యమై బాబా ప్రయోగములు విఫలములైనవి. కనుక ఆయన ఈ విధానమును నిలిపివేసెను. గోదావరి వివాహమే బాబా ఆశ్రమ మందలి కడపటి వివాహము. ఆ పైన బాబా బ్రహ్మచారులను పరమార్థ మార్గమందు తయారుచేయ యత్నించెను. ఒకరిద్దరు ఆరంభశూరత్వముతో బాబా శిక్షణ యందుండిరి గాని త్వరలోనే వీరీ జీవితమునకు స్వస్తి చెప్పి సకోరీ వదలిరి. ఇక గత్యంతరములేక బాబా స్త్రీల వైపు తన దృష్టి మరల్చెను. అవివాహితలుగా నుండి కన్యలు ఆధ్యాత్మికోన్నతిని సాధించుటకై తమ జీవితమును అంకితమొనర్చుటకు సంసిద్ధులైనచో వారిని క్రమశిక్షణలో ఉంచి వారికే కాక వారిద్వారా పురుష జాతికి కూడా మోక్షప్రాప్తి కలుగుటకై బాబా వలయు విధానమును చింతించెను. ఈ కార్యక్రమము నందు కన్యలు సహకరించి నిలబడగలిగిరి. కనుకనే కన్యాకుమారీ స్థానమేర్పడి పరమేశ్వర ప్రాప్తికిని, ఈశ్వరారాధనకు*6 కన్యలే ఉత్తమమైన పనిముట్లుగా ఎన్నుకొనబడిరి".

అలా ఎన్నో ప్రయోగాలు, ప్రయత్నాల ఫలితంగా శ్రీఉపాసనీ 'కనుగొని' మానవాళికందించిన ఆధ్యాత్మిక ప్రణాళికే – కన్యాకుమారీ సిద్ధాంతం. అదేమిటో సంక్షిప్తంగా ఇప్పుడు దర్శిద్దాం.

## కన్యాదానంలోని పరమార్థం!

"స్త్రీతత్వాన్ని పొందకపోతే, భగవద్దర్శనం దుర్లభం. స్త్రీతత్వాన్ని సాధించడమంటే స్త్రీ లక్షణాలను సంతరించుకోవడమే. పురుషులందరూ స్త్రీ స్థితిని పొందడానికి

*6 ఎస్. సుబ్బారావు, "సద్గురు సతీ గోదావరిమాత", ఉ–క–స్థాన్. సకోరి, 1968, P.P. 41-42

ప్రయత్నించాలి. తపస్సు వల్లనే అది సాధ్యం. అన్ని సాధనల చరమలక్ష్యం స్త్రీ తత్త్వ సాధనే"*7 అనేది శ్రీఉపాసనీ బోధనలలోని మూలసూత్రం.

"స్త్రీకి ప్రారబ్ధం లేదు. ప్రారబ్ధరహితావస్థ స్త్రీకి సహజస్థితి. ఆమెను ప్రారబ్ధ రహిత స్థితిలోనే ఉంచాలి. అలా ఉంచితే, ఆమె ఇతరులకు కూడా ముక్తిని ప్రసాదించ గలదు. అందువల్ల స్త్రీ ఎన్నడూ ప్రారబ్ధాన్ని జనింపజేసే ప్రాపంచిక జంజాటాలలో ఇరుక్కొనకూడదు."*8 – అనేది శ్రీఉపాసనీ సిద్ధాంతం. ఇదే కన్యాకుమారీ సిద్ధాంతానికి మౌలిక ప్రాతిపదిక; శ్రీఉపాసనీ – కన్యాకుమారీ స్థాన్‌కు సైద్ధాంతిక పునాది.

మరి, స్త్రీని సంసార జంజాటాలకు దూరంగా ఉంచి తద్వారా ఆమెను మానవాళి ముక్తికి సాధనంగా తయారుచెయ్యడం లోక వ్యవహారంలో ఎలా సాధ్యం? ఈ సమస్యకు శ్రీఉపాసనీ ప్రతిపాదించిన పరిష్కారం:

"కన్యలో నిద్రాణంగా ఉన్న ఆధ్యాత్మికశక్తిని మేల్కొలపాలంటే, ఆమెను బ్రహ్మజ్ఞానియైన సత్పురుషునికిచ్చి వివాహం చెయ్యాలని శాస్త్రాలు చెబుతున్నాయి. అలా అన్ని ప్రాపంచిక వ్యవహారాలను త్యజించి, ఒక మహాత్ముని సాంగత్యం చేసినప్పుడే కన్యలో నిద్రాణమై ఉన్న అంతర్‌శక్తి మేల్కొని అభివృద్ధి చెంది బహిర్గతమౌతుంది. అంటే, కన్య బ్రహ్మీస్థితిని పొందడానికి (ఆమెను వివాహమాడిన) సత్పురుషుడు ఒక అనుసంధాన కర్త అవుతాడన్నమాట. దీనినే బ్రహ్మ వివాహమంటారు. అందుచేత కన్యలను వారి స్వఇచ్ఛననుసరించిగాని, లేదా ఆమె తల్లిదండ్రుల నిర్ణయం చేత గానీ, శాశ్వతంగా ఒక సత్పురుషునికి కన్యాదానం చెయ్యడం ఎంతైనా ఆవశ్యకం"*9

అయితే ఎంతమంది తల్లిదండ్రులు లోకాచారానికి విరుద్ధంగా – మానవాళి ఆధ్యాత్మిక ఉన్నతి కోసమని – తమ కన్నబిడ్డలను (కన్యలను) నిస్వార్థంగా 'దానం' చేస్తారు? ఒకవేళ, అభం శుభం తెలియని మైనరు బాలికలు స్వచ్ఛందంగా 'కన్యాకుమారి' జీవితాన్ని గడపడానికి ఉత్సుకత చూపినా, దానికి వారి తల్లిదండ్రుల బంధుమిత్రుల ఆమోదం పొందడం సులభసాధ్యమా? మానవనైజంలోని స్వార్థప్రవృత్తి యొక్క స్వరూప స్వభావాలు బాగా ఎఱిగిన శ్రీఉపాసనీ ఈ సమస్యకు పరిష్కారంగా,

*7 'సాయి వాక్సుధ' – III, 63-64, 'సతీ చరిత్ర' – 34, 35, 65

*8 ఎస్. టిప్నిస్, Contribution of Sri Upasani Maharaj to Indian Culture, ఉ–క–స్థాన్. సకోరి, P –121

*9 'సతీ చరిత్ర', 52–56

ఆడపిల్లల తల్లిదండ్రులను 'కన్యాదానాని'కి ఉన్ముఖులను చేసే కొన్ని ఆకర్షణలను (incentives) ప్రకటించాడు. వాటిలో కొన్ని: "శాశ్వతంగా ఒక సత్పురుషునికి తమ కన్యలను 'దానం' చెయ్యడం వల్ల, అలా కన్యాదానం చెయ్యబడ్డ కన్య తననేగాక, తన తల్లిదండ్రులను, వారితో సంబంధమున్న అన్ని తరాలవారిని తరింపజేయగలదు. ఇటువంటి 'కన్యాదానం' అన్ని ఆధ్యాత్మిక సాధనలలోకి, సద్గతి పొందడానికి అత్యంత సులభతరమైన తరుణోపాయం. శ్రీకృష్ణుడు ఈ పద్ధతి ద్వారానే వేలాది జీవులను తరింపజేసాడు."*10

## కన్యాకుమారి పూజ యొక్క నేపథ్యం!

స్త్రీ సత్వాన్ని శక్తి స్వరూపిణిగా, ప్రకృతి శక్తులకు ప్రతీకలుగా దర్శించి ఆరాధించే ఆచారం అనాదిగా భారతీయ సంస్కృతిలో ఒక అంతర్భాగం. వివిధ దేశకాల పరిస్థితులకనుగుణంగా.... కాళీ, దుర్గ, భైరవి, త్రిపుర సుందరి, లలిత, కుమారి, స్త్రీ, వైష్ణవి, ... ఇలా.... అనేక రూపాలు ధరిస్తూ, వివిధ ఉపాసనా మార్గాలలో ఊపిరి పోసుకుంటూ ఈ 'స్త్రీత్వ పూజ' భారతీయ ఆధ్యాత్మిక జీవన స్రవంతిలో ఒక అంతర్వాహినిగా పరిఢవిల్లుతూనే ఉన్నది. వైదిక సంస్కృతి మనదేశంలో కాలూనక పూర్వం విలసిల్లిన సింధూ నాగరికతలో ఈ శక్తి పూజ (స్త్రీత్వ ఆరాధన) ఒక ప్రధాన అంశమని చారిత్రక ఆధారాలు నిరూపిస్తున్నాయి. ఈ స్త్రీత్వ ఆరాధనే ప్రాచీన సాంఖ్యమతానికి మూలమై తరువాత కాలంలో శాక్తేయ, తాంత్రిక, యోగమార్గాలుగా రూపాంతరం చెందింది. క్రమేణా ఈ మార్గాలు వైదిక సంప్రదాయంలో విడదీయరాని విధంగా కలిసిపోయినా, ఈ స్త్రీసత్వారాధన వేద సంస్కృతి కంటే ప్రాచీనమైనదని, మౌలికంగా అవైదికమని నిస్సందేహంగా చెప్పవచ్చు. శక్తి (స్త్రీ) పూజ యొక్క చారిత్రక పరిణామం దాని తాత్త్విక, ఆచార భేదాల వాదాల వివరణ ఈ గ్రంథంలో సంగతం కాదు. శ్రీఉపాసనీబాబా ప్రచారం చేసిన 'కన్యాకుమారి' సిద్ధాంత విశ్లేషణకు సంబంధించినంత వరకు పైన చెప్పిన అంశాలను పరిమితం చేద్దాం. ముందుగా 'కన్యాకుమారీ' పూజ గురించి తెలుసుకుందాం.

*10 'సతీ చరిత్ర', 57-58

పైన చెప్పిన శక్తి (స్త్రీ) పూజయొక్క వివిధ రూపాంతరాలలో "కుమారీ పూజ", "కన్యపూజ" కూడా ఒకటి. "కన్య" అంటే "అవివాహిత", "పురుషసంపర్కం లేని స్త్రీ" అనే అర్థంలోను, "కుమారీ" అంటే "బాలిక", 'కూతురు' అనే అర్థంలోను, సామాన్యంగా ఆ పదాలు వ్యవహరింపబడటం కద్దు. కానీ వైదిక తంత్రాగమ సాహిత్యంలో "కన్యాకుమారీ" అనే పదాలు పైన చెప్పిన సామాన్యార్థంలోనే గాక, ప్రకృతి తత్త్వానికి, శక్తి స్వరూపిణియైన స్త్రీ తత్త్వానికి, జగన్మాతకు, పర్యాయపదాలుగా ప్రయోగింపబడటం చూడవచ్చు. ఉదాహరణకు "తైత్తిరీయారణ్యకం"లో రుద్రుని భార్యయైన అంబిక "కన్యాకుమారి" అని సంబోధింపబడింది. మహాభారతంలో దుర్గయొక్క మరో పేరు "కుమారి". అనేక కారణాంతరాల మూలంగా "కన్యాకుమారి" పూజ క్రమంగా ఒక ప్రత్యేక ఉపాసనామార్గ ప్రతిపత్తిని కోల్పోయి, కాళీ, త్రిపురసుందరి, దుర్గ, మొ॥న దేవతోపాసనలలో ఒక సాధనాంగంగా రూపొందింది. ఆ కారణం వల్లనే కాబోలు, కాళీ, దుర్గ మొ॥న స్త్రీ దేవతామూర్తులకు కలిగినంత ప్రాచుర్యం – ఒక ప్రత్యేక ఉపాసనామూర్తిగా – కన్యాకుమారికి రాలేదు. అందుకే ప్రసిద్ధి పొందిన కన్యాకుమారి ఆలయాలు మనదేశంలో ప్రస్తుతం మూడు మాత్రమే కన్పిస్తున్నాయి. తమిళనాడులో "కన్యాకుమారీ" (కేఫ్ కొమరిన్) లోని కన్యాకుమారిదేవి ఆలయం: పంజాబ్ రాష్ట్రంలో కాంగ్రాలోయలో ఉన్న కన్యాదేవి ఆలయం, రాజస్థాన్‌లో బికనీర్ సమీపంలో కరానీ మాత ఆలయం.

మనదేశంలో కంటే నేపాల్ దేశంలో ఈ కుమారీ పూజ ఎక్కువ ప్రాచుర్యంలో ఉంది. ఆర్యవైశ్యులకు కులదేవతగా ఆరాధింపబడే "కన్యాకాపరమేశ్వరీ" కూడా "కన్యాకుమారి" యొక్క ఒక రూపాంతర విశేషం.

## వామాచారమా? వైదికాచారమా?

ఈ శాక్తేయ సంప్రదాయానికి అనుగుణంగా శ్రీఉపాసనీ కూడా సంపూర్ణ స్త్రీత్వ సాధనకు కన్యలను ఉపకరణాలుగానే భావించాడు. "క" అంటే పరబ్రహ్మస్థితి. "నై" అంటే కొనిపోవునది. అని శ్రీఉపాసనీ "కన" అనే పదానికిచ్చిన నిర్వచనం. శ్రీఉపాసనీ స్వయంగా తన శిష్యురాలైన గోదావరిబాయికి పూజచేసి ఆరతి ఇచ్చిన వైనం, ఆమెపై రచించిన స్తోత్రాలు, కన్యల స్థితిని గూర్చి ఆయన చేసిన వర్ణనలు,

పరిశీలిస్తే తంత్రాచారంలోని (కన్యా) కుమారి పూజ యొక్క స్వరూప స్వభావాలు, వాటి ఉనికి లీలగా గోచరించక మానవు.

ఇక "పురుషులందరూ స్త్రీ స్థితిని పొందటానికి ప్రయత్నించాలి. అన్ని సాధనలకు చరమలక్ష్యం స్త్రీత్వ సాధనే! స్త్రీత్వాన్ని సాధించటమంటే స్త్రీ లక్షణాలను సంతరించుకోవటమే!"నన్న శ్రీఉపాసనీ ఉద్బోధ నిజానికి తంత్రవాద మౌలిక సిద్ధాంతం. అత్యున్నత స్త్రీసత్వసాధన తంత్రవాదుల చరమలక్ష్యం. ఆ అత్యున్నత స్త్రీసత్వాన్ని ఆవాహనచేసి, స్త్రీగా మారిపోవడానికి చేసే తీవ్ర కృషే తాంత్రిక విధుల పరమార్థం. పురుషుడు, తన మౌలికమైన వ్యక్తిత్వాన్ని, చైతన్యాన్ని స్త్రీ వ్యక్తిత్వంగా పరివర్తింపజేయడమే "తంత్రంలో" చెప్పబడ్డ యోగసాధన విద్య యొక్క రహస్యం. తాంత్రిక పరిభాషలో శక్తి అంటే స్త్రీ. పద్మము, చక్రము, స్త్రీ జననాంగానికి చిహ్నాలు. ప్రతి వ్యక్తి యొక్క వెన్నెముక (వ్యక్తిత్వం) నానుకొని ఇరువైపుల ఇళపింగళ అనే నాడులుంటాయనీ, వాటి మధ్యలో సుషుమ్న అనే నాడి ఉందనీ, గుదస్థానం నుండి మెదడు (మాడు) వరకు కొనసాగే ఆ సుషుమ్ననాడిలో వజ్రోక్యమనే మరో నాడి ఉంటుందనీ, ఆ సుషుమ్ననాడిపై వివిధ స్థానాలలో సప్తపద్మాలు (చక్రాలు) ఉంటాయనీ, తంత్రశాస్త్రం చెబుతుంది. సుషుమ్ననాడిపై వివిధ దళసంఖ్యలలో ఉన్న ఏడు పద్మాలు (చక్రాలు) స్త్రీ సత్వంలోని వివిధ దశలు. గుదస్థానంలో నీచకేంద్రంలో కులకుండలినీ రూపంలో ఉన్న స్త్రీత్వాన్ని మేల్కొలిపి శక్తివంతంచేసి దాన్ని నీచకేంద్రం నుండి చిత్రిణీనాడి ద్వారా వివిధ స్త్రీ చైతన్య దశలను (పద్మాలను) అధిగమిస్తూ స్త్రీ అనే అత్యున్నత స్థానానికి బట్వాడా చెయ్యటం తాంత్రిక యోగసాధనంలోని షట్చక్ర భేద రహస్యం. ఈ తత్వాన్నే "నీలోని పురుషుణ్ణి త్యజించు! ప్రకృతి(స్త్రీ)గా మారిపో! అప్పుడే నీవు అనంతంలో ఏకమవుతావు" అని చెబుతుంది సహజీయ తంత్రగీతం. అత్యున్నత స్త్రీ శక్తిని ఉజ్వలింపచేయాలంటే స్త్రీగా మారిపోవాలి. అదే వామాచారం. (వామాభోత్వయజేత్పరం) అంటుంది ఆచార భేదతంత్రం. 'వామాచారం' అంటే ఎడమచేతి మార్గం అనేది అందరూ చెప్పే సామాన్యార్థం కానీ సూక్ష్మంగా చూస్తే "వామా" అనే పదానికి స్త్రీ లేక "కామవాంఛ" అని అర్థం. "ఆచారం" అంటే ఆచరణ. కనుక వామాచారమంటే స్త్రీత్వసాధన అని అర్థం. నిజానికి తంత్రాచరణమంటే వామాచరణమేననీ తద్భిన్నమైన ఆచరణలేవీ తంత్రసాధనల క్రిందకు రావనీ

సంప్రదాయ తంత్రవాదుల విశ్వాసం. స్త్రీత్వసాధన లక్ష్యంగాగల తాంత్రిక, "వామా"చరణకు విరుద్ధమైనది వైదిక మత సిద్ధాంతం. వైదిక సంప్రదాయం, పురుష ప్రాధాన్యతను కలిగినది. వైదిక సంస్కృతి పితృస్వామ్య లక్షణం గలది. వైదిక సాధనల లక్ష్యం పురుషోత్తమస్థితి యొక్క ప్రాప్తి. వైదిక సంస్కృతి యొక్క ప్రాబల్యంవల్ల మౌలికమైన తాంత్రికమతం (వామాచారం) సభ్యసమాజంలో "అవైదికము", అసత్యము, బూతు అనే ముద్రలతో సామాన్య మతాచరణ నుండి మరుగున పడిపోయింది. కొన్ని తాంత్రికాచారాలు మాత్రం వైదికం ముసుగులో కొనసాగాయి. ఇంకా సాగుతున్నాయి కూడా! ఈ దృష్ట్యా శ్రీఉపాసనీ కూడా స్త్రీత్వసాధనమనే మౌలిక తంత్రవాద సిద్ధాంతానికి వైదిక యజ్ఞయాగాది క్రతువులనే మేలిముసుగు వేసి సభ్యసమాజం దృష్టిలో ఆమోద యోగ్యమైనదిగా చేసి చూపయత్నించారని తోస్తుంది.

అయితే తంత్రం ప్రధానంగా ఆచరణశీలమైనట్టిది. స్త్రీసత్వసాధన అనే సిద్ధాంతాన్ని ఉద్భోధించినంత మాత్రాన శ్రీఉపాసనీని తంత్రవాదియని పూర్తిగా అనటానికి వీలులేదు. తాంత్రిక క్రియాచరణ మాత్రమే తంత్రవాదానికి నిజమైన గురుతు. శ్రీఉపాసనీలో అటువంటి తాంత్రిక క్రియాచరణ ఏదైనా కన్పిస్తున్నదా! అనే విషయం ఇప్పుడు పరిశీలిద్దాం.

## స్త్రీ వేషధారణలోని తంత్రవాదం

శ్రీమతి గోదావరీబాయిని శ్రీఉపాసనీ స్వయంగా పూజించి ఆరతులనివ్వడం మొ॥న తంతు, అది తంత్రపాలినలలోని (కుమారీ) పూజను పోలి ఉండటం మొదలగు అంశాలు ఇంతకు ముందే ప్రస్తావించడం జరిగింది. పోతే శ్రీఉపాసనీ చర్యలలో తాంత్రికాచరణకు అద్దంపట్టేది ఆయన తరచూ స్త్రీలా ప్రవర్తించడం. శ్రీఉపాసనీ చరిత్ర చదివిన పాఠకులకు అతి విడ్డూరంగా, అసహజంగా, అసంబద్ధంగా తోచే ఈ అంశాన్ని గూర్చి కొంచెం లోతుగా పరిశీలిద్దాం!

శ్రీఉపాసనీ తాను పురుషుడనుకాననీ, స్త్రీననీ తరచు అనేవారు. తాను భౌతికంగా పురుషదేహాన్ని కలిగి ఉన్నా ఆంతర్యంలో మాత్రం తానొక స్త్రీని అనే అనిపిస్తుందని అనేవారు. తాను దేవుని భార్యననీ, అఖండ సౌభాగ్యవతిననీ చెబుతుండేవారు. శిరిడీలో నివసించిన రోజుల్లోనే స్త్రీలా ప్రవర్తిస్తూ, ఎవరైనా మహిళలు కనిపిస్తే పసుపు,

కుంకుమ, గాజులు కావాలని అడిగేవారు. సాధారణంగా సాధువులు ధరించే పద్ధతిలో కాక, ఒక విలక్షణమైన రీతిలో ఒక గోనెగుడ్డను నడుముకు చుట్టుకొని, దాని ఒక కొనను స్త్రీలు పైట వేసుకొన్నట్లు భుజంపై వేసుకొనేవారు. తమ చివరిరోజులలో తరుచూ పూర్తిగా స్త్రీలా వేషం ధరించి దర్శనమిచ్చేవారు. 1941 సంక్రాంతికి శ్రీఉపాసనీ ఒక సూర్యయాగం నిర్వహించాడు. ఆ యాగంలో శ్రీఉపాసనీ పూర్తిగా స్త్రీలా వేషం ధరించి, ఆశ్రమ కన్యలతో బాటు కూర్చొని యాగ 'తంతు' జరిపించాడు. ఆ సూర్యయాగంలో తనకు సూర్యనారాయణునికి వివాహం జరిగిందని కూడా ప్రకటించాడు. శ్రీఉపాసనీ అలా స్త్రీ వేషధారణలో ఉండగా రెండు ఫోటోలు కూడా తీయడం జరిగింది.

శ్రీఉపాసనీ స్త్రీ వేషం ధరించి, స్త్రీలా ప్రవర్తించడం గురించి వ్యాఖ్యానిస్తూ, తమ 'Sage of Sakori' అనే గ్రంథంలో శ్రీబి.వి. నరసింహస్వామిగారు, అది శ్రీఉపాసనీ తనలోని కామవాసనను జయించడంలో భాగంగా లింగభేదాన్ని అతిక్రమించే యత్నంగా అభివర్ణిస్తూ, ఇంకా ఇలా అంటారు: "శ్రీరామకృష్ణపరమహంస అప్పుడప్పుడు ఎలా తనను తాను స్త్రీగా భావించుకొని, స్త్రీలా దుస్తులు ధరించి, స్త్రీవలె ప్రవర్తిస్తూ, శీలవతులైన స్త్రీలతో కలసిమెలసి తిరిగేవారో జ్ఞప్తికి వస్తుంది. శ్రీసాయిబాబా కూడా అప్పుడప్పుడు తనకు తాను స్త్రీగా వ్యవహరిస్తూ, స్త్రీలను అనుకరిస్తూ స్త్రీలా గొంతు మార్చి మాట్లాడేవారు".

స్థూల దృష్టికి, శ్రీనరసింహస్వామిగారు శ్రీఉపాసనీ స్త్రీలా ఎందుకు వర్తించాడు అనడానికి చేసిన వివరణ, శ్రీఉపాసనీ చర్యలకు శ్రీసాయిబాబా, శ్రీరామకృష్ణ పరమహంసల చర్యలతో చేసిన పోలిక సమంజసంగా కనిపించవచ్చు. నిశితంగా యోచిస్తేనే గాని, పై పోలిక వివరణలలోని అసమంజసత గోచరించదు. మొదట శ్రీసాయిబాబా వంటి పరిపూర్ణ సద్గురుమూర్తులు తమలోని కామవాసనను జయించడానికి స్త్రీలా వర్తించేవారని అనుకోవడం అసంగతం. శ్రీరామకృష్ణ పరమహంస తమ జీవితకాలంలో వివిధ మత సంప్రదాయాలకు చెందిన సాధనలు అనుష్ఠించి, వాటన్నింటా చరమానుభవము ఒక్కటేనని ప్రకటించారు. అలా ఆయన అనుష్ఠించిన సాధనలలో వామ మార్గ, తాంత్రిక సాధనలు, మధురభక్తి యోగం కూడా ఉన్నాయి. శ్రీరామకృష్ణ పరమహంస తాము చేసిన వామాచార తాంత్రికసాధనల

గూర్చిన వివరాలను గోప్యంగా ఉంచారు. తామనుష్ఠించిన మధురభక్తి, సాధనల గూర్చి మాత్రం తరచూ ప్రస్తావించేవారు. మధురభక్తి సాధనా మార్గాలపై తాంత్రిక, వామాచార ప్రభావం ఉన్నా, తాత్విక దృష్ట్యా వాటి మధ్య భేదముంది. స్త్రీత్వ సాధన వామమార్గీయుల చరమలక్ష్యం. పురుషోత్తముడైన శ్రీకృష్ణుడొక్కడే అసలు పురుషుడనీ, తక్కిన ప్రకృతిలోని, స్త్రీ, పురుషులందరూ తత్వతః స్త్రీ తత్వానికి చెందిన వారేననీ, ప్రేమభావంలో ఒక ప్రేయసి ప్రియుని దర్శించి అపుడు ఏకమవ్వడమే మధురభక్తి యోగము. మధురభక్తి యొక్క చరమలక్ష్యం పరమ పురుషునితో భావసంగమం, పురుషోత్తమప్రాప్తి. మధురభక్తియోగాన్ని అనుష్ఠించే భక్తులు తమను తాము స్త్రీగా భావించుకొనడం, బాహ్యంగా స్త్రీలా వేషం వేసుకొనడం అరుదు. బెంగాల్‌లో ఎన్నో తాంత్రిక వామాచార మతాలు మధురభక్తి పేర చెలామణి అయ్యాయి. సహజీయుల పేర బౌలులు మొదలైన మార్గాలు ఇటువంటివే. శ్రీరామకృష్ణ పరమహంస తాము బౌలు (Boul) సాంప్రదాయానికి చెందిన వాడనని ప్రకటించే ఉన్నారు. ఈ దృష్ట్యా రామకృష్ణ పరమహంస స్త్రీ వలె దుస్తులు ధరించడం, స్త్రీలా ప్రవర్తించడం నిజానికి ఆయన చేసిన వామాచార తాంత్రిక సాధనలలో భాగం లేక మధురభక్తికి మూలం అనే విషయం విచారణీయం.

## లింగభేదాలనతిక్రమించిన సాయి

ఇక శ్రీసాయిబాబా విషయానికొద్దాం. శ్రీసాయి ఎన్నడూ స్త్రీ వేషధారణ చెయ్యలేదు. ఇక శ్రీసాయి స్త్రీవలే కంఠం మార్చి స్త్రీలను అనుకరిస్తూ అప్పుడప్పుడూ సందర్భావసరాలను బట్టి మాట్లాడేవారు. శ్రీసాయిచరిత్రని నిశితంగా పరిశీలిస్తే ఆయనలా చేసిన సందర్భాలు (కారణాలు) స్థూలంగా రెండు కనిపిస్తాయి. ఒకటి శ్రీసాయి ఏ వ్యక్తి లేక జీవియొక్క అనుభవాన్ని చెప్పినా సాధారణంగా ఆ వ్యక్తితో పూర్తిగా తాదాత్మ్యం చెంది, ఆ వ్యక్తి లేక జీవి యొక్క అనుభవం తనదేనన్నట్లు చెప్పేవారు, అది సర్వజీవస్వరూపస్థితినందిన శ్రీసాయి విలక్షణ శైలి. ఉదాహరణకు ఒక దత్తజయంతినాడు ఆయన అనసూయాదేవితో తాదాత్మ్యం చెంది స్త్రీ వలె ప్రసవవేదన పడుతున్నట్లు కన్పించినా, కుక్కకు ఆకలైతే తనకు ఆకలైనదని చెప్పినా, తన దర్శనార్థం వచ్చిన ఎందరో భక్తులయొక్క అనుభవాలు తమ స్వంత అనుభవాలుగా ఉగ్గడించినా,

ఒక భక్తురాలు బట్టెను కొడితే తమనే కొట్టినట్లు చెబుతూ తమ దేహంపై ఆ దెబ్బవల్ల కలిగిన వాతను చూపించినా – ఆయన ఆయా జీవులను అనుకరించినట్లు కాదు. తనకంటూ ఘనమైన ఏ రూపమూ లేని నీరు ఏ పాత్రలో పోస్తే ఆ రూపం ధరించినట్లు అన్ని వ్యక్తిత్వాల ఘనతను, పరిమితులను, లింగభేదాలను అతిక్రమించిన శ్రీసాయి చైతన్యం, స్త్రీ పురుష, జంతు జడరూపాలన్నింటిలోనూ తాదాత్మ్యం చెందేది.

ఇక రెండవది, శ్రీసాయి ఎప్పుడైనా అదీ శిరిడీకి వచ్చిన మొదటి రోజులలో – కాళ్ళకు గజ్జెలు కట్టుకొని చేత తంబూరా ధరించి మధుర భక్తిగీతాలు, మధురంగా పాడుతూ, ఆనంద పారవశ్యంలో నృత్యం చేసేవారు. సూఫీ సంప్రదాయంలోని ఫకీర్లలో కబీరు సంప్రదాయానుయాయులలో బౌలు సాంప్రదాయానికి చెందిన "సాయి"లలో ఇలా నృత్యం చెయ్యడం కనిపిస్తుంది. శ్రీసాయి అలా నృత్యం చేసే సన్నివేశాన్ని ప్రత్యక్షంగా దర్శించిన తాత్యాకోతే పాటిల్ తన స్మృతులలో ఆ దృశ్యాలెలా వర్ణించాడో చూడండి:

"ఒక్కొక్కప్పుడు బాబా ఒకానొక పారవశ్యంలో ఉండేవారు. అటువంటి అరుదైన సమయాలలో ఆయన తమ చేత తంబూరా ధరించి పారవశ్యంతో ఒడలు తెలియని రీతిన నృత్యం చేసేవారు. అత్యంత లయబద్ధమైన వారి పాద, కర, నేత్ర కదలికలు భంగిమలు, చూచేవారినందరినీ ముగ్ధులను చేసేవి. మధుర కంఠస్వరంతో బాబా ఎంతో గొప్పగా పాడేవారు కూడా.

అలా నృత్యం చేస్తూ పిల్లనగ్రోవి వాయిస్తున్నట్లు భంగిమ చేస్తూ ఒక కాలు మరోకాలు ఎదుట అడ్డంగా మడిచి నిలుచునేవారు. ఆయనను ఆ భంగిమలో చూసిన వారందరికి, వారు బాబానుగాక, ఆ బృందావన కృష్ణుణ్ణే చూస్తున్నామా అనిపించేది. అటువంటి భావపారవశ్యంలో ఆయన్ను దర్శించిన వారందరికీ కూడా ఏదోతెలియని పారవశ్యం కలిగి ఏదో పారలౌకిక దృశ్యాన్ని చూస్తున్నట్లు అనిపించేది".

పై వర్ణన చూస్తుంటే మనకు తెలిసేది శ్రీసాయి గోపికా గీతాలను ఆలపిస్తూ గోపికాకృష్ణుల భంగిమలను అనుభవించినా చూసేవారికి శ్రీసాయిలో పురుషోత్తముడైన శ్రీకృష్ణుడే కనిపించి "ఒక పారలౌకిక దృశ్యాన్ని చూస్తున్న అనుభూతి పొందేవారు". అంతేకాని శ్రీసాయి చేసే గోపికాభినయంలోని స్త్రీ అనుకరణ చూసేవారిలో హాస్యపూరితమైన వినోదాన్ని కలిగించేదికాదు.

ఇక అతి తరచూ – ముఖ్యంగా సూర్యయాగం వంటి యజ్ఞయాగాది కర్మక్రతువులు నిర్వహించేటప్పుడు – శ్రీఉపాసనీ బాబా పూర్తిగా స్త్రీ వేషం ధరించి పాల్గొనేందుకు కారణమేమై ఉంటుందో పరిశీలిద్దాం. స్త్రీ సత్వాన్ని సాధించి స్త్రీగా మారిపోవడమంటే తాంత్రిక గ్రంథాలు తాత్వికపరంగా చెప్పిన లక్ష్యాన్ని సాధించే ప్రయత్నంలో – అవగాహనాలోపంవల్ల – స్త్రీయొక్క బాహ్యలక్షణాలను దుస్తులను కూడా ధరించటమనే వికృత పరిణామం భారతీయతాంత్రిక సంప్రదాయంలోనేగాక, ఇతరదేశాలలో కూడా ప్రాచీన ఆచార అవశేష విశేషాలుగా ఎలా ఉన్నాయో మానవ శాస్త్రం (Anthropology) నిరూపిస్తున్నది. ఈ విషయంగా విశేషంగా అధ్యయనం చేసిన శ్రీడి. ఛటోపాధ్యాయ ఇలా అంటారు:

"ప్రాచీన సంప్రదాయంలో మత సంబంధమైన క్రతువులు, వ్యవసాయ కార్యక్రమాలు, స్త్రీల చేతుల్లో ఉండేవి... క్రమక్రమంగా స్త్రీల అధికారంపై పురుషుల పెత్తనం పెరుగుతూ వచ్చింది. అలాగే దేవుళ్ళ ఆధిపత్యం దేవతలపై పెరిగింది. అయితే ఈ తంతుల వ్యవహారంలో స్త్రీల ప్రాధాన్యత తగ్గి పురుషుల ప్రాధాన్యత పెరగటం ఒక్కసారిగా జరిగి ఉండదు. అలాగే పాతఛాయలు పూర్తిగా మాసిపోవు. అంటే మహత్తు కార్యక్రమాలు మతక్రతువులు, క్రొత్తగా వచ్చిన పితృస్వామిక పరిస్థితులకు అనుగుణంగా సర్దుకొన్నప్పటికీ స్త్రీలు ఒకప్పుడు ఇదే వ్యవహారాల్లో ప్రధాన పాత్రలు వహించిన ఛాయలు మాత్రం మిగిలి ఉన్నాయి. పురుషులు పూజారి పద్ధతులకు అనుగుణంగా మలచుకొనే క్రమంలో తన జాతిని త్యాగంచేసి స్త్రీలో ఐక్యం కావాలి. మధ్య ఆసియాలోని అనేక దేశాల్లో పూర్వకాలం దేవాలయపూజారి భౌతికంగా నపుంసకుడు కావాలి. అంటే తన లింగాన్ని నరికించెయ్యాలి. (ఇందుకు ఇష్టుక, సిరియన్ దేవతలు, పెసినోస్, హిటైట్ పూజారులు, ఆర్టిమిన్ మొదలైన ఉదాహరణలు చెప్పవచ్చును.) కాని పురుషులు తమ లింగాన్ని సమర్పించడం విషయంలో వచ్చిన సాంకేతిక సంప్రదాయం స్త్రీలాగా దుస్తులు ధరించడం, శరీరంలో భాగాలుగా దుస్తులనుకూడా జమకట్టిన పురాతనమైన నమ్మకంనుంచి ఈ అలవాటు ప్రారంభించి ఉంటారు. ఏవ్యక్తి అయినా ఏజాతి (లింగం) కి సంబంధించిన దుస్తులు ధరిస్తే ఆ జాతికి సంబంధించిన కార్యక్రమాలు నిర్వర్తిస్తున్నట్లు ప్రాచీన సమాజంలో నమ్మిన సార్వజనీన సూత్రం. ఎటబోనియాలో పూజారి విధులు నిర్వర్తించేటప్పుడు

పురుషులు తమ జాతిని వదిలి స్త్రీల దుస్తులను ధరించవలసి ఉంటుంది. బోర్నియోలోని దయక్ తెగల వారిలో మహత్తు - క్రతువులు చేసే పురుషులు స్త్రీల దుస్తులు ధరించాలి. ద్యుముఖ్యులు వర్షాన్ని ఆవాహన చేసేటప్పుడు (ఆడవాళ్ళ) లంగాలు ధరిస్తారు. మెడగాస్కరులో పూజారులు స్త్రీ దుస్తులే ధరిస్తారు. తహితి మార్క్వెసాన్‌లలో పూజారులు తమ శరీరాలకు తెల్లరంగు వేస్తారు. ఆ పైన స్త్రీలలాగా ప్రవర్తిస్తారు. పూజారులు స్త్రీలవలెనే దుస్తులు ధరించాలనే సూత్రం ఉత్తరమెరికా ఇండియన్స్, న్యూమెక్సికో తెగలు, ఇండోనేషియా పెల్యో ద్వీపాలు, మొదలైన అన్ని చోట్లా అమలులో ఉంది. గుచ్చివాడలో పూజారి పూజలు చేసేటప్పుడు స్త్రీల దుస్తులే ధరిస్తాడు అని వైట్‌హేడ్ అంటాడు. ప్రాచీనకాలంలోగూడా క్లుప్తంగా చెప్పాలంటే పురుషుడు పురుషుడులాగా ఏ కార్యక్రమాలూ నిర్వర్తించలేడు. వారు "స్త్రీలగా" మారి మాత్రమే అవి నిర్వర్తించగలరన్న విశ్వాసమే (ఆధారాలకు) పునాది".

పైన ఉదహరించిన వివరాలు కొన్ని ఆచార వ్యవహారాలు ఎలా పరిణామం చెందుతాయో చెప్పడానికి మాత్రం ఉద్దేశించినవి. పైన పేర్కొన్న వివరాలకు కొందరు తాంత్రికులు ఈనాటికీ అవలంబిస్తున్న స్త్రీ వేషధారణ వంటి తంతులకు "సామ్యం" ఆ పరిణామ సూత్రం వరకే.

ఇక ఉపాసనీ చేసిన స్త్రీ అనుకరణ వంటి విచిత్రచర్యలు "కామవాసనను జయించటానికి లింగభేదాన్ని అతిక్రమించే సాధనలో భాగంగా" ఎంతవరకు సమంజసమైనవో చూద్దాం. కామవాసన (లైంగిక బలహీనతలు) పురుషులకు మాత్రమే పరిమితమైన విషయంకాదు. అవి స్త్రీలకూ సహజమే. స్త్రీకి గాని, పురుషునకుగాని, లింగస్పృహ ఉన్నంతవరకు లైంగిక వాసనలు నశించవు. పురుషులు తమలోని పురుషభావనను త్యజించి స్త్రీత్వ భావనను అలవర్చుకుంటే, స్త్రీలకు స్వాభావికమైన లైంగిక వాసనలు తప్పవుగదా? ప్రతి పురుషునిలోనూ స్వాభావికంగా కొంత స్త్రీసత్వం ప్రతి స్త్రీలోను కొంత పురుషసత్వం ఉంటాయనీ, పురుషుడు తనలో నిద్రాణంగా ఉన్న స్త్రీత్వాన్ని మేల్కొల్పి ఉద్దీపింపజేసి తనలోని స్త్రీపురుష సత్వాలను, పరిపూర్ణ సంయోగాన్ని సాధించడం తంత్రవిద్య చెప్పే సాధన. ఇదే ప్రతి వ్యక్తిలోని అర్ధనారీశ్వర తత్త్వం. మరోవిధంగా చెప్పాలంటే, అన్ని లింగభేదాలకు వ్యక్తిత్వపు పరిమితులకు అతీతమైనది భగవస్థితి. ఆ స్థితిని పొందడానికి పురుషులు, పురుషభావనను

విస్మరించి, లింగాతీతస్థితిని పొందడమే నిజానికి అట్టి తాంత్రిక సాధన, ఇటు మధురభక్తి సాధనల పరమార్థం. అయితే ఈ తంత్ర విద్య కేవలం అంతర్గతమైన భావచైతన్య పరివర్తనకు, స్త్రీ వేషధారణ, స్త్రీ అనుకరణవంటి బాహ్యాచార వ్యవహారాలకు సంబంధించినదికాదు. కానీ, అవగాహనాలోపంవల్ల కాలాంతరంలో అసలైన తంత్ర విద్యాసాధనలు, వికృతరూపం పొంది పురుషులు బాహ్యంగా, స్త్రీ లక్షణాలను అలవర్చుకోవడంగా పరిణమించింది. అటువంటి తాంత్రిక సాధనల వికృతరూపమే స్త్రీ వేషధారణ, స్త్రీ అనుకరణ వంటి శ్రీఉపాసనీ విచిత్ర చర్యలకు మూలమని తోస్తుంది.



భావూ మహరాజ్ కుంభార్

# భావూ మహరాజ్ కుంభార్

సుమారు 1915 – 16 మధ్యకాలంలో శిరిడీ వచ్చారు శ్రీభావూ మహరాజ్ కుంభార్. ఆయనకు శ్రీసాయిబాబాతో గల అనుభవాలేమిటో, బాబా ఆయనకు ఏ ఉన్నత ఆధ్యాత్మికస్థితులు ప్రసాదించారో ఎవ్వరికీ తెలియదు. పూర్తి అవధూతావస్థలో శిరిడీలో సంచరించిన శ్రీభావూ కుంభార్ మూర్తీభవించిన వైరాగ్యంతో భాసించేవారు. ఎప్పుడూ ఎవ్వరితో మాట్లాడక ఏదో వేరే లోకంలో ఉన్నట్లు సంచరించేవారు. ఎవరినీ ఏమీ అడిగేవారు కాదు. దారిలో ఎవరైనా ఏదైనా ఇస్తే దాన్ని తీసుకొని వెంటనే రోడ్డుపైన విసరికొట్టేవారు. కౌపీనం తప్ప మరే దుస్తులు ధరించేవారు కాదు, ఎవరైనా ఆయనకు బట్టలు ఇస్తే అవి తీసుకొని చిన్న చిన్న మొక్కలపై కప్పి, వాటితో "చలిగా ఉందా? ఇవి కప్పుకోండి. చలి తగ్గిపోతుంది" అనేవారు. "మీరు కప్పుకోండి మహరాజ్" అని ప్రేమగా ఆయనకు ఎవరైనా దుప్పటిస్తే దాన్ని ముక్కలు చేసి బాబా సమాధి మందిరము, మసీదు తుడవడానికి, రోడ్లు ఊడవడానికీ చీపురులాగా ఉపయోగించేవారు. "ఏ పనీ చేయకుండా ఎవ్వరూ ఊరకే ఉండకూడదు, ఏదో పని చేస్తూండాలి!" అన్న శ్రీసాయిబాబా హితవుకు ఆచరణరూపమా అన్నట్లుండేవారు శ్రీకుంభార్. ఏ ప్రతిఫలం ఆశించకుండా గ్రామంలో మురికి కాలువలు, రోడ్లు, ముఖ్యంగా మసీదు ముందు రోడ్లు శుభ్రం చేస్తుండేవారు. రోడ్డు ప్రక్కన చెట్ల క్రింద పడుకొనేవారు. ఎప్పుడూ ఎంతో శాంతంగా సాత్త్వికంగా ఉండేవారు. తనవల్ల ఎవ్వరికీ ఏ ఇబ్బందీ కలుగకుండా మసలుకొనేవారు. ఎప్పుడయినా ఎవరైనా ఆయనతో పరుషంగా మాట్లాడినా, దురుసుగా ప్రవర్తించినా తిరిగి పల్లెత్తు మాట అనేవారు కాదు. శ్రీభావూ మహరాజ్‌కు పసిపిల్లలన్నా, పశువులన్నా మొక్కలన్నా

ఎనలేని ప్రేమ. ఎక్కువ సమయం పిల్లలతోనూ, మొక్కలకు, పశువులకు సేవచేస్తూ గడిపేవారు. ఆ నోరులేని ప్రాణులను ప్రేమించమని, అలా చేస్తే ఎంతో మేలు జరుగుతుందనీ అనేవారు.

కుంభార్ అంటే 'కుమ్మరి' అని అర్థం. శ్రీభావూ మహరాజ్ శిరిడీ రాక పూర్వము కుమ్మరి పనిచేసేవాడని ప్రజలు భావించడం చేత ఆయనను 'కుంభార్' అని వ్యవహరించేవారు. అంతకు మించి, ఆయన పూర్వ జీవితాన్ని గూర్చిన వివరాలేమీ లభ్యం కావడంలేదు.

ఆ రోజుల్లోనే శ్రీభావూ కుంభార్ విచిత్ర వైఖరి, వైరాగ్య నిరతి గుర్తించి ఎందరో స్థానికులు శిరిడీ దర్శించే సాయిభక్తులు ఆయనను గొప్ప మహాత్మునిగా గౌరవించేవారు. 1918లో శ్రీసాయిబాబా మహాసమాధి చెందిన తర్వాత ఎందరో నకిలీ మహాత్ములు, నకిలీ సాయిబాబాలు బయలుదేరారు. శ్రీసాయిలాగే దుస్తులు ధరించేవారు కొందరు, బాబా తమతో మాట్లాడుతారనీ, పూనుతారని ప్రచారం చేసుకొనేవారు మరికొందరు. తామే సాయిబాబానని ప్రకటించుకొన్నవారు కూడా లేకపోలేదు. శ్రీసాయిబాబాకు వారసులెవ్వరూ లేరని స్పష్టంచేసి, పైన పేర్కొన్న నకిలీల గురించి పరోక్షంగా ప్రస్తావిస్తూ, శ్రీసాయిని ప్రత్యక్షంగా సేవించిన శ్రీహెచ్.డబ్ల్యు. ప్రధాన్, శిరిడీ సాయిబాబా సంస్థానం వారు ప్రచురించిన తన "Shri Saibaba of Shirdi" అనే గ్రంథం యొక్క అనుబంధంలో (1932) ఇలా వ్రాశారు:

"శిరిడీలోని భావూ కుంభార్ అనే ఆయన యొక్క వైరాగ్యసంపన్నత, తన దేహంతో సహా ఏ ప్రాపంచిక బంధాలనూ లక్ష్యపెట్టని ఆయన త్యాగశీలత, ఆయన్ను జాగ్రత్తగా గమనించిన ఎందరినో ఆకర్షిస్తున్నాయి.

ఎందరో దొంగసాధువుల్లా కాకుండా, సరిగ్గా సాయిబాబా వలె, ఈ భావు కుంభార్ కూడా ఏ విధమైన వ్యక్తిగత ప్రచారాన్ని ఇష్టపడరు. కట్టుకొన్న గోచి తప్ప ఇతర ఏ విధమైన స్వార్థాన్ని, ఆస్తిపాస్తులనైనా అసహ్యించుకొనేవారు. దీన్నిబట్టి ఆయన తన ఆత్మస్వరూపంగా ఉన్న సాయిబాబాతో ఎంత సన్నిహితంగా ఉన్నారో స్పష్టంగా ఋజువవుతున్నది.

శ్రీసాయిబాబాను, ఆయన దివ్యత్వాన్ని అనుకరించటం మాట అటుంచి, భావూ కుంభార్ వంటి వారిలో వ్యక్తమౌతున్న నిరాడంబరత్వాన్ని కూడా, మహాత్ముల

ముసుగులో సంచరిస్తూ, బాబా చరిత్ర సరిగ్గా తెలియని అమాయక ప్రజలను మోసం చేస్తున్న నకిలీలు ఎంత ప్రయత్నించినా ఏ మాత్రమూ అనుకరించలేరు".

శ్రీభావూ మహరాజ్ కుంభార్ 1938 ఏప్రిల్ 27న దేహత్యాగం చేశారు. ఆయన మరణించిన తరువాత అజ్ఞాతంగా పడివున్న ఆయన దేహాన్ని చీమలు, పురుగులు చాలా భాగము తినేసాయి. తరువాత ప్రజలు ఆయన మృతదేహాన్ని గమనించి ఆ అవశేషాలను సమాధి చేశారు. తన జీవితంలోని ప్రతిక్షణం పరోపకారం కోసం నిస్వార్థంగా వెచ్చించిన ఆ మహాత్ముడు, చివరకు తమ మృతదేహాన్ని కూడా కీటకాలకు ఆహారంగా సమర్పించారని ప్రజలు అనుకొన్నారు. శ్రీసాయిబాబా సమాధి మందిరం ముందు హాలులో అలంకరించబడ్డ ప్రముఖ సాయిభక్తుల ఫోటోల సరసన శ్రీభావూ మహరాజ్ కుంభార్ ఫోటోను కూడ మనం చూడవచ్చు.

శ్రీభావూ మహరాజ్ కుంభార్ సమాధి మనకు శిరిడీలో లెండీబాగ్ ప్రధాన ద్వారం కుడివైపున దర్శనమిస్తుంది. పసిబిడ్డలకు, పశువులకు జబ్బు చేస్తే శ్రీభావూ మహరాజ్ సమాధికి ప్రదక్షిణం చేసి అక్కడి మట్టిని నుదుట ధరిస్తే వెంటనే ఉపశమనం కలుగుతుందని ఈనాటికీ ఎందరో స్థానిక ప్రజల నమ్మకం.

ఒక మహావృక్షం నీడన మొలచిన మొక్క ఎక్కిరాదు. అలాగే శిరిడీ వంటి క్షేత్రంలో శ్రీసాయిని ఆశ్రయించుకొని జీవించిన భావూకుంభార్ వంటి ఎందరో మహాత్ముల మహిమ, కీర్తి ప్రపంచానికి ప్రకటం కాలేదు. వారెప్పుడూ శ్రీసాయి అనే మహావృక్షం నీడన అజ్ఞాతంగా అలా వినమ్రతతో తలవంచుకొని ఉండడానికి ఇష్టపడతారు!

## మూల సమాచారానికి ఆధారిత గ్రంథాలు

**మహల్సాపతి:**

1934వ సంవత్సరంలో శ్రీసాయిబాబా సంస్థాన్ వారు ప్రచురించిన *"భక్తశిరోమణి శ్రీమహల్సాపతి"*, సుమారు 1974-75 కాలంలో శ్రీచంద్రకాంత్ దామోదర్ సామంత్ గారిచే రచించబడిన *"శ్రీసాయినాథ్ మహారాజాంచే ఏక్ మహాన్ ఏకనిష్ఠసేవక్ మహల్సాపతి భగత్ హ్యాంచే చరిత్ర్"* మరియు శ్రీబి.వి. నరసింహస్వామిగారు రచించిన *"లైఫ్ ఆఫ్ సాయిబాబా"* అనే పుస్తకాలలోని వివరాలు మహల్సాపతి జీవితచరిత్రకు ఆధారాలు.

**తాత్యాకోతే పాటిల్:**

శ్రీసాయిబాబా సంస్థాన్ వారు 'సాయిలీల' మ్యాగ్‌జైన్ - 1960వ సంవత్సరం అక్టోబర్, నవంబర్ సంచికల్లో ప్రచురించిన తాత్యా అనుభవాల నుండి తాత్యా స్మృతులు గ్రహింపబడ్డాయి.

**శ్రీమతి బయ్యజాబాయి:**

సాయిలీల మ్యాగ్‌జైన్ - నవంబరు,1960 సంచికలో ప్రచురించిన తాత్యాకోతేపాటిల్ అనుభవాల నుండి శ్రీమతి బయజాబాయి సమాచారం స్వీకరించబడింది.

**నానావలీ:**

శ్రీబి.వి. నరసింహస్వామి గారు రచించిన *"లైఫ్ ఆఫ్ సాయిబాబా"* మరియు *"సేజ్ ఆఫ్ సకోరి"* అనే గ్రంథాల నుండి నానావలీ గురించిన కొన్ని వివరాలు తీసుకొన్నారని చెప్పవచ్చు.

**ఉపాసనీ మహరాజ్:**

శ్రీఉపాసనీ స్వీయపర్యవేక్షణలో రచింపబడిన *"ఉపాసనీ లీలామృత్"*, శ్రీబి.వి. నరసింహ స్వామిగారు రచించిన *"సేజ్ ఆఫ్ సకోరి"*, *"లైఫ్ ఆఫ్ సాయిబాబా"* నుండి ఉపాసనీ మహరాజ్ చరిత్ర సేకరించబడింది.

**భావూ మహరాజ్ కుంభార్:**

1965వ సంవత్సరములో ప్రచురితమైన శ్రీవి.ఆర్. గోఖలే వ్రాసిన మరాఠీ పుస్తకం "నిర్వాణీచా సఖా" నుండి భావూ మహరాజ్ కుంభార్ వివరాలు ఎక్కువ భాగం తీసుకోబడ్డాయి.

**ఇతర ఆధారాలు:** శ్రీసాయి సచ్చరిత్ర

## సాయిపథం ప్రచురణలు

శ్రీబాబూజీ విరచిత శ్రీసాయి ప్రార్థనాగీతాలు, నిత్యప్రార్థన
"ప్రార్థనాపథం"

శ్రీసాయితత్త్వాన్ని దర్శింపజేసే శ్రీబాబూజీ విరచిత "సాయిభక్తి సాధన రహస్యం"
**ముద్రణ:** గురుపూర్ణిమ, 1996

శిరిడీ ఆరతుల్లోని భావసౌందర్యాన్ని ఆస్వాదింపజేసే శ్రీబాబూజీ విరచిత
ఆంగ్ల గ్రంథం *Arati Sai Baba*
**ముద్రణ:** 1996

శ్రీదాసగణు మహరాజ్ విరచిత గ్రంథాల్లోని కొన్ని భాగాలకు తెలుగు అనువాదం,
శ్రీబాబూజీ వివరణాత్మక పీఠికతో "శ్రీసాయి గురుచరిత్ర"
**ముద్రణ:** గురుపూర్ణిమ, 1996

శిరిడీ ప్రాశస్త్యాన్ని వివరించే ఆంగ్ల గ్రంథం
*Experiencing Sai Baba's Shirdi: A Guide*, by Alison Williams
**ముద్రణ:** గురుపూర్ణిమ, 2002

శ్రీబాబూజీ విరచిత "సాయిభక్తి సాధన రహస్యం" గ్రంథానికి తమిళ అనువాదం
**ముద్రణ:** విజయదశమి, 2006

శ్రీబాబూజీ విరచిత "సాయిభక్తి సాధన రహస్యం" గ్రంథానికి కన్నడ అనువాదం
**ముద్రణ:** విజయదశమి, 2006

శ్రీబి.వి.నరసింహస్వామిగారి *Devotees Experiences of Sri Sai Baba*
ఆంగ్ల గ్రంథానికి ఆంధ్రానువాదం "శ్రీసాయిభక్త అనుభవ సంహిత"
**ముద్రణ:** విజయదశమి, 2008

పూజ్యశ్రీ బాబూజీ మహాసమాధి సమయంలో, అనంతరం భక్తుల అనుభవాలు
"స్మృతిసుమాలు" (*Smriti Sumalu - Flowers of remembrance)*
**ముద్రణ:** గురుపూర్ణిమ, 2011

పూజ్యశ్రీ బాబూజీతో భక్తులకు గల అనుభవాలు,
అనుభూతులు, మధురస్మృతుల సమాహారం "సాయి దీవెన"
**ముద్రణ:** విజయదశమి, 2011

భక్తునికి, సద్గురువుకు మధ్య ఉన్న అనుబంధాన్ని ఆవిష్కరించే ఆంగ్ల గ్రంథం
పూజ్యశ్రీ బాబూజీతో భక్తుల అనుభవాల తోరణం *Bound to Love*
**ముద్రణ:** శ్రీబాబూజీ ఆరాధనోత్సవాలు, 2011

పూజ్యశ్రీ బాబూజీ ఆంగ్ల సత్సంగభాషణల సంకలనం – మొదటి భాగం
*Rose Petals (Vol. 1)*
**ముద్రణ:** గురుపూర్ణిమ, 2012

పూజ్యశ్రీ సాయినాథుని శరత్‌బాబూజీ సత్సంగభాషణలకు అక్షరరూపం,
ఆంగ్ల సత్సంగభాగాలకు ఆంధ్రానువాదం "శరశ్చంద్రికలు" (మొదటి భాగం)
**ముద్రణ:** గురుపూర్ణిమ, 2012

"సాయిపథం"– సాయిలీలాప్రబోధ దర్శిని (ప్రథమ సంపుటము)
జనవరి 2001 నుండి సెప్టెంబర్ 2003 వరకు వెలువడిన సంచికల సంకలనం
**పునఃముద్రణ:** గురుపూర్ణిమ, 2013

పూజ్యశ్రీ బాబూజీ ఆంగ్ల సత్సంగభాషణల సంకలనం – రెండవ భాగం
*Rose Petals (Vol. 2)*
**ముద్రణ:** గురుపూర్ణిమ, 2013

పూజ్యశ్రీ సాయినాథుని శరత్‌బాబూజీ సత్సంగభాషణలకు అక్షరరూపం,
ఆంగ్ల సత్సంగభాగాలకు ఆంధ్రానువాదం "శరశ్చంద్రికలు" (రెండవ భాగం)
**ముద్రణ:** గురుపూర్ణిమ, 2013

పూజ్యశ్రీ బాబూజీ సంక్షిప్త జీవిత సంగ్రహం *Babuji [pamphlet]*
by Yvonne Weier with Geoff Dowson
**ముద్రణ:** శ్రీబాబూజీ ఆరాధన, 2013

పూజ్యశ్రీ బాబూజీ ఆంగ్ల సత్సంగభాషణల సంకలనం – మూడవ భాగం
*Rose Petals (Vol. 3)*
**ముద్రణ:** గురుపూర్ణిమ, 2014

పూజ్యశ్రీ సాయినాథుని శరత్‌బాబూజీ సత్సంగభాషణలకు అక్షరరూపం,
ఆంగ్ల సత్సంగభాగాలకు ఆంధ్రానువాదం "శరశ్చంద్రికలు" (మూడవ భాగం)
**ముద్రణ:** గురుపూర్ణిమ, 2014

పూజ్యశ్రీ బాబూజీ సంక్షిప్త జీవిత సంగ్రహం "శ్రీబాబూజీ"
**ముద్రణ:** విజయదశమి, 2014

శ్రీమతి సాయినాథుని అనసూయమ్మగారిచే రచింపబడిన
"పూర్ణావధూత శ్రీపూండీస్వామి - భక్తుల అనుభవాలు"
**ముద్రణ:** శ్రీపూండీస్వామి ఆరాధన, 2014

"సాయిపథం-*1988*" (Vol. 1)
జనవరి 1988 నుండి డిసెంబర్ 1988 వరకు వెలువడిన సంచికల సంకలనం
**ముద్రణ:** శ్రీబాబూజీ ఆరాధన, 2014

"సాయిపథం-*1989*" (Vol. 2)
జనవరి 1989 నుండి డిసెంబర్ 1989 వరకు వెలువడిన సంచికల సంకలనం
**ముద్రణ:** మే 27, 2015

సాయిపథం ప్రచురణల కొరకు సంప్రదించండి:
saipa@saimail.com
ph no: +91 9385593866, +91 9962599725